
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 32

బుధవారం 24-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెల్ఫీ


విశాఖ జిల్లా పెద్దిపాలెంలోని చెన్నాస్ కన్వెన్షన్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు

మీ ఫోనే.. మీ ఆయుధం

సోషల్ మీడియా కార్యకర్తలు, ఇన్‌ఫ్లూయెన్సర్లతో వైఎస్ జగన్ ముఖాముఖి

- మీకు తోడుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మొత్తం ఉంది
- మరో 18 రోజుల్లో ఎన్నికల యుద్ధం
- ఎంత మంది ఎన్ని కుట్రలు చేసినా జగన్ భయపడడు
- మన విశాఖ సిటీ ఆఫ్ డెస్టినీ.. త్వరలో ఏపీ డెస్టినీ
- దేవుడు ఇంకా పెద్ద స్క్రిప్ట్ ఏదో మనతో రాయించే కార్యక్రమంలో ఉన్నట్లే!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

“ఇటువైపున జగన్ ఒకే ఒక్కడు... అటు వైపున చూస్తే ఇంత మంది! దానికి తోడు కుట్రలు, కుతంత్రాలు, అబద్ధాలు, మోసాలు, బెదిరింపులు, హెరాస్‌మెంట్.. అన్నీ జరుగుతున్నాయి. మరి ఇంత మంది, ఇన్ని కుట్రలు, ఇన్ని ఇబ్బందులను తట్టుకుని మీ జగన్ నిలబడగలుగుతున్నాడంటే కారణం? వాళ్లకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 ఉండొచ్చు కానీ మనకు సోషల్ మీడియా ఉంది. సెల్‌ఫోన్ చేతిలో ఉన్న నా ప్రతి చెల్లెమ్మ, ప్రతి తమ్ముడూ జగన్‌కు తోడుగా ఉన్నారు. అందుకే జగన్ ఒంటరి కాదు. జగన్‌కు కోట్ల గుండెలు అండగా ఉన్నాయి' అని సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 21వ రోజు 'మేమంతా సిద్ధం బస్సు' యాత్ర సందర్భంగా మంగళవారం విశాఖ జిల్లా పెద్దిపాలెంలోని చెన్నాస్ కన్వెన్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలతో నిర్వహించిన ముఖాముఖిలో సీఎం వైఎస్ జగన్ మాట్లాడారు. రాత్రి బస ప్రాంతం నుంచి సీఎం అక్కడకు చేరుకున్నారు. పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ ముఖాముఖి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల సోషల్ మీడియా కార్యకర్తలతోపాటు వివిధ దేశాల నుంచి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

మీకు ఎంత చేసినా తక్కువే

ఆ దేవుడి దయమీద జగన్‌కు నమ్మకం ఉంది. జగన్‌ను ప్రేమించే గుండెల మీద నమ్మకం ఉంది. మరి జగన్ ఒంటరి ఎలా అవుతాడు? మీరు చూపిస్తున్న అభిమానానికి మీకు ఎంత చేసినా తక్కువే అవుతుంది. అన్ని రకాలుగా మీ అందరికీ తోడుగా ఉంటామని మరోసారి భరోసా ఇస్తున్నా. భార్గవ్ చాలా క్రియాశీలకంగా వ్యవహరిస్తూ స్ట్రీమ్ లైనింగ్ చేయడంలో ముందు నిలిచి అడుగులు వేస్తున్నాడు. మీ వెనుక ఒక్క జగనే కాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మొత్తం మీకు అండగా నిలుస్తుంది. ప్రతి నియోజకవర్గం, ప్రతి మండలం, ప్రతి గ్రామంలో మీకు అండగా ఉంటామని భరోసా ఇస్తున్నా. మన మీద దుష్ట చతుష్టయం దాడులు పెరిగాయంటే దాని అర్థం మనం విజయానికి చాలా దగ్గరగా ఉన్నామనే!

ఇంకా పెద్ద స్క్రిప్ట్ ఏదో ఉన్నట్లే!

దెబ్బ ఇక్కడ (నుదిటిపై) తగిలింది. ఇక్కడ (కంటిపై) తగల్లేదు. ఇక్కడా (కణతలపై) తగల్లేదంటే.. దేవుడు ఇంకా పెద్ద స్క్రిప్ట్ ఏదో మనతో రాయించే కార్యక్రమంలో ఉన్నాడని అర్థం. కాబట్టి ఆందోళన అవసరం లేదు. 175కి 175 అసెంబ్లీ, 25కి 25 ఎంపీ సీట్లను గెలుచుకోవడంలో మనం ఎక్కడా తగ్గేదే లేదు. ఫోన్ అనే ఆయుధం మీ చేతుల్లోనే ఉందని గుర్తు పెట్టుకోవాలని కోరుతున్నా. వందల మంది చంద్రబాబులు, రామోజీలు, దత్తపుత్రులు, ఎల్లో మీడియాలు వచ్చినా వైఎస్ జగన్ తొణకడు. కారణం.. పైన దేవుడున్నాడు, కింద మీరంతా మీ అన్నకు అండగా ఉన్నారు.

ప్రత్యేకంగా యాప్..

సోషల్ మీడియా వల్ల ఎవరైనా ఇబ్బందులకు గురైతే చెప్పుకోగలిగేలా ఒక యాప్ తయారు చేయాలి. ప్రతివారం నాకు దానిపై రిపోర్టు కావాలి.

సిటీ ఆఫ్ డెస్టినీ.. ఆంధ్రా డెస్టినీ

మన విశాఖ వచ్చిన మీరంతా ఈరోజు సిటీని చూస్తున్నారు కదా! ఈ సిటీ ఆఫ్ డెస్టినీ రేపు ఆంధ్ర రాష్ట్ర డెస్టినీ అవుతుందని కచ్చితంగా చెబుతున్నా. ఎప్పుడైతే ఒక ముఖ్యమంత్రి వచ్చి ఈ సిటీలో కూర్చుని పరిపాలన ప్రారంభిస్తారో అప్పుడు హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో పోటీ పడే పరిస్థితి వస్తుంది. ఐటీని అత్యుత్తమ స్థానానికి చేర్చే పరిస్థితి కూడా వస్తుంది.


వివిధ దేశాల నుంచి వర్చువల్‌గా సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు

చెల్లి గీతాంజలి చావుకు కారకులు..


గీతాంజలి కుమార్తెలతో ఆప్యాయంగా సీఎం జగన్

ఇప్పటిదాకా ప్రతి సందర్భంలోనూ నాకు తోడుగా ఉంటున్న మీ అందరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. మరో 18 రోజుల్లో ఎన్నికల యుద్ధం జరగనుంది. ఒక్క జగన్ మీద చంద్రబాబు, దత్తపుత్రుడు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5.. వీళ్లంతా చాలరన్నట్లుగా బీజేపీ, కాంగ్రెస్ యుద్ధం చేస్తున్నాయి. ఈ మధ్య వాళ్ల ఉక్రోషం ఏ స్థాయికి వెళ్లిందంటే సోషల్ మీడియాలో జగన్‌కు సపోర్ట్ చేసిందని చెల్లెమ్మ గీతాంజలిని ఎంత దారుణంగా వేధించారో అందరూ చూశారు. జగనన్న చేసిన మంచితో తన కుటుంబం బాగుపడిందని, జగనన్న వల్ల తనకు ఇల్లు, ఇంటి స్థలం వచ్చిందని, మిగిలిన పథకాలు కూడా వచ్చాయని తన సంతోషాన్ని అందరితో పంచుకోవటమే ఆమె చేసిన పాపం! చివరికి ఆ చెల్లి సూసైడ్ చేసుకునే పరిస్థితికి వెళ్లిందంటే ఈ వ్యవస్థ ఎంత దారుణంగా చెడిపోయిందో చెప్పేందుకు నిదర్శనం.

అన్నా.. జాగ్రత్త



తెనాలిలో ఇంటి పట్టా తీసుకున్న గీతాంజలి ఆనందంతో తన అభిప్రాయాన్ని చెప్పుకుంది. కాయలున్న చెట్టుకు రాళ్ల దెబ్బలు తప్పవు. వైఎస్సార్‌సీపీ కాయలున్న చెట్టు అయితే టీడీపీ ముళ్ల చెట్టు లాంటిది. గీతాంజలి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎంతో అండగా నిలిచింది. అన్నా మీరు జాగ్రత్త.. మీ మీద దాడి జరిగితే అది మా మీద జరిగినట్లు భావించాం. వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబుకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చు. చంద్రబాబు యుద్ధానికి డైరెక్ట్‌గా రాడు.

– పి.నాని, బాపట్ల జిల్లా

విశాఖ ఘటనకు నేనే ప్రత్యక్ష సాక్షిని..



విశాఖ ఎయిర్‌పోర్టులోని ఫుడ్ కోర్టు టీడీపీ వాళ్లదని తెలియక గతంలో అక్కడ ఉద్యోగం చేశా. విశాఖ ఎయిర్‌పోర్టులో మీపై జరిగిన దాడి ఘటనకు నేను ప్రత్యక్ష సాక్షిని. నేను జగన్ అభిమానిని అని తెలిసి నన్ను చాలా వేధించారు. టీడీపీ నాయకులు లోకేశ్, చంద్రబాబు, బాలకృష్ణ, సీఎస్‌వో వేణుగోపాల్, హర్షవర్ధన్ అందరూ ఒక కూటమిలా ఉండేవాళ్లు. చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నేను పీసీఎస్ రూల్స్ ప్రకారం నడుచుకుంటే నాపై దొంగ కేసులు బనాయించారు. నాకెక్కడా ఉద్యోగం రాకుండా చేశారు. నా కుటుంబాన్ని ఎంతగానో హింసించారు. సీఎస్‌వో వేణుగోపాల్ నిన్ను ఎక్కడా బతకనివ్వనని బెదిరించారు. మీ మీద హత్యాయత్నం వ్యవహారంలో నాపై ఒత్తిడి తేవటంతో ఉద్యోగానికి రాజీనామా చేసి మా కుటుంబం అంతా దూరంగా వెళ్లిపోయాం. ఇన్నేళ్లూ ఉద్యోగం లేకుండా ఉన్నా. విజయవాడలో మీ మీద బొండా ఉమ ప్రోద్బలంతో జరిగిన దాడి చూశాక మౌనంగా ఉండలేక ఇవన్నీ బయట పెడుతున్నా.

– సామ్రాజ్యం, మాజీ ప్రైవేట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, విశాఖ ఎయిర్‌పోర్టు

ముస్లింలంతా మీ వెనకే ..



2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో ముస్లింలంతా భయపడుతూ బతికారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ఊపిరి పీల్చుకుంటున్నాం. మైనార్టీలను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిప్యూటీ సీఎంగా, మండలి వైస్ చైర్‌పర్సన్‌గా చేశారు. ఏడుగురికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు. ముస్లింల కోసం వైఎస్సార్ ఒక అడుగు ముందుకేస్తే.. మీరు నాలుగు అడుగులు ముందుకేశారు.

– వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమాని

మీ మాటలు మాకెంతో స్ఫూర్తినిస్తాయి.



అబ్రహం లింకన్, గాంధీజీ, అంబేడ్కర్ గురించి పుస్తకాల్లో చదువుకున్నాం. మీరు మాకు కళ్లెదుటే కనిపించే లైవ్ ఎగ్జాంపుల్. మీ లైఫ్ జర్నీ ఇంకా తెలుసుకోవాలని ఉంది. మీ మాటలు మాకెంతో స్ఫూర్తినిస్తాయి.

–హెబ్సిబా, అసోసియేట్ ప్రొఫెసర్, ఫార్మసీ

మీ అభిమానిగా ఒక్క రోజైనా చాలు



నా తమ్ముడు భరత్‌కుమార్‌రెడ్డి ఫిబ్రవరిలో ఎన్నికల ప్రచారానికి వెళ్లి వస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఆ సమయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్, భార్గవ్ అన్న మా కుటుంబానికి అండగా నిలిచారు. నా తమ్ముడికి మీరే దైవం అన్నా. మీరు బాగుంటేనే మేమూ బాగుంటాం. మీరు తలపెట్టిన ప్రతి కార్యక్రమంపై ఎల్లోమీడియా దుష్ప్రచారం చేసేది. భార్గవ్ అన్న ఛార్జ్ తీసుకున్న తర్వాత వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతిపక్షాలు భయపడేంత స్ట్రాంగ్ అయ్యింది. మిమ్మల్ని కలుసుకుంటే నా తమ్ముడి ఆత్మ శాంతిస్తుందని వచ్చా. మీ అభిమానిగా ఒక్కరోజు బతికినా చాలు.

– ఎం.అనిల్‌కుమార్ రెడ్డి, అన్నమయ్య జిల్లా, రాయచోటి నియోజకవర్గం

మిమ్మల్ని చూసి స్ఫూర్తి పొందా



జగనన్నా మీరు చేసిన సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. మనసుకు, దేహానికి ఎంత గాయమైనా చిరునవ్వుతో ఎదుర్కోవాలని మిమ్మల్ని చూసి స్ఫూర్తి పొందా. నా పిల్లలకు ఎంతో సాయం చేశారు. ఎప్పటికీ మీ అండదండలు ఉండాలని కోరుకుంటున్నా. మళ్లీ మీరే ముఖ్యమంత్రి కావాలి.

– బాలచంద్ర, గుంటూరు జిల్లా, తెనాలి మండలం (గీతాంజలి భర్త)

కడుపు కాలేవాడికి మీ పథకాల విలువ తెలుసు



సోషల్ మీడియా సైనికుడైన మా అన్నయ్య 2022లో యాక్సిడెంట్‌లో మరణించాడు. అది తెలిసి సజ్జల భార్గవ్ మా ఇంటికి వచ్చారు. మీకు సాయం చేయాలని జగనన్న ఆదేశం చారని చెప్పారు. మా వదినకు ఉద్యోగం ఇప్పించారు. మా పిన్ని, బాబాయి టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలో మెంబర్లు. వాళ్లకి సైతం పెన్షన్ మన ప్రభుత్వంలో ఇచ్చారు. మీరు అందించే పథకాల విలువ కడుపు కాలేవాడికే తెలుస్తుంది. కడుపు నిండిన వాడికి తెలియదు. మా అన్న చనిపోయినప్పుడు కూలీ పనులు చేసుకునే వ్యక్తి ఒకరు ఫోన్ చేసి ఆ రోజు వచ్చిన రూ.600 సాయంగా పంపుతున్నట్లు చెప్పాడు. ఇంత గొప్ప కుటుంబం ఇచ్చింది నువ్వే కదా జగనన్నా!

– వినయ్ కుమార్, మల్కాపురం, జగ్గయ్యపేట మండలం, ఎన్టీఆర్ జిల్లా

అడుగడుగునా నీరా‘జనం’

విశాఖ నుంచి విజయనగరం వరకు వెంట నడిచిన అభిమానులు

- ఉత్సాహంగా 21వ రోజు సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర
- ఉదయం ఎండాడ నైట్ స్టే పాయింట్ నుంచి యాత్ర ప్రారంభం
- ఉదయం పీఎం పాలెం, కొమ్మాది, మధురవాడ, గంభీరం మీదుగా సాగిన యాత్ర
- పీఎంపాలెం వద్ద ఉత్తరాంధ్ర సంప్రదాయ చెక్క భజన, కోలాటంతో స్వాగతం

('మేమంతా సిద్ధం' బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

మరోసారి చరిత్ర సృష్టించేందుకు చారిత్రక విజయనగరం జననేత జగనన్నకు అఖండ స్వాగతం పలికింది. అడుగడుగునా ప్రజలు జననీరాజనాలు పలికారు. ఉత్తరాంధ్ర కళారూపాలైన చెక్క భజనలు, కోలాటాలతో తమ అభిమాన నేతను అక్కున చేర్చుకున్నారు. విశాఖలోని ఎండాడ నైట్ స్టే పాయింట్ వద్ద అభిమానుల కోలాహలం మంగళవారం ఉదయం నుంచే ప్రారంభమైంది. వేలాదిగా తరలివచ్చిన అభిమానులతో 21వ రోజు 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ఎండాడ నుంచి విజయనగరం వరకు సాగింది. దారిలో అడుగడుగునా అభిమానులు వెంటరాగా సీఎం జగన్ బస్సుపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. వైఎస్సార్ స్టేడియం, పీఎం పాలెం మీదుగా సాగిన యాత్ర జాతీయ రహదారి మొత్తం అభిమానులతో నిండిపోయింది. కొత్తవలస మండలంలోని చీడివలస గ్రామానికి చెందిన చెక్కభజన బృందంలోని అక్కచెల్లెమ్మలు జగన్ కోసం తరలివచ్చారు. ఎండాడ నుంచి కార్‌షెడ్ జంక్షన్, మధురవాడ, కొమ్మాది, పరదేశీపాలెం, గంభీరం, తాళ్లవలస వరకు వెంట నడిచారు. దారిపొడవునా అక్కచెల్లెమ్మల హారతులు, మహిళల కోలాటాలు, యువకుల తీన్‌మార్ డ్యాన్సులతో వారంతా సీఎం జగన్ యాత్ర వెంట అడుగులు వేశారు.

జగన్ సైన్యంతో జాతీయ రహదారి కిటకిట..

ఇక ఉదయం పీఎంపాలెం వద్దకు చేరుకున్న సీఎం జగన్ బస్సుయాత్రలో పాల్గొనేందుకు అప్పటికే ఆయన రాకకోసం పెద్దఎత్తున మహిళలు, పిల్లలతో పాటు ఆటోడ్రైవర్లు తరలివచ్చారు. జగన్ బస్సుపై నుంచి అభివాదం చేయగానే ఆ ప్రాంతమంతా జగన్నినాదాలతో మార్మోగింది. వైఎస్సార్ స్టేడియం నుంచి మొదలైన జనప్రవాహం కొమ్మాది, మారికవలస మీదుగా ఆనందపురం జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ వేచి ఉన్న అక్కచెల్లెమ్మలు జగనన్నకు ఘనస్వాగతం పలికారు. జగన్‌ను దూరం నుంచి చూసిన అపార్ట్‌మెంట్లలోని మహిళలు, విద్యార్థులు సైతం బాల్కనీల్లో హుషారుగా కేరింతలు కొట్టారు. 'గత ప్రభుత్వంలో ఏ చిన్న పనికావాలన్నా జన్మభూమి కమిటీల ద్వారా స్థానిక టీడీపీ నేతలను కలవాల్సి వచ్చేది. వారు అడిగింది ముట్టజెప్పినా, ఇష్టం లేకపోతే నెలల తరబడి తిప్పించుకునే వారు' అని మహిళలు నాటి పీడకలలను గుర్తుచేసుకున్నారు. జగనన్న తీసుకొచ్చిన వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాలతో ఇంటికే వచ్చి మీకేం అవసరమో చెప్పాలని అడిగి మరీ చేస్తున్నారని నేటి పరిస్థితులను వివరించారు. ఇది సామాన్యుల ప్రభుత్వమని, తామంతా ఆనందంగా ఉన్నామని జనం ముక్తకంఠంతో చెప్పారు. ఇక యాత్రలో భాగంగా సీఎం జగన్ ఆనందపురం జంక్షన్‌లోని చెన్నాస్ కన్వెన్షన్‌లో సోషల్ మీడియా ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రసంగించారు. అనంతరం.. మోదవలస జంక్షన్ మీదుగా విజయనగరం జిల్లాలో యాత్ర కొనసాగింది. జిల్లా నాయకులు, జగన్ అభిమానులతో మోదవల కూడలి జనసందోహంతో నిండిపోయింది. యువకులు ర్యాలీగా వెంటరాగా, మ.2 గంటలకు జొన్నాడ సమీపంలో ముఖ్యమంత్రి భోజన విరామం తీసుకున్నారు. అనంతరం సా.5 గంటలకు జొన్నాడ నుంచి చెల్లూరు వరకు ర్యాలీగా వచ్చి అక్కడ అశేష జనావాహినితో నిండిపోయిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో సీఎం జగన్ ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఈ బహిరంగ సభకు విజయనగరం జిల్లాకు చెందిన దివ్యాంగులు సీఎం జగన్‌కు మద్దతుగా మూడు చక్రాల మోటార్ సైకిళ్లపై పెద్దఎత్తున తరలివచ్చారు. జగన్ సీఎం అయ్యాకే తమ భవిష్యత్తు బాగుందని ఎంతో సంతోషంతో చెప్పారు.

శ్రీకాకుళం జిల్లాలోకి బస్సుయాత్ర..

సభ అనంతరం సీఎం జగన్ చింతలవలస మీదుగా విజయనగరం జిల్లా సరిహద్దు గ్రామం కొప్పెర్ల చేరుకున్నారు. అప్పటికే చీకటి పడినా జగన్ కోసం పెద్దఎత్తున అభిమానులు అక్కడే ఉండి తమ ప్రియతమ నేతకు భారీ పూలదండలతో శ్రీకాకుళం జిల్లాలోకి ఆహ్వానించారు. కిక్కిరిసిన జన సందోహం మధ్య జగన్ అభివాదం చేస్తూ సవరవిల్లి, భోగాపురం మీదుగా రణస్థలం చేరుకున్నారు. అక్కడ ప్రజలు, నాయకులు రహదారిపై బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి జన సంద్రాన్ని తలపించింది. అక్కడి నుంచి అక్కివలస సమీపంలోని రాత్రి బసకు జగన్ చేరుకున్నారు.



ఎండాడ: వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



పోతినమల్లయ్యపాలెం: బస్సుయాత్రకు తరలివచ్చిన అశేష జనవాహినికి సీఎం జగన్ అభివాదం

వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ నేతలు


సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పులుసు జనార్ధనరావు

ఎండాడ నైట్ క్యాంపులో ఎస్.కోట, గాజువాక, విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, భీమిలి నియోజకవర్గ అభ్యర్థులతో పాటు ఇతర నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సీఎం జగన్‌ను కలిశారు. వారిని పేరుపేరునా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకుని పార్టీ కార్యకలాపాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇందులో బీజేపీ గాజువాక నియోజకవర్గం నుంచి మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, 65వ వార్డు అధ్యక్షుడు వీఎస్ ప్రకాశరావు, ఉపాధ్యక్షుడు కర్రి గోవిందు, కార్యదర్శి గొల్లపల్లి గోవింద్, వరప్రసాదరెడ్డి, సంపత్‌కుమార్ ఉన్నారు. వీరితోపాటు విశాఖ ఉత్తరం నుంచి జనసేన నాయకురాలు దివ్యలత, బీజేపీ నుంచి హేమాంబర్, వ్యాపారవేత్త షేక్ సలీమ్, షేక్ హుస్సేన్ బాషా తదితరులున్నారు.

బుధవారం 24-4-2024



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+6 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 32

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

AP SSC 2024 RESULTS

అతిగొప్ప అద్భుతం ఆవిష్కృతమైంది...

నారాయణ అందుకు వేదికైంది!




599/600

A V N SAI MANASWI

HT.No. 2411123629

పదవ తరగతితోనే విద్యార్థి విజయం ఆరంభం! అది నారాయణతోనే ప్రారంభం!



ఈ-టెక్నో, ఒలింపియాడ్, సిఓ-స్పార్క్ వంటి ప్రత్యేక ప్రోగ్రామ్స్ అందించిన స్ట్రాంగ్ ఫౌండేషన్ కారణంగానే 10 వ తరగతి ఫలితాల్లో నారాయణ విద్యార్థులు అద్భుతాలు ఆవిష్కరించారు. నేటి ఈ ఫలితాలే రేపటి జెఈఈ/నీట్ టాప్ ర్యాంకుల సాధనకు సోపానాలు.

JEE-MAIN 2024 లో **300 కి 300** మార్కులు సాధించిన వారిలో **7** గురు నారాయణ విద్యార్థులే.

ఇతరులెవ్వరూ నారాయణకు దరిదాపుల్లో లేరు.. లేరు.. లేరు..

as per NTA final key



SRAMAYEVA JAYATHE

NARAYANA GROUP OF SCHOOLS

ADMISSIONS OPEN FOR SESSION 2024-25

Call: 1800 102 3344

www.narayanaschools.in

/TheNarayanaGroup

Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice



జొకోవిచ్‌కు లారియస్ అవార్డు

పురుషుల టెన్నిస్ ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ ప్రతిష్టాత్మక లారియస్ వరల్డ్ స్పోర్ట్స్ వార్షిక అవార్డుల్లో మెరిశాడు. 2023 సంవత్సరానికిగాను పురుషుల విభాగంలో ఈ సెర్బియా దిగ్గజం 'ఉత్తమ క్రీడాకారుడు' పురస్కారం గెల్చుకున్నాడు. జొకోవిచ్‌కు ఈ అవార్డు లభించడం ఇది ఐదోసారి. 2023లో జొకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించడంతోపాటు వింబుల్డన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. సీజన్‌ను టాప్ ర్యాంక్‌తో ముగించాడు. మహిళల విభాగంలో స్పెయిన్ ఫుట్‌బాల్ ప్లేయర్ బొన్మాటి 'ఉత్తమ క్రీడాకారిణి' అవార్డు అందుకుంది.



తొలి రౌండ్‌లోనే రష్మిక పరాజయం

షార్లోట్స్‌విల్ డబ్ల్యూ-75 మహిళల టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో జరుగుతున్న ఈ టోర్నీలో సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో రష్మిక 2-6, 2-6తో గాబ్రియేలా ఫ్రైస్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది.

స్టొయినిస్ విధ్వంసం



- 63 బంతుల్లో 13 ఫోర్లు, 6 సిక్స్‌లతో 124*
- చెన్నైపై లక్నో సూపర్ జెయింట్స్ విజయం
- రుతురాజ్ అజేయ సెంచరీ వృథా

చెన్నై: నాలుగు రోజుల క్రితం లక్నో వేదికగా చెన్నై సూపర్‌కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌కు ఇప్పుడు చెన్నైలో రీప్లేగా జరిగిన పోరులో లక్నోనే మళ్లీ 'సూపర్'గా ఆడి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో లక్నో 6 వికెట్ల తేడాతో చెన్నైపై గెలిచింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (60 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ శతకాన్ని నమోదు చేశాడు. 'హిట్టర్' శివమ్ దూబే (27 బంతుల్లో 66; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) చెలరేగాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన లక్నో 19.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్కస్ స్టొయినిస్ (63 బంతుల్లో 124 నాటౌట్; 13 ఫోర్లు, 6 సిక్స్‌లు) అసాధారణ ఇన్నింగ్స్‌తో అజేయ సెంచరీ సాధించి లక్నోను విజయతీరాలకు చేర్చాడు. పూరన్‌తో నాలుగో వికెట్‌కు 70 పరుగులు, దీపక్ హుడాతో అబేధ్యమైన ఐదో వికెట్‌కు 55 పరుగులు జోడించిన స్టొయినిస్ లక్నోకు చిరస్మరణీయ విజయం అందించాడు.

కెప్టెన్ ఇన్నింగ్స్...

రహానే (1), వన్‌డౌన్‌లో మిచెల్ (11), జడేజా (16) చెన్నై టాప్-4 బ్యాటర్లలో ముగ్గురి స్కోరిది! పవర్‌ప్లేలో చెన్నై చేసిన స్కోరు 49/2 తక్కువే! ఈ దశలో కెప్టెన్ రుతురాజ్ బౌండరీలతో పరుగుల వేగాన్ని అందుకున్నాడు. గైక్వాడ్ 28 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా... జట్టు స్కోరు 11.3 ఓవర్లలో వందకు చేరింది. అదే ఓవర్లో జడేజా నిష్క్రమించడంతో వచ్చిన దూబే ఓ రకంగా శివతాండవమే చేశాడు. 15 ఓవర్లలో చెన్నై 135/3 స్కోరు చేసింది. కానీ ఆ తర్వాత దూబే పవర్‌ప్లే మొదలైంది. భారీ సిక్సర్లతో స్కోరు ఒక్కసారిగా దూసుకెళ్లింది. 16వ ఓవర్లో దూబే హ్యాట్రిక్ సిక్స్‌లతో 19 పరుగులు, 18వ ఓవర్లో గైక్వాడ్ 6, 4, 4లతో 16 పరుగులు, 19వ ఓవర్లో మళ్లీ దూబే దంచేయడంతో 17 పరుగులు, ఆఖరి ఓవర్లో 15 పరుగులతో స్కోరు 200 పైచిలుకు చేరింది. చివరి 5 ఓవర్లలో దూబే వికెట్ మాత్రమే కోల్పోయిన చెన్నై 75 పరుగులు సాధించింది. గైక్వాడ్ 56 బంతుల్లో శతకాన్ని, దూబే 22 బంతుల్లో అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నారు.

బ్యాటింగ్ గేర్ మార్చి...

కొండంత లక్ష్యం ముందున్న లక్నోకు ఆరంభంలో అన్ని ఎదురుదెబ్బలే తగిలాయి. ఓపెనర్లు డికాక్ (0), కేఎల్ రాహుల్ (14 బంతుల్లో 16; 1 ఫోర్, 1 సిక్స్), దేవదత్ పడిక్కల్ (19 బంతుల్లో 13) నిరాశ పరిచారు. టాపార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగిన స్టొయినిస్ ఒక్కడే గెలిపించేదాకా మెరిపించాడు. ఈ క్రమంలో 26 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. తర్వాత నికోలస్ పూరన్ (15 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) జోరు పెంచగానే... పతిరణ మరుసటి ఓవర్లోనే పెవిలియన్ చేర్చాడు. స్టొయినిస్ 56 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దీపక్ హుడా కూడా (6 బంతుల్లో 17 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) బ్యాట్‌కు పని చెప్పడంతో అనూహ్యంగా లక్నో లక్ష్యం వైపు పరుగు పెట్టింది. 18 బంతుల్లో 47 పరుగుల కష్టమైన సమీకరణం ఇద్దరి దూకుడుతో సులువైంది. 18, 19వ ఓవర్లలో 15 పరుగుల చొప్పున వచ్చాయి. 6 బంతుల్లో 17 పరుగుల్ని స్టొయినిస్ 6, 4, నోబాల్4, 4లతో ఇంకో మూడు బంతులు మిగిల్చి ముగించాడు.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (సి) రాహుల్ (బి) హెన్రీ 1; రుతురాజ్ (నాటౌట్) 108; మిచెల్ (సి) హుడా (బి) యశ్ 11; జడేజా (సి) రాహుల్ (బి) మోసిన్ 16; దూబే (రనౌట్) 66; ధోని (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 210. వికెట్ల పతనం:** 1-4, 2-49, 3-101, 4-205. **బౌలింగ్:** హెన్రీ 4-0-28-1, మోసిన్ ఖాన్ 4-0-50-1, రవి బిష్ణోయ్ 2-0-19-0, యశ్ ఠాకూర్ 4-0-47-1, స్టొయినిస్ 4-0-49-0, కృనాల్ పాండ్యా 2-0-15-0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (బి) దీపక్ 0; రాహుల్ (సి) రుతురాజ్ (బి) ముస్తఫిజుర్ 16; స్టొయినిస్ (నాటౌట్) 124; పడిక్కల్ (బి) పతిరణ 13; పూరన్ (సి) శార్దుల్ (బి) పతిరణ 34; హుడా (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (19.3 ఓవర్లలో 4 వికెట్లకు) 213. వికెట్ల పతనం:** 1-0, 2-33, 3-88, 4-158. **బౌలింగ్:** దీపక్ చహర్ 2-0-11-1, తుషార్ 3-0-34-0, ముస్తఫిజుర్ 3.3-0-51-1, శార్దుల్ 3-0-42-0, మొయిన్ అలీ 2-0-21-0, జడేజా 2-0-16-0, పతిరణ 4-0-35-2.

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × గుజరాత్
వేదిక: న్యూఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	8	7	1	14	0.698
కోల్‌కతా	7	5	2	10	1.206
హైదరాబాద్	7	5	2	10	0.914
లక్నో	8	5	3	10	0.148
చెన్నై	8	4	4	8	0.415
గుజరాత్	8	4	4	8	-1.055
ముంబై	8	3	5	6	-0.227
ఢిల్లీ	8	3	5	6	-0.477
పంజాబ్	8	2	6	4	-0.292
బెంగళూరు	8	1	7	2	-1.046

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్



రుతురాజ్

గుకేశ్ 'భూకంపం' తెచ్చాడు!

గ్యారీ కాస్పరోవ్ ప్రశంస

టొరంటో: క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచి వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ పోరుకు అర్హత సాధించిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌పై 'ఆల్‌టైమ్ గ్రేట్' గ్యారీ కాస్పరోవ్ ప్రశంసలు కురిపించాడు. ప్రపంచ చెస్‌లో కొత్త మార్పునకు ఇది సూచన అని ఈ మాజీ వరల్డ్ చాంపియన్ అభిప్రాయపడ్డాడు. 'గుకేశ్‌కు అభినందనలు. టొరంటోలో ఒక భారతీయుడు భూకంపం సృష్టించాడు. 17 ఏళ్ల కుర్రాడు చైనా చాంపియన్ డింగ్ లిరెన్‌ను ఢీకొనబోతుండటం ప్రపంచ చెస్‌లో ఆధిక్యం ఒక దిక్కు నుంచి మరో దిక్కుకు మారిందనేదానికి సరైన సూచిక. విశ్వనాథన్ ఆనంద్ 'పిల్లలు' అన్ని చోట్లా దూకుడు ప్రదర్శిస్తున్నారు. గుకేశ్ మరింత పైకి ఎదుగుతాడు. చైనా, భారత్‌కు చెందిన కుర్రాళ్లు చెస్‌లో ఏదైనా సాధించే సంకల్పంతో దూసుకుపోతుంటే ఇంగ్లండ్, అమెరికా జూనియర్ ఆటగాళ్లు మాత్రం చూస్తూనే ఉండిపోతున్నారు' అని కాస్పరోవ్ వ్యాఖ్యానించాడు. ఆదివారం ముగిసిన క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో ఓపెన్ విభాగంలో భారత్ నుంచి గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతి పోటీపడ్డారు. గుకేశ్ విజేతగా అవతరించగా... ప్రజ్ఞానంద ఐదో స్థానంలో, విదిత్ ఆరో ర్యాంక్‌లో నిలిచారు. ఇదే టోర్నీ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి రన్నరప్‌గా నిలువగా, వైశాలికి నాలుగో స్థానం లభించింది.



విన్నర్స్ ట్రోఫీ, స్వర్ణ పతకంతో గుకేశ్



రన్నరప్, రజత పతకంతో కోనేరు హంపి

భారత నంబర్‌వన్‌గా శ్రీజ

తెలంగాణ టీటీ క్రీడాకారిణి ఘనత

న్యూఢిల్లీ: రెండుసార్లు జాతీయ చాంపియన్, తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) మహిళల సింగిల్స్ నంబర్‌వన్ ర్యాంకర్‌గా అవతరించింది. మంగళవారం విడుదల చేసిన అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో శ్రీజ ఒక స్థానం మెరుగుపర్చుకొని 38వ ర్యాంక్‌లో నిలిచింది. ఇప్పటి వరకు భారత నంబర్‌వన్‌గా ఉన్న మనిక బత్రా రెండు స్థానాలు పడిపోయి 39వ ర్యాంక్‌కు చేరుకుంది. భారత్ నుంచి యశస్విని 99వ ర్యాంక్‌లో, అర్చన కామత్ 100వ ర్యాంక్‌లో ఉన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఇండియా (ఆర్‌బీఐ)లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న 25 ఏళ్ల శ్రీజ ఈ ఏడాది నిలకడగా రాణిస్తూ ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) సర్క్యూట్‌లో రెండు టైటిల్స్ సాధించింది. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో ఆచంట శరత్ కమల్‌తో కలిసి శ్రీజ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో శరత్ కమల్ 37వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. సత్యన్ జ్ఞానశేఖరన్ 60వ స్థానంలో, మానవ్ ఠక్కర్ 61వ స్థానంలో, హర్మీత్ దేశాయ్ 64వ ర్యాంక్‌లో ఉన్నారు. హైదరాబాద్ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ 147వ ర్యాంక్‌లో నిలిచాడు.




జ్యోతి సురేఖకు రెండో స్థానం

షాంఘై (చైనా): ప్రపంచ ఆర్చరీ కొత్త సీజన్‌లో భాగంగా ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత క్రీడాకారిణులు రాణించారు. మహిళల కాంపౌండ్ విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ 711 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. భారత్‌కే చెందిన అదితి 704 పాయింట్లతో 8వ స్థానంలో, పర్ణీత్ కౌర్ 703 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచారు. జ్యోతి సురేఖ, అదితి, పర్ణీత్ స్కోర్లతో కలిపి భారత బృందం 2118 పాయింట్లతో టీమ్ విభాగంలో టాప్ ర్యాంక్‌ను పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.



సినిమా



'ప్రాశ్చదీర్ఘ'లో బ్రహ్మానందం
'లవ్@65'లో రాజేంద్రప్రసాద్, జయప్రద
'మారుతి నగర్'లో రావు రమేశ్

హీరోల్


హాస్య నటులు, ప్రతినాయకులు, సహాయ నటులుగా కనిపించి, ఆకట్టుకునే నటులు ఫర్ ఎ చేంజ్ కథానాయకులుగా కనిపిస్తే ఆ సినిమాకి కావాల్సినంత క్రేజ్ ఏర్పడుతుంది. ఆ నటులకు కూడా రొటీన్ క్యారెక్టర్స్ నుంచి కాస్త మార్పు దక్కుతుంది. ఎక్కువగా కమెడియన్లు, విలన్లు, క్యారెక్టర్లు ఆర్టిస్టులుగా చేసే ఆ నటులు ఇప్పుడు హీ'రోల్'లో కనిపించనున్నారు. ఆ 'హీరోల్' చేస్తున్న చిత్రాల విశేషాలు తెలుసుకుందాం.

తొలిసారి నేపాలీ భాషలో...

తెలుగు పరిశ్రమలో హాస్యబ్రహ్మగా పేరు తెచ్చుకున్నారు బ్రహ్మానందం. దాదాపు నలభై ఏళ్లుగా తనదైన హాస్యంతో ప్రేక్షకులను నవ్విస్తున్న ఆయన అడపాదడపా హీరోగానూ చేశారు. 'బాబాయ్ హోటల్' (1992), 'జోకర్ మామ సూపర్ అల్లుడు' (1992) వంటి చిత్రాల్లో సోలో హీరోగా చేసిన బ్రహ్మానందం 'సూపర్ హీరోస్' (1997), 'హ్యాండ్సప్' (2020) వంటి మరికొన్ని చిత్రాల్లో ఓ హీరోగా నటించారు. తాజాగా 'ప్రాశ్చదీర్ఘ' చిత్రంలో ఆయన ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. చంద్ర పంత్ దర్శకత్వంలో తెలుగు, నేపాలీ భాషల్లో ఈ సినిమా రూపొందుతోంది. బ్రహ్మానందం నటిస్తున్న ఈ తొలి నేపాలీ చిత్రం సెప్టెంబర్ 27న రిలీజ్ కానుంది.

ఆరు పదులలో ప్రేమ

ఆరు పదుల వయసులో ప్రేమలో పడ్డారు రాజేంద్రప్రసాద్, జయప్రద. ఈ ఇద్దరూ జంటగా నటించిన చిత్రం 'లవ్@65'. వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం టీజర్ ఆ మధ్య విడుదలైంది. 'ఈ ప్రపంచాన్నే బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. త్వరలో ఈ చిత్రం రిలీజ్ రానుంది.



'సారంగదరియా'లో రాజా రవీంద్ర

వినోదాల సుబ్రమణ్యం


కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా రావు రమేశ్ ఏ రేంజ్‌లో విజృంభిస్తారో వెండితెరపై చూస్తుంటాం. 'మారుతినగర్ సుబ్రమణ్యం' చిత్రంలో తొలిసారి ఆయన హీరోగా కనిపించనున్నారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రావు రమేశ్ సరసన ఇంద్రజ నటించారు. పూర్తి స్థాయి వినోదంతో, భావోద్వేగాలతో రూపొందిన ఈ సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది.

మధ్యవయస్కుడి కథ

తెలుగులో దాదాపు 36 ఏళ్లుగా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మెప్పిస్తున్నారు రాజా రవీంద్ర. పలు చిత్రాల్లో లీడ్ రోల్స్‌లోనూ నటించిన ఆయన తాజాగా 'సారంగదరియా' సినిమాలో లీడ్ రోల్ చేశారు. పద్మారావు అబ్బిశెట్టి దర్శకుడు. మధ్యవయస్కుడైన ఓ వ్యక్తి పరువుగా బతికితే చాలనుకుంటాడు. అయితే అతనికి తన కొడుకులు, కూతురు వల్ల సమాజం నిలదీసే పరిస్థితులు ఎదురవుతాయి. అప్పుడు అతను ఏం చేశాడు? అనే కథాంశంతో 'సారంగదరియా' చిత్రం రూపొందింది. మేలో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.

తండ్రి విలువ తెలిపేలా...

తెలుగులో శివాజీ రాజాది మూడు దశాబ్దాలకు పైగా ప్రయాణం. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హీరోగా తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారాయన. ఇటీవల సినిమాలకు కొంచెం గ్యాప్ ఇచ్చిన శివాజీ రాజా 'నాన్నా మళ్లీ రావా..!'లో లీడ్ రోల్ చేస్తున్నారు.



'నాన్నా మళ్లీ రావా'లో శివాజీ రాజా

ఆయనకు జోడీగా ప్రభావతి నటిస్తున్నారు. నిర్దేష్ దర్శకుడు. మనసుని హత్తుకునే బలమైన సెంటిమెంట్, భావోద్వేగాల నేపథ్యంలో తండ్రి విలువ తెలిపేలా ఈ చిత్రం రూపొందుతోంది.

మ్యూజిక్ షాప్‌లో...

'ప్రస్థానం' (2010) సినిమాతో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ప్రస్థానం మొదలుపెట్టారు అజయ్ ఘోష్. కమెడియన్, విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్.. ఇలా తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో నటించి, మెప్పించారాయన. తాజాగా 'మ్యూజిక్ షాప్ మూర్తి'లో హీరోగా చేశారు. శివ పాలడుగు దర్శకత్వం వహించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. మన జీవితాల్లో మనం ఏం కోల్పోయి ఏ స్థితిలో ఉన్నామో చూపించేలా ఈ చిత్రం ఉంటుందని యూనిట్ పేర్కొంది.



'మ్యూజిక్ షాప్'లో అజయ్ ఘోష్, చాందిని

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ప్రారంభం

సందీప్ కిషన్ హీరోగా నక్కిన త్రినాధరావు దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా మంగళవారం ఆరంభమైంది. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేశ్ దండా ఈ సినిమాను నిర్మించనున్నారు. తొలి సన్నివేశానికి దర్శకుడు విజయ్ కనకమేడల కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. అనిల్ సుంకర గౌరవ దర్శకత్వం వహించారు. ''ఈ సినిమాలో సందీప్ కిషన్ క్యారెక్టరైజేషన్ కొత్తగా ఉంటుంది. రావు రమేశ్ ఓ కీలక పాత్రలో నటిస్తారు. పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నాం. దర్శకుడిగా నక్కిన త్రినాధరావు విజయవంతమైన ప్రయాణంలో భాగమైన రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు డైలాగ్ రైటర్‌గా చేస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



'దిల్' రాజు, సందీప్ కిషన్

గట్స్ ఉన్నవాళ్లకే హిట్స్ వస్తాయి

- తేజ సజ్జా

''సత్యం' థియేటర్‌లో వందరోజులు ఆడిన సినిమాలు చూశాను. అలాంటి ప్లేస్‌లో మా 'హను-మాన్' వంద రోజుల పండగ జరుపుకోవడం హ్యాపీగా ఉంది. ప్రేక్షకులు మాకు ఇచ్చిన గిఫ్ట్ ఇది'' అని తేజ సజ్జా అన్నారు. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హను-మాన్'. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది జనవరి 12న విడుదలైంది. దాదాపు 300 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం 25 కేంద్రాల్లో వంద రోజుల ప్రదర్శనను పూర్తి చేసుకుందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన 'హను-మాన్' హిస్టారిక్ 100 డేస్ సెలబ్రేషన్స్‌లో తేజ సజ్జా మాట్లాడుతూ- ''దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాత నిరంజన్‌రెడ్డిగారిలోని ధైర్యాన్ని ఈ తరం స్ఫూర్తిగా తీసుకోవాలి. గట్స్ ఉన్నవాళ్లకే హిట్స్ వస్తాయి'' అన్నారు. ''ఇంద్ర, నువ్వు నాకు నచ్చావ్, పోకిరి' వంటివి.. నాకు బాగా గుర్తున్న వంద రోజుల వేడుకలు జరుపుకున్న సినిమాలు. అయితే ఇప్పుడు సినిమా అంటే ఓ వీకెండ్ అయిపోయింది. ఇలాంటి తరంలో వందో రోజు కూడా థియేటర్స్‌కు వచ్చి ఆడియన్స్ మా సినిమా చూస్తున్నారంటే అది మా అదృష్టంగా భావిస్తున్నాం. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయు)లో రాబోయే సినిమాల్లో అన్ని పరిశ్రమల నుంచి పెద్ద నటీనటులు కనిపిస్తారు'' అన్నారు ప్రశాంత్ వర్మ. ''నా కాలేజీ రోజుల్లో సినిమాల వంద రోజుల ఫంక్షన్స్ చూసేవాడిని. అలాంటిది నేను నిర్మించిన సినిమా వంద రోజులు జరుపుకోవడం హ్యాపీగా ఉంది'' అన్నారు నిరంజన్ రెడ్డి. ''హను-మాన్' వంద రోజుల వేడుక చేసుకోవడం హ్యాపీగా ఉంది''అన్నారు చైతన్య.

ఐమాక్స్ త్రీడీలో జై హనుమాన్... 'హను-మాన్'కు సీక్వెల్‌గా 'జై హనుమాన్' రానుంది. మంగళవారం (ఏప్రిల్ 23) హనుమాన్ జయంతి సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసి, భారీ వీఎఫ్ఎక్స్‌తో రూపొందించనున్న ఈ సినిమాను ఐమాక్స్ 3డీ వెర్షన్‌లో విడుదల చేయనున్నట్లు యూనిట్ పేర్కొంది.



చైతన్య, నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా, సముద్ర ఖని

ధర్మవీర్ శంభాజీ

ఛత్రపతి శివాజీ మహారాజ్ పెద్ద కుమారుడు శంభాజీ జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'ఛావా'. ఈ చిత్రంలో శంభాజీ పాత్రను విక్కీ కౌశల్ చేస్తున్నారు తండ్రి శివాజీలానే శంభాజీని కూడా ధర్మవీర్ అని గౌరవించేవారు. అలాంటి గొప్ప పాత్ర కావడంతో ఫిజికల్ మేకోవర్ పరంగా, నటన పరంగా విక్కీ కౌశల్ చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ హిస్టారికల్ మూవీలో శంభాజీ భార్య ఏసుభాయి పాత్రలో రష్మికా మందన్నా కనిస్తారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సినిమాకు సంబంధించిన విక్కీ కౌశల్ లుక్ లీకై, సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాను డిసెంబరు 6న విడుదల చేసేలా చిత్రనిర్మాత దినేష్ విజన్ ప్లాన్ చేస్తున్నారట.



విక్కీ కౌశల్

పడమటి కొండల్లో ప్రేమ

అనురోప్ కటారి హీరోగా నటిస్తున్న సినిమా 'పడమటి కొండల్లో...'. యశస్వి శ్రీనివాస్, శ్రావ్య రెడ్డి, మురళీ కృష్ణం రాజు, లతీష్ జవ్వాది, మురళీ రాజు ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. నరేష్ పెంట దర్శకత్వంలో జయకృష్ణ దురుగడ్డ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను హీరో సాయిదుర్గా తేజ్ 'ఎక్స్' వేదికగా విడుదల చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా కొనసాగే ఈ సినిమాలోని లవ్‌స్టోరీ కూడా ఉంది. సినిమా వినూత్నంగా ఉంటూ, ఓ విజువల్ ఫీస్ట్‌లా ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు ఈ చిత్ర దర్శకుడు- సంగీత దర్శకుడు నరేష్ పెంట.



అనురోప్ కటారి

సీత కష్టాలతో...

సుమన్ తేజ్, గరీమా చౌహాన్ జంటగా సతీష్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మించిన చిత్రం 'సీతా కల్యాణ వైభోగమే'. ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ – ''యుగంధర్ నిర్మించిన 'సీతా కల్యాణ వైభోగమే' టైటిల్ చూస్తే, ఫీల్ గుడ్ మూవీలా కనిపిస్తోంది. మంచి కథాంశంతో రూపొందించిన ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని అన్నారు. ''కొన్ని వందల స్క్రిప్ట్స్ విన్నాం. ఫైనల్‌గా ఈ సినిమాతో జర్నీ మొదలైంది'' అన్నారు సుమన్ తేజ్. ''సీతమ్మ తల్లి పడ్డ కష్టాలు మనకు పూర్తిగా తెలియవు. ఈ చిత్రంలో నాలాంటి రావణ పాత్రతో సీత ఎలాంటి కష్టాలు పడిందో చూపించారు. సీత క్యారెక్టర్‌లో గరీమ చక్కగా నటించారు'' అన్నారు గగన్ విహారి. ''మహిళలు ఎదుర్కొనే సమస్యలను ఎమోషనల్ జర్నీగా చూపించాం'' అన్నారు సతీష్ పరమవేద. ''ఏ మాత్రం పారితోషికం ఆశించకుండా పని చేసిన సంగీతదర్శకుడు చరణ్ అర్జున్‌కు థ్యాంక్స్'' అన్నారు రాచాల యుగంధర్.



గరీమ, సుమన్ తేజ్

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 32

బుధవారం 24-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



స్టాయినిస్ విధ్వంసం

63 బంతుల్లో 124 పరుగులు.. చెన్నైపై 6 వికెట్ల తేడాతో లక్నో గెలుపు - స్పోర్ట్స్‌లో



ప్రభుత్వ బ్యాంకులే ముందు..

ప్రైవేటు కంటే ప్రభుత్వ బ్యాంకుల్లో రెపో బదిలీ ఎక్కువన్న ఆర్బీఐ - బిజినెస్‌లో



ఆంధ్రాలో అధికారం జగన్‌దే

ఏపీలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి అధికారంలోకి వస్తారని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ అన్నారు.

వివరాలు 2లో ▸



వేలం వద్దు.. మేమే కేటాయిస్తాం

2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులపై 2012లో ఇచ్చిన తీర్పును సవరించాలని 12 ఏళ్ల తర్వాత సుప్రీంకు కేంద్రం విజ్ఞప్తి చేసింది.

వివరాలు 6లో ▸



మలేసియాలో ఢీకొన్న హెలికాప్టర్లు

మలేసియా ఆర్మీకి చెందిన రెండు హెలికాప్టర్లు ప్రమాదవశాత్తు ఢీకొనడంతో 10 మంది వైమానిక సిబ్బంది మరణించారు.

వివరాలు 6లో ▸



క్షమాపణలు 'ఫుల్ పేజీ' వేశారా?

అల్లోపతిని కించపరుస్తూ ఇచ్చిన ఫుల్‌పేజీ యాడ్‌ల స్థాయిలోనే క్షమాపణలు చెప్పారా? అని రామ్‌దేవ్ బాబాను 'సుప్రీం' ప్రశ్నించింది.

వివరాలు 6లో ▸



విజయనగరం జిల్లా చెల్లూరు వద్ద నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

మీ డ్రీమ్సే నా స్కీమ్సే

ప్రజలందరి కలలు మన సంక్షేమ పథకాలతో సాకారం

విజయనగరం జిల్లా చెల్లూరు మేమంతా సిద్ధం సభలో సీఎం వైఎస్ జగన్



మీ బిడ్డ తెచ్చిన పథకాలు ఏకంగా దాదాపు 40

మన రాష్ట్రం, గ్రామాల కలలనూ నెరవేర్చాం

- ప్రతి ఊరిలో ఏడు వ్యవస్థలు తెచ్చి అవస్థలు తొలగించాం
- జనానికి మంచి చేసిన మీ జగన్‌పై తోడేళ్ల దాడి
- మన పాలనలో జరిగిన మేలుపై మీ కుటుంబమంతా చర్చించుకోవాలి
- పిల్లలు, సంక్షేమ పథకాల భవిష్యత్తు గురించి ఆలోచించాలి
- చంద్రబాబు పాలనలో స్కీములేవు.. అన్నీ స్కాములే
- మళ్లీ ప్రజల రక్తం తాగడానికి చంద్రముఖిలా మారాడు
- కాల్‌మనీ, సెక్స్ రాకెట్లు నడపటం మినహా బాబు చేసిందేమిటి?
- పొలాల్లో దిష్టిబొమ్మనైనా నమ్మొచ్చుగానీ ఆయన్ను మాత్రం నమ్మలేం

10లో

ఊరు కలలనూ నెరవేర్చాం..

ఊరికి కూడా కలలుంటాయి. గ్రామంలో అందే సేవలు బాగుంటేనే తమ ఊరు బాగుంటుందని.. ఆ గ్రామాన్ని విడిచిపెట్టి ఎక్కడికెక్కడికో వెళ్లి పోరని.. గ్రామానికి కూడా కల ఉంటుంది. ఆ గ్రామం డ్రీమ్ కోసం మీ జగన్ ఎన్ని స్కీమ్‌లు తెచ్చాడో తెలుసా? ఏకంగా ఏడు స్కీమ్‌లు తెచ్చాడు. ఆ గ్రామంలోనే కనిపిస్తాయి సచివాలయాలు, 60-70 ఇళ్లకో వలంటీర్ వ్యవస్థ, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, నాడు-నేడుతో మారిన ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, మహిళా పోలీసు వ్యవస్థ కనిపిస్తాయి. వీటితోపాటు నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీలు కూడా కనిపిస్తాయి. గ్రామానికే వచ్చిన ఫైబర్ గ్రిడ్. ఇవన్నీ మీ గ్రామాల్లోనే కనిపించే జగన్ మార్కు విప్లవాత్మక మార్పులు. గ్రామాలే కాకుండా రాష్ట్రం కలలను కూడా సాకారం చేస్తూ విప్లవాత్మక చర్యలు చేపట్టాం.



వదలని వడగాడ్పులు

మరింత ఉధృతం కానున్న ఎండలు

45 డిగ్రీలకు పైగా నమోదయ్యే అవకాశం

రైల్వేలను అప్రమత్తం చేసిన ఐఎండీ

12లో




ఆర్థికాభివృద్ధి అదుర్స్

పారిశ్రామిక రంగం రయ్..రయ్

దోపిడీకి కేరాఫ్ సీఎం రమేశ్

- వివరాలు I, II, III, IVలో

ఎన్నికల వేళ.. పవన్ సంపద సృష్టి



- దాదాపు రూ.25 కోట్లతో హైదరాబాద్, మంగళగిరిలో ఇల్లు, ఇంటి స్థలం కొనుగోలు
- మొన్న మార్చి 4నే రూ.16.14 కోట్లతో హైదరాబాద్‌లో ఇల్లు..
- ఫిబ్రవరిలో మంగళగిరిలో రూ.7.11 కోట్లతో ఇంటి స్థలం
- 10% పైగా ఆస్తులు ఎన్నికలకు 2 నెలల ముందు కొన్నవే
- ఎన్నికల అఫిడవిట్‌లో పవన్‌కళ్యాణ్

2లో

పైసా ఖర్చు లేకుండా ప్రపంచ స్థాయి నైపుణ్యాలు

ప్రపంచ దిగ్గజ సంస్థ.. 'ఎడెక్స్' కోర్సుల సర్టిఫికేషన్‌లో ఏపీ రికార్డు

నెలలోనే 1.03 లక్షలకుపైగా సర్టిఫికేషన్లతో సత్తా

ప్రపంచవ్యాప్తంగా ఏటా 5 లక్షల సర్టిఫికేషన్లనే అందిస్తున్న ఎడెక్స్


ఏడాదికి 12 లక్షల సర్టిఫికేషన్లు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

ఎడెక్స్ కోర్సుల్లో 3 లక్షల మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల రిజిస్ట్రేషన్

వీరందరూ కోర్సులు చేయాలంటే బయట రూ.382 కోట్ల వ్యయం

పైసా భారం పడకుండా ఉచితంగా అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

2లో



బీజేపీ సిద్ధాంతాల మేరకు ముస్లిం

రిజర్వేషన్లపై నిర్ణయం



- రాజ్యాంగానికి లోబడే మా పార్టీ ఏ నిర్ణయమైనా అమలు
- బీజేపీ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్దార్థ్‌నాథ్ సింగ్ వెల్లడి

2లో

మోదీ వ్యాఖ్యలను

పరిశీలిస్తున్నాం



చొరబాటుదారులంటూ ముస్లింలను ప్రధాని మోదీ నిందించారన్న కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదుపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. మోదీ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నామని తెలిపింది.

6లో

ఇక్కడ డీల్ కుదిరింది.. అక్కడ వేలు తెగింది

ఢిల్లీలో కోపూరి లక్ష్మి డ్రామా వెనుక టీడీపీ భారీ స్క్రిప్టు

- బూర్ల రామాంజనేయులు, ఆనంద్ బాబుతో కలిసి టీడీపీలో పని చేస్తున్న లక్ష్మి.. ఓటమి భయంతో ఆమెతో డ్రామా ఆడించిన నేతలు
- చంద్రబాబు నేతృత్వంలోనే చీప్ ట్రిక్
- 1994 నుంచి చీప్ ట్రిక్స్, గుంటనక్క వేషాలు బాబుకు అలవాటే
- ఎల్లో మీడియా, జాతీయ మీడియా దృష్టి కోసమే ఈ నాటకం
- ఓటమి భయంతో ఆమెతో వైఎస్సార్‌సీపీ నేతలపై ఆరోపణలు
- ఆరేళ్ల కింద వేధింపులంటూ ఇప్పుడు ఢిల్లీలో వినతిపత్రాలు



ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులుతో టీడీపీ కార్యకర్త కోపూరి లక్ష్మి

11లో

- ఇటీవల కాలంలో ఆమెను వేధించినట్లు ఎక్కడా ఫిర్యాదులూ లేవు
- మోసాలే ఈ ఆదర్శ మహిళ వృత్తి



ఇదండీ వరస



ఎవరేశారో తెలుసుకోకుండా దోశలు తినేయడమేనా!!

చంద్రబాబు, లోకేశ్ ప్రకటించిన ఆస్తులు

రూ.1,474 కోట్లు

వారి కుటుంబానికి హైదరాబాద్, తమిళనాడులో ఎక్కువ ఆస్తులు

- హైదరాబాద్‌లో సొంతిల్లు, ఫామ్ హౌస్.. సొంత రాష్ట్రం ఏపీలో మాత్రం సొంతిల్లు కూడా లేదు
- ఆస్తుల విలువను తక్కువగా చూపిన తండ్రీకొడుకులు.. మదీనాగూడలోని ఫామ్ హౌస్ విలువే రూ.500 కోట్లు
- దాని విలువ కేవలం రూ.100 కోట్లుగా చూపిన వైనం
- రెండేళ్ల వయసులోనే ఆస్తి కొన్న దేవాన్ష్
- విడివిడిగా ఆస్తులు చూపించి తక్కువగా చెప్పుకుంటున్న చంద్రబాబు కుటుంబం



సాక్షి, అమరావతి : చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ వారి ఆస్తుల గురించి ఎన్నికల అఫిడవిట్‌లలో వెల్లడించిన వివరాలు చర్చనీయాంశమయ్యాయి. అపారమైన ఆస్తులు ఉన్నా చాలా తక్కువ ఆస్తుల్ని మాత్రమే వారు బయటపెట్టినట్లు తెలుస్తోంది. కుప్పం అసెంబ్లీ అభ్యర్థిగా చంద్రబాబు, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థిగా లోకేశ్ విడివిడిగా ఆస్తులు చూపించారు. కానీ వారు కలిసే ఉంటున్నారు. ఆస్తుల్ని మాత్రం పక్కాగా పంచుకున్నారు. అందరూ కలిసి ఒకే కుటుంబంగా ఉంటున్నప్పటికీ, విడివిడిగా ఆస్తుల్ని చూపించడం ద్వారా తక్కువ ఆస్తిపరులని ప్రజలను మభ్య పెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అఫిడవిట్లలో అధికారికంగా వారు ప్రకటించిన ఆస్తుల విలువ రూ.1,474 కోట్లు. చంద్రబాబు, భువనేశ్వరి ఆస్తుల విలువ రూ.931.83 కోట్లు కాగా, లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్ ఆస్తుల విలువ

మిగతా 3వ పేజీలో ▸

అంతా బాబు జట్టే..

పచ్చ కుట్రే..

వివేకా హత్య కేసును రాజకీయ లబ్ధికి వాడుకునే పన్నాగం



- చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే దుష్ప్రచారం
- పచ్చ డ్రామాలో పాత్రధారులే సునీత, షర్మిల, సౌభాగ్యమ్మ
- వివేకా హత్యపై మాట్లాడొద్దన్న న్యాయస్థానం తీర్పుతో బెంబేలు
- తీర్పును వ్యతిరేకిస్తూ సునీత వ్యాఖ్యలు
- తాజాగా తీర్పును సవాల్ చేస్తూ టీడీపీ నేత బీటెక్ రవి పిటిషన్
- సునీత మాటలనే పిటిషన్‌లో చెప్పిన రవి
- వివేకా శత్రువులు, హంతకులతో జట్టు కట్టిన సునీత దంపతులు

3లో

పైసా ఖర్చు లేకుండా ప్రపంచ స్థాయి నైపుణ్యాలు

ప్రపంచ దిగ్గజ సంస్థ.. 'ఎడెక్స్' కోర్సుల సర్టిఫికేషన్‌లో రాష్ట్రం రికార్డు

సాక్షి, అమరావతి: ప్రపంచంలోనే అత్యుత్తమ, నాణ్యమైన విద్యను అందించడం.. విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా ఆన్‌లైన్ కోర్సులు అందించడంలో ప్రపంచంలోనే దిగ్గజ ఎడ్యుటెక్ సంస్థ.. ఎడెక్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఎడెక్స్ ద్వారా 260కిపైగా వరల్డ్ క్లాస్ వర్సిటీలు, కంటెంట్ పార్టనర్స్‌తో కలిసి 2వేలకు పైగా కోర్సులను ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. దీంతో పైసా ఖర్చు లేకుండా వీటిని అభ్యసిస్తున్న విద్యార్థులు సర్టిఫికేషన్ల సాధనలో రికార్డులు సృష్టిస్తున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి 'ఎడెక్స్' కోర్సులు ప్రారంభించిన నెల రోజుల్లోనే ఏకంగా 1,03,956 సర్టిఫికేషన్లు సాధించి సత్తా చాటారు. దీంతో ఎడెక్స్ చరిత్రలోనే ఏపీ అతిపెద్ద సర్టిఫికేషన్ హబ్‌గా ఆవిర్భవించింది. ఏటా ప్రపంచవ్యాప్తంగా ఎడెక్స్ కేవలం 5 లక్షల సర్టిఫికేషన్లు మాత్రమే అందిస్తోంది. కానీ, రాష్ట్ర విద్యార్థులకు ఏడాదికి 12లక్షల సర్టిఫికేషన్లు ఇచ్చేలా ప్రభుత్వం ఎడెక్స్‌తో ఒప్పందం చేసుకోవడం విశేషం.



1,469 కోర్సుల్లో సర్టిఫికేషన్లు..

ఎడెక్స్ ద్వారా కోర్సులు అందిస్తున్నవాటిలో హార్వర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, కొలంబియా, న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్, ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు ఉన్నాయి. రాష్ట్ర విద్యార్థులు 100 ప్రపంచ స్థాయి వర్సిటీల నుంచి 1,469 రకాల కోర్సుల్లో లక్షకుపైగా సర్టిఫికేషన్లు సాధించారు. ఎంఐటీ 320, హార్వర్డ్ 1,560, గూగుల్ 410, ఐబీఎం 33,700, ఏడబ్ల్యూఎస్ 770, ఏఆర్ఎం 6,400, కొలంబియా వర్సిటీ 100, ఐఐఎం బెంగళూరు 1,957, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ 170, ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ 700, స్టాన్‌ఫర్డ్ 2,200, ఫుల్ బ్రిడ్జి (హార్వర్డ్, ఎంఐటీ సంయుక్తంగా అందిస్తున్న కోర్సులు)ద్వారా 13,500 సర్టిఫికేషన్లు పొందారు. ఉన్నత విద్యా మండలి ఒక ఎడెక్స్ కోర్సును తప్పనిసరి సబ్జెక్టుగా చదివేలా కరిక్యులంలో చేర్చింది. వీటికితోడు విద్యార్థికి నచ్చినన్ని ఎడెక్స్ కోర్సులను వ్యాల్యూ యాడెడ్‌గా చదువుకోవడానికి వీలు కల్పిస్తోంది.

సులభంగా ప్రవేశాలు..

ఎడెక్స్ ద్వారా మైక్రో మాస్టర్స్ కోర్సులో 7 వేల మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. దీన్ని పూర్తి చేస్తే విదేశాల్లో ఎంఎస్‌లో చేరడం సులువవుతుంది. పైగా అక్కడికి వెళ్లాక సిలబస్‌లో ప్రస్తుతం ఎడెక్స్‌లో నేర్చుకున్న గ్రూప్ మాడ్యూల్స్‌ను మినహాయిస్తారు. తద్వారా విద్యార్థికి ఎంఎస్‌లో చదవాల్సింది తగ్గడంతో పాటు సంబంధిత కోర్సుకు చెల్లించాల్సిన ఫీజు కూడా ఆదా అవుతుంది.

రూ.382 కోట్లు వ్యయమయ్యే కోర్సులు ఉచితంగా..

ఇప్పటి వరకు 3 లక్షల మంది విద్యార్థులు, బోధన సిబ్బంది ఎడెక్స్ కోర్సులకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరందరూ ఎడెక్స్ అందించే 2 వేల కోర్సుల్లో ఒక్కో కోర్సు చొప్పున బయట చదువుకుంటే మార్కెట్ రేటు ప్రకారం ఏకంగా రూ.382 కోట్లు వ్యయమవుతుంది. ఇప్పటివరకు సుమారు 75వేల మందికిపైగా విద్యార్థులు ఆయా కోర్సులు పూర్తి చేసి 1,03,956 సర్టిఫికేషన్లు పొందారు. ఈ కోర్సుల మార్కెట్ విలువ రూ.115 కోట్ల వరకు ఉంది. ఇంత ఖరీదైన కోర్సులను విద్యార్థులపై నయాపైసా భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోంది.

మన వర్సిటీల్లోకి అంతర్జాతీయ స్థాయి విద్య



అంతర్జాతీయ స్థాయి విద్యను మన వర్సిటీల్లోకి తేవాలన్నదే మా లక్ష్యం. అందుకే ఎడెక్స్‌తో ఒప్పందం చేసుకున్నాం. ప్రపంచంలో టాప్ 50లో ఉన్న 37 వర్సిటీలు ఇందులో కోర్సులు ఆఫర్ చేస్తున్నాయి. దేశంలో ఇంత పెద్ద ఎత్తున ఎడెక్స్ ద్వారా అంతర్జాతీయ కోర్సులు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ ఒక్కటే. ప్రపంచంలో అత్యుత్తమ అధ్యాపకులతో మన విద్యార్థులకు బోధన అందిస్తున్నాం. – కె.హేమచంద్రారెడ్డి, చైర్మన్, ఉన్నత విద్యా మండలి

32 కోర్సుల్లో సర్టిఫికేషన్లు..



మాది మదనపల్లె. అమ్మ కూరగాయలు అమ్ముతూ, నాన్న ఆటో నడుపుతూ నన్ను, తమ్ముడిని చదివిస్తున్నారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన సాయంతో ఇంజనీరింగ్ చదువుతున్నా. నేను ఎడెక్స్ ద్వారా ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా సంస్థలు అందిస్తున్న 32 రకాల కోర్సులు పూర్తి చేశాను. డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఏఐ వంటి కోర్సుల్లో అడ్వాన్స్‌డ్ మెథడ్స్ నేర్చుకున్నాను. హార్వర్డ్, ఐబీఎం, గూగుల్ వంటి సంస్థల నుంచి సర్టిఫికేషన్లు పొందాను. ఈ కోర్సులు బయట చేయాలంటే వేల రూపాయలు పెట్టాలి. ఎడెక్స్ కోర్సులతో నాలాంటి పేద విద్యార్థులకు పెద్ద సంస్థల్లో మంచి ఉద్యోగాలు దక్కుతాయనే నమ్మకం ఉంది. – టి.మోక్షిత్ సాయి, బీటెక్, శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, చిత్తూరు

కర్టిన్ వర్సిటీ నుంచి సర్టిఫికేషన్..



మాది నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం గోవిందిన్నె గ్రామం. అమ్మ చిరుద్యోగి. నాన్న కూలి పనులకు వెళ్తారు. మా అన్నను, నన్ను జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ఆదుకున్నాయి. నేను నంద్యాలలో రాజీవ్‌గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాను. ఎడెక్స్‌లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ)లో మైక్రో మాస్టర్స్ గ్రూప్ కోర్సు చేశాను. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 182వ స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాలోని కర్టిన్ వర్సిటీ నుంచి సర్టిఫికేషన్ సాధించాను. – దూలం చందు, బీటెక్ (ఈఈఈ)

స్పెయిన్ వర్సిటీ నుంచి ఐవోటీ చేశా..



నేను ఉచితంగా ఎడెక్స్ ద్వారా ప్రపంచంలోనే అడ్వాన్స్‌డ్ కోర్సులు నేర్చుకుంటున్నా. స్పెయిన్‌కు చెందిన 'వాలెన్సియా పాలిటెక్నిక్ విశ్వవిద్యాలయం' నుంచి ఐవోటీలో మైక్రో మాస్టర్స్ కోర్సు పూర్తి చేశాను. మరో రెండు కోర్సులను కూడా త్వరలో పూర్తి చేయబోతున్నా. సొంతంగా డబ్బులు ఖర్చుపెట్టి చదవలేని నాలాంటి వారందరికీ ఎడెక్స్ కోర్సులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. – అర్వా నాగ సుజిత, బీటెక్ (ఈఈఈ), రాజీవ్‌గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, నంద్యాల

నేడు సీఎం జగన్ తాడేపల్లికి రాక

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు (బుధవారం) తాడేపల్లికి రానున్నారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ముగించుకుని ఆయన రోడ్డు మార్గంలో శ్రీకాకుళం జిల్లా అక్కవరం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి విమానంలో గన్నవరం విమానాశ్రయానికి వస్తారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన తాడేపల్లి చేరుకుంటారు.

బీజేపీ సిద్ధాంతాల మేరకు ముస్లిం రిజర్వేషన్లపై నిర్ణయం

- రాజ్యాంగానికి లోబడే మా పార్టీ ఏ నిర్ణయమైనా అమలు
- బీజేపీ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ వెల్లడి



సాక్షి, అమరావతి: భారతీయ జనతా పార్టీ విధానాలు, సిద్ధాంతాలకు అనుగుణంగానే ముస్లిం రిజర్వేషన్ల అంశంలో తమ వైఖరి ఉంటుందని బీజేపీ ఏపీ ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ స్పష్టం చేశారు. తమ పార్టీ నిర్ణయాలు ఏమైనా రాజ్యాంగబద్ధంగా, నిబంధనలకు లోబడే ఉంటాయని ఆయన చెప్పారు. 'మోదీ గ్యారెంటీ-2024' పేరుతో బీజేపీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో తెలుగు ప్రతులను మంగళవారం విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకులతో కలిసి సిద్ధార్థనాథ్‌సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలనే సమస్యేలేదని స్పష్టంచేశారు. ఇప్పటికే ఏపీకి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించినట్లు తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ... యూనిఫాం సివిల్ కోడ్ తెచ్చే దిశగా పని చేస్తున్నామని చెప్పారు. కేంద్రంలో ఎన్డీఏ 400 సీట్లు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఏపీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, ప్రదాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా పర్యటనలు ఉంటాయని, త్వరలోనే తేదీలు ఖరారవుతాయని తెలిపారు.

2,767 నామినేషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు గత ఐదురోజుల్లో 2,767 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో అసెంబ్లీకి 2,350, లోక్‌సభకు 417 ఉన్నాయి. మంగళవారం అసెంబ్లీకి 702 సెట్ల నామినేషన్లు, లోక్‌సభకు 124 సెట్ల నామినేషన్లను దాఖలయ్యాయి. సోమవారం లోక్‌సభకు నామినేషన్లు దాఖలు చేసిన ప్రముఖుల్లో వైఎస్సార్‌సీపీ తరఫున వి.విజయసాయిరెడ్డి (నెల్లూరు), కారుమూరి సునీల్‌కుమార్ (ఏలూరు), రాపాక వరప్రసాద్ (అమలాపురం), తెలుగుదేశం తరఫున తెన్నేటి కృష్ణప్రసాద్, కాంగ్రెస్ తరఫున ఎం.పళ్లంరాజు, బీజేపీ తరఫున భూపతిరాజు వర్మ ఉన్నారు.

ఏపీలో మళ్లీ జగనే సీఎం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఏపీలో ప్రస్తుత సీఎం జగన్ మరోసారి అధికారంలోకి వస్తారని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ తెలిపారు. ఈ మేరకు తనకు సమాచారం ఉందన్నారు. ఏ పీలో ఎవరు గెలిచినా తమకు సంబంధం లేదని చెప్పారు.

కడప కోర్టు ఉత్తర్వుల రద్దు కోరుతూ పిటిషన్లు

- హైకోర్టులో దాఖలు చేసిన బీటెక్ రవి, నర్రెడ్డి సునీత
- విచారణ నేటికి వాయిదా
- విచారణ నుంచి తప్పుకుంటామని మౌఖికంగా వెల్లడించిన జస్టిస్ శేషసాయి ధర్మాసనం



సాక్షి, అమరావతి: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ముందు పెండింగ్‌లో ఉన్న మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు గురించి మాట్లాడవద్దంటూ కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నర్రెడ్డి సునీత, టీడీపీ నేత రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) హైకోర్టును ఆశ్రయించారు. కడప జిల్లా కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ వారు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురించి బీటెక్ రవి తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించారు. అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. అత్యవసర విచారణ అవసరం లేదన్న ధర్మాసనం ఈ వ్యాజ్యంపై బుధవారం విచారణ జరుపుతామంది. ఈ వ్యాజ్యం విచారణ నుంచి తాము తప్పుకుంటామని ధర్మాసనం మౌఖికంగా తెలిపింది.

'మా వాదన వినలేదు'

కడప జిల్లా కోర్టు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా, తమ వాదన వినకుండా ఏకపక్షంగా తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులిచ్చిందని బీటెక్ రవి, సునీత తమ వ్యాజ్యాల్లో పేర్కొన్నారు. బాధితులు సూట్ దాఖలు చేయాల్సి ఉండగా.. పార్టీ తరఫున దాఖలు చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కడప జిల్లా కోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చి ఉండాల్సింది కాదన్నారు. ఆ ఉత్తర్వులు చెల్లుబాటు కావన్నారు. కడప కోర్టు తన పరిధి దాటి వ్యవహరించిందని పేర్కొన్నారు. మధ్యంతర ఉత్తర్వుల ద్వారా కడప కోర్టు తమ వాక్ స్వాతంత్ర్యపు హక్కును నిరోధించిందని, ఇది సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమన్నారు. మధ్యంతర ఉత్తర్వుల పేరుతో జిల్లా కోర్టు తుది అభిప్రాయానికి వచ్చిందన్నారు. ఎన్నికల వేళ ప్రజాబాహుళ్యంలో ఉన్న వాస్తవాలను ప్రజలకు తెలియచేసే హక్కు తమకు ఉందన్నారు.

'సాక్షి'ని అడ్డు పెట్టుకుని రూ.కోట్లు దోచుకున్నారు

- వైఎస్సార్‌సీపీ సింహం కాదు.. రేబీస్ వచ్చిన శునకం
- చిరంజీవి జోలికి రావొద్దు : పవన్

పిఠాపురం: 'సాక్షి'ని అడ్డుపెట్టుకొని రూ.కోట్లు దోచుకున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంగళవారం కాకినాడ జిల్లా ఉప్పాడలో నిర్వహించిన బహిరంగ సభలో అక్కసు వెళ్లగక్కారు. ఉప్పాడ హార్బర్ నిర్మాణం ఖర్చు రూ.420 కోట్లు అయితే, దాని పేరుతో సాక్షి పేపర్‌కు ఇచ్చిన యాడ్స్‌తో సీఎం జగన్ రూ.335 కోట్లు దోచుకున్నారని అన్నారు. సాక్షి పేపర్‌లో పని చేస్తున్న వారిలో 41 మంది ఉద్యోగులను పీఆర్‌వోలు, మీడియా మేనేజర్ల కింద పెట్టుకుని కొంత డబ్బు దోచుకున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనుల పేరుతో యాడ్స్ వేసుకుని రూ.600 కోట్లు దోచుకున్నారన్నారు. సాక్షి పేపర్‌ను అడ్డుపెట్టుకొని రూ.935 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. వాలంటీర్లకు పేపర్ వేసే పేరుతో రూ.330 కోట్లు దోచుకున్నారన్నారు. వాలంటీర్లను కార్యకర్తల్లా మార్చేసి వారికి డబ్బులిచ్చి రాజీనామాలు చేయిస్తున్నారని చెప్పారు. సజ్జల రామకృష్ణారెడ్డి వైఎస్సార్‌సీపీ సింహమని అది సింగిల్‌గానే వస్తుందని అంటున్నారని, కానీ అది రేబీస్ వచ్చిన శునకమని అన్నారు. తమని తోడేళ్లు, హైనాలు అంటూ గుంపులుగా వస్తామని సజ్జల అంటున్నారని, రేబీస్ సోకిన శునకాన్ని తరిమి కొట్టడానికి తామంతా కూటమిగా వస్తున్నామన్నారు. సజ్జలా మనం బతుకుతున్నది మానవ సమాజంలో అన్నారు. పద్మభూషణ్ అందుకున్న చిరంజీవి జోలికి వెళ్లవద్దన్నారు. సజ్జలకు ఆధిపత్య అహంకారం ఎక్కువని, జనం ఎవరినైనా మెచ్చుకొంటే ఆయనకు గిట్టదన్నారు. తాను అన్నింటికీ తెగించి వచ్చానని, సజ్జల నోరు అదుపులో పెట్టుకోకపోతే ఊరుకునేది లేదని అన్నారు. వంగాను తల్లిలాంటిది, చెల్లిలాంటిది అన్న సీఎం జగన్ ఆయన సొంత తల్లిని, చెల్లిని పక్కన పెట్టేశారని పవన్ విమర్శించారు.

ఎన్నికల వేళ.. పవన్ సంపద సృష్టి

- వ్యక్తిగతంగా పవన్‌కు రూ.209.13 కోట్లు ఆస్తులు, రూ.65.76 కోట్ల అప్పులు
- భార్య. పిల్లల పేరిట మరో రూ.28.47 కోట్ల ఆస్తులు
- రూ.14 కోట్లకు పైగా విలువచేసే పది కార్లు ఉన్నట్లు వెల్లడి
- టెన్త్ వరకు చదువుకున్నట్లు.. 8 కేసులు పెండింగ్‌లో ఉన్నాయంటూ అఫిడవిట్

సాక్షి, అమరావతి: సరిగ్గా ఎన్నికలకు రెండు నెలల ముందు జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ హైదరాబాద్, మంగళగిరిలో దాదాపు రూ.25 కోట్ల ఆస్తులను కొనుగోలు చేశారు. ప్రస్తుత సాధారణ ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీచేస్తున్న ఆయన మంగళవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా తన వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఆదాయ, ఆస్తుల వివరాలను అఫిడవిట్ రూపంలో ఎన్నికల సంఘానికి సమర్పించారు. అందులో ఆయన నెలన్నర క్రితం 2024 మార్చి 4న రూ.16.14 కోట్లతో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో 1,060 చదరపు గజాల స్థలంలో 15,709 చదరపు అడుగుల్లో ఉన్న ఇంటిని కోనుగోలు చేసినట్లు చూపగా.. 2024 ఫిబ్రవరి 12న రూ.7.11 కోట్లతో మంగళగిరి పట్టణ పరిధిలోని 5,517.6 చదరపు గజాల స్థలం కొనుగోలు చేసినట్లు పవన్ అందులో పేర్కొన్నారు. అంతేకాక.. వ్యక్తిగతంగా తన పేరిట రూ. 209.13 కోట్లు స్థిర చరాస్తులుగానూ, రూ.65.76 కోట్లు అప్పులు ఉన్నట్లు ఆయన తెలిపారు. తన భార్య అన్నా లెజినోవా, అఫిడవిట్‌లో పేర్కొన్న నలుగురు పిల్లల పేరిట మరో రూ.28.47 కోట్ల స్థిర చరాస్తులు ఉన్నట్లు పవన్ పేర్కొన్నారు. ఇక మొత్తం ఆస్తుల్లో 10 శాతానికి పైగా ఆస్తులు ఎన్నికలకు రెండు నెలల ముందు కొనడం గమనార్హం.

ఆ పిల్లలకు ఒక రకంగా.. ఈ పిల్లలకు మరో రకంగా..

ఇదిలా ఉంటే.. అఫిడవిట్‌లో పవన్ తన పిల్లలు దేశాయి అకీరా నందన్, దేశాయి ఆద్య (వీరిద్దరూ రేణుదేశాయి-పవన్‌కళ్యాణ్ పిల్లలు)తో పాటు పోలీనా అంజని, మార్క్ శంకర్ (పవన్‌కళ్యాణ్-అన్నా లెజినోవా పిల్లలు) పేర్లతో ఉన్న ఆస్తులూ వెల్లడించారు. ఆ అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. వీరికి ఆస్తుల కేటాయింపులో పవన్ వ్యత్యాసం చూపించారు. విడాకులిచ్చిన రేణుదేశాయి పిల్లలకు ఒక రకంగా, ఆ తర్వాత మళ్లీ పెళ్లి చేసుకున్న లెజినోవా పిల్లలకు మరో రకంగా వారి పేరిట తన ఆస్తులు బహుమతుల రూపంలో ఇవ్వడం గమనార్హం.

చదివింది పదో తరగతే..

ఇక పవన్ పదో తరగతి వరకే చదువుకున్నారు. అది కూడా ఎస్ఎస్ఎల్‌సీ (సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్) రద్దయి, దాని స్థానంలో ఎస్ఎస్‌సీ (సెకండరీ స్కూల్ సర్టిఫికెట్) వచ్చిన చాలా ఏళ్ల తర్వాత ఎస్ఎస్ఎల్‌సీ చదవడం గమనార్హం. ఇంటర్‌లో మేథమేటిక్స్ మొదలు ఎకనామిక్స్ వరకు దాదాపు అరడజను సబ్జెక్టులు చదివినట్లు సందర్భాన్ని బట్టి చెప్పే పవన్.. అవన్నీ హంబక్ అని అఫిడవిట్‌లో కుండబద్దలు కొట్టారు. 1984లో నెల్లూరులోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో టెన్త్ ఉత్తీర్ణులైనట్లు అఫిడవిట్‌లో వివరించారు. తనపై మొత్తం 8 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొనగా.. తన ప్రస్తుత చిరునామా మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీగా చెబుతూ.. మంగళగిరి అసెంబ్లీ పరిధిలోని 197 పోలింగ్ బూత్ 1120 నెంబరుగా తనకు ఓటు ఉన్నట్లు తెలిపారు.

పవన్‌కళ్యాణ్ నామినేషన్ అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సోదరుడు నాగబాబు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ, తన న్యాయవాదితో కలిసి వచ్చిన ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల నిబంధనలను వారు బేఖాతరు చేశారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు నలుగురికే అనుమతి ఉండగా అంతకుమించి లోపలకు అనుమతించారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో మాత్రమే అభ్యర్థుల అనుచరులు ఉండాలన్న నిబంధననూ లెక్కచేయలేదు. అక్కడ నినాదాలూ చేశారు.

బీజేపీ నేతలకు పరాభవం..

కూటమిలో సభ్యులైన టీడీపీ నేతలకు మాత్రమే విలువనిచ్చిన పవన్‌కళ్యాణ్.. అప్పటివరకూ ర్యాలీలో తనతో పాటు తిప్పుకున్న బీజేపీ నేత బుర్రా కృష్ణంరాజుకు నామినేషన్ కేంద్రంలోకి వచ్చే అవకాశం లేకుండా చేశారు. తనను పోలీసులు గేటు వద్ద అడ్డుకోవడంతో పొత్తు ధర్మాన్ని పాటించలేదంటూ కృష్ణంరాజు అసహనానికి గురయ్యారు. తరువాత పోలీసులు వర్మ కుమారుడు గిరీష్ వర్మతో పాటు ఆయన్ను లోపలకు పంపించారు. ఇక నామినేషన్ వేసేందుకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు నుంచి ఒకసారి ర్యాలీగా పిఠాపురం చేరుకోవడానికే పవన్ అనుమతి తీసుకున్నారు. అయితే, రెండుసార్లు తిరగడం గమనార్హం.

పవన్, కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలు..

2018-19 ఆర్థిక సంవత్సరంలో తనకెలాంటి ఆదాయం లేకపోగా, రూ.1,10,62,939 నష్టం వచ్చిందని.. అయితే, 2019-20లో రూ.4.51 కోట్లు, 2020-21లో రూ.12.86 కోట్లు, 2021-22లో 30.09 కోట్లు, 2022-23 ఆర్థిక ఏడాదిలో 12.20 కోట్లు మాత్రమే తన ఆదాయంగా ఆదాయపన్ను శాఖకు సమర్పించినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే, తన భార్య, పిల్లల ఆదాయాలకు సంబంధించి ఎలాంటి ఐటీ రిటర్న్స్ వివరాలు లేవు.

చరాస్తులు..

- పవన్‌కళ్యాణ్ చేతిలో ఈ ఏడాది ఏప్రిల్ 19 నాటికి తన చేతిలో నగదు రూపంలో రూ.3.15 లక్షలు ఉన్నాయని.. బ్యాంకుల్లో డిపాజిట్లుగా రూ.16.48 కోట్లు.. షేర్లు, బాండ్ల రూపంలో రూ.15.48 లక్షలు.. ఇన్సూరెన్స్ తదితర పెట్టుబడులుగా మరో రూ.3.02 కోట్లు.. ఇతరులకు అప్పు రూపంలో ఇచ్చిన మొత్తం రూ.3.65 కోట్లు.. అలాగే, రూ.14.01 కోట్లు విలువ చేసే కార్లు, వాహనాలున్నాయని.. రూ.2.34 కోట్ల బంగారు ఆభరణాలు.. రూ.14.51 లక్షల విలువ చేసే వెండి ఆభరణాలు.. ఇతర రూపాల్లో మరో రూ.1.79 కోట్లు కలిపి మొత్తం చర ఆస్తుల రూపంలో రూ.41.65 కోట్లుగా చూపించారు.
- తన వద్ద రూ.32 లక్షల విలువ చేసే హార్లీ డేవిడ్సన్ బైక్‌తో పాటు పది కార్లు (రెండు బెంజి, మూడు మహీంద్రా స్కార్పియోలు, రేంజ్ రోవర్, రెండు టయోటాలు, జీపు, టాటా పికప్ ట్రక్ వాహనాలున్నట్లు పవన్ పేర్కొన్నారు.
- ఇక తన భార్య అన్నా లెజినోవా పేరిట నగదు రూపంలో రూ.19,340లు.. బ్యాంకు డిపాజిట్లు రూపంలో రూ.86.05 లక్షలు.. రూ.13.97 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు కలిపి మొత్తంగా రూ.ఒక కోటి చరాస్తులున్నాయి.
- పిల్లలు దేశాయి అకీరా నందన్ పేరిట బ్యాంకు డిపాజిట్లుగా రూ.89.38 లక్షలు.. దేశాయి ఆద్య పేరిట రూ 87.77 లక్షల బ్యాంకు డిపాజిట్లు.. పోలీనా అంజని పేరిట బ్యాంకు డిపాజిట్లుగా రూ.85.92 లక్షలు.. మార్క్ శంకర్ పేరిట రూ.86.25 లక్షలు బ్యాంకు డిపాజిట్లుగా ఉన్నట్లు పేర్కొన్నారు. అకీరా నందన్‌కు తన తల్లి 2022లో ఆడి కారు బహుమతిగా ఇచ్చినట్లు పేర్కొన్నారు.
- మరోవైపు.. మొత్తం రూ.65.76 కోట్ల మేర తాను బ్యాంకులు లేదా వివిధ వ్యక్తులకు చెల్లించాలని పవన్ పేర్కొంటూ, అందులో రూ.17.56 కోట్లు బ్యాంకులకు, మరో రూ.46.70 కోట్లు 15 మంది వ్యక్తులు లేదా సంస్థలకు అప్పులుగా చెల్లించాల్సి ఉందని ఆయన తన అఫిడవిట్‌లో వివరించారు.

స్థిరాస్తులు..

- హైదరాబాద్ శంకరపల్లి మండలం జొన్నవాడ గ్రామంలో 18.02 ఎకరాల వ్యవసాయ భూములున్నాయని, వాటి ప్రస్తుత విలువ రూ. 10.42 కోట్లు ఉన్నట్లు పవన్ పేర్కొన్నారు.
- ప్రస్తుత మార్కెట్ విలువ అంచనాల ప్రకారం రూ.52.85 కోట్ల విలువచేసే ఏడుచోట్ల స్థలాలు (శేరిలింగంపల్లి మండల పరిధిలో రెండు, మంగళగిరి మండల పరిధిలో నాలుగు, హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఒకటి స్థలాలు ఉన్నట్లు తెలిపారు. మంగళగిరిలో పేర్కొన్న నాలుగు స్థలాల్లో ఒకటి ఈ ఏడాది ఫిబ్రవరి 12న రూ.7.11 కోట్లతో కోనుగోలు చేసినట్లు వివరించారు.
- ఆ ఏడింటిలో ఒకటి మంగళగిరిలోని స్థలం తన తల్లి బహుమతి రూపంలో ఇచ్చారని.. మిగిలినవి తను కొనుగోలు చేసినవన్నారు.
- హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో రూ. 3.14 కోట్లు విలువచేసే రెండు ఇళ్లు ఉన్నట్లు తెలిపారు.
- రూ.1.95 కోట్లు విలువచేసే హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో ఇంటిని భార్య అన్నా లెజినోవాకు బహుమతిగా ఇచ్చానన్నారు.
- రూ.22 కోట్లు విలువ చేసే హైదరాబాద్ జూబీహిల్స్‌లోని ఇంటిని తన భార్య అన్నా లెజినోవా పిల్లలు పోలీనా అంజని, మార్క్ శంకర్ ఇద్దరికీ చేరి సగం వాటాగా బహుమతిగా అందజేసినట్లు పవన్ పేర్కొన్నారు.

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట రామోజీ

- గుంటూరులో 'రోతరాతల రామోజీ మోసాలు' అనే అంశంపై చర్చలో వక్తలు
- హాజరైన సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్, ఆడిటర్ నాగార్జునరెడ్డి తదితరులు



చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవులపల్లి అమర్, చిత్రంలో ఇతర వక్తలు

నెహ్రూనగర్: వ్యవస్థలను మేనేజ్ చేయడంలో రామోజీరావు దిట్ట అని పలువురు ప్రముఖులు వ్యాఖ్యానించారు. ఆయన చట్టాలను ఎప్పుడూ గౌరవించడని, చట్టాలకు, రాజ్యాంగానికి తాను అతీతుడని చెప్పుకొంటూ చలామణి అవుతున్నారని పేర్కొన్నారు. గుంటూరులో మంగళవారం అగ్రిలరీ సొసైటీ ఫర్ డెమోక్రటిక్ డిబేట్ ఆధ్వర్యంలో 'రోత రాతల రామోజీ మోసాలు' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్, సీనియర్ ఆడిటర్ మందపాటి నాగార్జునరెడ్డి, హైకోర్టు న్యాయవాది పి.ప్రభాకర్‌రెడ్డి, ఏసీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పోలే ముత్యం మాట్లాడారు. రామోజీ వ్యవహారశైలిని ఎండగట్టారు.

చట్టాలకు అతీతుడినన్నట్లు వ్యవహరిస్తాడు

రామోజీరావు వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట. రామోజీ ఫిలిం సిటీ కూడా పేదల స్థలాలు ఆక్రమించుకుని, చట్టాలను అతిక్రమించి వేల ఎకరాల్లో అక్రమంగా నిర్మించుకున్నదే. జగన్‌ను ఎలాగైనా గద్దె దింపాలని ఈనాడు దినపత్రిక కంకణం కట్టుకుందనే చెప్పాలి. ఉదయం లేవగానే వారి పత్రికల్లో, న్యూస్ చానళ్లలో ఏపీలో అవినీతి జరుగుతోందని ప్రచారం చేస్తున్నాయి కదా.. మరి రామోజీ చేసిన అక్రమాల మాట ఏంటి? నీతులు చెప్పడమేగానీ మనం ఎంత నీతిమంతంగా ఉన్నామా.. అని ప్రశ్నించుకోవాలి. వెన్నుపోటు రాజకీయాలతో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడు. అప్పటి నుంచి రామోజీరావు తిరుగులేకుండా వ్యవస్థలను, చట్టాలను, న్యాయవ్యవస్థను మేనేజ్ చేసుకుంటూ వచ్చాడు. మళ్లీ తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఈనాడులో వైఎస్ జగన్‌పై తప్పుడు రాతలు రాయిస్తున్నాడు. – దేవులపల్లి అమర్, సీనియర్ జర్నలిస్ట్

అక్రమంగా రూ.వేలకోట్ల డిపాజిట్ల సేకరణ

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.10 వేలు చిట్టీ పాడుకుంటే పాడుకున్న డబ్బులు తీసుకోవడానికి రామోజీరావు ముప్పుతిప్పలు పెడతాడు. గెజిటెడ్ ఆఫీసర్ సంతకాలు, ఆ ఆఫీసర్ సంతకాలు అంటూ దాదాపు ఏడు నుంచి ఎనిమిది నెలల దాకా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తాడు. తీరా డబ్బులు ఇస్తారా అంటే ఆ డబ్బులను ఫిక్స్‌డ్ డిపాజిట్ల కింద ఇచ్చినట్లు సంతకాలు చేయించుకుంటాడు. ఈ విధంగా ప్రజల నుంచి రూ.2,600 కోట్లు వసూలు చేశాడు. – మందపాటి నాగార్జునరెడ్డి, సీనియర్ ఆడిటర్

బాబును ముఖ్యమంత్రిని చేసేపనిలో రామోజీరావు

చంద్రబాబును అధికారంలోకి తీసుకొచ్చేందుకు రామోజీరావు అసత్య వార్తలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అప్పుల పాలైందని తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న రామోజీరావు.. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా దాదాపు రూ.2.70 లక్షల కోట్లు ప్రజలకు నేరుగా అందించిన విషయం రాయడు. – మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అగ్రిలరీ సొసైటీ అధ్యక్షుడు

ఆర్థిక నేరగాళ్లను ప్రజలముందు నిలబెట్టాలి

రామోజీరావు చేసిన మోసాలను సంవత్సరం పొడవునా చెప్పుకున్నా చాలదు. మోసాలను కప్పిపుచ్చుకునేందుకు వ్యవస్థలను మేనేజ్ చేయగల సమర్థుడు. జగన్ పాలనలో తన ఆటలు సాగడంలేదనే గద్దె దింపాలని కుట్ర పన్నేవారిలో రామోజీరావు ఒకరు. ఇలాంటి ఆర్థిక నేరగాళ్లను ప్రజల ముందు నిలబెట్టాలి. – పి.ప్రభాకర్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది

పేదలకు మేలుచేసినా తప్పే

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇంగ్లిష్ మీడియం విద్య అందిస్తుంటే దాన్ని ఓర్చుకోలేక రామోజీ తన పత్రిక ద్వారా తప్పుడు రాతలు రాయించారు. పేదలకు ఇళ్లు ఇస్తే కోర్టులకు వెళుతున్నారు. వాస్తవాలను వాస్తవరూపంలో రాయాలే తప్ప చంద్రబాబు కోసం తప్పుడు రాతలు వక్రీకరించి రాయకూడదు. – డాక్టర్ పోలే ముత్యం, ఏసీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్

చంద్రబాబు, లోకేశ్ ప్రకటించిన ఆస్తులు

రూ.1,474 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

రూ.542.17 కోట్లుగా చూపారు. వారి ఆస్తుల్లో ఎక్కువ హెరిటేజ్ షేర్ల రూపంలో ఉన్నాయి. స్థిరాస్తులు హైదరాబాద్ పరిసరాల్లో ఎక్కువగా ఉండగా, కొన్ని తమిళనాడులోనూ ఉన్నాయి. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో మాత్రం నామమాత్రంగా రెండు స్థలాలున్నాయి. వారు తమదిగా చెప్పుకునే అమరావతి, విజయవాడ ప్రాంతాల్లో మాత్రం ఈ కుటుంబంలోని ఐదుగురిలో ఎవరికీ ఒక్క ఆస్తి కూడా లేదు. వారి సొంతిల్లు హైదరాబాద్‌లోనే ఉన్న విషయం తెలిసిందే.

లోకేశ్, భువనేశ్వరి హెరిటేజ్ షేర్ల విలువే రూ.1102 కోట్లు

చంద్రబాబు ఆస్తుల్లో ఆయన భార్య భువనేశ్వరి, కొడుకు లోకేశ్‌కి ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ షేర్ల విలువే రూ.1102.11 కోట్లు. భువనేశ్వరికి రూ.763 కోట్ల విలువైన షేర్లు ఉండగా, లోకేశ్‌కి రూ.339.11 కోట్ల విలువైన షేర్లు ఉన్నాయి. మొత్తంగా చంద్రబాబు, భువనేశ్వరి పేరు మీద రూ.121.41 కోట్ల స్థిరాస్తులు, రూ.815.17 కోట్ల చరాస్తులుగా చూపించారు. అలాగే భువనేశ్వరికి రూ.1.84 కోట్ల విలువైన బంగారం, రూ. 1.09 కోట్ల విలువైన ముత్యాలు, వజ్రాభరణాలు, రూ.30 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు పేర్కొన్నారు. అప్పులు రూ. 10.31 కోట్లుగా చూపారు. లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్‌కు కలిపి రూ.394 కోట్ల చరాస్తులు ఉండగా, స్థిరాస్తులు రూ.148.07 కోట్ల విలువైనవి ఉన్నట్లు పేర్కొన్నారు. బ్రాహ్మణికి 2500.338 గ్రాముల బంగారం, 97.441 కిలోల వెండి, రూ.1.48 కోట్ల విలువైన వజ్రాభరణాలు ఉండగా, దేవాన్ష్ వద్ద 7.5 కిలోల వెండి ఆభరణాలు ఉన్నాయి.



ఆస్తుల విలువ తగ్గించి చూపారు

చంద్రబాబు కుటుంబం అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తుల విలువను తక్కువ చేసి చూపించింది. హైదరాబాద్ మదీనగూడలో లోకేశ్, భువనేశ్వరి పేరు మీద ఉన్న 10 ఎకరాల వ్యవసాయ భూమి విలువను రూ.100 కోట్లుగా చూపించారు. నిజానికి అక్కడ ఎకరం రూ.50 కోట్లకు పైనే ఉంటుంది. ఆ లెక్కన ఆ భూమి విలువ రూ.500 కోట్లకు పైమాటే. అలాగే ఈ భూమి వ్యవహారాన్ని చంద్రబాబు గతంలో రహస్యంగా ఉంచారు. 10 ఎకరాల్లో 5 ఎకరాలు లోకేశ్‌కి ఉన్నట్లు బయటపడినప్పుడు అది ఎలా వచ్చిందనే దానిపై మల్లగుల్లాలు పడ్డారు. నానమ్మ అమ్మణ్ణమ్మ నుంచి లోకేశ్‌కి గిఫ్ట్‌గా రాసినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈ విషయంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. కుప్పంలో ఉండే అమ్మణ్ణమ్మకు ఖరీదైన ప్రాంతంలో అంత భూమి ఎలా వచ్చిందనే ప్రశ్నకు చంద్రబాబు సమాధానం చెప్పలేదు. మదీనగూడలోనే మరో 5 ఎకరాలను భువనేశ్వరి కొన్నట్లు చూపారు.

బ్రాహ్మణి స్థిరాస్తులు

1. హైదరాబాద్ మాదాపూర్‌లో 924 గజాల స్థలం. విలువ రూ.4.15 కోట్లుగా పేర్కొన్నారు.
2. రంగారెడ్డి జిల్లా మల్లాపూర్‌లో 4 వేల గజాల స్థలం. విలువ రూ.90.39 లక్షలుగా చూపించారు.
3. హైదరాబాద్ మణికొండలో 2,440 గజాల స్థలం. విలువ రూ.3.66 కోట్లుగా చూపారు.
4. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కొడుకు దేవాన్ష్‌తో కలిపి (50 శాతం వాటా) 1,024 గజాల్లో వాణిజ్య భవనం. విలువ రూ.20.17 కోట్లుగా చూపారు.
5. చెన్నైలో 383 గజాల స్థలం. విలువ రూ.6.69 కోట్లుగా పేర్కొన్నారు.

రెండేళ్ల వయసులోనే రూ.20 కోట్ల ఆస్తి కొన్న దేవాన్ష్

చంద్రబాబు మనుమడు దేవాన్ష్ రెండేళ్ల వయసులోనే రూ.20 కోట్ల విలువైన ఆస్తిని కొన్నట్లు చూపడం విశేషం. జూబ్లీహిల్స్‌లో తల్లి బ్రాహ్మణితో కలిపి ఉన్న వాణిజ్య భవనాన్ని దేవాన్ష్ 2017లో కొన్నట్లు పేర్కొన్నారు. అతను పుట్టింది 2015లో. పిల్లలకు వారసత్వంగా ఆస్తి ఇవ్వడం మామూలుగా జరుగుతుంటుంది. కానీ ఆ వయసులో కొన్నట్లు చూపడమే కొసమెరుపు.

బాబు పేరుతో ఉన్న స్థిరాస్థులు

1. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కొడుకు లోకేశ్‌తో కలిపి 1,285 గజాల వాణిజ్య భవనం. విలువ రూ.70.20 కోట్లుగా చూపారు.
2. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లి వద్ద 96.23 సెంట్ల భూమి. విలువ రూ.77.33 లక్షలుగా చూపించారు.
3. నారావారిపల్లె శేషాపురంలో ఇల్లు. విలువ రూ.43.66 లక్షలుగా పేర్కొన్నారు.

భువనేశ్వరి పేరుతో స్థిరాస్థులు

1. హైదరాబాద్ మదీనగూడలో 5 ఎకరాల వ్యవసాయ భూమి (ఫామ్ హౌస్). దాని విలువ రూ.55 కోట్లుగా చూపారు.
2. తమిళనాడు కాంచీపురం జిల్లా సెన్నేర్ కుప్పం గ్రామంలో 2.33 ఎకరాల వాణిజ్య భూమి. విలువ రూ.30.10 కోట్లుగా చూపారు.

లోకేశ్ స్థిరాస్థులు

1. హైదరాబాద్ మదీనగూడలో నానమ్మ గిఫ్ట్‌గా ఇచ్చిన 5 ఎకరాల వ్యవసాయ భూమి. దాని విలువ రూ.57.21 కోట్లుగా చూపారు.
2. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో తండ్రి చంద్రబాబుతో కలిపి (50 శాతం వాటా) 1285 గజాల్లో నివాస భవనం. విలువ రూ.35.10 కోట్లుగా పేర్కొన్నారు.

దేవాన్ష్ స్థిరాస్థులు

1. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో తల్లి బ్రాహ్మణితో కలిపి (50 శాతం వాటా) 1,024 గజాల వాణిజ్య భవనం. విలువ రూ.20.17 కోట్లుగా పేర్కొన్నారు.

ఆడా నేనే.. ఈడా నేనే..

- బీజేపీలో చేరిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి
- నామినేషన్ల ఘట్టం ముగిసే రోజుల్లో కూటమిలో మరో హైడ్రామా
- తమ పార్టీ అభ్యర్థి ఆయనే అన్న బీజేపీ చీఫ్ పురందేశ్వరి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి కట్టిన పార్టీల నడుమ మంగళవారం రాత్రి మరో హైడ్రామా నడిచింది. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన అనపర్తి నియోజకవర్గ నుంచి కూడా టీడీపీ నేతనే రంగంలోకి దింపేందుకు నాయకుడి మార్పు డ్రామా పూర్తయ్యింది. రెండు రోజుల్లో నామినేషన్ల స్వీకరణ ఘట్టం ముగుస్తున్న సమయంలో అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీలో చేరారు. బీజేపీకి కేటాయించిన అనపర్తి నియోజకవర్గం నుంచి మాజీ సైనికుడైన శివకృష్ణంరాజు పేరును పార్టీ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం రాజమండ్రి లోక్‌సభ స్థానం పరిధిలో ఉంది. ఆ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనపర్తి నుంచి బీజేపీ జాతీయ నాయకత్వం ప్రకటించిన అభ్యర్థి కంటే ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీ చేస్తేనే ప్రయోజనం ఉంటుందనేలా కొంతకాలంగా పురందేశ్వరి రాజకీయాలు నెరపుతున్నారు. మరోవైపు బీజేపీ జాతీయ నాయకత్వం ప్రకటించిన అభ్యర్థి శివకృష్ణంరాజును ప్రచారం చేసుకోనివ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుపడుతూ వచ్చారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ శివకృష్ణంరాజు సోమవారం బీజేపీ తరఫున నామినేషన్ కూడా దాఖలు చేశారు. అనపర్తిలో బీజేపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన తరువాత కూడా టీడీపీ నేతను బీజేపీలో చేర్పించి.. ఆ పార్టీకి, పొత్తు ధర్మానికి వెన్నుపోటు పొడిచారు. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయాక పునరావాసం కోసం టీడీపీ నుంచి బీజేపీలో చేరిన నాయకులే బీజేపీకి కేటాయించిన సీట్లలోనూ పోటీ చేస్తున్నారు. తొలి నుంచి బీజేపీలో రాజకీయాలు కొనసాగించిన నాయకులకు బీజేపీ మొండిచేయి చూపడంతో ఆ పార్టీ శ్రేణులు రగిలిపోతున్నారు.

మా అభ్యర్థి ఆయనే: పురందేశ్వరి

కాగా.. టీడీపీ అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం రాత్రి విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు. బీజేపీ జాతీయ కార్యదర్శి, ఏపీ ఎన్నికల ఇన్‌చార్జి అరుణ్‌సింగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారు.

ముందు కుప్పంలో గెలువు బాబూ!

- ఆ తర్వాత ఇతర నియోజక వర్గాల జోలికెళ్లు
- నాపై విమర్శలు చేసేకొద్దీ ఓట్లు తగ్గుతాయి
- దళిత బంధువు సీఎం వైఎస్ జగన్
- మంత్రి పెద్దిరెడ్డి

వరదయపాళెం(తిరుపతి జిల్లా): 'చంద్రబాబూ... సత్యవేడును గెలిపించడం కాదు.. ముందు నువ్వు కుప్పంలో గెలువు. ఆపై పక్క నియోజకవర్గాల జోలికి వెళ్లు' అని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విపక్ష నేత చంద్రబాబు నాయుడుపై నిప్పులు చెరిగారు. మంగళవారం తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ నామినేషన్ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సత్యవేడు టవర్ క్లాక్ వద్ద జరిగిన రోడ్ షోలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో పక్కన పెట్టిన వ్యక్తులను టీడీపీలో అభ్యర్థులుగా నిలబెడుతున్నారంటే ఆ పార్టీ ఎంతకు దిగజారిపోయిందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే టీడీపీకి ఓట్లు తగ్గిపోవడం ఖాయమన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోగా, ప్రస్తుతం ఆరు గ్యారంటీలంటూ ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. బాబు మోసపూరిత హామీలు రాష్ట్ర ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. మాటపై నిలబడిన సీఎం జగన్ వైపే ప్రజలు ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. ఇటీవల సత్యవేడులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు తన గురించి మాట్లాడిన మాటలకు సత్యవేడు ప్రజలు ఓట్ల రూపంలో సమాధానం ఇస్తారని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో దళితులపై ప్రేమ చూపే ఆయన నాటకాలకు ఓట్ల రూపంలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. అందరి సమన్వయంతో సత్యవేడులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్‌ను గెలిపించాలని, అలాగే ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకులు బీరేంద్రవర్మ, సీనియర్ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, తిరుపతి జిల్లా మహిళా కన్వీనర్ బొర్రా మాధవిరెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కె.వి. భాస్కర్ నాయుడు, తిరుపతి జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ వేలూరు రాకేష్, పార్టీ మండల కన్వీనర్ సునీల్ రెడ్డి, దయాకర్ రెడ్డి, అపరంజిరాజు, కేవీ.చలపతిరాజు, గవర్ల కృష్ణయ్య, విద్యానాథరెడ్డి పాల్గొన్నారు.



అంతా బాబు జట్టే.. పచ్చ కుట్రే

వివేకా హత్య కేసును రాజకీయ లబ్ధికి వాడుకునే పన్నాగం

సాక్షి, అమరావతి: 'పచ్చ' ముఠా ముసుగు పూర్తిగా తొలగిపోయింది. చంద్రబాబు, నర్రెడ్డి సునీత, షర్మిల, పవన్ కళ్యాణ్, లోకేశ్, పురందేశ్వరి, బీటెక్ రవి అంతా ఒకే తానులో ముక్కలని తేటతెల్లమైంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వారికి కావాల్సింది రాజకీయ ప్రయోజనాలే తప్ప, అసలు హంతకులకు శిక్ష పడటం కాదన్న విషయం మరోసారి తేటతెల్లమైంది. వివేకాను రాజకీయంగా, ఆ తర్వాత భౌతికంగానూ తొలగించుకొన్న వారితో ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి అంటకాగుతున్నారన్న విభ్రాంతికర వాస్తవం మరోసారి సాక్ష్యాత్కరించింది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐ దర్యాప్తు చేస్తున్నందున, ఈ కేసుపై న్యాయస్థానాల్లో విచారణ జరుగుతున్నందున ఈ ఉదంతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోకూడదన్న పులివెందుల న్యాయస్థానం తీర్పును అందరూ శిరసావహిస్తారని భావించారు. కానీ, పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి ఆ తీర్పును హైకోర్టులో సవాల్ చేయడం పచ్చ కుట్రను బయటపెట్టింది. రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని నేతగా ఉన్న వివేకానందరెడ్డిని తానే ఓడించానని చంద్రబాబు నమ్మిన బంటు సీఎం రమేష్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు వివేకాను అంతమొందించే కుట్రకు ఎంత ముందుగా భూమికను సిద్ధం చేశారో అర్థమవుతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

వివేకా హత్యను రాజకీయంగా వాడుకోవడానికి చంద్రబాబు చాలా ముందుగానే స్క్రిప్ట్ సిద్ధం చేశారు. దస్తగిరి, సునీత, సౌభాగ్యమ్మ, షర్మిల.. ఇలా పలువురు పాత్రధారులు తెరపైకి వస్తూ వారికి ఇచ్చిన డైలాగులు చెబుతూ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తరువాత మరింతగా విషం చిమ్మేందుకు తెగించారు. ఓటర్లను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారానికి అడ్డుకట్ట పడాలని, సామరస్యపూర్వక రాజకీయ వాతావరణంలో ఎన్నికలు జరగాలని వైఎస్సార్‌సీపీ భావించింది. పలు న్యాయస్థానాల్లో విచారణ సాగుతున్న ఈ హత్యపై ఎవరూ మాట్లాడటం సరైన విధానం కాదని కూడా అభిప్రాయపడింది. ఇదే అంశాన్ని విన్నవిస్తూ చంద్రబాబు, నర్రెడ్డి సునీత, షర్మిల, లోకేశ్, పవన్, పురందేశ్వరి, బీటెక్ రవిని ప్రతివాదులుగా చేరుస్తూ పులివెందుల న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. వైఎస్ వివేకా హత్య కేసు గురించి ఎన్నికల ప్రచారంలో మాట్లాడకుండా కట్టడి చేయాలని కోరింది. ఈ పిటిషన్‌లో పేర్కొన్న అంశాలతో న్యాయస్థానం ఏకీభవించింది. వైఎస్ వివేకా హత్య కేసు గురించి ఎవరూ మాట్లాడవద్దని ఈ నెల 16న తీర్పునిచ్చింది. మంచి ఉద్దేశంతో న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు అడ్డగోలు రాజకీయ ప్రయోజనాలే లక్ష్యమైన చంద్రబాబు అండ్ కోకు మింగుడు పడలేదు. దీంతో పక్కా పన్నాగంతో మొదట సునీతతో ఈ తీర్పుపై అభ్యంతరం తెలిపారు. ఆమె హైకోర్టులో ఈ తీర్పును సవాల్ చేస్తారని అందరూ భావించారు. కానీ, పులివెందుల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి హైకోర్టులో సవాల్ చేశారు. తీర్పుపై సునీత వెలిబుచ్చిన అభిప్రాయాలనే ఈ పిటిషన్‌లో ప్రస్తావించారు. తద్వారా అంతా చంద్రబాబు తానులో ముక్కలేనని స్పష్టం చేశారు.

చంద్రబాబు కుట్రలో పాత్రధారుల ప్రవేశం ఇలా

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజాక్షేత్రంలో నేరుగా ఎదుర్కొనే సత్తా లేక కుట్ర రాజకీయాలు చేస్తున్నానని చంద్రబాబు మరోసారి పరోక్షంగా చెప్పారు. 2019 మార్చి 15న వివేకా హత్యకు గురైన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా అప్పటి సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రచారంలోకి తీసుకువచ్చిన కట్టుకథను ప్రజలు ఆ ఎన్నికల్లో తిప్పికొట్టారు. ఎన్నికల తరువాత చంద్రబాబు రూటు మార్చారు. తాము చేసిన నిరాధార ఆరోపణలనే వైఎస్ వివేకా కుటుంబ సభ్యులతో చెప్పించే సరికొత్త డ్రామాకు తెరతీశారు. ముందుగా వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతతో మూడేళ్లకుపైగా డ్రామా నడిపించారు. ఆ తరువాత బాబు స్క్రిప్ట్ ప్రకారమే షర్మిలను రాష్ట్ర రాజకీయ తెరపైకి తెచ్చారు. సునీత చేస్తున్న నిరాధార ఆరోపణలనే షర్మిల కూడా వినిపిస్తున్నారు. ఇటీవల వివేకా సతీమణి సౌభాగ్యమ్మనూ తెరపైకి తెచ్చారు. వివేకా వర్ధంతి కార్యక్రమంలో సౌభాగ్యమ్మ, సునీత, షర్మిలతోపాటు టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవి ఒకే వేదికపై ఆశీనులయ్యారు. వారందరి ప్రసంగాలు ఒకే రాజకీయ లక్ష్యంతో సాగడం గమనార్హం. తాజాగా పులివెందుల కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సునీత, బీటెక్ రవి ఒకేలా చంద్రబాబు పాటనే పాడారు.

వివేకా శత్రువులు, హంతకులతోనే జట్టు కట్టిన సునీత దంపతులు

వివేకా కుమార్తె సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి తీరు మొదటి నుంచి అత్యంత వివాదాస్పదంగా, సందేహాస్పదంగా ఉంది. వివేకాను 2017లో రాజకీయంగా వెన్నుపోటు పొడిచి ఎమ్మెల్సీగా ఓడించిన బీటెక్ రవి తదితరులతో వారు సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. 2017లో వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ ఉంది. అయినప్పటికీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వివేకాను అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి ఆదినారాయణ రెడ్డి కుట్రపూరితంగా ఓడించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులను ప్రలోభాలకు గురిచేసి బీటెక్ రవిని గెలిపించారు. వివేకాను కుట్రతో ఓడించిన ఇదే బ్యాచ్‌తో సౌభాగ్యమ్మ, సునీత దంపతులు నాలుగేళ్లుగా సన్నిహితంగా ఉండటం వివాదాస్పదంగా మారింది. సునీత ఇటీవల మీడియా సమావేశంలోనూ చంద్రబాబు, ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవి, మహాసేన రాజేశ్ తదితరులకు కృతజ్ఞతలు తెలపడం గమనార్హం. మరోవైపు వివేకాను కిరాతకంగా నరికి హత్య చేశానన్న దస్తగిరితోనూ సఖ్యతతో ఉండటం విభ్రాంతి కలిగిస్తోంది.

హత్య జరిగిన రోజునా సందేహాస్పదంగా..

వైఎస్ వివేకా హత్య అనంతరం ఆయన సతీమణి సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి తీరు సందేహాస్పదంగా ఉంది. వివేకా గుండెపోటుతో చనిపోయారనే ప్రచారం వెనుక సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించారు. 2019 మార్చి 15న ఉదయం వివేకా తలపై తీవ్ర గాయాలతో మృతిచెందారని ఆయన పీఏ కృష్ణారెడ్డి మొదటగా గుర్తించారు. ఆ వెంటనే వివేకా సతీమణి, కుమార్తె, అల్లుడికి సమాచారం ఇచ్చారు. రక్తపు మడుగులో ఉన్న వివేకా మృతదేహం ఫొటోలు తీసి వాట్సాప్ చేశారు. అయినప్పటికీ ఆయన పెద్ద బావమరిది శివప్రకాశ్‌రెడ్డి అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డికి ఫోన్ చేసి వివేకా గుండెపోటుతో మరణించారని చెప్పారు. అదే విషయాన్ని ఆదినారాయణ రెడ్డి మీడియాకు వెల్లడించారు. దాంతో వివేకా గుండెపోటుతో మరణించారనే అసత్య సమాచారం బయటకు వచ్చింది. ఇక వివేకా రాసిన లేఖను బయటపెట్టవద్దని పీఏ కృష్ణారెడ్డిని ఆదేశించడం ద్వారా గుండెపోటుతో మరణించారన్న ప్రచారాన్ని ఆయన కుమార్తె, అల్లుడు కొనసాగించారు. ఆ లేఖను వెంటనే పోలీసులకు అప్పగించమని వారు చెప్పి ఉంటే వివేకాని హత్య చేశారన్న విషయం వెంటనే అందరికీ తెలిసేది. కానీ ఆ లేఖను ఉద్దేశపూర్వకంగానే గోప్యంగా ఉంచారు. సాయంత్రం 5 గంటలకు కృష్ణారెడ్డి లేఖ, సెల్‌ఫోన్‌ను పోలీసులకు ఇచ్చారు. లేఖను వారు ఎందుకు గోప్యంగా ఉంచారన్నది ఈ కేసులో కీలక అంశం. వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారనే ప్రచారం చేసే ఉద్దేశంతోనే ఆ లేఖను బయట పెట్టకూడదని వారు నిర్ణయించారా అన్నది ఇక్కడ అందరికీ కలిగే సందేహం.

పెట్రోల్, డీజిల్ ధరలు నియంత్రిస్తా: చంద్రబాబు

ఎల్.ఎన్.పేట/పాతపట్నం: ప్రజల డబ్బులతో కట్టిన ప్రజావేదిక కూల్చి పాలన ప్రారంభించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో మంగళవారం నిర్వహించిన ప్రజాగళం బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. టీడీపీ గెలిస్తే పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరల్ని నియంత్రిస్తానని చెప్పారు. భవిష్యత్‌లో విద్యుత్ చార్జీలు పెంచనని హామీ ఇచ్చారు. సోలార్ విద్యుత్ తీసుకొచ్చి ప్రజలు సోలార్ విద్యుత్ అమ్ముకునేలా సంపద సృష్టిస్తానని తెలిపారు. చెత్తపన్ను రద్దు చేస్తానని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ తీరుస్తానని ఆయన చెప్పారు. ఎంపీ రామ్మోహన్నాయుడు, పాతపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గోవిందరావు, జనసేన నాయకుడు గేదెల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో జగన్ అక్రమ పొత్తు

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యలు
- కోర్టు ఆదేశాలు ఉల్లంఘించి తెనాలిలో వివేకా హత్య గురించి ప్రస్తావన

కర్లపాలెం/చీరాల/తెనాలి: బీజేపీతో చంద్రబాబు నేరుగా పొత్తు పెట్టుకుంటే జగన్‌మోహన్‌రెడ్డి అక్రమంగా పొత్తు పెట్టుకున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. రాష్ట్రంలో అయిదేళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు, తర్వాత అయిదేళ్లుగా అధికారంలో ఉన్న జగన్ రాష్ట్రానికి ఒక్క మేలు కూడా చేయని బీజేపీకి గులాంగిరీ చేస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మంగళవారం బాపట్ల జిల్లా కర్లపాలెం, తెనాలిలలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పి మోసం చేసిన ఘనుడు మోదీ అని విమర్శించారు. రాజధాని కట్టారా? పోలవరం కట్టారా? చివరకు విశాఖ స్టీలును అమ్మేస్తున్నారు.. ఏం చేశారని చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి.. మోదీ కొంగుపట్టుకుని డ్యాన్స్ చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో పదేళ్లుగా ట్రయాంగిల్ లవ్ స్టోరీ నడుస్తోందన్నారు. మద్యపాన నిషేధం చేస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే మద్యం అమ్ముతోందన్నారు. అది కూడా నాసిరకం మద్యమని చెప్పారు.

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి వివేకా హత్యను ప్రస్తావించిన షర్మిల

వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు అంశాన్ని ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించవద్దన్న కడప జిల్లా కోర్టు ఆదేశాలను పీసీసీ చీఫ్ షర్మిల ఉల్లంఘించారు. తెనాలిలో మంగళవారం రాత్రి ఆమె మాట్లాడుతూ సొంత చిన్నాన్నను హత్యచేసినవారిని జగన్‌మోహన్‌రెడ్డి పక్కన బెట్టుకుని, వాళ్లను కాపాడుకోవటమే కాకుండా మళ్లీ వాళ్లకే ఎంపీ టికెట్ ఇచ్చాడని ఆరోపించారు.

చీరాలలో జనం లేరని వెనుదిరిగిన షర్మిల

బాపట్ల జిల్లా చీరాలలో రోడ్ షో, సభను భారీస్థాయిలో నిర్వహించాలనుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ అంచనాలు తల్లకిందులయ్యాయి. పందిళ్లపల్లి నుంచి వేటపాలెం వరకు 1,500 మంది, పీసీసీ చీఫ్ షర్మిల నిర్వహించే సభకు కనీసం వెయ్యిమంది కూడా లేకపోవడంతో రోడ్ షో అట్టర్‌ఫ్లాప్ అయింది. దీంతో షెడ్యూల్ ప్రకారం బహిరంగసభ నిర్వహించకుండా షర్మిల వెనుదిరిగి వెళ్లిపోయారు. రోడ్ షోలోనూ ఆమె బస్సు దిగలేదు. బస్సుదిగి కార్యకర్తల్లోకి రావాలని ఆమంచి కోరడంతో ఆమె అయిష్టంగా, అసహనంగా బస్సు దిగి ఆమంచి మెడలో కాంగ్రెస్ పార్టీ కండువా వేసి కార్యకర్తలను కూడా పలుకరించకుండా బాపట్ల వెళ్లిపోయారు. బాపట్ల ఎంపీ అభ్యర్థి జె.డి.శీలం నామినేషన్‌కు వెళుతున్నట్లు చెప్పిన ఆమె ఆ కార్యక్రమంలోనూ పాల్గొనలేదు.



షర్మిల మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న మహిళలు



అనిత్య భావన బుద్ధుని కాలం కంటే ముందే ఉన్నా, దాన్ని బుద్ధుడు బోధించినంత లోతుగా, గంభీరంగా ఎవరూ చెప్పలేదు.
– బుద్ధదాన భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 24 ఏప్రిల్ 2024

ఛాంపియన్ దేశం

భారత చదరంగ క్రీడావనికి ఇది మరో శుభవార్త. మన దేశం నుంచి మరో చిచ్చరపిడుగు వచ్చాడు. తెలుగు కుటుంబానికి చెందిన దొమ్మరాజు గుకేశ్ పట్టుమని 17 ఏళ్ళ వయసులో ప్రపంచస్థాయిలో సత్తా చాటాడు. అరంగేట్రంలోనే ప్రపంచ చదరంగ క్రీడా పర్యవేక్షక సంస్థ (ఫిడే) వారి 'క్యాండిడేట్స్ 2024'లో గెలిచాడు. అదీ... చదరంగపుటెత్తుల్లో చలాకీతనం చూపుతూ, చులాగ్గా గెలిచాడు. కొద్ది నెలల్లో జరిగే ప్రపంచ ఛాంపియన్ పోటీలకు ఎన్నికయ్యాడు. 138 సంవత్సరాల ప్రపంచ ఛాంపియన్‌షిప్ చరిత్రలోనే చిన్న వయసువాడిగా వరల్డ్ టైటిల్ కోసం పోటీపడనున్నాడు. ఒకవేళ ఆ విశ్వవేదిక పైనా గెలిస్తే, అతి పిన్నవయస్కుడైన వరల్డ్ ఛాంపియన్‌గా కొత్త చరిత్ర సృష్టించనున్నాడు.

ఒక్క గుకేశ్ విజయమే కాక భవిష్యత్ ఆశాకిరణాలూ అనేకం ఉండడం గమనార్హం. ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్ళు పాల్గొనే 'క్యాండిడేట్స్'లో ఉన్నదే 16 మంది. అందులో ముగ్గురు మగవాళ్ళు (గుకేశ్, విదిత్, ఆర్. ప్రజ్ఞానంద), ఇద్దరు ఆడవారు (కోనేరు హంపీ, ఆర్. వైశాలి)తో మొత్తం అయిదుగురి అతి పెద్ద బృందం భారత్‌దే. ఇంతమంది ఆటగాళ్ళు ఈ క్లిష్టమైన అలాగే, 2024 ఏప్రిల్ నాటి 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో టాప్ 25లో అయిదుగురు భారతీయ పురుషులే. ఇక, మహిళల ర్యాంకింగ్స్‌లో టాప్ 15లో ముగ్గురు మనవాళ్ళే. జూనియర్ ర్యాంకింగ్స్‌కు వస్తే టాప్ 20లో ఏడుగురు భారతీయులే. అదే టాప్ 30 జూనియర్స్‌ని గనక లెక్క తీస్తే మూడింట ఒక వంతు మన దేశీయులే. ప్రపంచ చదరంగ వేదికపై అంతకంతకూ విస్తరిస్తున్న భారతదేశ స్థాయికీ, స్థానానికీ ఇదే సాక్ష్యం.

'చదరంగంలో భారత్ విశేష కృషి చేస్తోంది. అనతికాలంలో ప్రపంచంలో అగ్రశ్రేణి చదరంగ దేశమవుతుంది' అని ప్రపంచ మాజీ ఛాంపియన్ మ్యాగ్నస్ కార్ల్‌సెన్ గత ఏడాది వ్యాఖ్యానించారు. ఇప్పుడదే నిజమవుతోంది. నిజానికి, మన దేశంలో చదరంగ క్రీడ ఇంత శరవేగంతో విస్తరించడానికీ, విస్ఫోటనం చెందడానికీ అనేక కారణాలున్నాయి. ఇంటర్నెట్ డేటా ప్యాక్‌లు చౌక కావడం, మొబైల్ ఫోన్లలో సైతం సులభంగా అందుబాటులో ఉన్న చెస్ యాప్‌లు వగైరా వల్ల జనసామాన్యంలో ఈ క్రీడ వేగంగా, బలమైన పునాది వేసుకుంటోందని నిపుణుల విశ్లేషణ. ఇంటర్నెట్ వ్యాప్తి వల్ల ఇప్పుడు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని పిల్లలు సైతం మెట్రో నగరాల్లోని అత్యుత్తమ కోచ్‌ల నుంచి ఆన్‌లైన్ చెస్ పాఠాలు నేర్చే వీలొచ్చింది. కరోనా అనంతరం ఆన్‌లైన్ టోర్నమెంట్‌లు పెరగడం కూడా భారతీయ యువకిశోరాలకు కలిసొచ్చింది. సూపర్ గ్రాండ్ మాస్టర్ల తోనూ, చివరకు ప్రపంచ మాజీ ఛాంపియన్లతోనూ తలపడి అనుభవం, ఆశ్చర్యకరమైన ఫలితాలు సాధించే అవకాశం దక్కింది.

అగ్రశ్రేణి క్రీడాకారులు ఆట మానేశాక, కోచ్‌లుగా మారడమూ కొత్త తరానికి వరమైంది. గ్రాండ్ మాస్టర్లు ఆర్బీ రమేశ్ (ప్రజ్ఞానంద, వైశాలికి కోచ్), విష్ణుప్రసన్న (గుకేశ్‌కు కోచ్), శ్రీనాథ్ నారాయణన్ (అర్జున్, నిహాల్ సరీన్‌ల ట్రైనర్), సూర్యశేఖర్ గంగూలీ (విదిత్‌కు కోచ్) లాంటి వారు, వారి శిక్షణలో ఆరితేరిన ఆటగాళ్ళే అందుకు నిదర్శనం. గ్రాండ్ మాస్టర్లు కాకపోయినప్పటికీ, మంచి చదరంగం ఆటగాళ్ళు దాదాపు 50 వేల మందికి పైగా భారత్‌లో ఉన్నారని సాక్షాత్తూ ప్రపంచ చదరంగ క్రీడా పర్యవేక్షక సంస్థ (ఫిడే) డైరెక్టర్ జనరల్ ఎమిల్ సుతోవ్‌స్కీ అనడం విశేషం. ఇవన్నీ కలసి దేశంలో చదరంగ క్రీడకు సంబంధించిన సువ్యవస్థిత వాతావరణ కల్పనకు దోహదం చేశాయి. 'ఫిడే' సహకారంతో టెక్ మహీంద్రా ధనసాయంతో నడుస్తున్న గ్లోబల్ చెస్ లీగ్ లాంటి టోర్నమెంట్లు సైతం ఆటకూ, ఆటగాళ్ళకూ కొత్త ఉత్సాహం, ఉత్తేజం తెచ్చాయి. వీటన్నిటి ఫలితంగా ఇవాళ 64 చదరపు గడుల ఆటలో భారత్ అపూర్వంగా ముందుకు దూసుకుపోతోంది.

'ఈ ప్రపంచంలో ఈ క్షణంలో అత్యంత అస్థిరమైనది ఏమిటంటే, చదరంగంలో భారత నంబర్ 1 స్థానం' అని అజర్‌బైజాన్‌కు చెందిన ఓ గ్రాండ్ మాస్టర్ ఈ ఏడాది జనవరిలో ట్వీట్ చేశారు. ఛలోక్తిగా చెప్పినా, చెస్‌లో నిత్యం కొత్త ప్రతిభావంతులు రంగంలోకి దూసుకువస్తున్న మన దేశంలో ఇప్పుడది అక్షరసత్యం. ఈ ఏడాదిలో ఈ నాలుగు నెలల్లోనే ఆ నంబర్1 కిరీటం మన ఆటగాళ్ళు అయిదుగురి (విశ్వనాథన్ ఆనంద్, గుకేశ్, ప్రజ్ఞానంద, అర్జున్, విదిత్) మధ్య ఎప్పటికప్పుడు మారుతూ వచ్చిందంటే మనవాళ్ళలో పెల్లుబుకుతున్న ప్రతిభను అర్థం చేసుకోవచ్చు. యువజన – క్రీడాశాఖ సమకూరుస్తున్న నిధులు, ఆటగాళ్ళ శిక్షణకు అఖిల భారత చదరంగ సమాఖ్య అందిస్తున్న సహకారం, ప్రైవేట్ సంస్థల సహాయం ప్రతిభను పెంచి పోషించడంలో ప్రధానపాత్ర వహించాయి. ఇవాళ దేశంలో 84 మంది గ్రాండ్ మాస్టర్లు, 124 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు, 23 మంది మహిళా గ్రాండ్ మాస్టర్లు, 42 మంది మహిళా ఇంటర్నేషనల్ మాస్టర్లు ఉన్నారంటే కారణం అదే!

దేశవ్యాప్తంగా 30 వేల మందికి పైగా రేటింగ్ పొందిన రెగ్యులర్ టోర్నమెంట్ చెస్ ఆటగాళ్ళున్నారని ఒక లెక్క. ప్రపంచమంతటిలో ఇందరు ప్రతిభావంతులున్నది మన దేశంలోనే! ప్రపంచ మాజీ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ లాంటివారు చిరకాలంగా ఆదర్శంగా నిలవడంతో, ఎంతో మంది చెస్ వైపు ఆకర్షితులయ్యారన్నది నిజం. సమాజంలోని ఆ ధోరణుల్ని గమనించి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో తగినంత సహాయ సహకారాలు అందించి, ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే ఏ క్రీడలోనైనా ఎంతటి అద్భుతాలు చేయవచ్చో భారతీయ చదరంగావని చాటిచెబుతోంది. కఠోర పరిశ్రమతో, కాలగతిలో ఆ ఆటలో ఛాంపియన్ దేశంగా ఆవిర్భవించిన మనం ఈ పాఠాలను ఇతర క్రీడలకూ అనువర్తింపజేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వమూ, ఇతర క్రీడా సంస్థలూ ఆ దిశగా అడుగులు వేస్తే మన క్రీడాలోకం మరిన్ని శుభవార్తలు అందించడానికి సదా సిద్ధంగా ఉంటుంది!


గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** బ.పాడ్యమి పూర్తి (24 గంటలు)
తదుపరి విదియ, **నక్షత్రం:** స్వాతి రా.11.55 వరకు,
తదుపరి విశాఖ, **వర్జ్యం:** లేదు,
దుర్ముహూర్తం: ఉ.11.33 నుండి 12.21 వరకు,
అమృత ఘడియలు: ప.2.15 నుండి 4.01 వరకు.

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సరిహద్దులో చైనాతో కొత్త బెడద

విశ్లేషణ



మేజర్ జనరల్ జిజి ద్వివేది (రిటైర్డ్)

'షావోకాంగ్' పథకం ద్వారా వందల ఆధునిక గ్రామాలను సరిహద్దుల్లో చైనా నిర్మించింది. సరిహద్దు ప్రాంత అభివృద్ధి పేరిట సాగుతున్న ఇది పూర్తిగా నిర్బంధ విస్తరణపై కేంద్రీకృతమైంది. లద్దాఖ్, బారాహోతి, అరుణాచల్ ప్రదేశ్‌లను తన భూభాగాలుగా చూపిస్తూ చైనా 'భౌగోళిక పటాల దాడి'ని కూడా ప్రారంభించింది. ఈ ప్రాంతాల్లోని స్థలాలకు మాండరిన్ పేర్లను ఇవ్వడం అనేది చైనా 'త్రిముఖ యుద్ధవ్యూహం'లో భాగం. టిబెట్, షిన్‌జాంగ్‌లలో భారీ మౌలిక సదుపాయాల అభివృద్ధి తర్వాత మాత్రమే, సరిహద్దు ప్రాంతాలలో రోడ్లు, ఉపరితల కమ్యూనికేషన్‌లను అప్‌గ్రేడ్ చేయడం భారత్ మొదలుపెట్టింది. 'ఎత్తుకు పై ఎత్తు' వేయడం కాకుండా, చైనా విస్తరణవాద నమూనాలను సమర్థంగా ఎదుర్కోవడానికి, నవ్య విధానం అవసరం.

సరిహద్దులలో చైనా ఆధునిక గ్రామాలను నిర్మించడం, వాటిని నివాస ప్రాంతాలుగా చేసుకోవడం గురించి తరచుగా వార్తలు వస్తున్నాయి. మార్చ్ 28న, టిబెట్‌ను చైనా స్వాధీనం చేసుకున్న ఘటన 65వ వార్షికోత్సవం సందర్భంగా, భారత్, భూటాన్ సరిహద్దులకు సమీపంలో ఉన్న కొత్త గ్రామాలలో చైనా ప్రభుత్వం అనేక వేడుకలను నిర్వహించింది. తాజా వార్తల ప్రకారం, ఇప్పటికే ఉన్న 628 'సవొకాంగ్' (సంపన్న గ్రామాలు)తో పాటు, మరో 175 సరిహద్దు గ్రామాలను చైనా అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉంది.

సరిహద్దు ప్రాంత అభివృద్ధి పేరిట, షావోకాంగ్ చొరవ అనేది నిర్బంధ విస్తరణపై కేంద్రీకృతమైంది. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన ద్వారా చైనా సమాజపు సమాన అభివృద్ధిని నిర్ధారించడానికి 1979లో డెంగ్ జియావోపింగ్ ఈ నమూనాను ప్రతిపాదించారు. ప్రస్తుత చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ దీనిని, ప్రధాన భూభాగంతో సరిహద్దు ప్రాంతాల ఏకీకరణ వ్యూహంగా మార్చారు. తద్వారా అరుణాచల్‌ప్రదేశ్‌కు ఎదురుగా ఉన్న టిబెట్‌లో దాని భూసరిహద్దుల భద్రతను మెరుగుపరిచారు.

షావోకాంగ్ పథకంలో భాగంగా, 427 మోడల్ గ్రామాలను ఫ్రంట్ లైన్‌లో నిర్మించగా, 201 గ్రామాలు రెండవ శ్రేణిలో ఉన్నాయి. ఈ సంపన్న గ్రామాలు షిగత్సే, లోహ్కా, న్యింగ్చి, ఎన్గారి వంటి ముఖ్యమైన పట్టణాలతో సహా 21 సరిహద్దు కౌంటీలలో విస్తరించి ఉన్నాయి. భూటాన్, అరుణాచల్‌ప్రదేశ్‌లతో సరిహద్దును పంచుకునే లోహ్కా ప్రాంతంలోనే, చైనా 354 'సంపన్న' సరిహద్దు స్థావరాలను అభివృద్ధి చేసింది. ఈ గ్రామాలలో దాదాపు మూడింట ఒక వంతు వాస్తవ నియంత్రణ రేఖ(ఎల్‌ఏసీ) సమీపంలో నిర్మించారు. మౌలిక సదుపాయాలు సహా, ఈ ఆవాసాల నిర్మాణం కోసం సుమారుగా 4.6 బిలియన్ డాలర్లు కేటాయించారు.

2017 అక్టోబర్‌లో జరిగిన 19వ పార్టీ కాంగ్రెస్‌లో, ప్రతిభావంతులైన చైనీస్ పౌరులు మారుమూల జాతిపరమైన మైనారిటీ ప్రాంతాలలో పని చేయాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. దీంట్లో నిగూఢంగా దాగి ఉన్నది, ప్రధానంగా అక్కడి జనావాసాల స్థితిగతులను మార్చడమే. గత దశాబ్దంలోనే, టిబెట్‌లో హాన్ జనాభా సుమారు 12 శాతం పెరిగింది. కమ్యూనిస్ట్ పాలన అంతిమ లక్ష్యం, టిబెట్ స్వయం ప్రతిపత్తి ప్రాంతంలో పూర్తిగా చైనీకరణను సాధించడం. భారత్, నేపాల్, భూటాన్ సరిహద్దు ప్రాంతాలలో అన్ని సరిహద్దు గ్రామాలకు రోడ్లు, విద్యుదీకరణ, ఆఖరికి ఇంటర్నెట్ కనెక్టివిటీ వంటి నాణ్యమైన సౌకర్యాలు అందించారు. అదనంగా, దాదాపు 206 పారిశ్రామిక ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి.

సరిహద్దు నిర్వహణను బలోపేతం చేయడానికి చైనా ఇటీవలి సంవత్సరాలలో రెండు జాతీయ చట్టాలను ప్రవేశపెట్టింది. 2021లో



సరిహద్దులో చైనా నిర్మిస్తున్న ఒక గ్రామం

ఆమోదించిన నేషనల్ డిఫెన్స్ లా, జాతీయ ప్రయోజనాల కోసం పౌర సంస్థలతో కలిసి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ పనిచేయడానికి అధిక పాత్రను అందిస్తుంది. ఒక సంవత్సరం తర్వాత, ఆక్రమిత ప్రాంతాలపై చైనా పట్టును ఏకీకృతం చేసేందుకు భూ సరిహద్దు చట్టాన్ని ఆమోదించారు. ఈ చట్టంలోని ఆర్టికల్స్ 10, 43... సరిహద్దు మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి యథాతథ స్థితిని సవాలు చేస్తున్నాయి. ఇది భారతదేశ సరిహద్దు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. లద్దాఖ్, బారాహోతి, అరుణాచల్ ప్రదేశ్‌లను తన భూభాగాలుగా చూపిస్తూ చైనా 'మ్యాప్‌ల దాడి'ని ప్రారంభించింది. ఈ ప్రాంతాల్లోని స్థలాలకు మాండరిన్ పేర్లను ఇవ్వడం అనేది చైనా 'త్రిముఖ యుద్ధవ్యూహం'లో భాగం. ఇది ప్రచారపరమైన, మానసికపరమైన, చట్టపరమైన కోణాలను కలిగి ఉంటుంది.

జూలై 2021లో, జిన్‌పింగ్ లాసాను సందర్శించారు. గత మూడు దశాబ్దాలలో చైనా దేశాధినేత చేసిన మొదటి సందర్శన. ఆయన టిబెట్‌ను 'ఇనుప కవచం'గా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. దీని ప్రకారం, డోక్లామ్, లాంగ్ జు వంటి వివాదాస్పద ప్రాంతాలలోని సరిహద్దు గ్రామాలు ఫార్వర్డ్ పోస్టులుగా వ్యవహరించడానికి చైనా సైన్యపు రక్షణ ప్రణాళికలలో విలీనం చేయబడ్డాయి. హాన్ జాతికి చెందిన మాజీ సైనిక సిబ్బంది సరిహద్దు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. చైనా చర్యలు దాని 'గ్రే జోన్ వార్‌ఫేర్'కు అనుగుణంగా ఉన్నాయి. ఇందులో పౌరులు, పౌరసైనికులు 'నాన్-కాంటాక్ట్' యుద్ధంలో భాగమవుతారు. దక్షిణ చైనా సముద్రంలో బీజింగ్ కార్యాచరణ దీనికి ఒక ఉదాహరణ.

ఒక స్పష్టమైన విధానం లేనందున, ముఖ్యంగా చైనాకు ఎదురుగా ఉన్న భారత సరిహద్దు ప్రాంతాలు అభివృద్ధి చెందలేదు. టిబెట్, షిన్‌జాంగ్‌లలో భారీ మౌలిక సదుపాయాల అభివృద్ధి తర్వాత మాత్రమే, సరిహద్దు ప్రాంతాలలో రోడ్లు, ఉపరితల కమ్యూనికేషన్లను అప్‌గ్రేడ్ చేయడం భారత్ మొదలుపెట్టింది. సరిహద్దు గ్రామాల్లో నివసించే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్ (వీవీపీ)ని గతేడాది ప్రారంభించారు. దీని ప్రకారం, చైనా సరిహద్దులో కనెక్టివిటీ లోపించిన 168 గ్రామాలను ఈ ఏడాది చివరి నాటికి అనుసంధానం చేయనున్నారు. 19 జిల్లాల్లోని 663 సరిహద్దు గ్రామాల్లో తగిన మౌలిక సదుపాయాల కల్పనకు రూ.4,800 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు.

చైనా నియంత్రణలో పూర్తిగా ఉండే సవొకాంగ్ పథకానికి విరుద్ధంగా, భారత్ కార్యక్రమం 'హబ్ అండ్ స్పోక్'(ఒక దగ్గరి నుంచి అందరికి) నమూనాను అనుసరిస్తోంది. ఇది జిల్లా పరిపాలన, గ్రామ పంచాయతీల ద్వారా అమలవుతుంది. కేంద్ర ప్రభుత్వ పాత్ర నిధులు ఇవ్వడానికే పరిమితమైంది. వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్ ప్రధాన దృష్టి సామాజిక-ఆర్థిక కార్యక్రమాల ప్రచారంపై ఉంది. అయితే, భద్రతా అంశాలను కూడా చేర్చడం ద్వారా ద్వంద్వ-వినియోగ విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉంది.

రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాలు, దిబాంగ్ జల విద్యుత్ ప్రాజెక్టు, జలమార్గాలతో సహా భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా సరిహద్దుల్లో భారత్ చేపడుతోంది. ఈశాన్య ప్రాంత సమగ్ర అభివృద్ధికి రూ. 12,882.2 కోట్ల నిధులను 'స్థూల బడ్జెట్ సహాయం' కింద సమకూర్చారు.

వివాదాస్పద సరిహద్దు, లద్దాఖ్‌లలో కొనసాగుతున్న ప్రతిష్టంభన దృష్ట్యా, చైనా ప్రణాళిక తీవ్రమైన వ్యూహాత్మక పరిణామాలను కలిగి ఉంది. వాస్తవ నియంత్రణ రేఖ స్థితిని ఏకపక్షంగా మార్చాలనే బీజింగ్ ఉద్దేశం, సవొకాంగ్ పథకంతో మరింత తోడ్పాటును పొందుతుంది. 2005 (ఆర్టికల్ 7)లో పొందుపర్చిన 'సరిహద్దు సమస్య పరిష్కారానికి రాజకీయ పరామితులు, మార్గదర్శక సూత్రాలు' ఒప్పందాన్ని కూడా చైనా విస్మరించింది. ఈ ఒప్పందం ప్రకారం సరిహద్దుల వెంబడి జనాభా ప్రస్తుత అమరికకు ఎవరూ భంగం కలిగించకూడదు.

చైనా విస్తరణవాద నమూనాలను సమర్థంగా ఎదుర్కోవడానికి, నవ్య విధానం అవసరం. 'ఎత్తుకు పై ఎత్తు'పై ఆధారపడిన మన ప్రస్తుత ప్రతిస్పందనా విధానానికి కాలం చెల్లిపోయింది. సరిహద్దు నిర్వహణ మొత్తంగా సమగ్ర సమీక్షకు గురికావాలి. ఇది జాతీయ భద్రతా వ్యూహంలో కీలకమైన అంశంగా ఉండాలి. దురదృష్టవశాత్తూ ఇది ఇప్పటికీ రూపు దాల్చుతూనే ఉంది!

వ్యాసకర్త చైనాకు భారత మాజీ డిఫెన్స్ అటాచె
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ప్రతీకార అవమానం



రింగ్ గర్ల్ వేసుకున్న దుస్తులు సరిగ్గా లేవని ఒక ఇరానియన్ ఎంఎంఏ (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్) ఫైటర్ ఆమె మీద దాడిచేశాడు. 30 సెకన్లలోనే అతడిని ఫైట్ నుంచి బయటికి పంపడం అటుండనీ, ప్రేక్షకులు మూకుమ్మడిగా అతడిని చితకబాదారు. మహిళల్ని కొడితే రష్యన్లు అస్సలు సహించరు.

– ఇయాన్ మైల్స్ చియోంగ్, జర్నలిస్ట్

వీటికే ఇలా అంటే...



వైరి రాజకీయ పక్షాల మద్దతుదారుల చర్చలు సోషల్ మీడియాలో మరీ ఘోరంగా, బుద్ధి హీనంగా, నీచంగా, విషపూరితంగా ఉన్నాయని మీకు అనిపిస్తే– క్రికెట్ స్టార్లు, సినిమా తారల అభిమానుల యుద్ధాలను గమనించండి. అవి ఇంకా మురికి కూపాలు!

– ఖాలిద్ బేగ్, యూట్యూబర్

ఎప్పుడేం జరిగేనో?



గాజా కన్నా, ఇరాన్-ఇజ్రాయెల్ దాదాపుగా యుద్ధానికి దగ్గరగా వచ్చాయన్న అంశం కన్నా ఇప్పుడు యూఎస్ విశ్వవిద్యాలయ క్యాంపసుల్లోని టెన్షన్లు మరింత గట్టి వార్తలు అవుతున్నాయి. చిత్రమైన ప్రపంచం!

– కబీర్ తనేజా, ఫెలో

భారత హోరు



అభినందనలు! టోరంటో (కెనడా)లో భారత భూకంపం సంభవించడానికి కారణం, చదరంగ ప్రపంచంలో టెక్టానిక్ ప్లేట్ల మార్పు పరిసమాప్తి కావడమే. ఇక 17 ఏళ్ల డి.గుకేశ్ అత్యున్నత టైటిల్ కోసం చైనీస్ ఛాంపియన్ డింగ్ లీరెన్(31)తో తలపడతాడు. విశ్వనాథన్ ఆనంద్ 'పిల్లలు' రంకెలు వేస్తున్నారు.

– గ్యారీ కాస్పరోవ్, చదరంగ దిగ్గజం

అప్పుడే అన్నేళ్లయ్యిందా?



సరిగ్గా 9 ఏళ్ల క్రితం, ఐపీఎల్ 2015 జరుగుతున్నప్పుడు, శాంతా క్రూజ్ (ముంబయి)లోని సూర్య మదర్ అండ్ చైల్డ్‌కేర్ హాస్పిటల్ వాటర్‌బర్త్ పూల్‌లో 'ఇండియా జీన్స్ రోడ్స్' జన్మించిందని నమ్మలేకపోతున్నా! (తన కూతురుకు ఇండియా అని పేరు పెట్టాడు.)

– జాంటీ రోడ్స్, దక్షిణాఫ్రికా క్రికెటర్

ఎలా అనగలరు?



గతంలో ఏ విధమైన సంబంధాలు లేని ఒక పేద ఆఫ్రికా దేశానికి (రువాండా) తన శరణార్థులను పంపడానికి బ్రిటన్ ప్రయత్నిస్తోంది. అదే తన పొరుగు దేశాల్లో పీడనను ఎదుర్కొంటూ, చారిత్రకంగా, మతపరంగా సంబంధాలు ఉన్నవాళ్లను ఇండియా అంగీకరిస్తే మాత్రం అది వివక్ష అవుతుంది. పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు!

– కన్వల్ సిబాల్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి

మనుషుల సంగతి?



'ద గాడ్‌ఫాదర్' (1972) వచ్చిన తర్వాత, నేను విన్నదంతా 'జంతువుల పట్ల క్రూరత్వం' గురించే! సినిమాలో 30 మందిని కాల్చి చంపుతారు. కానీ జనం మాత్రం మాట్లాడింది కేవలం 'జంతువుల పట్ల క్రూరత్వం' గురించే!

– ఫ్రాన్సిస్ ఫోర్డ్ కొప్పోలా, దర్శకుడు

ఇన్ బాక్స్

నాటకంగా... 'మట్టిమనిషి'

నేషనల్ బుక్ ట్రస్ట్ ద్వారా 14 భారతీయ భాషల్లోకి అనువాదమై, నన్నయ నుంచి నేటి వరకు వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో, పద మూడో రచనగా 'మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్' ప్రశంసలు పొందిన అత్యుత్తమ నవల వాసిరెడ్డి సీతాదేవి రచన 'మట్టిమనిషి'.

ఈ నవలను ప్రసిద్ధ నాటక రచయిత, నాటక ప్రక్రియ పరిశోధకుడు, 'అరసం' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ నాటకంగా రూపొందించారు. 'డా॥ వాసిరెడ్డి సీతాదేవి మెమోరియల్ ఫౌండేషన్' సహకారంతో నిభా థియేటర్ ఎన్సెంబుల్ ఈ నాటకాన్ని రసరంజని తోడ్పాటుతో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏప్రిల్ 24 (నేడు) సాయంత్రం 6.30 గంటలకు ప్రదర్శిస్తోంది. ఈ నాటకానికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా గ్రాడ్యుయేట్ నస్రీన్ ఇషాక్ దర్శకత్వం వహిస్తున్నారు.

నవల ఇతివృత్తంలోకి వెళితే... వెంకయ్య కూలీ నుంచి చిన్న రైతుగా మారితే కఠోరశ్రమతో అతని కొడుకు సాంబయ్య భూస్వామిగా రూపొందుతాడు. తన తండ్రి ఏ ఇంట్లో పాలేరుగా పని చేశాడో ఆర్థికంగా చితికిన ఆ ఇంటి యజమాని కూతురు వరూధినిని కోడలిగా తెచ్చుకుంటాడు పట్టుబట్టి. వరూధిని నగర జీవన వ్యామోహంతో భర్తతో సహా నగరానికి కాపురం మారుస్తుంది. అక్కడ రామనాథబాబు అనే వివాహితుడికి చేరువై ఆస్తి మొత్తం పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకుంటుంది. భార్యనీ, ఆస్తినీ కోల్పోయిన వెంకటపతి బికారి అవుతాడు. చదువుకుంటున్న తన కొడుకు రవిని గ్రామంలో ఉన్న తండ్రి సాంబయ్య వద్దకు పంపుతాడు. తాతా మనవళ్లిద్దరూ కలిసీ తమ గ్రామంలోని బంజరు భూమిని తిరిగి సాగులోకి తెస్తారు. చివరికి అదీ వారి చేయిజారిపోతుంది.

ఈ నవలను గురించి ఆరుద్ర ఇలా అన్నారు. ''సమాజంలోని ఉత్పత్తి పద్ధతులనూ, వర్గ సంబంధాలనూ, వివిధ మానసిక ప్రవృత్తులనూ, వాటికి గల ఆర్థిక కారణాలనూ విశ్లేషణ చేస్తూ మూడు తరాల జీవితాలతో వివిధ పరిణామాలను నవలలో రచయిత్రి చాలా సామర్థ్యంతో చిత్రించారు.''

– పెనుగొండ లక్ష్మీనారాయణ
(నేడు హైదరాబాద్ రవీంద్ర భారతిలో 'మట్టిమనిషి' నాటక ప్రదర్శన)

విశ్వసనీయత లేని ప్రతిపక్షాన్ని తిరస్కరించాలి!

అభిప్రాయం



డా॥ జి. నవీన్

రాష్ట్రంలో ఎన్నికల తేదీ దగ్గర పడుతోంది. ఇరు వర్గాలూ జోరుగా ప్రచారం సాగిస్తున్నాయి. ప్రతిపక్ష కూటమి ముప్పొద్దులా జగన్‌పై విరుచుకుపడడమే వారి పంథాగా బరిలోకి దిగింది. వారి వైఖరి గమనిస్తే ఎన్నికలకు ఒకటే అజెండా పెట్టుకున్నట్టున్నారు – జగన్‌ని వ్యతిరేకించడం! సిద్ధాంతపరంగా కాక కేవలం ఒక వ్యక్తిని వ్యతిరేకించడం ఏమి విధానం? పవన్ కల్యాణ్ వంటి వారైతే 'జగన్ వ్యతిరేక ఓటు' అని కొత్త నామకరణం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు అంటే ఒక నిర్వచనం ఉంది. 'జగన్ వ్యతిరేక ఓటు' ఏంటి? జగన్ అమలు చేసిన సంక్షేమ వ్యతిరేక ఓటా?

మరి అదే వారి ఉద్దేశం అయితే 'మేము ప్రభుత్వం నెలకొల్పితే జగన్ సంక్షేమ పథకాలు రద్దు చేస్తాం' అని చెప్పే ధైర్యం చేయగలరా? పైపెచ్చు వారు 'సూపర్ సిక్స్' పేరుతో సంక్షేమ పథకాలు ప్రకటించారు. అంటే వీరు చేస్తే గొప్ప, జగన్ చేస్తే ఖజానా కుప్పకూలుటా? ఇదెక్కడి తర్కం? చంద్రబాబు నాయుడు ప్రతి సభలోనూ 'ఈ దుర్మార్గుడు' అని జగన్‌పై అక్కసు వెళ్లగక్కడం తనలోని కార్పణ్యానికి తార్కాణం. డీబీటీ పద్ధతి ద్వారా ప్రజల డబ్బుని లక్షల కోట్ల రూపాయల మేర పేద ప్రజలకే చేర్చడం దుర్మార్గమా? అదే అయితే బాబు పదే పదే 'నేను వస్తే ఆడబిడ్డకు 15,000 చొప్పున మీ బ్యాంకు ఖాతాలలో వేస్తాను' అనే 'దుర్మార్గ'పు హామీ ఎందుకు ఇస్తున్నారు? అంటే, 'జగన్ వ్యతిరేక ఓటు' రాబట్టడానికి కూటమి దగ్గర ఉన్న ప్రణాళిక... అదే సంక్షేమం అనే మందుని కొత్త సీసాలో అమ్మదలచటమా? 'జగన్ వ్యతిరేక ఓటు' అంటే ఎక్కువగా యెల్లో మీడియా ప్రభావంతో నిజాన్ని చూడలేకపోతున్న వారి ఓటు.

నిజానికి 'జగన్ వ్యతిరేక ఓటు' అనే నినాదంతో వెళ్ళడం లోనే భావదారిద్ర్యం కనిపిస్తుంది. నిబద్ధత ఉన్న ప్రతిపక్షం అయితే వారు వేరేగా ఏమి చేస్తారో చెప్పాలి. 14 ఏళ్లు వెలగబెట్టి చేయని మేలు ఈ రోజు కొత్తగా చేస్తాము అంటే జనం నమ్మే పరిస్థితి లేదు. గత 10 ఏళ్లు కేంద్రంలో తిరుగులేని ఆధిక్యంతో ప్రభుత్వాన్ని నడుపుతూ కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వవలిసిన ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీతో కూటమి ఏర్పరిచి, ఈసారి గెలిచేది మళ్ళీ మోదీ కాబట్టి మమ్మలిని గెలిపించండి అనడం దివాళాకోరుతనానికి పరాకాష్ఠ.



ఈ మధ్య జరుగుతున్న సభల్లో చంద్రబాబు రైతులపై వల్లమాలిన ప్రేమ వొలకపోస్తుంటే జుగుప్స కలుగుతోంది. 'ఉచిత విద్యుత్ ఇస్తే కరెంటు తీగలు బట్టలు ఆరేసుకోడానికి తప్ప పనికిరావు' అని బాబు ఎద్దేవా చేయలేదా? ఆలూరు సభలో పత్తి రైతులకు మేలు చేస్తాను అని బాబు అంటుంటే అప్పట్లో ఇదే రైతుల ఇళ్లలోకి ప్రభుత్వమే చొరబడి బకాయిలకు బదులుగా వంట పాత్రలు, గిన్నెలు జప్తు చేసిన వైనం గుర్తుకొస్తుంది.


ఒక పక్క నోరు విప్పితే ఆడవారిని కించ పరిచి, హత్యారోపణలు ఎదుర్కొని మతి స్థిమితం లేదనే నెపంతో చట్టానికి దొరక్కుండా బయట పడ్డ బాలకృష్ణ, మరో పక్క సొంత పార్టీకి చెందిన బహుజన నాయకులను కాలరాస్తూ బాబు బినామీలు అయిన వారికి తన పార్టీ సీట్లు కట్టబెట్టిన పవన్ తారా శక్తి చాలక సరికొత్తగా చిరంజీవి కూడా కూటమి కుంపట్లో కాలు పెట్టారు. చిరంజీవి అప్పట్లో ఒక బలమైన ప్రత్యామ్నాయం కోసం కృషి చేసి, ఓర్పు లేక కేంద్ర మంత్రి పదవి కోసం కాంగ్రెస్ దరిచేరి, దాన్ని పూర్తిగా అనుభవించి ఇప్పుడు కాషాయ మాత్రలు మింగుతూ సీఎం రమేశ్ లాంటి వారి కోసం ప్రత్యేక వీడియో సందేశాలు ఇస్తున్నారు. ఇంకో అడుగు ముందుకేసి చంద్రబాబు తన తమ్ముడితో కలిసి కూటమి ఏర్పాటు చేయడం రాష్ట్రానికి మేలు అని చెప్పడంతో, అదే కాంగ్రెస్‌లో మంత్రిగా పనిచేసిన పురందేశ్వరిలానే ఈయన కూడా ఏ ఎండకి ఆ గొడుగు పట్టే ఫక్తు రాజకీయ కళాకారుడు అని తేలిపోయింది. ఇలాంటి విశ్వసనీయత లేని ప్రతిపక్షాన్ని ప్రజలు తిరస్కరిస్తారని ఆశిద్దాము.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ అంశాల విశ్లేషకులు | naveen.prose@gmail.com

స్వార్థం నుంచి నిస్వార్థం వైపు...

మానవుడు ప్రధానంగా స్వప్రయోజన దృష్టి గల జీవి. అది అతణ్ణి జీవితాంతం వెన్నంటే ఉంటుంది. దీనికి తోడు ఇతర ప్రాణులకు లేని బుద్ధి బలం కూడా మనిషికి ఉంది.

మనిషి సహజ లక్షణమైన స్వార్థ గుణాన్ని గురించి ఉపనిషత్తులు కూడా వివరించాయి. యాజ్ఞవల్క్య మహర్షి తన భార్య మైత్రేయితో... భార్య భర్తను ప్రేమిస్తున్నదంటే అది తన ఆనందం కోసమే అనీ, భర్త భార్యను ప్రేమిస్తున్నాడన్నా అతని ఆనందం కోసమేననీ అంటాడు. పుత్రుల మీదా, దేశం మీదా మనిషి చూపించే ప్రేమ కూడా తన ఆనందం కోసమే అని చెబుతాడు.



తనకు ఉపయోగపడేంత వరకే మానవుడు సమాజంతో సంబంధం పెట్టుకుంటాడు. మనిషిలో సహజంగా ఉండే ఈ స్వార్థాన్ని నియంత్రణ లేకుండా వదిలిపెడితే భూమిపై సుఖ శాంతులు పూర్తిగా కరవైపోతాయి. తన స్వార్థ ప్రయోజనాలకు బలహీనులను పట్టి పీడిస్తాడు. పెద్ద చేప చిన్న చేపను మింగినట్లు ప్రవర్తిస్తాడు. కొన్నాళ్ళకు తనూ తన కంటే బలవంతుని చేతిలో బలవుతాడు.

లోక నాశనానికి దారి తీసే ఈ స్వార్థ గుణాన్ని అణచివేసి, మనిషి మనసులో గొప్ప మార్పును భగవత్ చింతన తీసుకొస్తుంది. మానవులకు శాంతిమయ జీవితాన్ని ఇవ్వటానికి భగవంతుడు వివిధ రూపాలలో అవతరిస్తుంటాడు.

ఇహలోకంలో ప్రశాంత జీవితం గడపటానికీ, పరంలో శాశ్వతానందాన్ని పొందటానికీ తగిన ఉపదేశాన్ని మానవాళికి అంద జేసిన అత్యుత్తమ గ్రంథ రాజం భగవద్గీత. రోజుకొక శ్లోకం చదివినా, నేర్చుకున్నా ఆలోచనలు భగవంతునిపై నిలుస్తాయంటారు పెద్దలు. భక్తుడు ఏ దేవతా రూపాన్ని శ్రద్ధగా పూజిస్తాడో అతనికి ఆ రూపంపై శ్రద్ధ నిలిచేటట్లు చేస్తాను అంటాడు భగవంతుడు.

అలా పూజించినందుకు తగిన ఫలాన్ని అందజేస్తాడు. భగవంతుని చింతనలో మనసు పునీతమై, మనిషి నిస్వార్థ జీవిగా మారి, విశాల దృక్పథాన్ని అలవరచుకుంటాడు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

డివిజన్‌లో పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో జరుగుతోన్న ట్రాక్ నిర్వాహణ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసి కొన్నింటిని దారి మళ్లించినట్లు విజయవాడ రైల్వే పీఆర్‌వో నుస్రత్ మండ్రుప్కర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 22–28 వరకు బిట్రగుంట–విజయవాడ (07977/07978), విజయవాడ–తెనాలి (07279), తెనాలి–విజయవాడ (07575), రాజమండ్రి–భీమవరం జంక్షన్ (07884/07883), ఈ నెల 22 నుంచి 26 వరకు బిట్రగుంట–చెన్నై సెంట్రల్ (17237/17238), ఈ నెల 29–మే 26 వరకు గుంటూరు–రాయగడ (17243), ఈ నెల 30–మే 27 వరకు రాయగడ–గుంటూరు (17244), ఈ నెల 29–మే 26 వరకు కాకినాడ పోర్ట్–విశాఖ (17267/17268), ఈ నెల 29–మే 10, మే 16–22 వరకు విజయవాడ–సికింద్రాబాద్ (12713/12714) రైళ్లను రద్దు చేశారు.

పాక్షికంగా రద్దైన రైళ్లు ఇవే..

ఈ నెల 29–మే 26 వరకు పలు రైళ్లను విజయవాడ–రామవరప్పాడు స్టేషన్‌ల మధ్య పాక్షికంగా రద్దు చేశారు. అందులో విజయవాడ–మచిలీపట్నం (07769, 07866), విజయవాడ–భీమవరం జంక్షన్ (07283), విజయవాడ–నర్సాపూర్ (07861) మధ్య నడిచే రైళ్లు విజయవాడ స్టేషన్‌కు బదులుగా రామవరప్పాడు స్టేషన్ నుంచి బయలుదేరుతాయి. మచిలీపట్నం–విజయవాడ (07896,07770,07870), నర్సాపూర్–విజయవాడ (07863) రైళ్లు ఆయా స్టేషన్‌ల్లో బయలుదేరి తిరిగి రామవరప్పాడు స్టేషన్ వరకు మాత్రమే నడవనున్నాయి.

ఉద్యోగులకు మేలు చేసిన ప్రభుత్వమిది

- వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాత ప్రభుత్వమని వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతంరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వారి కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉంటే.. ఈనాడులో తప్పుడు రాతలు రాయించి టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు భద్రత కలిగిందన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఐదారు వేల మందే ఉన్నారని గతంలో చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గం ఉప సంఘం చర్చలు జరిపి.. చాలా మందిని రెగ్యులరైజ్ చేయడం పూర్తయ్యిందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఆశావర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీల వేతనాలను కూడా ప్రభుత్వం పెంచిందని పేర్కొన్నారు.

శ్రీవిశ్వశాంతి విజయభేరి

ఉయ్యూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉయ్యూరు శ్రీవిశ్వశాంతి విద్యార్థులు విజయభేరి మోగించారు. 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా 587, 587, 586, 584, 584, 582, 580, 580 మార్కులను దక్కించుకున్నారు. 550కిపైగా 65 మంది విద్యార్థులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల అధినేత మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, డైరెక్టర్ మాదల సూర్యశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

వలంటీర్ చెప్పినవారికి ఓటేసేంత బలహీనంగా ఓటర్లు లేరు

- రాజీనామాతోనే వలంటీర్‌కు, లబ్ధిదారుకు సంబంధం తెగిపోతుంది
- బూత్‌లోకి వెళ్లాక ఓటరు తనకు నచ్చిన వారికే ఓటేస్తారు
- ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఇప్పుడు సెలబ్రిటీలే ప్రచారం చేస్తున్నారు
- వలంటీర్ల రాజీనామాల వ్యవహారంలో హైకోర్టు వ్యాఖ్యలు
- వలంటీర్లు ఎంత మంది ఉన్నారు? ఎంత మంది రాజీనామా చేశారో చెప్పండి
- కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశం.. విచారణ నేటికి వాయిదా
- వలంటీర్లు రాజీనామా చేస్తే మేం చేయడానికి ఏమీ ఉండదు
- రాజీనామా చేశాక వారి ఇష్టానుసారం నడుచుకోవచ్చు: కేంద్ర ఎన్నికల సంఘం



సాక్షి, అమరావతి: వలంటీర్ల మాటలు విని.. వారు చెప్పినవారికి ఓటు వేసేంత బలహీనంగా ఓటర్లు లేరని హైకోర్టు వ్యాఖ్యానించింది. వలంటీర్, లబ్ధిదారు మధ్య ఉన్న అనుబంధం వలంటీర్ రాజీనామాతో తెగిపోతుందని స్పష్టం చేసింది. అలాంటప్పుడు వలంటీర్ చెప్పినట్లు ఓటరు ఎందుకు చేస్తారని ప్రశ్నించింది. వలంటీర్లు తమ జేబులో నుంచి తీసి డబ్బేమీ ఇవ్వడం లేదని, అలాంటప్పుడు వారి మాటలను ఓటరు ఎందుకు వింటారని పిటిషనర్‌ను నిలదీసింది. ఎవరైనా కూడా ఓటరును పోలింగ్ బూత్ వద్దకు వెళ్లేంత వరకే ప్రభావితం చేయగలిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. పోలింగ్ బూత్‌లోకి వెళ్లాక ఓటరు తనకు నచ్చినవారికే ఓటు వేస్తారని తెలిపింది. రాజీనామా చేశాక ఎవరైన వలంటీర్ ఏదైనా ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించింది. మొత్తం వలంటీర్లు ఎందరు? ఎంతమంది పనిచేస్తున్నారు? రాజీనామా చేసినవారెందరు? తదితర వివరాలను తమ ముందుంచాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు వలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ విచారణ జరిపారు.

రాజీనామా చేశాక మేమేం చేయలేం..

కేంద్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది శివదర్శన్ వాదనలు వినిపిస్తూ.. వలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు కారన్నారు. ఎన్నికల్లో విధుల్లో పాల్గొనకుండా, పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించకుండా వలంటీర్లను నియంత్రిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఒకవేళ వలంటీర్ రాజీనామా చేస్తే వారిపై ఎన్నికల సంఘానికి ఎలాంటి నియంత్రణ ఉండదన్నారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేమని స్పష్టం చేశారు. వారికి సైతం ప్రాథమిక హక్కులున్నాయని.. ఇష్టానుసారం రాజీనామా చేసే హక్కు వారికి సైతం ఉందన్నారు. వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు పిటిషనర్ ఎలాంటి ఉదంతాలను పొందుపరచలేదని చెప్పారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి.. విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

ప్రత్యక్ష పరిచయాలతో ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు..

పిటిషనర్ రామచంద్ర యాదవ్ తరపు న్యాయవాది పీవీజీ ఉమేష్ వాదనలు వినిపిస్తూ.. అధికార పార్టీకి సహకరిస్తున్నారన్న ఆరోపణలతో వలంటీర్లను ఎన్నికలకు దూరంగా ఉంచుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆ ఆదేశాల నుంచి తప్పించుకునేందుకు వలంటీర్లు ఇప్పుడు రాజీనామాలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులతో వలంటీర్లు ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్నారన్నారు. ఇప్పుడు రాజీనామాలు చేసి ఎన్నికల్లో లబ్ధిదారులను అధికార పార్టీ వైపు తిప్పడానికి వారిని ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల వలంటీర్ల రాజీనామాల విషయంలో జోక్యం చేసుకోవాలని అభ్యర్థించారు.

మరి సెలబ్రిటీలు కూడా ప్రచారం చేస్తున్నారుగా..

పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలపై న్యాయమూర్తి స్పందిస్తూ.. వలంటీర్లు ఓటర్లను ప్రభావితం చేసి, ఆయా పార్టీల అభ్యర్థుల అవకాశాలను ప్రభావితం చేయడం సాధ్యమా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఒకరు పెద్ద ధనవంతుడు, మరొకరు పేద వ్యక్తి అయి ఉంటే, ఆ పేద వ్యక్తి.. తాను ఎన్నికల్లో తలపడేందుకు సమాన అవకాశాలు కల్పించాలని ఎన్నికల సంఘాన్ని కోరగలడా? అని నిలదీశారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు సెలబ్రిటీలు కూడా ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ఊహల ఆధారంగా పిటిషనర్ ఈ పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. రాజీనామాలు చేశాక వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఎక్కడా కూడా పిటిషన్‌లో పేర్కొనలేదన్నారు. వలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు కారని, వరుసగా వారు మూడు రోజుల పాటు విధులకు హాజరు కాకుంటే వారిని విధుల నుంచి తొలగించవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందజేసేందుకే వలంటీర్లను నియమించామని చెప్పారు. వారు కేవలం గౌరవ వేతనం మాత్రమే అందుకుంటున్నారని గుర్తు చేశారు. కొందరు తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు గౌరవ వేతనం పెంచుతామంటూ ఎన్నికల ప్రచారంలో వాగ్దానాలు చేస్తున్నారని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. ఈ రోజుల్లో ఐఏఎస్ అధికారులు కూడా తమ ఉద్యోగానికి రాజీనామా చేసి, నచ్చిన పార్టీల తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తున్నారన్నారు. కాబట్టి రాజీనామా చేశాక ఎవరినీ నియంత్రించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

సీఐపై దాడికి టీడీపీ నేతల యత్నం

- ఆర్వో కార్యాలయంపై డ్రోన్ చిత్రాలు తీసి నిబంధనలు ఉల్లంఘన
- మందుకోసం కొట్టుకున్న తెలుగు తమ్ముళ్లు



సీఐ శంకర్‌పై దౌర్జన్యానికి దిగిన టీడీపీ నాయకుడు జయశంకర్‌నాయుడు, నాయకులు, కార్యకర్తలు

గంగాధరనెల్లూరు (చిత్తూరు జిల్లా): గంగాధరనెల్లూరు ఆర్వో కార్యాలయం వద్ద విధులు నిర్వహిస్తున్న సీఐ శంకర్‌పై శ్రీరంగరాజపురం టీడీపీ మండల అధ్యక్షుడు జయశంకర్‌నాయుడు, మరికొందరు నేతలు తీవ్రంగా దుర్భాషలాడుతూ దాడికి ప్రయత్నించారు. గంగాధర నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ నామినేషన్ దాఖలులో భాగంగా మంగళవారం ఆర్వో కార్యాలయంలో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు ప్రవేశించేందుకు ప్రయత్నం చేశారు. ఆర్వో కార్యాలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణ కోసం విధుల్లో ఉన్న సీఐ శంకర్ అలా వెళ్లకూడదని అడ్డుకునే యత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన జయశంకర్‌నాయుడు 'నన్నే అడ్డుకుంటావా.. వచ్చేది మా ప్రభుత్వం నీ అంతు చూస్తా నా..' అంటూ సీఐపై బూతు పురాణంతో విరుచుకు పడ్డారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి దూషణకు దిగి సీఐ డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో రోడ్డుపై బైఠాయించారు.

తన్నుకున్న తమ్ముళ్లు..

ర్యాలీ కోసం 30 బస్సుల్లో జనాన్ని పోగుచేసి రూ.3 వందలు, మద్యం బాటిల్, బిర్యానీ ప్యాకెట్ పంపిణీ చేసినట్లు తెలిసింది. తీసుకొచ్చిన జనానికి మందుబాటిళ్ల పంపకాల్లో తేడా రావడంతో ఆర్వో కార్యాలయం ఎదుటే టీడీపీ కార్యకర్తలు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. కర్రలతో కొట్టుకున్నారు. అదేవిధంగా ఫొటోగ్రాఫర్లకు అనుమతి లేని రిటర్నింగ్ కార్యాలయం ఆవరణంలో డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి తెలుగు తమ్ముళ్లు పైశాచిక ఆనందాన్ని పొందారు.

ముగిసిన శ్రీవారి వసంతోత్సవాలు

వైభవంగా స్నపన తిరుమంజనం



శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి అభిషేకం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయం వెనుక వైపు గల వసంతోత్సవ మండపంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న సాలకట్ల వసంతోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామితో పాటు శ్రీసీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణుడికి వసంతోత్సవ సేవ నేత్రపర్వంగా సాగింది. మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి, సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి, రుక్మిణి సమేత శ్రీకృష్ణ స్వామి వార్లను నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. అదేవిధంగా ప్రతినెలా పౌర్ణమినాడు తిరుమలలో నిర్వహించే గరుడ సేవను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, జేఈవో గౌతమి, సీపీఆర్వో టి.రవి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

కనుల పండువగా కోదండరాముడి రథోత్సవం



ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామ స్వామి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామి వారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సీతారామలక్ష్మణులు రథాన్ని అధిష్ఠించి గ్రామ వీధుల్లో విహరించారు. చెక్క భజనలు, కోలాట ప్రదర్శనల నడుమ భక్తులు శ్రీరామ నామం జపిస్తూ రథాన్ని ముందుకు లాగారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం కాళీయమర్దన అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కేశవరెడ్డి విద్యా సంస్థల ప్రభంజనం



ఎస్.సాయి స్వతేజ్ | టి.సాయి నిఖిత | ఎస్.రజియ సుల్తాన
ఎస్.ప్రశాంత్ | కె.భావన | ఎస్.మహ్మద్ జయాన్

విజయవాడ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కేశవరెడ్డి విద్యా సంస్థల ఫౌండర్, చైర్మన్ ఎన్.కేశవరెడ్డి తెలిపారు. 600 మార్కులకు 597 మార్కులు సాధించి ఎస్.సాయి స్వతేజ్ ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. టి.సాయి నిఖిత, వి.ఎస్.రోషిని, ఎస్.రజియ సుల్తాన, ఎస్.ప్రశాంత్, కె.భావన 596 మార్కులతో, ఎస్.మహ్మద్ జయాన్ 595 మార్కులతో వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారని తెలిపారు. ఆరుగురు విద్యార్థులు 594 మార్కులు, పది మంది 593, ఎనిమిది మంది 592, మరో ఎనిమిది మంది 591, పది మంది 590, ఏడుగురు 589, 15 మంది 588 మార్కులు సాధించా రని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల ఫౌండర్, చైర్మన్ ఎన్.కేశవరెడ్డి అభినందించారు.

నెల్లూరు జిల్లా రుణం తీర్చుకుంటా

నెల్లూరు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి నామినేషన్



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు లోక్‌సభ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వి.విజయసాయిరెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరినారాయణన్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'సొంత జిల్లాలో లోక్‌సభ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడాన్ని.. జీవితంలో అన్నింటి కంటే గొప్ప విషయంగా భావిస్తున్నా. నెల్లూరు రుణం తీర్చుకునే అవకాశం కల్పించిన మా పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌కు, భారతమ్మకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇది నా జీవితంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. నెల్లూరు ఇప్పటివరకు 10 మంది మహనీయులను లోక్‌సభకు పంపించింది. అలాంటి స్థానం నుంచి పోటీచేసే అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు మరోసారి కృతజ్ఞతలు తెలియచేస్తున్నా' అని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు బీద మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ,టీడీపీ జనసేనకు బుద్ధి చెబుతాం: మునీర్ అహ్మద్

లబ్బీపేట(విజయవాడతూర్పు): మత ఛాందసవాదంతో దేశ ప్రజల మధ్య విద్వేషాలు రగిలించి లబ్ధి పొందాలనుకోవడమే బీజేపీ విధానమని, రానున్న ఎన్నికల్లో బీజేపీ, దానితో జత కలిసిన టీడీపీ, జనసేనకు బుద్ధి చెబుతామని ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్ మంగళవారం హెచ్చరించారు. ముస్లింలు, మసీదులు అనే పదాలు ఉపయోగించకుండా, వారిపై విమర్శలు చేయకుండా రాజకీయం చేయడం బీజేపీకి సాధ్యం కాదన్నారు. తాము అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తాం, ముస్లింల రిజర్వేషన్లు తొలగిస్తాం, వక్ఫ్ బోర్డు రద్దు చేస్తామని ప్రకటనలు చేస్తూ మైనార్టీల పట్ల వివక్ష ధోరణి అవలంభిస్తున్నారని మండిపడ్డారు. దివంగత మహానేత వైఎస్సార్ అందించిన నాలుగు శాతం రిజర్వేషన్లతో ఎంతోమంది ఉన్నత విద్య అభ్యసిస్తున్నారని, వాటిని రద్దు చేస్తామంటున్నారని మండిపడ్డారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

సాక్షి, నెట్‌వర్క్: పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన 200 కుటుంబాలు టీడీపీని వీడి మంగళవారం గురజాల ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి నుంచి టీడీపీకి చెందిన పలువురు యువత తెలుగు అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. విస్సన్నపేట మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కి చెందిన టీడీపీ మైనార్టీ నేతలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి సమక్షంలో పార్టీలో చేరారు. విజయవాడ టీడీపీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ బాజీ ఆధ్వర్యంలో 50 మంది ముస్లిం మైనార్టీ నేతలు, మహిళలు పార్టీలో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు బిళ్ల కృష్ణమూర్తి కుమారులైన బిళ్ల బ్రదర్స్‌గా పిలువబడే బిళ్ల నర్సింహరావు, బిళ్ల అన్నవరం, యర్రంశెట్టివారిపాలెం గ్రామం పూతినీడివారిపాలెంలో జనసేన, టీడీపీల నుంచి పలువురు ఎమ్మెల్యే ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పాలకొల్లులోని 18వ వార్డు బెత్లహేంపేటలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాలు, యలమంచిలి మండలంలోని అడవిపాలెం పంచాయతీ గగ్గిపర్రుకు చెందిన టీడీపీ, జనసేన నేతలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి సమక్షంలో పార్టీలో చేరారు. భీమవరానికి చెందిన జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలు, 100 మందికిపైగా నాయి బ్రాహ్మణులు, చిన ఆమిరం, భీమవరంలోని అప్పారావు తోట, నరసయ్య అగ్రహారం ప్రాంతాలకు చెందిన 50 మంది క్షత్రియులు, భీమవరం 18వ వార్డుకు చెందిన ముస్లిం సోదరులు వార్డు మాజీ కౌన్సిలర్ కోడె యుగంధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు జిల్లా సీతంపేటలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ కోటగిరి శ్రీధర్ సమక్షంలో సీతంపేట జనసేన నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సమక్షంలో గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. నంద్యాలలోని 36వ వార్డు సంజీవనగర్ ఏరియా నుంచి 200 కుటుంబాలు మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి.



గిద్దలూరులో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరికలు



మైలవరంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో లక్ష్మీపార్వతి, సర్నాల



విజయవాడలో మైనార్టీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా



నంద్యాలలో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో చేరికలు

వైఎస్సార్‌సీపీలోకి లోక్‌సత్తా, కాంగ్రెస్ రాష్ట్ర నేతలు



వైఎస్సార్‌సీపీలో చేరిన మోదుగుల కృష్ణారెడ్డితో సజ్జల రామకృష్ణారెడ్డి, వేమారెడ్డి

సాక్షి,అమరావతి: పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన కాంగ్రెస్ నేత మోదుగుల కృష్ణారెడ్డి, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర నేతలు బద్దిగం శంకరరెడ్డి, చెవుల హరికృష్ణ, వేముల కోట నారాయణ, కె.బాలకృష్ణ, చలంచర్ల మహాలక్ష్మయ్య వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత దొంతిరెడ్డి వేమారెడ్డి నేతృత్వంలో తాడేపల్లిలో మంగళవారం ఈ చేరికలు జరిగాయి. అలాగే, లోక్‌సత్తా పార్టీ నేతలు గొట్టం శ్రీరామ్మూర్తి, పాట్లూరి మల్లికార్జున్, ఎరుకల రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పోతురాజులు కూడా పార్టీలో చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.

ప్రజలను వెధవలు అంటారా?

- తెలుగువారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన టీడీపీ ఎన్ఆర్‌ఐలు
- పెత్తందారి ఆలోచనలకు ఇది నిదర్శనం
- ఎన్నికల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేయాలి
- మంత్రి జోగి రమేష్



కోమటి ప్రసంగాన్ని చూపుతున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: 'రాష్ట్ర ప్రజలను వెధవలు అని కించపరుస్తారా... ఇది మీ పెత్తందారి ఆలోచనలకు నిదర్శనం...' అని టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం నేతలపై మంత్రి జోగి రమేష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కృష్ణాజిల్లా గంగూరులోని తన కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం దెబ్బతీసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదలు అందరూ సీఎం వైఎస్ జగన్ వైపే ఉన్నారని, రాష్ట్రానికి మళ్లీ జగనన్న సీఎం అవుతారని అనేక సర్వేలు స్పష్టంచేశాయని చెప్పారు. దీంతో టీడీపీ దిక్కుతోచక అధికారం కోసం అడ్డదారులు తొక్కుతోందన్నారు. ఇందులో భాగంగా టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం రంగంలోకి వచ్చిందని, ప్రజలను డబ్బులతో ప్రలోభాలకు గురిచేయాలని ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రయత్నంలో 'డబ్బుతో ఓట్లు కొనవచ్చు... తెలుగు ప్రజలు వెధవలు...' అంటూ టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం నేత కోమటి జయరాం చేసిన ప్రసంగాన్ని జోగి రమేష్ మీడియాకు చూపించారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే చదివి, విదేశాలకు వెళ్లి డబ్బు సంపాదించుకున్న తరువాత తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరుస్తూ మాట్లాడటం దారుణమని, ఇది పెత్తందారుల మనస్తత్వానికి నిదర్శమని మండిపడ్డారు. కోమటి జయరాం, టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం నేతలపై ఎన్నికల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేయాలని ఆయన కోరారు. ఎన్ఆర్‌ఐలు చంద్రబాబును నమ్మి రాజకీయాల్లో తలదూర్చి అక్రమాలకు పాల్పడితే నట్టేట ముంచుతాడని జోగి రమేష్ హెచ్చరించారు. ఎన్ఆర్‌ఐలు డబ్బు సంచులతో గ్రామాల్లోకి వచ్చి ఓటర్లను ప్రభావితం చేయాలని చూస్తే జనం తరిమికొడతారని, దొంగ ఓట్లు వేయటానికి ప్రయత్నిస్తే జైలుకు వెళతారని స్పష్టంచేశారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు కుప్పంలో ఓడిపోయి హైదరాబాద్‌కు పలాయనం చిత్తగిస్తారని, ఇక ఆయన ఎన్ఆర్‌ఐలను ఎలా కాపాడుతారో ఆలోచించుకోవాలని సూచించారు. ఎన్ఆర్‌ఐలు తాము పుట్టి, పెరిగి, చదువుకున్న ప్రాంతానికి నిస్వార్థంగా సేవ చేయాలని, స్వార్థ రాజకీయాలకు దూరంగా ఉండాలని కోరారు. పేదలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌కు ఎన్ఆర్‌ఐలు మద్దతు తెలిపితే ప్రజలందరికి మరింత మంచి జరుగుతుందని చెప్పారు.

జగన్ పాలనలో మారిన బీసీల బతుకుచిత్రం

జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయకిరణ్

కృష్ణలంక(విజయవాడ తూర్పు): సీఎం వైఎస్ జగన్ పాలనలోనే బడుగుల బతుకులు మారాయని, ఆయన గెలుపుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయకిరణ్ ఉద్ఘాటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదల మేలు కోరే జగన్ లాంటి నాయకుడిని తానెప్పుడూ చూడలేదని ఓ ప్రకటన పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీతోనే బడుగులకు సమున్నత స్థానం లభించిందని, చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో బీసీలకు ఒరగబెట్టిందేమి లేదని పేర్కొన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన మూడు పార్టీలు పొత్తు పెట్టుకుని వస్తున్నా బీసీలు ఆదరించరని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పాలనలో

హనుమాన్ చాలీసా విన్నా నేరమే

ప్రజలు సొంత మత విశ్వాసాలు పాటించడం కష్టం

- రాజస్తాన్‌లో కాంగ్రెస్ హయాంలో శ్రీరామనవమి వేడుకలపై ఆంక్షలు
- మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం
- దేశవ్యాప్తంగా ముస్లిం రిజర్వేషన్లను తీసుకొచ్చే కుట్రలు ఫలించలేదు
- బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలు కాంగ్రెస్ సిద్ధాంతం
- రాజ్యాంగాన్ని, అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ ఏనాడూ గౌరవించలేదు
- నేను రాజ్యాంగానికి విధేయుడిని.. అంబేడ్కర్‌ను ఆరాధిస్తున్నా..
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారం

జైపూర్/రాయ్‌పూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్ష కాంగ్రెస్‌పై మరోసారి నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ప్రజలు వారి మత విశ్వాసాలు పాటించడం చాలా కష్టమని, కనీసం హనుమాన్ చాలీసా వినడం కూడా పెద్ద నేరం అవుతుందని అన్నారు. మంగళవారం రాజస్తాన్‌లోని టోంక్, ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి, ధామ్‌తారీ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఇటీవల హనుమాన్ చాలీసా వింటున్న ఓ దుకాణదారుడిని దారుణంగా కొట్టారని గుర్తుచేశారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శ్రీరామనవమి ఊరేగింపుపై రాళ్లు విసిరారని చెప్పారు. రాళ్లు విసిరినవారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి రక్షణ కల్పించారని, రాష్ట్రంలో శ్రీరామనవమి వేడుకలపై ఆంక్షలు విధించారని మండిపడ్డారు. రాజస్తాన్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజల మత విశ్వాసాలను ప్రశ్నించే ధైర్యం ఎవరూ చేయలేకపోతున్నారని చెప్పారు. ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛగా హనుమాన్ చాలీసా పఠించవచ్చని, శ్రీరామనవమి వేడుకలు జరుపుకోవచ్చని, ఇది బీజేపీ గ్యారంటీ అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. ఎన్నికల ప్రచారంలో ఆయన ఇంకా ఏం చెప్పారంటే..

రిజర్వేషన్లపై ఇదే నా గ్యారంటీ

''మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం. 2004లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో కోత విధించి, ముస్లింలకు కట్టబెట్టే పనికి శ్రీకారం చుట్టింది. 2004 నుంచి 2010 దాకా ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం రిజర్వేషన్లను అమలు చేసేందుకు నాలుగుసార్లు గట్టిగా ప్రయత్నించింది. కానీ, చట్టపరమైన అడ్డంకులు ఎదురయ్యాయి. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో కాంగ్రెస్ ఉద్దేశం నెరవేరలేదు. 2011లో దేశవ్యాప్తంగా ముస్లిం రిజర్వేషన్లను అమల్లోకి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ సాగించిన కుట్రలు ఫలించలేదు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కులను కొల్లగొట్టి, మరో వర్గానికి ప్రయోజనం కల్పించాలని చూశారు. భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ ఏనాడూ గౌరవించలేదు. దళితులు, వెనుకబడిన గిరిజనులకు కల్పించిన రిజర్వేషన్లను విభజించి, ముస్లింలకు ఇచ్చేస్తామని బహిరంగంగా ప్రకటించే ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా? కర్ణాటకలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల నుంచి దొంగిలించి, ముస్లింలకు ఇచ్చిన కోటాను బీజేపీ ప్రభుత్వం వచ్చాక రద్దు చేసింది. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్ల గడువు 2020లో ముగిసిపోగా, మేము మరో పదేళ్లు పొడిగించాం. దళితులకు, వెనుకబడిన గిరిజనులకు రిజర్వేషన్లు ఎప్పటికీ అంతం కాబోవని నేను గ్యారంటీ ఇస్తున్నా. మతం పేరిట ఎవరైనా రిజర్వేషన్లను విభజించాలని చూస్తే సహించే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకున్నా. రాజ్యాంగానికి విధేయుడిగా నడుచుకుంటున్నా. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను ఆరాధిస్తున్నా''


టోంక్‌లో జరిగిన ర్యాలీలో అభిమానులందజేసిన గదతో మోదీ

నక్సలిజం, మావోయిజాన్ని అంతం చేస్తాం

''ఛత్తీస్‌గఢ్‌లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి హింసను ప్రోత్సహించింది. కాంగ్రెస్‌కు, అభివృద్ధికి పొత్తు పొసగదు. అవి రెండూ కలిసి ముందుకు సాగలేవు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి, హింస పెరిగిపోతాయి. ఈశాన్య రాష్ట్రాల్లో, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు నక్సలైట్ల హింసాకాండ విపరీతంగా పెరిగింది. హింసాకాండలో ఒకవైపు జనం మరణిస్తుంటే, మరోవైపు కాంగ్రెస్ నాయకులు జేబులు నింపుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం వచ్చాక అవినీతి, మావోయిస్టు హింసాకాండ తగ్గుముఖం పట్టింది. రాష్ట్రంలో నక్సలిజాన్ని, మావోయిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని ప్రజలకు గ్యారంటీ ఇస్తున్నా'' అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు''

కాంగ్రెస్ వస్తే ప్రజల సొమ్ముపై ఎక్స్‌-రే

''దేశంలో వనరులపై మొదటి హక్కు మైనార్టీలకే ఉందని కాంగ్రెస్ పాలనలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ అన్నారు. ఇది యాదృచ్ఛికం కాదు. బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలే కాంగ్రెస్ సిద్ధాంతం. ప్రజల ఆస్తులను, కష్టపడి సంపాదించిన సొమ్మును దోచుకొని, కొందరు ఎంపిక చేసిన వ్యక్తులకు పంపిణీ చేయాలని కాంగ్రెస్ కుట్రలు పన్నుతోంది. కాంగ్రెస్‌తోపాటు విపక్ష ఇండియా కూటమిలోని పార్టీల ఓటు బ్యాంకు రాజకీయాలను బయటపెడుతున్నందుకే ఆ పార్టీ నాయకులు నన్ను దూషిస్తున్నారు. నిజం మాట్లాడితే వారు భయపడుతున్నారు. వారి రహస్య ఎజెండాలను బహిర్గతం చేస్తుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలను నమ్ముకుంది. అందుకే రాజ్యాంగాన్ని కూడా లెక్క చేయకుండా వ్యవహరిస్తోంది. కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రజల ఆస్తులను, సొమ్ములను ఎక్స్‌-రే తీస్తామని కాంగ్రెస్ యువరాజు చెబుతున్నారు. అంటే ప్రజలు తమ దగ్గరున్న డబ్బులు, బంగారాన్ని పెట్టెలో దాచి, గోడల్లో రహస్యంగా భద్రపరిచినా కాంగ్రెస్ నాయకులు ఎక్స్‌-రే ద్వారా కనిపెట్టి, స్వాధీనం చేసుకుంటారు. తర్వాత ఎంపిక చేసిన వ్యక్తులకు ఆ సొమ్ము పంపిణీ చేస్తారు. కాంగ్రెస్ చెబుతున్న సంపద పునఃపంపిణీ వెనుక ఉన్న అసలైన అర్థం ఇదే''

దేశాన్ని విభజించే కుతంత్రమే

''కాంగ్రెస్ పార్టీ మన దేశాన్ని మతం పేరిట ముక్కలు చేసింది. స్వాతంత్య్రం వచ్చాక మొదటిరోజు నుంచే బుజ్జగింపు రాజకీయాలు చేస్తోంది. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతుల ప్రజలు అధికారంలో భాగస్వాములు కావడాన్ని ఆ పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. మరో నాటకానికి తెరతీసింది. దేశాన్ని విభజించే కుట్రలకు పాల్పడుతోంది. దక్షిణ భారతదేశాన్ని ప్రత్యేక దేశంగా మార్చాలని ఇటీవల కర్ణాటకలో కాంగ్రెస్ ఎంపీ డిమాండ్ చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి ఒకరు గోవాలో భారత రాజ్యాంగాన్ని అమలు చేయొద్దని అంటున్నారు. ఇది ముమ్మాటికీ దేశాన్ని విభజించే కుతంత్రమే. రాజ్యాంగాన్ని అమలు చేయొద్దనడం రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను అవమానించినట్లు కాదా? తమపై రాజ్యాంగాన్ని బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తున్నారంటూ గతంలో జమ్మూకశ్మీర్‌లో కొందరు వ్యక్తులు గగ్గోలు పెడుతుండేవారు. మీరు(ప్రజలు) బీజేపీని ఆదరించాక ఆ వ్యక్తుల నోళ్లు మూతపడ్డాయి. జమ్మూకశ్మీర్‌లో రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. భారతదేశం కాంగ్రెస్‌ను తిరస్కరించింది. అందుకే దేశాన్ని చిన్న చిన్న దేశాలుగా, దీవులుగా విడగొట్టాలని ఆ పార్టీ భావిస్తోంది. కాంగ్రెస్ నేడు గోవాలో రాజ్యాంగం అమలును అంగీకరించడం లేదు. రేపు దేశమంతటా అమలు చేయొద్దని చెప్పడం ఖాయం. దేశ అభివృద్ధి పట్ల కాంగ్రెస్‌కు ఒక విజన్ లేదు. పేదల సంక్షేమం గురించి ఆ పార్టీకి ఏబీసీడీ కూడా తెలియదు. ఎన్నికల్లో బీజేపీ మళ్లీ గెలిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోంది. బీజేపీ సంగతి పక్కన పెట్టండి. సాక్షాత్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దిగొచ్చినా సరే రాజ్యాంగాన్ని రద్దు చేయలేరు''

వేలం వద్దు.. మేమే కేటాయిస్తాం

మీ తీర్పును సవరించండి

2జీ స్పెక్ట్రమ్‌పై సుప్రీం తలుపుతట్టిన మోదీ సర్కార్



న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులపై 2012లో ఇచ్చిన తీర్పును సవరించాలని 12 ఏళ్ల తర్వాత సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తిచేసింది. వేలం విధానంలో కాకుండా తామే కేటాయింపులు జరుపుతామని కోర్టుకు తెలిపింది. వేలం ద్వారా మాత్రమే కేటాయింపులు జరపాలంటూ ఇచ్చిన గత తీర్పును సవరించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాల ధర్మాసనం ఎదుట కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి అభ్యర్థించారు. ఈ అంశంపై తక్షణం విచారణ చేపట్టాలని కోరారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ బేసిస్(ముందు వచ్చిన వారికే ప్రాధాన్యత) పద్ధతిలో యూపీఏ హయాంలో ఏ.రాజా టెలికం మంత్రిగా ఉన్నపుడు 2జీ స్పెక్ట్రమ్‌కు సంబంధించి కంపెనీలకు ఇచ్చిన 122 లైసెన్సులను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడం తెల్సిందే. కొన్ని సందర్భాల్లో వేలంలో కాకుండా ప్రభుత్వమే కేటాయింపులు జరపాలని ఆశిస్తోందని, అందుకే పాత తీర్పును సవరించాలని అటార్నీ జనరల్ సోమవారం కోరారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని, వివరాలను ఈ-మెయిల్‌లో పంపాలని సీజేఐ చంద్రచూడ్ సూచించారు. అయితే తీర్పును సవరించాలంటూ ప్రభుత్వం చేసిన అభ్యర్థనను సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తప్పుబట్టారు. నాటి తీర్పు సమంజసంగానే ఉందని, సవరణ అనవసరమని ఆయన వాదించారు. ఆనాడు యూపీఏ సర్కార్‌కు వ్యతిరేకంగా 2జీ స్పెక్ట్రమ్‌పై ప్రజా ప్రయోజనా వ్యాజ్యం దాఖలుచేసిన ఎన్‌జీవో సంస్థ తరఫున ఆనాడు ప్రశాంత్‌భూషణే వాదించారు. కేటాయింపుల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని మన్మోహన్ ప్రభుత్వంలో నాటి కమ్యూనికేషన్స్, ఐటీ సహాయ మంత్రి కపిల్‌సిబల్ 2011లో వాదించారు. అయితే ఈ కేసులో ఎ.రాజా, డీఎంకే నాయకురాలు కనిమొళిలను నిర్దోషులుగా ప్రకటిస్తూ 2017 డిసెంబర్ 21న ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరిచింది. ఈ తీర్పును సవాల్‌చేస్తూ సీబీఐ 2018 మార్చి 20న హైకోర్టును ఆశ్రయించింది. అక్రమ కేటాయింపుల వల్ల కేంద్ర ఖజానాకు రూ.30,984 కోట్ల నష్టం వాటిల్లిందని వాదించింది. వేలం విధానంలో జరగని కేటాయింపుల లైసెన్స్‌లను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

నాటి అడ్వర్టైజ్‌మెంట్ల సైజులోనే

క్షమాపణల యాడ్స్ వేశారా?

రామ్‌దేవ్ బాబా, బాలకృష్ణలను ప్రశ్నించిన సుప్రీంకోర్టు




న్యూఢిల్లీ: కరోనా విలయకాలంలో అల్లోపతి వంటి ఆధునిక వైద్యవిధానాలను తప్పుబడుతూ పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ ఇచ్చిన తప్పుడు అడ్వర్టైజ్‌మెంట్లు, ప్రకటనల కేసులో బాబా రాందేవ్, పతంజలి మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ బహిరంగ క్షమాపణలు చెప్పినా సర్వోన్నత న్యాయస్థానం వారిని వదిలిపెట్టలేదు. ఈ కేసు విచారణ సందర్భంగా మంగళవారం రాందేవ్, బాలకృష్ణ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టుకు హాజరయ్యారు. రూ.10 లక్షలు ఖర్చుపెట్టి సోమవారం 67 వార్తాపత్రికల్లో క్షమాపణల యాడ్ ఇచ్చామని కోర్టుకు తెలిపారు. '' ఆనాడు అల్లోపతిని కించపరుస్తూ, పతంజలి ఉత్పత్తులు అద్భుతమంటూ ఇచ్చిన ఫుల్‌పేజీ యాడ్‌ల స్థాయిలోనే ఈ యాడ్‌లను ప్రముఖంగా ప్రచురించారా?. అదే ఫాంట్ సైజులో అంతే పరిమాణంలో ప్రకటన ఇచ్చారా?' అని జస్టిస్ హిమా కోహ్లీ ప్రశ్నించారు. ' మా క్లయింట్లు యాడ్స్ కోసం లక్షలు వెచ్చించారు' అని రోహత్గీ చెప్పారు. ' ఖర్చు ఎంతయింది అనేది మాకు అనవసరం' అని జడ్జి అసహనం వ్యక్తంచేశారు. 'గతంలో క్షమాపణల యాడ్స్ ఇవ్వాలని ఆదేశిస్తే ఈరోజు కోర్టు విచారణ ఉందనగా నిన్న ఎందుకు యాడ్ ఇచ్చారు?. ఈ కేసులో పతంజలికి ప్రతివాదిగా ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌పై రూ.100 కోట్ల పరువునష్టం దావా ఒకటి దాఖలైంది. ఆ దావాతో మీకేమైనా సంబంధం ఉందా?' అని జడ్జి అనుమానం వ్యక్తంచేశారు. '' తన క్లయింట్లకు దీనితో ఎలాంటి సంబంధం లేదు. ఈసారి పెద్ద సైజులో క్షమాపణ ప్రకటనలు ఇస్తాం'' అని రోహత్గీ చెప్పారు. దీంతో సోమవారం నాటి ప్రకటనల వివరాలను రెండ్రోజుల్లోపు సమర్పించాలని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాహ్‌ల ధర్మాసనం ఆదేశించింది. ఇలాగే తప్పుడు ప్రకటనలు ఇస్తున్న ఫాస్ట్‌మూవింగ్ కన్జూమర్ గూడ్స్(ఎఫ్‌ఎంసీజీ) కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని సంబంధింత మూడు కేంద్రప్రభుత్వ మంత్రిత్వ శాఖలను కోర్టు ఆదేశించింది. '' ఈ కంపెనీల తప్పుడు ప్రకటనలు వల్లే ఆయా సంస్థల ఉత్పత్తులను చిన్నారులు, పాఠశాల స్థాయి విద్యార్థులు, వృద్ధులు విరివిగా వినియోగిస్తున్నారు' అని కోర్టు ఆవేదన వ్యక్తంచేసింది.

మా మతం ఎవరినీ

తక్కువగా చూడదు

మోదీ వ్యాఖ్యలపై ఫరూక్ అబ్దుల్లా సీరియస్



శ్రీనగర్: ముస్లింలు చొరబాటుదారులు, తల్లులు, అక్కాచెల్లెళ్ల బంగారం, మంగళసూత్రాలను కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తీవ్రంగా మండిపడ్డారు. ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి నేలబారు మాటలు మాట్లాడటం శోచనీయమన్నారు. '' ఇతర మతాలను కించపరచాలని మా మతం అస్సలు బోధించదు. హిందూ మహిళల మంగళసూత్రాలను ఏ ఒక్క ముస్లిం కూడా దోచుకోడు. అందరినీ సమానంగా చూడాలని ఇస్లాం ప్రబోధిస్తోంది. మేం నమ్మే మా మతం అన్ని మతాలకూ గౌరవం ఇవ్వాలనే చెబుతోంది. హిందూ తల్లి, సోదరి మంగళసూత్రాలను ముస్లిం దోచాడని నేను ఎక్కడా వినలేదు. అలా ఒకవేళ ఎక్కడైనా జరిగి ఉంటే అతను ముస్లిమే కాదు. అతను ఇస్లాంను సరిగా అర్థం చేసుకోలేదని అర్థం'' అని అన్నారు. మంగళవారం రాజసోథన్‌లోని బాంసవాడా పట్టణంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఫరూక్ మాట్లాడారు. '' ఒకరిని చంపితే మానవత్వాన్ని చంపేసినట్లేనని ఇస్లాం బోధనల్లో ఉంది. నేనూ ముస్లింనే. హిందువులను ద్వేషించాలని ఖురాన్‌లో ఎక్కడా లేదు. సిక్కులు, ముస్లింలను ఎంతగా ప్రేమిస్తానో హిందువుల పట్ల అంతే ప్రేమతో వ్యవహరిస్తా. ఇతర మతాల వాళ్లు అభివృద్ధిలోకి వస్తే వారితోపాటే మనమూ వృద్ధిలోకి వస్తాం. అప్పుడే దేశమే అభివృద్ధిపథంలో ముందుకెళ్తుంది'' అని అన్నారు. బీజేపీ 2047 విజన్‌పై ఫరూక్ ఆరోపణలు గుప్పించారు. '' విజన్ 2047పై బీజేపీ ఎప్పుడూ వల్లెవేస్తోంది. 2047ను ఎందుకు పట్టుకుని వేలాడుతున్నారు?. అప్పటికల్లా దేశంలో పారదర్శకమైన ఎన్నికలు అనేవే లేకుండా చేయడం బీజేపీ ఉద్దేశం. అధికారాన్ని హస్తగతం చేసుకుని నచ్చినట్లు దేశాన్ని ఏలాలని భావిస్తోంది. రష్యాలో పుతిన్‌లాగా మోదీని బతికున్నంతకాలం ప్రధాని పీఠంపై కూర్చోబెట్టాలని బీజేపీ ఆశపడుతోంది' అని ఫరూక్ వ్యాఖ్యానించారు. '' ముస్లింల పట్ల బీజేపీ వైఖరిని తెల్సుకోండి. ఆ తర్వాత ఆ పార్టీకి మద్దతు అవసరమా లేదా అని ఆలోచించండి' అని కశ్మీర్ ప్రాంత పార్టీల నేతలను హెచ్చరించారు.

రాహుల్‌కు డీఎన్‌ఏ టెస్ట్ చేయాలి

- నెహ్రూల కుటుంబంలో ఇలా మాట్లాడేవాళ్లు ఉంటారా?
- ఎల్డీఎఫ్ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్య

పాలక్కడ్: అవినీతి ఆరోపణలున్న కేరళ ముఖ్యమంత్రి, లెఫ్ట్ నాయకుడు పినరయి విజయన్‌ను ఎందుకు దర్యాప్తు సంస్థలు ఇంతకాలం అరెస్ట్‌చేయకుండా ఉన్నాయన్న రాహుల్ గాంధీపై ఎల్డీఎఫ్ శాసనసభ్యుడు పీవీ అన్వర్ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేరళలోని ఎడథనట్టుకారలో ఎల్డీఎఫ్ స్థానిక కమిటీ మీటింగ్‌లో అన్వర్ మాట్లాడారు. '' నెహ్రూ కుటుంబంలో ఇలా మాట్లాడేవాళ్లు ఉన్నారా? నెహ్రూ కుటుంబంలో పుట్టి కూడా ఇలా మాట్లాడతారా? ఈ విషయంలో నాకు పెద్ద సందేహాలు వస్తున్నాయి. రాహుల్ గాంధీ డీఎన్‌ఏను టెస్ట్‌చేయాలి. నెహ్రూ వారసుడిగా ఉండే అర్హత రాహుల్‌కు లేదు. ప్రధాని మోదీకి రాహుల్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడేమో అనే అనుమానం మనకు రావాలి'' అని అన్వర్ అన్నారు. దీంతో కాంగ్రెస్ మండిపడింది. వెంటనే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని కేరళ కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షుడు ఎంఎం హసన్ చెప్పారు. ' గాడ్సేకు కొత్త అవతారం అన్వర్. గాంధీజీ ప్రాణాలు తీసిన నాథూరాం గాడ్సే బుల్లెట్ కన్నా దారుణంగా మాటల తూటాలు పేల్చారు. ప్రజా ప్రతినిధులు ఎవ్వరూ ఇలా హేయమైన వ్యాఖ్యలు చేయరు. సీఎం పినరయి విజయన్ ఆత్మాహుతి దళంలో అన్వర్ సభ్యుడనుకుంటా ' అని హసన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నెహ్రూ కుటుంబాన్ని తిట్టేందుకు అన్వర్‌కు సీపీఐ(ఎం) పార్టీ డబ్బులు ఇచ్చి ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. అన్వర్ వ్యాఖ్యలను సీఎం విజయన్ సమర్థించారు. '' రాహుల్‌కు అన్వర్ సరైన సమాధానమే ఇచ్చారు. రాహుల్ విమర్శలకు అతీతుడైన వ్యక్తి కాదుకదా'' అని సీఎం అన్నారు.

సైనిక హెలికాప్టర్లు ఢీకొని

10 మంది మృతి

మలేసియాలో దుర్ఘటన

కౌలాలంపూర్: మలేసియా ఆర్మీకి చెందిన రెండు హెలికాప్టర్లు ప్రమాదవశాత్తు ఢీకొని 10 మంది చనిపోయారు. ఉత్తర పెరాక్ రాష్ట్రంలోని నేవీ కేంద్రం సమీపంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వచ్చే నెలలో జరిగే నేవీ వార్షికోత్సవాల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా పదుల సంఖ్యలో హెలికాప్టర్లు తక్కువ ఎత్తులో ప్రయాణం చేస్తున్నాయి. ఆ సమయంలో ఒక హెలికాప్టర్ పక్కకు జరగడంతో దాని రెక్క పక్కనే వస్తున్న మరో హెలికాప్టర్ రోటార్‌ను తాకింది. దీంతో, రెండు హెలికాప్టర్లు ఢీకొని కుప్పకూలాయి. వాటిలో ఉన్న ఏడుగురు పురుషులు, ముగ్గురు మహిళలు సహా మొత్తం పది మంది వైమానిక దళ సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు.

ఎట్టకేలకు కేజ్రీవాల్‌కు ఇన్సులిన్

న్యూఢిల్లీ: మధుమేహం స్థాయిలు పెరిగాయంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పెట్టుకున్న మొరను తిహార్ జైలు యంత్రాంగం ఎట్టకేలకు ఆలకించింది. మద్యం విధానంలో అవకతవకల కేసులో అరెస్టయి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌కు తిహార్ జైలులో ఇన్సులిన్ ఇవ్వడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులతో వీడియోకాల్‌లోనూ ఇన్సులిన్ గురించి ప్రస్తావించానని కేజ్రీవాల్ చెప్పడం, అలాంటి ప్రస్తావనే రాలేదని జైలు యంత్రాంగం ఒక ప్రకటన విడుదలచేయడం తెల్సిందే. దీంతో ఆయనకు ఇన్సులిన్ అవసరమో లేదో తేల్చేందుకు మెడికల్ బోర్డ్‌ను ఏర్పాటుచేయాలని ఎయిమ్స్ డైరెక్టర్‌ను ఢిల్లీ కోర్టు ఆదేశించడం వంటి పరిణామాల నేపథ్యంలో కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి ఏడింటికి షుగర్ లెవల్ 217 గా ఉంది. దీంతో సోమవారం సాయంత్రం ఆయనకు ఎయిమ్స్ వైద్యుల సూచన మేరకు రెండు డోస్‌ల ఇన్సులిన్ ఇచ్చారు. ''హనుమాన్ జయంతి రోజు హనుమంతుని ఆశీస్సులు కేజ్రీవాల్‌కు అందాయి. హనుమాన్‌జీ ఆయన భక్తునికి ఇన్సులిన్ అందేలా చేశారు' ఆప్ వ్యాఖ్యానించింది. '' నిజంగా ఇన్సులిన్ అవసరం లేకపోతే ఇప్పుడు ఎందుకు ఇచ్చారు?'' అని బీజేపీని ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ నిలదీశారు.

మే 7 వరకు కస్టడీ పొడిగింపు

మద్యం కుంభకోణం మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు మే 7వ తేదీ వరకు పొడిగించింది. ఈ కేసులో మార్చి 21వ తేదీన కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేసి, తిహార్ జైలులో ఉంచిన విషయం తెలిసిందే. మంగళవారంతో ఆయనకు విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగిసింది. దీంతో అధికారులు ఆయన్ను సీబీఐ, ఈడీ కేసులను విచారించే ప్రత్యేక కోర్టు జడ్జి కావేరీ బవేజా ఎదుట వర్చువల్‌గా హాజరుపరిచారు.



ఎన్నికల విచిత్రం

పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ బ్యాగుల దుకాణం వద్ద కాంగ్రెస్ అభ్యర్థి అధిర్ రంజన్ చౌదరి

ఎలక్షన్ బీట్

దేశం కోసం నా తల్లి మంగళసూత్రాలు త్యాగం చేశారు

- నానమ్మ ఇందిరా గాంధీ బంగారం ఇచ్చేశారు
- ప్రధాని మోదీ వ్యాఖ్యలను తిప్పికొట్టిన కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ



సాక్షి, బళ్లారి/బెంగళూరు: తన తల్లి సోనియా గాంధీ ఈ దేశం కోసం తన మంగళసూత్రాలు త్యాగం చేశారని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంగళసూత్రాలను లాక్కుంటారని మోదీ చేసిన వ్యాఖ్యలను ఆమె తిప్పికొట్టారు. దేశానికి 75 ఏళ్ల క్రితం స్వాతంత్య్రం వచ్చిందని, కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్లు అధికారంలో ఉందని, ఏనాడైనా మంగళసూత్రాలను, బంగారాన్ని లాక్కుందా? అని ప్రశ్నించారు. మంగళవారం కర్ణాటకలో ప్రచార సభల్లో ప్రియాంక ప్రసంగించారు. యుద్ధ సమయంలో తన నానమ్మ, అప్పటి ప్రధాని ఇందిర తన బంగారాన్ని దేశం కోసం ఇచ్చేశారని గుర్తుచేశారు. మంగళసూత్రాల ప్రాధాన్యత ఏమిటో తెలిస్తే ప్రధాని ఇలా మాట్లాడరని చెప్పారు. నరేంద్ర మోదీ నైతికత వదిలేశారని, సత్యమార్గంలో పయనించడం లేదని, ప్రజల ముందు కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు.

మోదీ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నాం: ఈసీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ రాజస్తాన్‌లో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ చొరబాటుదారులు అంటూ ముస్లింలను నిందించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదుపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. మోదీ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నామని ఎన్నికల సంఘం వర్గాలు తెలియజేసినట్లు ఓ వార్తా సంస్థ వెల్లడించింది. కాంగ్రెస్ నేతలు సోమవారం ఎన్నికల సంఘం అధికారులను కలిసి ప్రధాని మోదీతోపాటు బీజేపీ నేతలపై మొత్తం 16 ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే. ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడిన మోదీపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల సంపదను, వారి కష్టార్జితాన్ని దోచుకుంటారని, ఆ సొమ్మును చొరబాటుదారులకు, అధిక సంతానం ఉన్నవారికి అప్పగిస్తారని రాజస్తాన్ సభలో ప్రధాని మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే. దేశంలో వనరులపై తొలి హక్కు మైనార్టీలకే ఉందని కాంగ్రెస్‌కు చెందిన అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అన్నారని మోదీ తప్పు పట్టారు. మోదీ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర వివాదానికి దారితీశాయి.

సనాతన వ్యతిరేకి, జాతి వ్యతిరేకి..

కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌పై స్మృతి ఇరానీ ఆరోపణలు

అమేథీ: సనాతన ధర్మాన్ని, హిందువులను బలహీనులుగా మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉన్నారని కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మండిపడ్డారు. ఆ పార్టీ నేత రాహుల్ గాంధీని ఆమె సనాతన వ్యతిరేకి, జాతి వ్యతిరేకిగా అభివర్ణించారు. అమేథీలో మంగళవారం ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. 'హిందుత్వను మాత్రమే కాదు, శ్రీరాముడిని సైతం కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించారు. శ్రీరాముడి భక్తుడు కాని వ్యక్తితో ఎలాంటి ప్రయోజనమూ లేదు. రాహుల్ కావొచ్చు, ప్రియాంకా గాంధీ కావొచ్చు వాళ్లు సనాతన ధర్మ విరోధులు మాత్రమే కాదు, జాతి వ్యతిరేకులు కూడా. దేశాన్ని ముక్కలుగా చేస్తానంటూ మాట్లాడిన వ్యక్తిని వీరు తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు' అని స్మృతి ఆరోపించారు.

మూడో విడత బరిలో 1,351 మంది

సాక్షి, న్యూఢిల్లీ: మే 7వ తేదీన మూడో విడత పోలింగ్ జరగనున్న లోక్‌సభ స్థానాల్లో మొత్తం 1,351 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ దఫాలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 95 ఎంపీ స్థానాలకు 2,963 నామినేషన్లు దాఖలైనట్లు మంగళవారం తెలిపింది. అత్యధికంగా గుజరాత్‌లోని 26 స్థానాలకు 658 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు పేర్కొంది. మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ లోక్‌సభ సీటు కోసం 77 మంది నామినేషన్లు వేసినట్లు తెలిపింది.

సూరత్ కాంగ్రెస్ అభ్యర్థి జాడ గల్లంతు!

సూరత్: సూరత్ ఎంపీ స్థానంలో పార్టీ తరఫున నిలబడి నామినేషన్ తిరస్కరణకు గురవడంతో పోటీ నుంచి తప్పుకున్న నీలేశ్ కుంభనీ జాడ తెలీడం లేదని కాంగ్రెస్ పార్టీ మంగళవారం ప్రకటించింది. ప్రస్తుతం ఆయన ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. ఇంటికి తాళం వేసి కుటుంబం అంతా ఎక్కడికో వెళ్లారు. ఆయన బీజేపీలో చేరొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో నీలేశ్ ఇంటి వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నాకు దిగారు.

లద్దాఖ్‌లో నమ్‌గ్యాల్‌కు దక్కని బీజేపీ టికెట్

న్యూఢిల్లీ: 2019లో ఆర్టికల్ 370 రద్దుకు మద్దతుగా లోక్‌సభలో ఆవేశపూరితంగా ప్రసంగించి అందరి దృష్టిని ఆకర్షించిన లద్దాఖ్ ఎంపీ, బీజేపీ నేత జమ్యాంగ్ సేరింగ్ నమ్‌గ్యాల్‌కు ఈసారి నిరాశ ఎదురైంది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఆయనకు టికెట్ నిరాకరించింది. లద్దాఖ్ అభ్యర్థిగా తాషీ గ్యాల్సన్‌ను ఖరారు చేసింది. నమ్‌గ్యాల్ పట్ల లేహ్‌లో బౌద్ధులు అసంతృప్తిగా ఉండటంతో ఆయనను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.

సీఏఏ జోలికి వచ్చేంత ధైర్యం లేదు

మమత, కాంగ్రెస్‌లపై అమిత్ షా ధ్వజం

మాల్డా: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)ను బెంగాల్‌లో అమలు చేయబోమంటూ సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. సీఏఏ జోలికి వచ్చేంత ధైర్యం మమత, కాంగ్రెస్ పార్టీలకు లేదన్నారు. అక్రమ వలసలను ప్రోత్సహించేందుకే ఆమె సీఏఏను వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన బెంగాల్, మహారాష్ట్రలలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో మాట్లాడారు. బీజేపీ 400 పైగా సీట్లు సాధిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.


సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



వైభవంగా కల్యాణోత్సవం

తిరుమలగిరి వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి కల్యాణం మంగళవారం రాత్రి కనుల పండువగా జరిగింది. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. -8లో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 506.40 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 3,597 క్యూసెక్కులు విడుదలవుతోంది.



	కనిష్టం	గరిష్టం
నందిగామ	26.4	42.3
జగ్గయ్యపేట	26	42
మచిలీపట్నం	27	36
గుడివాడ	26	40

సెంట్రల్‌లో బొండాగిరి

- వెంటాడుతున్న సెక్స్ రాకెట్, కాల్‌మనీ వ్యవహారాలు
- సీఎంపై హత్యాయత్నంతో పూర్తిగా మసకబారిన ప్రతిష్ట
- ఐటీడీపీ పేరుతో వికృత పోస్టులు.. అల్లరి మూకలకు ప్రోత్సాహం
- బొండా ఉమా తీరుపై రగిలిపోతున్న నియోజకవర్గ ప్రజలు



ప్రజలను ఆకట్టుకుంటున్న వెలంపల్లి

సాక్షి ప్రతినిధి విజయవాడ: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా రాజకీయాల్లోకి రాకముందే గూండాగిరి సాగించారు. 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక రెచ్చిపోయారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని కాల్ మనీ, సెక్స్ రాకెట్, భూ కబ్జాలతో చెలరేగిపోయారు. రౌడీ షీటర్లు, అసాంఘిక శక్తులను అమాయక ప్రజలపైకి ఉసిగొల్పడం, అధికారులపై దౌర్జన్యాలకు దిగడం ఆయనకు సాధారణం. సోషల్ మీడియా వేదికగా తన అనుచరులతో మహిళలపై వికృత పోస్టులు పెట్టించి వారిని మానసికంగా వేధించడం, ఆత్మహత్యలు చేసుకునేలా ప్రేరేపించడం నిత్యకృత్యం. ఇటీవల సంచలనం సృష్టించిన తెనాలి మహిళ గీతాంజలి ఆత్మహత్యకు కారణమైన పసుమర్తి రాంబాబు సైతం బొండా ఉమా అనుచరుడు కావడం గమనార్హం.

సీఎంపై హత్యాయత్నంతో....

'మేమంతా సిద్ధం' బస్సుయాత్రలో అజిత్‌సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్ వద్ద ముఖ్యమంత్రిని హత్య చేయాలనే కుట్రతో పదునైన రాయితో దాడి జరిగింది. ఈ కేసులో నిందితుడు సతీష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాయి దాడి వెనుక కుట్రకోణం దాగి ఉందని స్పష్టమైంది. ఏ2 పురిగొల్పడంతో దాడి చేసినట్లు తన వాంగ్మూలంలో నిందితుడు స్పష్టం చేశాడు. బొండా ఉమాకు సతీష్ సన్నిహితుడు. సతీష్‌ను దాడికి పురిగొల్పిన వాడిగా అనుమానిస్తున్న ఏ2 బొండాకు ప్రధాన అనుచరుడు. టీడీపీలో ఆయనకు పదవి ఉంది. కేసును తప్పుదోవ పట్టించేందుకు బొండా ఉమా చేయని జిమ్మికులు, ఆడని నాటకాలు లేవు. సీఎంపై జరిగిన రాయి దాడిని, పేద ప్రజలు తమ హృదయాలపై జరిగిన దాడిగా భావిస్తున్నారు. గూండాగిరి చేస్తున్న బొండాకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు. ప్రజల నాడి గమనించిన బొండా ఉమా ఎన్నికలకు ముందే చేతులేత్తేసే పరిస్థితికి వచ్చాడు. రాయి దాడి ఉదంతం ఆయన ప్రతిష్టను పూర్తిగా మసకబార్చింది. దీంతో ఓటమి తప్పదనే భావనకు ఆయన వచ్చినట్లు టీడీపీ వర్గాలే పేర్కొంటున్నారు.

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ను సామాజిక సమీకరణల దృష్ట్యా వైఎస్సార్ సీపీ సెంట్రల్ అభ్యర్థిగా ప్రకటించింది. స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా, ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, శ్రేణులు అందరినీ కలుపుకొని వెలంపల్లి ప్రచారం చేస్తున్నారు. ఎంపీ అభ్యర్థి కేశినేని నానితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు, నియోజకవర్గంలో ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించారు. అన్ని సామాజికవర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి వారి మద్దతు కూడగట్టుకున్నారు. ప్రచారంలో దూకుడు పెంచారు. ఆయన ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. నియోజకవర్గంలో జరిగిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. దీంతో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. దాడి ఘటనలో ముఖ్యమంత్రికి తగిలిన రాయి వెలంపల్లి కంటికి తగిలి గాయపరిచింది. గాయంతోనే ఆయన ఇంటింటి ప్రచారం కొనసాగిస్తున్నారు. సోమవారం జరిగిన నామినేషన్ కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలు తరలి వచ్చి వెలంపల్లికి దన్నుగా నిలిచారు. ఈ పరిణామాలు అన్నీ ఆయన గెలుపు నల్లేరు మీద నడకేనని స్పష్టం చేస్తున్నాయి.

మహిళలంటే అలుసు

టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా ఉన్మాదానికి అడ్డూఅదుపూ లేదు. 'ఏవే... ఏంటే... ఇటు రావే..' ఇదీ ఆయన నోటి నుంచి వచ్చే భాష. అది పబ్లిక్ మీటింగ్ అయినా.. ప్రైవేటు కార్యక్రమమైనా.. ఎదురుగా ఉన్నది ప్రజాప్రతినిధి అయినా.. సొంత పార్టీ మహిళ అయినా ఆ భాషలో ఎటువంటి మార్పు ఉండదు. పక్కన ఎవరున్నా, ఎంతమంది ఉన్నా మహిళలకు ఏమాత్రం గౌరవం ఇవ్వకుండా చులకనగా మాట్లాడతారు. దీంతో ఉమా కంట పడకుండా ఉంటే బాగుండని సొంత పార్టీ మహిళలే తప్పుకొని తిరుగుతారని ఆయన సన్నిహితులే ఒప్పుకొంటారు. ఇక తటస్తులైతే ఆయన భాష విని ఏవగించుకుంటారు. తొలి సారి వెళ్లిన చట్టసభలో 'ఏంట్రా... నా కొ...' అంటూ బొండా వాడిన భాష యావత్ ప్రపంచం చూసింది.

పవన్ కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ లెక్కలు ఏవీ?

వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్



వీడియోలో మాట్లాడుతున్న పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్థాపించిన కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎక్కడ ఉంది, దాని జమా లెక్కల పరిస్థితి ఏమిటో ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్ డిమాండ్ చేశారు. విజయవాడ వన్ టౌన్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విడుదల చేసిన వీడియోలో ఆయన పలు అంశాలపై స్పందించారు. పదేళ్ల క్రితం కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశానని, దానికి కోటి రూపాయలు విరాళం ఇచ్చానని పవన్‌కల్యాణ్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ పరిధిలో ఏ సేవలు చేశారు? వాటికి సంబంధించి ప్రజల నుంచి ఎంత మేర విరాళాలు వచ్చాయి? వాటి ఖర్చులు ఏమిటి? వంటి లెక్కాపత్రాలను ప్రజలకు వివరించాలని కోరారు. కామన్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను చంద్రబాబునాయుడు ప్రొటెక్షన్ ఫోర్స్‌గా పవన్ కల్యాణ్ మార్చేశారని విమర్శించారు. కాపులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ చిరంజీవి వంటి వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారని ఆశించారని పేర్కొన్నారు. అయితే ఆయన అనివార్య కారణాలతో రాజకీయాల నుంచి నిష్క్రమించారని పేర్కొన్నారు. ఆయన తమ్ముడైన పవన్ కల్యాణ్‌పై ఆశ పెట్టుకుంటే పది సంవత్సరాల నుంచి జనసేన పార్టీని ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థగా తయారు చేశారని దుయ్యబట్టారు. కాపులు తమ అన్న పవన్‌కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని రూపాయి రూపాయి దాచి విరాళాలుగా ఇచ్చారని గుర్తు చేశారు. జనసేన పార్టీ నేతగా వారి ఆశలను ఆయన వమ్ము చేసి చంద్రబాబుకు అమ్ముడుపోయారని విమర్శించారు.

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తికి పేట బార్ సభ్యుల వినతి



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట కోర్టు ప్రాంగణంలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికకు జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, కార్యదర్శి దామాల సంతోష్, ఉపాధ్యక్షుడు యలమంచిలి రాజేంద్రప్రసాద్, కోశాధికారి మెట్టిల ఆంజనేయులు, హైకోర్టు న్యాయవాది గండికోట శ్రావణ్‌కుమార్ తదితరులు అమరావతిలో జస్టిస్ శేషసాయి, అరుణ సారికను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ.. జగ్గయ్యపేట కోర్టుకు న్యాయం కోసం కక్షిదారులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని, వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా వారు సేద తీరేందుకు కోర్టు ప్రాంగణంలో రేకుల షెడ్డు నిర్మాణానికి అనుమతించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. కక్షిదారులు తరచూ నందిగామ కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తకుండా జగ్గయ్యపేట జూరిస్డిక్షన్ పెంచాలని, సబ్ కోర్టును మంజూరు చేయాలని కోరామన్నారు. తమ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన జస్టిస్ శేషసాయి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక తదుపరి చర్యల నిమిత్తం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. న్యాయవాదులు బూడిద నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సాధారణ పరిశీలకులుగా మంజూరాజ్‌పాల్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకురాలిగా ఐఏఎస్ అధికారి మంజూ రాజ్‌పాల్ నియమితులయ్యారు. ఆమె విజయవాడ నగరానికి మంగళవారం విచ్చేశారు. స్థానిక మునిసిపల్ గెస్ట్ హౌస్ వద్ద మంజూ రాజ్‌పాల్‌కు కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లాలో ఎన్నికలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ కేంద్రం కార్యకలాపాలు, ఈవీఎంల ర్యాండమైజేషన్, పీఓ, ఏపీఓల శిక్షణ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, వివిధ ఫారాల పరిష్కారం, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్) తదితరాల గురించి వివరించారు. వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఫిర్యాదుల పరిష్కారం గురించి వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, తిరువూరు ఆర్డీఓ కె.మాధవి, విజయవాడ ఆర్డీఓ బీహెచ్ భవానీ శంకర్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, విజయవాడ పశ్చిమ ఆర్‌ఓ ఇ.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లలో తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణికులకు అతి తక్కువ ధరకే పరిశుభ్రతతో నాణ్యమైన ఆహారం అందించేందుకు భారతీయ రైల్వే ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఎకానమి మీల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. ఇది జనరల్ కోచ్‌ల ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. రైల్వే శాఖ ప్రయోగాత్మకంగా ఇప్పటి వరకు భారతీయ రైల్వేలో వంద స్టేషన్లలో 150 కౌంటర్‌ల ద్వారా ప్రయాణికులకు కేవలం రూ.20కే ఎకానమి మీల్స్, రూ.50కే స్నాక్స్ మీల్స్‌ను ప్రత్యేక కౌంటర్‌ల ద్వారా ప్రయాణికులకు అందజేస్తోందని పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో 12 స్టేషన్లలో 23 కౌంటర్లు ఏర్పాటు చేసిందని వివరించారు. విజయవాడ డివిజన్‌లోని విజయవాడ, రాజమండ్రి స్టేషన్‌లలో మూడు కౌంటర్ల ద్వారా ఎకానమీ మీల్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని డీఆర్ఎం తెలిపారు. వేసవిలో ప్రయాణికుల రద్దీని అంచనా వేస్తూ జనరల్ కోచ్‌ల వద్ద ఈ ప్రత్యేక కౌంటర్‌లను అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.01లక్షల విరాళం



కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివ రామకృష్ణ క్షేత్రానికి పూతబోయిన వెంకటరామారావు–జయలక్ష్మి, అయ్యప్పస్వామి– చరిష్మా దంపతులు రూ.2,01,116 నగదును విరాళంగా అందించారు. మంగళవారం ఈ నగదును కమిటీ సభ్యులకు అందించారు. పూర్తి గ్రానైట్‌తో నిర్మిస్తున్న ఆలయానికి తమవంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని దాతలు తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకటసుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్‌చంద్రబోస్, అన్నం శివరామకృష్ణ, బడే భవన్నారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం



పశ్చిమ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ తరఫున నామినేషన్ వేస్తున్న మండల శ్రీనివాసరావు



తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్న నల్లగట్ల సుధారాణి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లాలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. ఐదో రోజైన మంగళవారం 27 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మే 13వ తేదీన జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆయా రిటర్నింగ్ కార్యాలయాల వద్ద నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లు రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తరఫున పార్టీ నేతలు మంగళవారం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. తిరువూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామి దాసు సతీమణి నల్లగట్ల సుధారాణి నామినేషన్ వేశారు.

- విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్, బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థిగా మద్దిరాల భూషణరాజు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పోతిన వెంకట రామారావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నక్కల సాయిబాబు, ఇండియన్ ముస్లిం లీగ్ అభ్యర్థిగా షేక్ ఖాజావలి తమ నామినేషన్లను ఆర్వోకు సమర్పించారు.
- విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో స్వతంత్ర అభ్యర్థి బొప్పన గాంధీ, టీడీపీ తరఫున బొండా సుజాత, బొండా ఉమామహేశ్వరరావు, స్వతంత్రులు కొణిజేటి ఆదినారాయణ, బి.వెంకట సాయి లక్ష్మీగణేష్ నామినేషన్లు సమర్పించారు.
- విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నలుగురు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థులుగా సుమ సుదర్శన, ఎం.భార్గవ్, స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ అభ్యర్థిగా వెంకటరెడ్డి గంగిరెడ్డి, జనవాహిని పార్టీ అభ్యర్థిగా ఎస్.ఎన్.వరప్రసాద బాబు దాస్యం నామినేషన్లు దాఖలు చేశారు.
- మైలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థులుగా ఓర్సు రామారావు, స్వతంత్ర అభ్యర్థులుగా నూనె సుదీర్ కుమార్ రెడ్డి, చింతపల్లి దాస్ నామినేషన్ దాఖలు చేశారు.
- నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి టీడీపీ అభ్యర్థిగా తంగిరాల సౌమ్య ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.
- తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నల్లగట్ల సుధారాణి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా లాక్కేపోగు వందన్ కుమార్ నామినేషన్ వేశారు.
- జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. టీడీపీ అభ్యర్థిగా శ్రీరామ్ శ్రీదేవి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా ప్రభుదాస్, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా శ్రీరామ రామకృష్ణ స్వతంత్ర అభ్యర్థులుగా ఆనందరావు, బి.ప్రకాష్‌రావు, కె.బుజ్జిబాబు, వేల్పుల విజయ్ నామినేషన్ దాఖలు చేశారు.
- విజయవాడ పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించి ఒక్క నామినేషన్ కూడా రాలేదు.

సెలవలొచ్చాయ్..!



ఇన్నాళ్లూ పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులకు ఆటవిడుపు దొరికింది. విద్యా సంవత్సరం ముగియడంతో ప్రభుత్వం బుధవారం నుంచి పాఠశాలలకు వేసవి సెలవులను ప్రకటించింది. సెలవులు వచ్చిన ఆనందంలో విద్యార్థులు చిందేసి సందడి చేశారు. వారి అల్లరికి రెక్కలొచ్చాయి. విజయవాడ మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల వద్ద సెలవులు ఇచ్చిన ఆనందంలో గంతులు వేస్తున్న విద్యార్థులను ఈ చిత్రంలో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కృష్ణాజిల్లా ఎన్నికల పరిశీలకుల నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో శాసనసభ, లోక్‌సభ స్థానాలకు సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించేందుకు ఎన్నికల కమిషన్ ఆరుగురు ఎన్నికల పరిశీలకులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం లోక్‌సభ స్థానం, పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ శాసనసభ స్థానాలకు ఏఆర్ జాన్‌కింగ్స్, మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి వ్యయ పరిశీలకులుగా రిషబ్‌గుప్తా, గన్నవరం, గుడివాడ, పామర్రు, పెనమలూరు శాసనసభ స్థానాలకు సాధారణ పరిశీలకులుగా నరహరిసింగ్ టంగేర్‌లను నియమించారని పేర్కొన్నారు. మచిలీపట్నం, అవనిగడ్డ, పామర్రు, పెనమలూరు శాసన సభ స్థానాలకు వ్యయ పరిశీలకులుగా చవాన్ ప్రవీణ్ మోహన్‌దాస్, గన్నవరం, గుడివాడ శాసనసభ వ్యయ పరిశీలకులుగా వికాష్ చంద్రకరోల్, మచిలీపట్నం లోక్‌సభ స్థానం పోలీస్ పరిశీలకులుగా రాజా రామస్వామిని నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. వారు ఎన్నికలు పూర్తయ్యే వరకు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు.

సింహ వాహనంపై శ్రీదుర్గా మల్లేశ్వరులు



సింహ వాహనంపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవం

- కనుల పండువగా నగరోత్సవ సేవ
- ఆది దంపతులకు వేద పండితుల ఆశీస్సులు
- నేడు పూర్ణాహుతి, హంసవాహన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లు కొలువుదీరిన ఇంద్రకీలాద్రిపై చైత్రమాస బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదో రోజైన మంగళవారం నవ దంపతులు దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు వేద పండితుల వేదాశీస్సులు అందజేశారు. సాయంత్రం సింహ వాహన సేవ కనుల పండువగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం వద్ద సింహ వాహనంపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు కొబ్బరికాయ కొట్టి నగరోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య మహా మండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవం కెనాల్‌రోడ్డు, పాత కంట్రోల్ రూమ్ ఫ్లై ఓవర్, ఏలూరు రోడ్డు, చల్లపల్లి బంగ్లా, బందరు లాకుల మీదుగా తిరిగి మహా మండపానికి చేరుకుంది. నగరోత్సవంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



స్వామివార్లకు వేదాశీస్సులు ఇస్తున్న పండితులు

ఉదయం రాజగోపురం ఎదుట ధర్మపథం వేదికపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు సదస్యం, వేద స్వస్తి, వేద పండితుల వేదాశీస్సులను అందజేశారు.

నేడు చైత్రమాస బ్రహ్మోత్సవాల ముగింపు

చైత్రమాస బ్రహ్మోత్సవాలు బుధవారం ముగియనున్నాయి. ఈ సందర్భంగా మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఉదయం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్తిచేశారు. పూర్ణాహుతి అనంతరం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు వసంతోత్సవం, కృష్ణానదిలో అవభృత స్నానం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు లాంఛనంగా పూర్తవుతాయి. సాయంత్రం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు పవిత్ర కృష్ణానదిలో హంస వాహనంపై తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు.

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీది కీలక పాత్ర

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) పాత్ర కీలకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఎస్ఎల్‌బీసీకి కన్వీనర్‌గా సి.వి.ఎన్.భాస్కర్ బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఎస్ఎల్‌బీసీ నూతన కన్వీనర్ భాస్కర్ మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బ్యాంకు లింకేజీ, ఫైనాన్షియల్ లిటరసీ, ప్రజలకు ఆర్థిక సేవలను చేరువ చేయడం తదితర కార్యకలాపాల్లో ఎస్ఎల్‌బీసీ, లీడ్ డిస్ట్రిక్ట్ కార్యాలయాలు కీలక సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉన్నందున జిల్లాలో ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్)ను సమర్థంగా అమలుచేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో అనుమానిత, అసాధారణ లావాదేవీలను గుర్తించి, ఆ సమాచారాన్ని విశ్లేషించడంలో లీడ్ డిస్ట్రిక్ట్ కార్యాలయం దృష్టిసారించాలని సూచించారు. కలెక్టర్ ఢిల్లీరావును కలిసిన వారిలో యూబీఐ రీజనల్ హెడ్ ఎం.శ్రీధర్, జిల్లా ఎల్‌డీఎం కె.ప్రియాంక, యూబీఐ సీఎం జయశ్యామ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మే 26 నుంచి అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు మే 26 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు జరుగుతాయని వర్సిటీ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.అజంత కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మే 6వ తేదీలోగా ఏపీఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ. 500 అపరాధ రుసుంతో మే 14వ తేదీ వరకు, రూ. వెయ్యి అపరాధ రుసుంతో మే 22వ తేదీ లోగా పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. మరింత సమాచారం కోసం మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో స్వయంగా కానీ, 0866--2434868, 7382929642 ఫోన్ నంబర్లలో కానీ సంప్రదించాలని కోరారు.

నున్న చెక్‌పోస్టులో రూ.4.5 లక్షలు స్వాధీనం



నున్న(విజయవాడరూరల్): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి నుంచి రూ.4.5 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నున్న గ్రామం పవర్‌గ్రిడ్ చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదు పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రం భద్రాది జిల్లా దమ్మపేట మండలం, పట్వారిగూడెం గ్రామానికి చెందిన దంపకుంట్ల శ్రీనివాసరావు ఆర్టీసీ బస్సులో విజయవాడ వస్తున్నాడు. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఆయన వద్ద నగదు గుర్తించారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించలేదు. దీంతో నగదు సీజ్ చేసి ట్రెజరీకి పంపినట్లు నున్న రూరల్ సీఐ ఎస్.దుర్గాప్రసాద్ చెప్పారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు : కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. విజయవాడలోని సీఎస్ క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా నగర పాలక సంస్థ, మున్సిపల్ ఏరియా, గ్రామ పంచాయతీ పరిధిలో అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతిరోజు తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో సాంకేతికంగా అంతరాయం ఏర్పడితే తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు గరిష్ట వేతనం అందేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సునీత, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ డి.వి.రమణ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు



స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): పండువెన్నెల.. మల్లె పూల పందిరిలో.. రంగు రంగుల విద్యుద్దీపాల నడుమ.. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి కల్యాణం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం కనులపండువగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను కొండపైన ఆలయం నుంచి ఊరేగింపుగా కొండ కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలోకి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి రామకృష్ణమా చార్యులు, పరాంకుశం శ్రీనివాసాచార్యులు కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ లోకకల్యాణార్థం ఏటా స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈవో నూతక్కి సాంబశివరావు, విజయవాడ డీసీపీ శ్రీనివాసరావు, పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. దాదాపు రెండు గంటల పాటు వైఖానస ఆగమ శాస్త్రానుసారం వేద మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం చేశారు. గ్రామమంతా ఏడుకొండల నామస్మరణతో మార్మోగింది. వ్యాఖ్యాతగా వాసుదేవాచార్యులు వ్యవహరించారు. ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నందిగామ ఏసీపీ రవి కిరణ్, సీఐ జానకీరామ్, పర్యవేక్షణలో జగ్గయ్యపేట, చిల్లకల్లు ఎస్ఐలు సతీష్, పద్మారావు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. దేవదాయశాఖ డెప్యూటీ కమిషనర్ విజయరాజు పాల్గొన్నారు. విప్ ఉదయభాను సతీమణి విమలాభాను కల్యాణోత్సవాన్ని సామాన్య భక్తులతో కలిసి వీక్షించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండటంతో పాలకవర్గ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, పాలకవర్గ సభ్యులు సామాన్య భక్తుల్లా కల్యాణం తిలకించారు.

గిరి ప్రదక్షిణతో నెరవేరుతున్న మనోభీష్టం



గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తున ఈవో రామరావు, ఆలయ అధికారులు



గిరి ప్రదక్షిణలో దుర్గా మల్లేశ్వరస్వామి వార్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమి రోజున ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ నిర్వహించిన గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ద్వారా తమ మనోభీష్టి నెరవేరుతుందని పలువురు భక్తులు తెలిపారు. చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ మంగళవారం తెల్లవారుజామున నిర్వహించారు. లోక కళ్యాణార్థం, భక్త జన శ్రేయస్సు, ధర్మ ప్రచారం నిమిత్తం ప్రతి నెలా పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున 05–55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డు ప్రారంభంలోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం ఈవో కెఎస్.రామరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై దుర్గామల్లేశ్వరస్వామి వార్లు కొలువై ఉండగా, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, డప్పు నృత్యాలు, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, కలరా హాస్పటల్, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరింది. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతుంది. గిరి ప్రదక్షిణలో పాల్గొనడం వల్ల తమ కోర్కెలు తీరుతున్నాయని భక్తులు పేర్కొన్నారని ఆలయ అర్చకులు తెలిపారు. గిరి ప్రదక్షిణలో భాగంగా తమ ఇంటి ముంగిటకు విచ్చేసిన ఆది దంపతులకు భక్తులు పూలు, పండ్లు సమర్పించి పూజలు జరిపించుకున్నారు. ఈవో రామరావు దంపతులు, ఈఈ కోటేశ్వరరావు, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాస శాస్త్రి, యజ్ఞనారాయణ మూర్తి, సూపరింటెండెంట్లు భాగ్యజ్యోతి, సునీతలతో పాటు పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు, ఆలయ సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగ కమిటీల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఎన్టీఆర్ జిల్లా మహిళా విభాగ కమిటీ....

ఎన్టీఆర్ జిల్లా మహిళా విభాగ కమిటీ అధ్యక్షురాలిగా సంపత్ విజిత (జగయ్యపేట), ప్రధాన కార్యదర్శులుగా ధనేకుల ఇందిరా ప్రియదర్శిని (విజయవాడ ఈస్ట్), శాఖమూరి వెంకటకుమారి (నందిగామ), పుచ్చకాయల భారతీరెడ్డి (తిరువూరు), సల్మా సుల్తానా (వెస్ట్), బి. నాగపావని (వెస్ట్), బెంబవరపు కృష్ణకుమారి (జగ్గయ్యపేట) నియమితులయ్యారు. వీరితోపాటు కార్యదర్శులుగా వి.స్వప్న, ఓ.రత్న కుమారి, అమర్లపూడికీర్తి సౌజన్య, గద్దె శేషుకుమారి, కొంగల నాగమణి, చేబ్రోలు వెంకటరమణ, తంగిరాల ప్రమీల, టి.నాగమణి, యర్రబోతు చిట్టెమ్మ, రుద్రపాటి శ్రవంతి, యనమదల సింధుజారెడ్డి, సామినేని మాధవి, సంయుక్త కార్యదర్శులుగా కొణెదల కనకదుర్గ, గుడివాడ చిన్నారి, యద్దనపూడి అనంద్ జ్యోత్స్న, నాయుడు ఉదయలక్ష్మి, మోదుగు సీతమ్మ, ఉదయగిరి సులోచన, ములుగు శిరీష రాయ్, పసుపులేటి దుర్గా భవాని, పీతల పద్మ, భాగ్యలక్ష్మి, విస్సంశెట్టి కమల నియమితులయ్యారు.

మైనార్టీ విభాగ కమిటీ....

ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా మొహమ్మద్ రఫీ (విజయవాడసెంట్రల్), వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఇర్షద్ అలీ (సెంట్రల్), ప్రధాన కార్యదర్శులుగా ఎండీ గౌస్ (ఈస్ట్), షేక్ యాకూబ్ అలీ (నందిగామ), షేక్ హిమామ్‌సాహెబ్ (తిరువూరు), సయ్యద్ ముజీబ్(జగ్గయ్యపేట), షేక్ మొగలాన్ (సెంట్రల్), ఎండీ నాగుల్‌మీరా (సెంట్రల్) నియమితులయ్యారు. వీరితో పాటు 11 మంది కార్యదర్శులు, 10 మంది సంయుక్త కార్యదర్శులను నియమించారు.

➡ ఎన్టీఆర్ జిల్లా పార్టీ కమిటీ కార్యదర్శిగా మైలవరం నియోజకవర్గానికి చెందిన పాచిగొళ్ల వెంకట రత్నరాజును నియమించారు.

➡ ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శిగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన గుడిపాటి సీతారం కేసరి నియమితులయ్యారు.

➡ జిల్లా వైఎస్సార్ సేవాదళ్ విభాగ కార్యదర్శిగా గుడిపాటి చంద్రశేఖర్ శర్మ నియమితులయ్యారు

➡ జిల్లా వైఎస్సార్‌టీయూసీ విభాగ ప్రధాన కార్యదర్శిగా సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన కోలా నాగ అంజనేయులు నియమితులయ్యారు.

➡ విజయవాడ నగర మైనార్టీ విభాగ అధ్యక్షుడిగా సెంట్రల్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలి నియమితులయ్యారు.

➡ కృష్ణా జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా గన్నవరం నియోజకవర్గానికి చెందిన పులిమద్ది చిన్నమస్తాన్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా గన్నవరం నియోజకవర్గానికి చెందిన మోపిదేవి ద్వారకనాథ్, అదే నియోజకవర్గానికి చెందిన దుట్టా మోహన శివ రాజయ్య కార్యదర్శిగా నియమితులయ్యారు.

ఘరానా కేటుగాడు అరెస్టు

- కార్లు, స్థలాల పేరుతో రూ.92 లక్షలు స్వాహా
- భార్య అమెరికాకు పరార్
- తండ్రి హైకోర్టు నకిలీ లాయర్





రకరకాల వేశాలతో శరత్‌చంద్రవర్మ

పెనమలూరు: బ్లఫ్‌మాస్టర్ సినిమాలో కథానాయకుడిని మించిన కేటుగాడిని కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా ఉండికి చెందిన అల్లూరి శరత్‌చంద్రవర్మ, ఆయన భార్య గుత్తా జ్యోత్స్నప్రియ, వర్మ తండ్రి అల్లూరి వెంకట సంజీవరాజు పోరంకి లక్ష్మీపురంకాలనీలో గత కొద్ది కాలంగా అద్దెకు ఉంటున్నారు. శరత్‌చంద్రవర్మ ఢిల్లీ నుంచి సెకండ్ హ్యాండ్ కార్లు తీసుకొచ్చి తక్కువ ధరకు అమ్ముతామని, అలాగే విజయవాడ శివారు ప్రాంతాల్లో తక్కువ ధరకే స్థలాలు ఇప్పిస్తామని జనాలను మోసం చేయసాగాడు. ఇంటి ఎదురుగా ఉండే మేలురెడ్డి శ్రీనివాసరెడ్డి ఆర్థిక స్థితిని గమనించి ఆయనతో శరత్‌చంద్రవర్మ కుటుంబం పరిచయం పెంచుకుంది. ఇందులో భాగంగా శరత్‌చంద్రవర్మ, అతని భార్య గుత్తా జ్యోత్స్న తన 9 నెలల కుమారుడిని శ్రీనివాసరెడ్డి ఇంట్లో వదిలేసేవారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య సన్నిహిత సంబంధాలు పెరిగాయి. ఇది అవకాశంగా తీసుకొని నకిలీ పత్రాలతో కారు, నున్న వద్ద ఎకరం పొలం తక్కువ ధరకు వస్తుందని దంపతులు శరత్‌చంద్రవర్మ, జ్యోత్స్నప్రియ, శరత్‌చంద్రవర్మ తండ్రి అల్లూరి వెంకట సంజీవరాజు పథకం ప్రకారం శ్రీనివాసరెడ్డిని నమ్మించి రూ.92 లక్షలు కొట్టేశారు. శ్రీనివాసరెడ్డికి కారుగానీ, స్థలం గానీ ఇవ్వకపోవటంతో అనుమానం వచ్చి పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఇది ముందుగానే పసిగట్టిన జ్యోత్స్నప్రియ అమెరికాకు పారిపోయింది. అల్లూరి శరత్‌చంద్రవర్మ, అల్లూరి వెంకటసంజీవరాజు కనిపించకుండా పోయారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా శరత్‌చంద్రవర్మను మంగళవారం తాడిగడప వద్ద అరెస్టు చేశారు. జ్యోత్స్నప్రియ గతంలో పెనమలూరుకు చెందిన తేలప్రోలు శ్రీనివాస్‌ను కూడా మోసం చేయగా కేసు విచారణలో ఉంది.

అప్రమత్తంగా ఉండాలి...

ఇటువంటి ఘరానా నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలిపారు. తండ్రీకొడుకులు అల్లూరి శరత్‌చంద్రవర్మ, వెంకటసంజీవరాజు అమాయకులను మోసం చేసి రూ.కోట్లు నొక్కేశారని తెలిపారు. వీరిపై అనేక కేసులు ఉన్నాయన్నారు. వీరు వాడే వాహనాలపై హైకోర్టు జడ్జి, ఎమ్మెల్యే స్టిక్కర్లు వేసుకోని జనాన్ని మోసం చేస్తున్నారని చెప్పారు. తండ్రి వెంకట సంజీవరాజు హైకోర్టు లాయర్ అని ప్రజలను మోసం చేస్తాడని పేర్కొన్నారు. ఇటువంటి వారి పట్ల ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.

వైఎస్సార్ సీపీలోకి బీజేపీ నేత

విస్సన్నపేట: ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు ఆయనకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న నల్లగట్ల స్వామిదాసు

గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశానికి 201 సీట్లు భర్తీ

గన్నవరంరూరల్: వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి ఎన్టీఆర్, కృష్ణా ఉమ్మడి జిల్లాల కౌన్సెలింగ్ ప్రక్రియను మంగళవారం డీసీవో బి.సుమిత్రాదేవి నిర్వహించారు. రెండు జిల్లాల్లో 9 బాలికల గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మి, కె.ప్రేమావతి తదితరులు పాల్గొన్నారు. మొత్తం 201 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఎస్సీ 139, బీసీ 15, బీసీసీ 24, ఎస్టీ 20, ఓసీ 3 సీట్లు కేటాయించినట్లు డీసీవో చెప్పారు.

మంటల్లో కాలిపోయి ద్విచక్రవాహనదారుడు దుర్మరణం



మంటల్లో కాలిపోతున్న వెంకయ్య



వెంకయ్య బైక్‌ను ఢీకొట్టిన బుల్లెట్

పెనుగంచిప్రోలు: రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో మంటలు చెలరేగి ఒకరు దుర్మరణం చెందిన నవాబుపేట క్రాస్‌రోడ్స్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నవాబుపేట గ్రామానికి చెందిన చింతా వెంకయ్య (62) సుబాబుల్ తోటకు వెళ్లి బైక్‌పై తిరిగి గ్రామంలోకి వస్తున్నాడు. హైదరాబాద్- విజయవాడ రహదారిపై గ్రామంలోకి క్రాస్ అవుతుండగా వెనుక నుంచి వస్తున్న బుల్లెట్ వెంకయ్య బైక్‌ను ఢీకొట్టింది. కింద పడిపోవడంతోపాటు బైక్ నుంచి పెట్రోల్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు, వాహనదారులు మంటలు అదుపు చేసినప్పటికీ అప్పటికే వెంకయ్య శరీరం పూర్తిగా కాలిపోయింది. విజయవాడ తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు.

● ఆకట్టుకునేలా అసిఫ్ ప్రచారం



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ అసిఫ్ ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. భవానీపురం 38వ డివిజన్ కొట్టే కోటయ్య వీధి రావిచెట్టు సెంటర్ నుంచి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అసిఫ్ ఆటో తోలుతూ అందరినీ ఆకర్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

3800 మద్యం సీసాలు పట్టివేత



పట్టుబడిన మద్యం సీసాలను పరిశీలిస్తున్న ఏసీపీ

వీరులపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు నందిగామ ఏసీపీ రవికిరణ్ తెలిపారు. మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను వీరులపాడు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో తెలంగాణ నుంచి మద్యం అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో ఎస్ఐ మహాలక్ష్మణుడు సిబ్బందితో కలిసి వీఅన్నవరం గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారని తెలిపారు. ఈ క్రమంలో ఓ ఆటోలో 3800 మద్యం సీసాలతో ఉన్న 75 బాక్సులను గుర్తించామని చెప్పారు. ఆటో యజమాని జానపాటి శ్రీరాములు, ఉన్న మరో వ్యక్తి అనంత మాధవలను విచారించగా చిలుకూరు గ్రామానికి చెందిన లగడపాటి శ్రీను డబ్బులిచ్చి తెలంగాణ రాష్ట్రం మధిరలోని ఎస్ఎల్‌పి వైన్ షాప్ యజమాని పరమేశ్వరరావు అనే వ్యక్తి దగ్గర మద్యం కొనుగోలు చేసి తీసుకొస్తే ఎక్కువ కిరాయి ఇస్తామని చెప్పటంతో వచ్చామని చెప్పారు. శ్రీరాములు, మాధవలను అదుపులోకి తీసుకున్నామని లగడపాటి శ్రీను, పరమేశ్వరరావులు పరారీలో ఉన్నారని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల దృష్ట్యా అన్ని సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. మద్యం సీసాలను చాకచక్యంగా పట్టుకున్న నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్‌రావు, ఎస్ఐ మహాలక్ష్మణుడును ఏసీపీ అభినందించారు. కానిస్టేబుళ్లు రాకేష్, సుల్తాన్, శ్రీనివాస నాయక్, నరసింహారావులకు రివార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవినాష్ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ నామినేషన్ కార్యక్రమాన్ని బుధవారం విజయవంతం చేయాలని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ కోరారు. రామలింగేశ్వరనగర్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా హాజరవుతున్నారన్నారు. స్థానిక పడవలరేవు సెంటరులో హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో అవినాష్ విజయాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక మహిళలచే హారతి ఇస్తామన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం



పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం జరిగాయని ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. 13వ డివిజన్ పాలకేంద్రం వీధి, కోనేరు వీధిలలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఓటర్లను కలిశారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి ఆమె ఓట్లు అభ్యర్థించారు. కష్టపడి పనిచేసే అవినాష్‌ని గెలిపించాలని కోరారు. నియోజకవర్గం మరింతగా అభివృద్ధి సాధించాలంటే విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని నానికి, తూర్పులో దేవినేని అవినాష్‌కు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో 13వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జ్ రామాయణపు శ్రీనివాస్, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన మరకత శివలింగ వాయు ప్రతిష్ఠ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మరకత శివలింగ వాయు ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యాన మరకత శివలింగ వాయు ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు లోక కళ్యాణార్థం విశేషంగా హోమాలు నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతుల చేతులమీదుగా పూజలు, అభిషేకం, హోమం జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేత్ర పర్వంగా చిన్నారుల నృత్య ప్రదర్శన



విజయవాడకల్చరల్: శ్రీసీతారామ కల్యాణం, నూతన సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా సత్యనారాయణపురం గిరి వీధిలోని కళా వేదికపై మంగళవారం అభినయ నృత్య వేదిక నిర్వాహకురాలు, నాట్యాచారిణులు వీ కృష్ణగౌతమి, సీహెచ్ ప్రసన్న ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. వినాయక కౌతం, మహాగణపతిం, సిరి నవ్వులనాడే, పలుకే బంగార మాయనా, భోశంభో, భామా కలాపం, తందనానా, బాలకనక మయ, మధుర మీనాక్షి అంశాలను ప్రదర్శించారు. హిమజ, రుచిత, రమ్య, వర్షిణి, మేఘన, ధనప్రియ, ప్రేమ సాయి, లోక్షిత, రిషిత, చైతన్య నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని వీ సురేష్ పర్యవేక్షించారు. తంగిరాల రాఘవశాస్త్రి చిన్నారులను ఆత్మీయంగా సత్కరించారు.

నేటి నుంచి చెస్ ఉచిత శిక్షణ తరగతులు

విజయవాడస్పోర్ట్స్: గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో చదరంగం వేసవి ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి ఎస్కే ఖాసీం తెలిపారు. మొగల్రాజపురంలోని గ్లోబల్ చెస్ అకాడమీ, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, గొల్లపూడి వన్ సెంటర్‌లో ఈ క్యాంపులు కొనసాగుతాయన్నారు. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు మాత్రమే శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఈ కేంద్రాల్లో విడతల వారీగా శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 98495 14138 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తూర్పు.. అవినాష్‌తోనే మార్పు

- అన్నా అంటే పలికే యువనేత
- అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు
- నేడు వైఎస్సార్ సీపీ తూర్పు అసెంబ్లీ అభ్యర్థిగా అవినాష్ నామినేషన్
- భారీగా తరలిరానున్న అభిమానులు, కార్యకర్తలు, నాయకులు
- రామలింగేశ్వరనగర్ పడవల రేవు సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభం



ఎన్నికల ప్రచారంలో అవినాష్‌ను సన్మానిస్తున్న ప్రజలు(ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తూర్పు ప్రజల్లో మంచి మనస్సున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. అన్నా అంటే పలుకుతూ, అర్ధరాత్రి వేళ ఆపద వచ్చినా వెంటనే వారి వద్దకు చేరుకుని అండగా నిలిచాడు. అలాంటి నాయకుడు దేవినేని అవినాష్ నేడు నామినేషన్ వేస్తుండటంతో వేలాదిగా తరలివచ్చేందుకు ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు సిద్ధమవుతున్నారు. నామినేషన్ ర్యాలీని అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. మా సమస్యలు తీర్చిన నాయకుడికి అండగా నిలుస్తామంటున్నారు. కుల, మత, వర్గాలకు అతీతంగా అందరూ ఈ నామినేషన్ కార్యక్రమ ర్యాలీలో భాగస్వాములు కానున్నారు.

నెప్పల్లి గుడిలో ప్రత్యేక పూజలు

కంకిపాడు మండలంలో నెప్పల్లిలోని గంగానమ్మ గుడిలో దేవినేని అవినాష్ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తన తండ్రి నుంచి వస్తున్న ఆనవాయితీ ప్రకారం ఆ గ్రామంలోని గుడిలో బుధవారం ఉదయం పూజలు నిర్వహిస్తారు. పూజల అనంతరం విజయవాడలోని 12వ డివిజన్ మెగా టౌన్‌షిప్‌లో ఉన్న ఆంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి రామలింగేశ్వరనగర్ పడవుల రేవు సెంటర్‌కు చేరుకుని భారీ ర్యాలీగా నామినేషన్‌కు తరలివెళ్లనున్నారు.

ర్యాలీ కొనసాగేదిలా..

రామలింగేశ్వరనగర్ పడవుల రేవు సెంటర్‌లో ప్రారంభమయ్యే ర్యాలీ స్క్యూ బ్రిడ్జి, పోస్టాఫీస్, రాణిగారితోట, ఎం.హోటల్, సత్యం గారి హోటల్ మీదుగా డీసీఎం హోటల్ వరకు కొనసాగనుంది. ర్యాలీలో అడుగడుగునా ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా దశాబ్దాల ముంపు సమస్యను పరిష్కరించి రక్షణ గోడ ఏర్పాటు చేశారు. తమకు ముంపు సమస్య తప్పించిన నాయకుడు నామినేషన్ వేసేందుకు వెళ్తుండగా, ఆయనకు మద్దతుగా పెద్ద ఎత్తున తరలిరానున్నారు. నియోజకవర్గంలోని 21 డివిజన్ల నుంచి వేలాది మంది తరలి వచ్చేందుకు ప్రజలు సమాయత్తమవుతున్నారు. ర్యాలీ అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడిన అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేసేందుకు వెళ్లనున్నారు.

ప్రజలు ఎదురు చూస్తున్నారు..



మంచి మనసున్న తమ అభిమాన నాయకుడు అవినాష్ నామినేషన్‌కు తరలి వచ్చేందుకు నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారు. నాలుగున్నరేళ్లుగా తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించారు. దశాబ్దాలుగా ఏ నాయకుడు పట్టించుకోని వాటిని కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంలో చేయగలిగారు. కృష్ణానది కరకట్ట కానీ, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్, ల్యాండ్ సీలింగ్ ఎత్తివేయడం వంటి అనేక సమస్యలకు పరిష్కారం చూపారు. అన్నా అంటే పలికే అవినాష్‌ను తూర్పు ఎమ్మెల్యేగా చేసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారు. నామినేషన్‌కు అవినాష్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, దేవినేని నెహ్రూ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

– కొరివి చైతన్య(వర), వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో జూబిలి ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ ఫీడర్‌లో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని రెడ్‌సర్కిల్ ఏరియా, గిరిపురం, ఐజీఎంసీ స్టేడియం, ఫుడ్‌కోర్టు రోడ్డు, ఎంజీ రోడ్డు, పోలీస్ కమాండ్ కంట్రోల్ ఆఫీసు ఏరియా ఆర్టీఏ ఆఫీసు, వ్యాస్ కాంప్లెక్స్, సబ్ కలెక్టర్ కార్యాలయం, పున్నమ్మతోట, రైల్వే క్వార్టర్స్, పాస్‌పోర్టు ఆఫీస్, అమెరికన్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

స్క్యూ బ్రిడ్జి పరిధిలో..

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక స్క్యూ బ్రిడ్జి సమీపంలోని విద్యుత్ ఉపకేంద్రం, 11 కె.వి. ఎస్‌పీఎస్‌ఎస్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. కుర్రా సూర్యనారాయణవీధి, నారా చంద్రబాబునాయుడు కాలనీ, ఖన్నానగర్, మోడ్రన్ హెచ్‌టీ సర్వీస్, ఎస్‌బీఐ కాంప్లెక్స్, రాఘువనగర్, సీతారామనగర్, చెన్నుపాటి రామకోటయ్యవీధి, ఎయిర్‌టెల్ హెచ్‌టీ సర్వీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

నెరవేరిన భ్రమరాంబపురం వాసుల కల

- దశాబ్దాల సమస్యను పరిష్కరించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఇంటి స్థలాలు క్రమబద్ధీకరణకు జీవో నంబర్ 107 విడుదల చేసిన వైనం
- 1,200 స్థలాల్లో 2,500 మంది కుటుంబాలకు మేలు
- దేవినేని అవినాష్ చొరవ, సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ
- హర్షం వ్యక్తం చేస్తున్న డివిజన్ వాసులు



సీఎం వైఎస్ జగన్, అవినాష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న డివిజన్ వాసులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దశాబ్దాలుగా పాలకులు పట్టించుకోని సమస్యలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిష్కరించింది. వాటిలో ముఖ్యంగా కృష్ణలంక ప్రాంతంలో రెండు సమస్యలు పరిష్కారమయ్యాయి. ఒకటి కృష్ణానది రిటైనింగ్ వాల్ నిర్మాణం కాగా, మరొకటి భ్రమరాంబపురంలో 1200 ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం మార్చి 13వ తేదీన జీవో నంబర్ 107 విడుదల చేసింది. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించే నాయకులు ఉంటే ఎంతటి సమస్యకైనా పరిష్కారం లభిస్తుందనేందుకు ఇవే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. 10 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ చేయలేనివి, నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ దేవినేని అవినాష్ చేయగలిగారని ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. భ్రమరాంబపురంలో 1,200 ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణకు జీవో విడుదల చేయగా, 2,500ల కుటుంబాలు, దాదాపు 6 వేల మంది జనాభాకు లబ్ధి చేకూరినట్లయింది.

దశాబ్దాలుగా ఎదురుచూపులు..

కృష్ణలంక భ్రమరాంబపురంలో సుమారు 1960లో పలు జిల్లాల నుంచి వలస వచ్చిన వారు అక్కడ ఉన్న శ్మశాన స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. క్రమేణా నివాసాలు పెరుగుతూ వచ్చాయి. కొంతకాలం తర్వాత నాలుగు దశాబ్దాల కిందట ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి ప్రభుత్వం బి.ఫారమ్ పట్టాలను అందజేసింది. కొంత మందికి అవి కూడా అందలేదు. తమ ఇళ్ల స్థలాలను రెగ్యులరైజ్ చేయాలని భ్రమరాంబపురం ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. కానీ వారిని పట్టించుకున్న వారు లేరు. గద్దె రామ్మోహన్‌తో పాటు ఇతర నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా స్పందించలేదని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు.

అవినాష్ చొరవతో పరిష్కారం..

భ్రమరాంబపురంలో అవినాష్ పర్యటిస్తున్న సమయంలో ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణ విషయాన్ని పలువురు అవినాష్ దృష్టికి తీసుకువచ్చారు. 22వ డివిజన్‌లో సగం ఇదే సమస్య ఉన్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో 1,200 స్థలాల్లో దాదాపు 2,500 కుటుంబాల వరకూ నివశిస్తుండగా 6 వేలకు పైగా జనాభా ఉంటున్నారు. అంత మంది సమస్యను పరిష్కరించాలనే నిర్ణయానికి వచ్చిన అవినాష్ వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు విషయాన్ని తెలియజేశారు. స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యను వివరించారు. దీంతో రిటైనింగ్ వాల్ జాతికి అంకితం చేసే సభలో భ్రమరాంబపురం స్థలాలను క్రమబద్ధీకరిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడమే కాకుండా, రెండు రోజుల్లో జీవోను కూడా విడుదల చేశారు. చిత్తశుద్ధి గల వైఎస్ జగన్, దేవినేని అవినాష్‌ల కృషితో ఆ ప్రాంతంలో సమస్య పరిష్కారమైంది.

హామీని అమలు చేశాం..



ఈ ప్రాంతంలో అవినాష్ పర్యటించే సమయంలో పలువురు ఇంటి స్థలాల సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన అవినాష్ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. మూడు దశాబ్దాలుగా ఎంతో మంది నాయకులు హామీలు ఇచ్చారే కానీ నెరవేర్చలేదు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరించారు.

– తాటిపర్తి కొండారెడ్డి, కార్పొరేటర్, 22వ డివిజన్

చిత్తశుద్ధితో కృషి చేశారు..



మా ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించాలని మూడు దశాబ్దాలుగా కోరుతున్నాం. ఎంతో మంది నాయకులు వచ్చి హామీలు ఇచ్చారే కానీ నెరవేర్చలేదు. కానీ దేవినేని అవినాష్ ఇచ్చిన మాట ప్రకారం మా ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నుంచి జీవో ఇప్పించారు. మాట ఇస్తే నెరవేర్చే చిత్తశుద్ధి గల నాయకుడిగా నిరూపించుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

– ఎస్కే ఫజులుద్దీన్, భ్రమరాంబపురం

మా కల సాకారమైంది..



ఎన్నో దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మా ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ కల నేటికి నెరవేరింది. దేవినేని అవినాష్ చొరవ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపడంతో మా సమస్యకు పరిష్కారం లభించింది. సమస్యను పరిష్కరించాలనే చిత్తశుద్ధి గల నాయకులు ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం. గతంలో షో చేసే వారిని చూశాం. ఇప్పుడు పనిచేసే వారిని చూస్తున్నాం.

– పులి రమణారెడ్డి, భ్రమరాంబపురం

గద్దె అనుచరుడు నాగేంద్రను వెంటనే అరెస్ట్ చేయాలి

పటమట(విజయవాడ తూర్పు): తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసిన టీడీపీ నాయకుడు, గద్దె అనుచరుడు విజయ నాగేంద్రను వెంటనే అరెస్ట్ చేయాలని బాధితురాలు పటమట పోలీసులను వేడుకుంది. నిందితుడు విజయనాగేంద్రపై బాధితురాలు ఈనెల 21వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు పురోగతిని తెలుసుకునేందుకు ఆమె మంగళవారం పటమట పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. విజయవాడ తూర్పు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ అనుచరుడిగా ఉన్న విజయనాగేంద్ర ఈ కేసులో రాజకీయ పలుబడి ఉపయోగిస్తున్నట్లు తెలిపింది. రెండేళ్లుగా తనను శారీరక వేధింపులకు గురిచేస్తున్న విజయ నాగేంద్రను కేసు నుంచి తప్పించేందుకు టీడీపీ నాయకులు కృషి చేస్తున్నారని వివరించింది. నిందితుడు విజయనాగేంద్ర పలువురు మహిళలను లోబరుచుకుని వారిని వ్యభిచార రొంపిలోకి దింపినట్లు, వ్యభిచారం చేయాలని తనను ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపింది. తన పిల్లలను సైతం గంజాయి కేసులో ఇరికిస్తానని బెదిరించినట్లు వాపోయింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ మోహనరెడ్డి మీడియాకు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేసిన దీవెన ఫౌండేషన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్న యువతికి వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేసింది. చిట్టినగర్ కలరా హాస్పిటల్ వద్ద నివసిస్తున్న గౌరీ ప్రియాంక(18) డిగ్రీ చదువుతుంది. తండ్రి మరణించడంతో తల్లి రెక్కల కష్టంపై కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో గౌరీ ప్రియాంక అనారోగ్యం కారణంగా గత కొన్ని నెలల నుంచి బాధపడుతూ చికిత్స చేయించుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులు దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించటంతో మంగళవారం ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు వన్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ గోపరాజు, కానిస్టేబుల్ బాలరాజు బాధితురాలి ఇంటికి వెళ్లి తమ వంతు సాయంగా రూ.10 వేలు చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబసభ్యులు దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఘనంగా వరల్డ్ బుక్ డే

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నేటితరం యువత పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని పీబీ సిద్ధార్థ కళాశాల గ్రంథాలయాధికారి వాణిశ్రీ చెప్పారు. వరల్డ్ బుక్ డే సందర్భంగా కళాశాల బుక్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఆవరణలోని గ్రంథాలయంలో పుస్తక సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఏప్రిల్ 23వ తేదీన వరల్డ్ బుక్ అండ్ కాపిరైట్ డే నిర్వహించాలని 1995వ సంవత్సరంలో పారిస్‌లో జరిగిన సమావేశంలో యునెస్కో నిర్ణయించిందన్నారు. విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు తమ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో తరచూ పుస్తక సమీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. హాఫ్ గర్ల్ ఫ్రెండ్, 12 ఫెయిల్ పుస్తకాలను విద్యార్థులు పూరబ్, మోహన, నసీరుద్దీన్, రేవతి సమీక్షించారు. బుక్ క్లబ్ ఇన్‌చార్జి రాజేశ్వరి మాట్లాడుతూ మంచి పుస్తకాలను చదివి వాటి గురించి స్నేహితులకు చెప్పడం అలవాటు చేసుకోవాలన్నారు. పాఠ్యపుస్తకాలతో పాటుగా గ్రంథాలయంలోని పుస్తకాలను చదవడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తక సమీక్ష చేసిన విద్యార్థులకు బహుమతులుగా పుస్తకాలను అందజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలతో గ్రంథాలయాధికారి వాణిశ్రీ, అధ్యాపకులు

సంకల్పానికి శారీరక వైకల్యం అడ్డుకాదు



స్మార్ట్ గ్లాసెస్ అందుకున్న విద్యార్థులతో జయిత, అజయ్ సింగ్ తదితరులు

గుణదల(విజయవాడతూర్పు): జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే సంకల్పం ఉంటే శారీరక వైకల్యాన్ని అధిగమించి అభివృద్ధి సాధించవచ్చని ఎస్‌ఐఐఎఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జయిత సహా అన్నారు. ఆంధ్రా లయోల కళాశాలలో అంధ విద్యార్థులకు స్మార్ట్ గ్లాసెస్ పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో వస్తున్న సాంకేతికత ద్వారా అంధ విద్యార్థులకు కావలసిన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సౌండ్ కంప్యూటర్, బ్రెయిలీ సిస్టమ్స్, స్మార్ట్ గ్లాసెస్ అంధులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయని తెలిపారు. అంధ విద్యార్థులను ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు లయోల కళాశాల చేస్తున్న కృషిని అభినందించారు. 10 మంది అంధ విద్యార్థులకు స్మార్ట్ గ్లాసెస్ పంపిణీ చేశారు. కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి సహాయ భాస్కరన్ పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉపకార వేతనాలు

పెనమలూరు: వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఈ విద్యా సంవత్సరం నుంచి సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీగా మార్పు చెందిందని సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం బీటెక్ కోర్సులో ప్రవేశించే వారికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రవేశ పరీక్షలు నిర్వహించామన్నారు. వాటి ఫలితాలు విడుదల చేస్తూ ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తూ ప్రవేశాలు ప్రారంభించామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అట్లూరి వెంకట రత్నప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించిన సిద్ధార్థ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌కు(ఎస్ఇఇ-24) విశేష స్పందన లభించిందన్నారు. ప్రతిభ చూపిన 500 మంది విద్యార్థులకు 15 శాతం నుంచి 100 శాతం ఉపకార వేతనాలు ఇస్తామన్నారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విఆర్‌సిద్ధార్థ.ఎసి.ఇన్‌లో చూడాలన్నారు. కన్వీనర్ మలినేని రాజయ్య, డీన్ బావినేని పాండు రంగారావు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ఫలితాలు ప్రకటిస్తున్న పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, కన్వీనర్ రాజయ్య

తూర్పులో నాలుగు నామినేషన్లు దాఖలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గంలో మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. సుమ సుదర్శన, మాటబలిమి భార్గవ్‌లు ఇండిపెండెంట్‌లుగా, గంగిరెడ్డి వెంకటరెడ్డి స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ పార్టీ తరఫున, ఎస్.ఎన్.వరప్రసాద్‌బాబు దాస్యం జనవాహిని పార్టీ తరఫున నామినేషన్లు దాఖలు చేశారు.





భానుడి భగభగలు

జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. దీంతో నగర వాసులు గొడుగులు, కర్చీఫ్‌లు, టోపీలు వంటి రక్షణ చర్యలు తీసుకుని రాకపోకలు సాగిస్తున్న దృశ్యాలను సాక్షి కెమెరా మంగళవారం క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో క్రీడాకారుల సత్తా

విజయవాడస్పోర్ట్స్: ఈ నెల 20, 21 తేదీల్లో కానూరులో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో విజయవాడ ఎస్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించి సత్తా చాటారు. అండర్–17 విభాగంలో కె.సుప్రీత్ గోల్డ్ మెడల్ సాధించగా, అండర్–7 విభాగంలో గోకుల్‌నందన్‌రెడ్డి సిల్వర్, కె.సురార్చిత్ నాల్గవ స్థానాన్ని, అండర్–9 విభాగంలో బి.శ్రీవశిష్ట సిల్వర్, అండర్–11 విభాగంలో ఎ.సుహాస్ సిల్వర్, జె.లాలస బ్రాంజ్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అకాడమీ డైరెక్టర్ పి.రేణుక, చీఫ్ కోచ్ ఎం.ఎం.ఫణికుమార్ అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.


సభకు హాజరైన అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం జగన్


సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో అక్కచెల్లెమ్మలు

మీ డ్రీమ్సే నా స్కీమ్స్

ప్రజలందరి కలలు మన సంక్షేమ పథకాలతో సాకారం

విజయనగరం జిల్లా చెల్లూరు మేమంతా సిద్ధం సభలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ''డ్రీమ్స్ మీవి.. స్కీమ్స్ మీ బిడ్డ జగన్‌వి! ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం కలలను నెరవేరుస్తూ విప్లవాత్మక పథకాలు, వ్యవస్థలు తీసుకొచ్చాం. 58 నెలల పాలనలో మీ అందరి కలలను నెరవేర్చిన ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి 175 అసెంబ్లీ స్థానాలు, 25 లోక్‌సభ స్థానాల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కాలి'' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం విజయనగరం జిల్లా చెల్లూరు వద్ద నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు.

'చెల్లూరు సభ జనసముద్రాన్ని తలపిస్తోంది. ఒక్కసారిగా లక్షల మంది తాండ్ర పాపారాయుళ్లు శత్రుసైన్యాన్ని చిత్తుగా ఓడించేందుకు సిద్ధమైతే, ఆ యుద్ధం ఎలా ఉంటుందో పేదల వ్యతిరేకులకు రుచి చూపించడానికి నా ఉత్తరాంధ్ర, నా విజయనగరం సిద్ధం సిద్ధం అని అడుగులు వేస్తోంది. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కావు. ఇంటింటి భవిష్యత్తును, తమకు అందుతున్న పథకాలను, ఇంటికే వచ్చే పౌర సేవలను, తమ పిల్లల భవిష్యత్తును రాబోయే ఐదేళ్లు కాపాడుకోవాల్సిన అవసరాన్ని ప్రజలంతా గుర్తించారు. వారికి అడ్డుతగులుతున్న ఆ పెత్తందార్లకు, ఆ కౌరవ సైన్యానికి, ఆ నారా సైన్యానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధం సిద్ధం అని అడుగులు వేస్తున్న ప్రజాసైన్యం ఈ రోజు నా కళ్ల ఎదుట కనిపిస్తోంది. చంద్రబాబుకు కాంగ్రెస్, బీజేపీ పరోక్షంగా, ప్రత్యక్షంగా మద్దతిస్తున్నాయి. ఇదే బాబుకు తోడుగా దత్తపుత్రుడున్నా, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 ఉన్నాయి. వాళ్లు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, అబద్ధాలు కళ్ల ఎదుటే కనిపిస్తున్నాయి. ఒక్క జగన్ మీదకు ఇంతమంది ఏకమవుతున్నారు. జగన్ కనుక ఇంటింటికీ మంచి చేయకపోయి ఉంటే, జగన్‌ను ప్రతీ ఇంట్లోనూ తమ బిడ్డగా, తమ అన్నగా, తమ్ముడిగా భావించకపోతే ఇన్ని తోడేళ్లు ఏకం కావాల్సిన అవసరం ఏముంది? జగన్ ఒకే ఒక్కడు కాదు. నాకున్న ధైర్యం మీరే అని సగర్వంగా చెబుతున్నా. 58 నెలల పాలనలో ఇంటింటికీ చేసిన మంచి నా నమ్మకం. ప్రతీ వర్గాన్ని మోసం చేసిన వారితో ఈరోజు ఎన్నికల కురుక్షేత్రంలో తలపడుతున్నాం. జగన్‌ను ఓడించాలని వారు, పేదల్ని గెలిపించి ఇంటింటి అభివృద్ధిని కొనసాగించాలని మనం చేయబోతున్న ఈ యుద్ధంలో మరో చారిత్రక విజయాన్ని సొంతం చేసుకునేదానికి మీరంతా సిద్ధమేనా? ప్రజల కలల్ని తన మోసాలతో వంచించడమే పనిగా పెట్టుకున్న చంద్రబాబుకు, ఆ బాబు కూటమికి బుద్ధి చెప్పేందుకు మీరంతా సిద్ధమేనా?

420.. చంద్రముఖి బృందం

వస్తువులు ఎత్తుకుపోయేవారని దొంగల ముఠా అంటాం. బెదిరించి దోచుకునే వారిని దోపిడీ ముఠా అంటాం. మరి ఎన్నికలప్పుడు నమ్మించి ఆ ప్రజలు ఇచ్చిన అధికారంతో ఐదేళ్లూ మోసం చేసిన చరిత్ర ఉన్న కూటమిని ఏమనాలి? తియ్యటి మాటలు మేనిఫెస్టోలో చెప్పి ఎన్నికలు అయిపోయిన తరువాత ప్రజల్ని మోసం చేసేవారిని ఏమంటాం? 420 అనే కదా అంటారు. పేదల కలల్ని, బతుకుల్ని బలిపెట్టి దోచుకునేందుకు వచ్చిన ఈ రాజకీయ కూటమిని చంద్రముఖి బృందం అని కూడా అంటాం.


విజయనగరం జిల్లా చెల్లూరు మేమంతా సిద్ధం సభకు హాజరైన భారీ జనసందోహానికి ర్యాంప్ చివరివరకూ వచ్చి అభివాదం చేస్తున్న సీఎం జగన్

ఏకంగా 40 పథకాలు..

ఏ మనిషికైనా, ఏ కుటుంబానికైనా కొన్ని కలలు, లక్ష్యాలు ఉంటాయి. వాటిని నిజం చేసే మార్గాలు ఉంటే ఆ కుటుంబం ఒక్కో మెట్టు ఎదుగుతూ పోతుంది. అలాంటి పేదల కలల్ని అర్థం చేసుకుని నెరవేర్చేందుకు మీ బిడ్డ పెట్టిన స్కీమ్స్ ఎన్నో తెలుసా? దాదాపుగా 40. ఈ 58 నెలల కాలంలో వాటిని నెరవేర్చేందుకు మీ బిడ్డ ఏకంగా 130 సార్లు బటన్లు నొక్కాడు. ఏకంగా రూ. 2.70 లక్షల కోట్లు నేరుగా అందజేశాడు. నేరుగా నా అక్క చెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లాయి. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. దీనికి తోడు నాన్ డీబీటీ అంటే ఇళ్లస్థలాలు, విద్యాకానుక, టాబ్స్... ఇవన్నీ కలిపి మరో రూ.లక్ష కోట్లకుపైగా ప్రయోజనాన్ని చేకూర్చాం. ఇలా వాళ్ల డ్రీమ్స్.. మీ బిడ్డ స్కీమ్స్ ద్వారా ఏకంగా రూ. 3.75 లక్షల కోట్లు పై చిలుకు లబ్ధి చేకూర్చాడని చెప్పడానికి గర్వపడుతున్నా.

చంద్రబాబు అంటే చంద్రముఖి...

తల్లుల కలలు, బాధల గురించి 14 ఏళ్లు పాలించానని చెప్పుకునే చంద్రబాబు ఏరోజైనా ఆలోచన చేశాడా? ఆయనకు ఆ ఆలోచన ఎందుకు రాలేదంటే కారణం.. చంద్రబాబు అంటే చంద్రముఖి కాబట్టి. పేదలకు మంచి చేయడం కోసం కాకుండా పేదల రక్తం తాగేందుకు లకలకా అని తపిస్తాడు.

కలలను నెరవేర్చిన స్కీములు...

ఏ అక్కచెల్లెమ్మ అయినా ఆత్మగౌరవంతో బతకాలని కోరుకుంటుంది. పిల్లలకు మంచి చదువులు చెప్పించాలని, కుటుంబం మరింత బాగుండేలా రెండు మెట్లు ఎదగాలని కలగంటుంది. చంద్రబాబు మాటలు నమ్మి 2014 నుంచి 2019 మధ్య కుదేలయిపోయిన పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల సాధికారత, మళ్లీ వాళ్లను తమ కాళ్ల మీద తమను నిలబెట్టేందుకు వారి డ్రీమ్స్‌ను సాకారం చేస్తూ వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాలు పుట్టాయి. 45 – 60 సంవత్సరాల వయసున్న నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు తోడుగా ఉంటూ ఆత్మగౌరవంతో జీవించేలా చేసేందుకు పుట్టింది వైఎస్సార్ చేయూత పథకం. నా కాపు అక్కచెల్లెమ్మల కోసం తెచ్చిన మరో పథకం వైఎస్సార్ కాపు నేస్తం. ఈబీసీ అక్కచెల్లెమ్మల కోసం వైఎస్సార్ ఈబీసీ నేస్తం అనే పథకం. తెచ్చాం. చంద్రబాబు హయాంలో ఏరోజూ ఇలాంటి స్కీములు ఎందుకు లేవు? నాడు ఉన్నదల్లా అక్కచెల్లెమ్మలను మోసం చేయడం, రక్తాన్ని పీల్చే ఒక చంద్రముఖి పాలన మాత్రమే.


సభలో స్తంభం ఎక్కి సీఎం జగన్ ఫొటో తీస్తున్న వృద్ధుడు

అక్కచెల్లెమ్మల సొంతింటి కల...

తమకు సొంత ఇల్లు ఉండాలని ప్రతి అక్కచెల్లెమ్మ కల కంటుంది. కొన్ని కుటుంబాలకు ఇది జీవితకాల కల లాంటిది. వారి డ్రీమ్‌ను నెరవేరుస్తూ 31 లక్షల ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి మీ బిడ్డ జగన్ ఇచ్చాడు. అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాం.

భావోద్వేగానికి గురైన మంత్రి బొత్స...

చీపురుపల్లి అభ్యర్థిగా మంత్రి బొత్స సత్యనారాయణను సీఎం జగన్ పరిచయం చేసిన సందర్భంలో ఉద్వేగ వాతావరణం నెలకొంది. బొత్స తనకు తండ్రి లాంటివారని, ఆయన్ను ఆప్యాయంగా అన్నా అని పిలుస్తానని సీఎం జగన్ చెప్పడంతో బొత్స భావోద్వేగానికి గురయ్యారు.

అవ్వాతాతలు.. రైతుల కలలు నెరవేర్చాం

- అవ్వా తాతల డ్రీమ్ ఏమిటో తెలుసా? బాబు హయాంలో మాదిరిగా పెన్షన్ల కోసం క్యూలో నిలబడి తమ ప్రాణాలు అక్కడికక్కడే పోయే పరిస్థితి రాకూడదన్నది వారి డ్రీమ్. ఆ పెన్షన్ సొమ్ము కాస్తంత పెంచి ఇస్తే బాగుంటుందన్నది డ్రీమ్. వారి మనవడు జగన్ తెచ్చిన స్కీమ్ ఏమిటంటే అవ్వాతాతల ఆత్మ గౌరవాన్ని నిలబెడుతూ వలంటీర్లు నేరుగా ఇంటికి వచ్చి రూ.3 వేల పెన్షన్ ఇవ్వడం. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. నాడు చంద్రబాబు ముష్టి వేసినట్లు రూ.వెయ్యి రాష్ట్రంలో 39 లక్షల మందికి మాత్రమే ఇచ్చారు.
- మీ బిడ్డ వచ్చాక ఇంటివద్దే నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నాడు. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా 58 నెలల కాలంలో 2.31 లక్షల ఉద్యోగాలు యువతకు ఇచ్చి వారి కలను సాకారం చేశాం. రైతన్నలు కోరుకున్నట్లుగా పంట వేసే సమయానికి పెట్టుబడి సాయం, సమయానికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు గ్రామంలోనే అందచేస్తున్నాం. అమూల్‌ను తెచ్చి పాడి రైతులకు అండగా నిలిచాం. ఏకంగా 35 లక్షల ఎకరాల భూముల మీద రైతులకు పూర్తి హక్కులు ఇచ్చిందీ మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతే. మరి రైతుల గురించి చంద్రబాబు ఏరోజైనా ఆలోచించాడా? నాడూ నేడూ ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్. కానీ చంద్రబాబు హయాంలో డీబీటీలు, బటన్లు నొక్కడం లేవు. మీ పొలాలలో పెట్టే దిష్టిబొమ్మనైనా నమ్మొచ్చేమో గానీ చంద్రబాబును మాత్రం నమ్మలేమని గుర్తు పెట్టుకోండి. విజయవాడలో కాల్‌మనీ, సెక్స్ రాకెట్లు నడపటం మినహా బాబు చేసిందేమిటి? మళ్లీ ప్రజల రక్తం తాగడానికి చంద్రముఖిలా మారాడు. జనానికి మంచి చేసిన మీ జగన్‌పై తోడేళ్లలా దాడి చేస్తున్నారు. మన 58 నెలల పాలనలో జరిగిన మేలుపై మీ కుటుంబమంతా చర్చించుకోవాలి. పిల్లలు, సంక్షేమ పథకాల భవిష్యత్తు గురించి ఆలోచించాలి


కొప్పెరలో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

విద్యా విప్లవం..

ప్రతి నిరుపేద తల్లి కలను నిజం చేయడానికే పుట్టింది జగనన్న అమ్మఒడి పథకం. పేద తల్లులు తన పిల్లల భవిష్యత్తు కోసం కనే కలలు గురించి అర్థం చేసుకున్నాను. తమ పిల్లల్ని డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఐఏఎస్‌లుగా, ఐపీఎస్‌లుగా, పెద్ద కంపెనీల్లో ఉద్యోగస్తులుగా చూడాలని, ఉన్నత చదువులు చదివించాలన్న కలల నుంచి పుట్టిన స్కీములతో నాడు - నేడు, ఇంగ్లిష్ మీడియం బడులు, సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం చేశాం. 3వ తరగతి నుంచి గవర్నమెంట్ బడుల్లో టోఫెల్ శిక్షణ, సబ్జెక్టు టీచర్లు, బైజూస్ కంటెంట్, 6వ తరగతి నుంచి డిజిటల్ బోధన, క్లాస్ రూముల్లో ఐఎఫ్‌పీ ప్యానళ్లతో డిజిటల్ బోధన, 8వ తరగతికి పిల్లల చేతుల్లో ట్యాబులు పెట్టాం. పెద్ద చదువులు చదువుతున్న 93 శాతం మందికి ఈ రోజు విద్యాదీవెనతో లబ్ధి చేకూరుతోంది. డిగ్రీ కరిక్యులమ్‌లో మార్పులు తీసుకొస్తూ, విదేశీ విశ్వవిద్యాలయాల్లో సర్టిఫైడ్ ఆన్ లైన్ వర్టికల్స్‌ను మన డిగ్రీలతో అనుసంధానం చేయడం, డిగ్రీలో తప్పనిసరి ఇంటర్న్‌షిప్ తెచ్చాం. ఇవన్నీ నా అక్కచెల్లెమ్మలు, ఆ పిల్లల డ్రీమ్స్ నుంచి వచ్చిన మీ జగనన్న స్కీమ్స్.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి...

విజయనగరం పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు పరిచయం చేశారు. ఎంపీ అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం అసెంబ్లీ అభ్యర్థిగా కోలగట్ల వీరభద్రస్వామి, బొబ్బిలి అసెంబ్లీ అభ్యర్థిగా శంబంగి చిన అప్పలనాయుడు,. నెల్లిమర్ల అసెంబ్లీ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, రాజాం నుంచి పోటీచేస్తున్న డాక్టరు తలే రాజేష్, గజపతినగరం నుంచి పోటీచేస్తున్న బొత్స అప్పలనరసయ్య, ఎచ్చెర్ల నుంచి పోటీచేస్తున్న గొర్లె కిరణ్‌ను గొప్ప మెజార్టీతో ఆశీర్వదించాలని కోరారు.




2014లో 'చంద్రముఖి' మోసాలివీ..

- రైతులకు రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ జరిగిందా?
- పొదుపు సంఘాల రుణాలు పూర్తిగా రూ.14,205 కోట్లు మాఫీ చేస్తామని చెప్పి కనీసం ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా?
- ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేస్తామన్నాడు. ఎవరికైనా ఒక్క రూపాయి డిపాజిట్ చేశారా?
- ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లలో అంటే 60 నెలల పాటు నెలకు రూ.రెండు వేలు చొప్పున ప్రతి ఇంటికి రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు ఇస్తామన్నారు. ఏ పేదవాడికైనా ఒక్కటంటే ఒక్క సెంటు స్థలం ఇచ్చాడా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అన్నాడు. చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. మరి అయ్యాయా?
- మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మరి చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు.. చేశాడా?
- ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి నిర్మించాడా? విజయనగరంలో ఏమైనా కనిపిస్తోందా?
- పోనీ ప్రత్యేక హోదా తెచ్చాడా అంటే అదీ లేదు.
- ఇప్పుడు సూపర్ సిక్స్, సెవెన్, ఇంటింటికీ కేజీ బంగారం, బెంజి కార్ అంటూ మళ్లీ మోసాలకు తయారయ్యారు.


రణస్థలంలో సీఎం జగన్‌ను చూసేందుకు వచ్చిన భారీ జనసందోహం

విశాఖ స్టీల్‌పై కూటమి వైఖరి చెప్పాలి

- ఎన్నికల కోసం పొత్తులు పెట్టుకుని రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి
- ఈ విషయంలో వైఎస్సార్‌సీపీది ఒకటే వైఖరి
- ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం
- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి నేతలతో సీఎం జగన్


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పోరాట కమిటీ నాయకులు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు తమ వైఖరి స్పష్టం చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎండాడలో 21వ రోజు 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి (కార్మిక సంఘం) నాయకులు మంగళవారం ముఖ్యమంత్రిని కలిసి విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలపై నివేదించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ వారితో మాట్లాడుతూ.. 'విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు మద్దతుగా నిలుస్తుంది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికుల తరపున మొట్టమొదట గళమెత్తిందే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. అదే విధంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ సమస్యకు పరిష్కారాలను ప్రతిపాదిస్తూ తాను స్వయంగా ప్రధానికి లేఖ రాశాను'.. అని గుర్తుచేశారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం కూడా చేసిందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీది రాజీలేని ధోరణి అని జగన్ స్పష్టం చేశారు. ఇనుప ఖనిజం గనులను శాశ్వతంగా కేటాయించడంవల్ల ప్లాంట్ పరిస్థితి మెరుగుపడుతుందని, ప్లాంట్ పునరుద్ధరణకు తాము శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తున్నామని ఆయన కార్మికులకు చెప్పారు. ఈ ఎన్నికల్లో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మికుల మద్దతును కోరే నైతికత వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని, ఎందుకంటే మా పార్టీ మాత్రమే కార్మికులకు అండగా నిలిచిందన్నారు. ఈ అంశంపై టీడీపీ, బీజేపీ రెండూ విభిన్న నిర్ణయాలు ప్రకటించాయని, ఎన్నికల కోసం పొత్తు పెట్టుకున్న కూటమి పార్టీలు ఈ విషయంపై తమ నిర్ణయాన్ని స్పష్టంచేయకుండా రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని సీఎం జగన్ మండిపడ్డారు. కూటమిగా ఏర్పడిన టీడీపీ-జనసేన-బీజేపీ స్టీల్‌ప్లాంట్ విషయంలో తమ నైతికతను, విలువలు మరిచాయని విమర్శించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో పోరాట కమిటీ నాయకులు సీహెచ్. నర్సింగరావు, డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వై. మస్తానప్ప ఉన్నారు.

నేడు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఇలా..

- ఉదయం 9 గంటలకు అక్కివలస నుంచి యాత్ర ప్రారంభం
- పరశురాంపురం జంక్షన్ వద్ద భోజన విరామం
- సాయంత్రం టెక్కలి వద్ద బహిరంగ సభ



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర 22వ రోజైన బుధవారం(ఏప్రిల్ 24) షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం మంగళవారం విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా సీఎం జగన్ మంగళవారం రాత్రి బస చేసిన అక్కివలస నుంచి బుధవారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. ఎచ్చెర్ల బైపాస్, శ్రీకాకుళం బైపాస్, నరసన్నపేట బైపాస్, కోటబొమ్మాళి, కన్నెవలస మీదుగా పరశురాంపురం జంక్షన్ వద్దకు చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం కె.కొత్తూరు మీదుగా టెక్కలి వద్దకు చేరుకొని.. 3 గంటలకు అక్కడ నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని సీఎం జగన్ ప్రసంగిస్తారు.

క్లుప్తంగా...

టీడీపీ నేత కోమటి జయరాంపై ఈసీ ఆగ్రహం

కుటుంబానికి రూ.2 లక్షలు లేదా రూ.3 లక్షలు ఇచ్చి ఓట్లు కొనుగోలు చేయాలని చేసిన వ్యాఖ్యలపై కన్నెర్ర

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన ఓటర్లను వెధవలంటూ దూషిస్తూ.. ఆ కుటుంబాలను రూ.2 లక్షలు లేదా రూ.3 లక్షలు ఇచ్చి కొనుగోలు చేసి, టీడీపీ వైపునకు తిప్పాలని టీడీపీ ఎన్నారై విభాగం అధ్యక్షుడు కోమటి జయరాం పిలుపునివ్వడంపై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల నియమావళిని ఆయన ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ వ్యవహారంపై 24 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని గుంటూరు జిల్లా కలెక్టర్, ఆ జిల్లా ఎన్నికల అధికారిని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ఈ నెల 16న మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎన్నారైలతో కోమటి జయరాం సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన ఓటర్లను వెధవలంటూ దూషించారు. గ్రామాలకు వెళ్లి.. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల కుటుంబాలను కలిసి రూ.2 లక్షలు లేదా రూ.3 లక్షలు ఇచ్చి వారిని టీడీపీ వైపునకు మళ్లించాలని ఎన్నారైలకు పిలుపునిచ్చారు. ఒక్కో నియోజకవర్గంలో కనీసం వెయ్యి కుటుంబాలను ఇలా టీడీపీ వైపునకు మళ్లించాలని కోరారు. కోమటి జయరాం మాట్లాడిన వీడియో ఈ నెల 20న వెలుగుచూసింది. ఈ వ్యవహారంపై ఈ నెల 21న వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన కోమటి జయరాం, వేమూరు రవికుమార్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేపట్టండి

కలెక్టర్లకు సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహించేందుకు ప్రస్తుతం మంచి అనుకూల సమయమని, ఈ నేపథ్యంలో అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి పనులు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డాక్టర్ కేఎస్.జవహర్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో తాగునీరు, ఉపాధి హామీ పనులు, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా పరిస్థితులపై మంగళవారం సీఎస్ తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ ఉపాధి పనులు నిర్వహించిన కూలీలకు సకాలంలో కూలి సొమ్ము చెల్లించాలని చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి, నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా విడుదల చేసిన నీటితో సకాలంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపాలని ఆదేశించారు.రాష్ట్ర జల వనరులు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్ బాబు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఈఎన్సీ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పోలీస్ అధికారులు బదిలీ

ఇంటెలిజెన్స్ చీఫ్, విజయవాడ సీపీని బదిలీ చేస్తూ ఈసీ ఆదేశాలు

సాక్షి, అమరావతి: ఇద్దరు పోలీసు అధికారులను బదిలీ చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీ పి.సీతారామాంజనేయులు, విజయవాడ పోలీస్ కమిషనర్(సీపీ) కాంతి రాణా టాటాను బదిలీ చేసిన ఈసీ.. వెంటనే ఆ బాధ్యతలను తదుపరి అధికారులకు అప్పగించి రిలీవ్ కావాలని వారిని ఆదేశించింది. వీరిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశాల్లో పేర్కొంది. బదిలీ అయిన ఇద్దరు అధికారుల స్థానంలో కొత్త వారిని నియమించేందుకు ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా ఒక్కో పోస్టుకు మూడేసి పేర్లతో కూడిన ప్యానల్‌ను పంపించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్.జవహర్‌రెడ్డిని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

మెగా డీఎస్సీ ప్రకటన దగా

సాక్షి, అమరావతి: 'నాకు ఓ యువతి పెన్ను ఇచ్చింది. అధికారంలోకి రాగానే ఈ పెన్నుతోనే మెగా డీఎస్సీపై తొలి సంతకం పెడతా..' అంటూ తెలుగుదేశం అధ్యక్షుడు సోమవారం చంద్రబాబు చెప్పడం దగా మాటలేనని వైఎస్సార్‌సీపీ నేత వాసిరెడ్డి పద్మ విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 2014–19 మధ్య ఇలాంటి పెన్ను లేకనే డీఎస్సీ ద్వారా రిక్రూట్‌మెంట్ చేయలేదా అని నిలదీశారు. ఇంకా ఆమె ఏమన్నారంటే.. ఆనాడు మీరు డీఎస్సీ మీరు ప్రకటించి తప్పించుకుంటే మీరు చేయాల్సిన పనిని అంటే 7,524 పోస్టులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక భర్తీచేశారు. 2018లో డీఎస్సీ పోస్టులను చంద్రబాబు ఇవ్వలేదు. 1998 నుంచి పెండింగ్‌లో ఉన్న పోస్టులతో సహా అధికారంలోకి వచ్చాక 14,219 పోస్టులను సీఎం జగన్ భర్తీ చేశారు. మీ హయాంలో సున్నా చుట్టారు. మీ హయాంలో ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయకుండా ఈవాళ దొంగమాటలతో అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ అంటూ మాట్లాడటానికి సిగ్గుందా? ఈ రోజు సీఎం జగన్ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నాడు–నేడు ద్వారా వేలాదికోట్ల రూపాయలు వెచ్చించి కార్పొరేట్ స్కూల్స్‌లాగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దారు. సబ్జెక్టులవారీ టీచర్లను నియమించారు. ఎక్కడా ఉపాధ్యాయుల ఖాళీలు లేకుండా రిక్రూట్ చేశారు. చంద్రబాబు ఎన్ని వేషాలు వేసినా ప్రజలు నమ్మరు. బాబు నమ్ముకున్న పవన్‌ను కూడా ప్రజలు నమ్మడం లేదు.

ఇక్కడ డీల్ కుదిరింది.. అక్కడ వేలు తెగింది

ఢిల్లీలో కోపూరి లక్ష్మి డ్రామా వెనుక టీడీపీ భారీ స్క్రిప్ట్

బూర్ల రామాంజనేయులు, ఆనందబాబుతో కలిసి టీడీపీలో పని చేస్తున్న లక్ష్మి

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ గుంటూరు రూరల్ : ఈ చిత్రం చూశారుగా.. సోమవారం ఢిల్లీలో వేలు కోసుకొని హడావుడి చేసిన గుంటూరు స్వర్ణభారతి నగర్‌కు చెందిన కోపూరి లక్ష్మి టీడీపీ నేత బూర్ల రామాంజనేయులుతో ఉన్న చిత్రమిది. కొన్నేళ్లుగా తాడేపల్లిలో ఉంటున్న లక్ష్మి ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, వేమూరు టీడీపీ అభ్యర్థి నక్కా ఆనందబాబుతో కలిసి ఆ పార్టీలో పనిచేస్తోంది. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఆ పార్టీకి చెందిన వ్యక్తిగా 2014 నుంచి 2017 మధ్య గుంటూరు, పరిసర ప్రాంతాల్లో చాలా భూ దందాలు, ఫోర్జరీ పత్రాలతో వేరొకరి స్థలాలు అమ్మేయడాలు, కేసులు పెట్టిన వారిపై అనుచరులతో కలిసి దాడులు చేయడంలో పేరొందిన 'ఆదర్శ' మహిళ. ఢిల్లీ డ్రామాలో నాయిక. లక్ష్మి తల్లి, తండ్రిది కూడా భూ దందాల చరిత్రే. ఆమె తండ్రి కూడా చేతులు కోసుకొని, కళ్లు పొడుచుకొని అధికారులను బెదిరించి, పనులు చేయించుకొనే వాడు. వారి మరణానంతరం వారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొంది. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో గుంటూరు, పరిసర ప్రాంతాల్లో లక్ష్మి చేసిన దందాలు అన్నీ ఇన్నీ కావు. ఆమెపై గుంటూరులో పలు కేసులు కూడా నమోదయ్యాయి. దీంతో ఆమె తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసుల నుంచి బయట పడేందుకు ఆ పార్టీలో చేరింది. ఆమె కోరుకున్నట్లుగానే కేసులు, దర్యాప్తులు ఆగాయి. ఇప్పుడు ఇదే కోపూరి లక్ష్మిని పావుగా వాడుకొని వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత నేతలపై ఆరోపణలు చేయించి, తద్వారా ఎన్నికల్లో ఎంతో కొంత లబ్ధి పొందాలన్న చవకబారు ఆలోచనతో టీడీపీ భారీ పథకమే రచించింది. భూ అక్రమాలకు పాల్పడిన ఆమె చేతే, వేరే వారెవరో అక్రమాలు చేస్తుంటే అడ్డుకొన్నానంటూ చెప్పించడం వెనుక ఎల్లో స్క్రిప్టు ఉందన్న విషయం ఆమె ఢిల్లీ వెళ్లి ఆడిన డ్రామాలోనే తేటతెల్లమైంది.



ప్రత్తిపాడు తెలుగుదేశం అభ్యర్థి బూర్ల రామాంజనేయులుతో కోపూరి లక్ష్మి

కేసుల ఎత్తివేత హామీ, ప్రలోభాలు

ఎవరైనా తనపై దాడులు జరిగినా, వేధింపులకు గురిచేసినా ముందుగా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. తనను కొంతమంది వేధిస్తున్నారంటూ ఆరేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వంలోనే కేసులు పెట్టింది. తర్వాత గుంటూరు నుంచి తాడేపల్లి వెళ్లిపోయింది. ఇటీవలి కాలంలో ఆమెపై ఎప్పుడు దాడులు జరిగాయి, వాటిని ఎవరు చేశారో తెలియదు. ఆమె ఫిర్యాదు కూడా చేయలేదు. ఢిల్లీలో విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో కూడా 2018 నాటి కేసుల గురించే ప్రస్తావించింది. టీడీపీ నేతల అండ, ఆర్థిక సహకారంతో ఏకంగా ఢిల్లీ వెళ్లి, తనపై వైఎస్సార్‌సీపీ నేతల దాడులంటూ ఆరోపణలకు దిగింది. ఇందుకు చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ నేతలు పెద్ద స్క్రిప్టే తయారు చేశారు. ఆమెతో భారీ డీల్ కుదుర్చుకున్నారు. ఆమెపై ఉన్న కేసులు ఎత్తేస్తామని, ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామంటూ ప్రలోభాలకు గురి చేశారు. ఈ డీల్ కుదిరిన వెంటనే ఆమె ఢిల్లీ వెళ్లి, ఎల్లో స్క్రిప్టు ప్రకారం వైఎస్సార్‌సీపీ నేతలపై ఆరోపణలు చేసి, వేలు కోసుకొన్నానని చెప్పి డ్రామాను రక్తికట్టించే ప్రయత్నం చేసింది. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. టీడీపీ పెద్దల అండ లేనిదే ఆమె ఇంత దూరం వెళ్లదన్న విషయం ఇక్కడ సుస్పష్టం. ఆమె ఢిల్లీ నుంచి రాగానే నేరుగా టీడీపీ కార్యాలయానికి తీసుకువెళ్లి మీడియా ముందు పెట్టడమూ ఎల్లో స్క్రిప్టు ఉందన్న విషయాన్ని స్పష్టంగా చెబుతోంది.

అంతలోనే ఇంత పెద్ద స్పందనా?

కోపూరి లక్ష్మి ఇలా ఢిల్లీలో వేలు కోసుకొన్నానని చెప్పిందో లేదో.. కొద్ది నిమిషాల్లోనే టీడీపీ అధినేత చంద్రబాబు సహా ఆ పార్టీ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున పోస్టులు పెట్టడం ప్రారంభించారు. ఆమె ఢిల్లీలో ఆడిన డ్రామా వెనుక టీడీపీ పెద్ద తలకాయలు ఉన్నాయని చెప్పడానికి ఇంతకంటే పెద్ద నిదర్శనం అక్కర్లేదు. ఒకాయన వేలు కోసుకోవద్దు.. ఓటేయండంటాడు. ఇంకొకాయన మరో రకంగా ఓదారుస్తాడు. అసలు వేలు కోయించిన వాళ్లే క్షణాల్లో ఇలా ఓదార్పు మాటలు మాట్లాడటం విడ్డూరమే.

మా స్థలానికి నకిలీ బీఫారం సృష్టించి అమ్మేసింది



2016లో నా కుమార్తె అనారోగ్యంతో ఉండటంతో ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లేదాన్ని. ఆ క్రమంలో కోపూరి లక్ష్మి మా ఇంటి స్థలానికి నకిలీ బీఫారాన్ని సృష్టించి వేరేవారికి అమ్మేసింది. అదేమని అడిగితే మాపై దాడి చేసింది. దీంతో మనస్థాపానికి గురైన మా కుమార్తె చనిపోయింది. తరువాత పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టి లక్ష్మి నకిలీ బీఫారం సృష్టించిందని రూజువు చేసి మా ఇల్లు మేము కాపాడుకున్నాం.

– పోకనాటి ఆరోగ్యం, భర్త నాగేశ్వరరావు, కృష్ణతులసీ నగర్

మా స్థలం కబ్జాకు ప్రయత్నించింది.. మమ్మల్ని బెదిరించింది



మా ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు కోపూరి లక్ష్మి తీవ్రంగా ప్రయత్నించింది. మమ్మల్ని బెదిరించింది. మేము పదేళ్ళ క్రితం రైతుబజారులో కూలీ పనులు చేసుకునేవాళ్లం. స్వర్ణభారతి నగర్‌లో మా స్థలం ఖాళీగా ఉండేది, దానిని కబ్జా చేసి విక్రయించాలని చూసింది. పోలీసులు, స్థానిక నాయకుల సహకారంతో అతి కష్టం మీద మా స్థలాన్ని కాపాడుకున్నాం. అప్పటి నుంచి మాపై పలుమార్లు దాడులు చేయించింది. లక్ష్మి మనుషులు ఇప్పటికీ ఇబ్బంది పెడుతూనే ఉన్నారు.

– పుష్పలత, స్వర్ణభారతి నగర్

నకిలీ బీఫారాన్ని సృష్టించి అమ్మేసింది



మేము వ్యవసాయ కూలీలం. పనులు ఉన్న సమయంలో ఇతర గ్రామాలకు వెళ్ళి కూలీ చేసి, వేసవిలో సొంత ఇంటికి వచ్చే వాళ్లం. మేము లేని సమయంలో కృష్ణతులసీ నగర్‌లోని మా ఇంటిని కబ్జాచేసి నకిలీ బీఫారాన్ని సృష్టించి అమ్మేసింది. దీంతో పోలీసులను ఆశ్రయించాం. లక్ష్మి తన మనుషులతో మాపై దాడులు చేయించింది. చంపుతామని బెదిరించింది. రెవెన్యూ అధికారులు, పోలీసులు, స్థానిక నాయకుల సాయంతో తిప్పలుపడి మా స్థలాన్ని కాపాడుకున్నాం.

– పులిపాటి అంజలి, భర్త లోకయ్య, కృష్ణతులసీ నగర్

అక్రమాలకు అడ్డుపడుతున్నామని కేసు పెట్టింది



కోపూరి లక్ష్మి స్థలాల ఆక్రమణలను అడ్డుకున్నందుకు నాపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టింది. అదేమని అడిగితే పోక్సో కేసు పెడతానని, నన్ను చంపేస్తానని బెదిరించింది. ఎస్సీ ఎస్టీ కేసు పెట్టి నా నుంచి లక్షల్లో డబ్బు వసూలు చేసింది. ఆమె బాధలు పడలేక హైదరాబాద్ వెళ్ళి బతుకుతున్నాను.

– కె మోహనరావు, స్వర్ణభారతి నగర్

లక్ష్మి గతమంతా అక్రమాలే

స్వర్ణ భారతి నగర్‌కు చెందిన నామాల కృష్ణమూర్తి, భార్య తులసమ్మ 25 ఏళ్ళ కిందట స్వర్ణభారతి నగర్‌లో ప్రభుత్వ స్థలాల్ని కబ్జా చేసి, వాటిలో ప్లాట్లు వేసి ఫోర్జరీ పత్రాలు సృష్టించి అమాయక ప్రజలకు అంటగట్టేవారు. ఆ కాలనీకి ఇద్దరి పేర్లు కలిసేలా కృష్ణతులసీ నగర్ అనే పేరు వారే పెట్టారు. నామాల కృష్ణమూర్తి కూడా 25 ఏళ్ళ క్రితం ఇదే విధంగా చేతులు కోసుకుని, కళ్ళు పొడుచుకుని అధికారులను బెదిరించి పనులు చేయించుకునేవాడని కాలనీవాసులే చెబుతున్నారు. వారి కుమార్తే కోపూరి లక్ష్మి. వారి మరణానంతరం తల్లిదండ్రుల వారసత్వాన్ని అందిపుచ్చుకుని స్వర్ణభారతి నగర్, కృష్ణతులసీ నగర్, అడవితక్కెళ్ళపాడు, తుఫాన్ నగర్‌లలో ఇదే విధంగా బ్లాక్‌మెయిల్, స్థలాల కబ్జాలకు పాల్పడుతుండేదని, ఫోర్జరీ పత్రాలతో వేరొకరి స్థలాలు అమ్మేస్తుండేదని స్థానికులు చెబుతున్నారు. ఆమెపై పలు కేసులు కూడా నమోదయ్యాయి. ఈ కేసులన్నీ అప్పటి కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల హయాంలోనే నమోదయ్యాయి. చాలా కేసులు కోర్టులో విచారణలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వాటిలో కొన్ని..

- ▲ 2013లో స్వర్ణభారతి నగర్‌కు చెందిన దివ్యభారతి అనే మహిళకు చెందిన స్థలానికి నకిలీ బీఫారం సృష్టించి, అందులో తహసీల్దారు సంతకం సైతం ఫోర్జరీ చేసి, ఆ స్థలం తనదేనని స్థానికంగా ఉండే పద్మశ్రీ అనే మహిళకు విక్రయించింది. విషయం తెలుసుకున్న దివ్యభారతి కోపూరి లక్ష్మిపై ఫిర్యాదు చేయగా, పోలీసులు ఫోర్జరీ, నకిలీ పత్రాలు తయారీ తదితర విషయాలపై కేసు నమోదు చేశారు. 2016లో ఈ కేసు విషయమై కోర్టు నుంచి ఇంటికి వస్తున్న పద్మశ్రీ కుటుంబ సభ్యులను స్వర్ణభారతినగర్ సమీపంలో అడ్డగించి వారిపై కోపూరి లక్ష్మి, ఆమె అనుచరులు దాడిచేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా లక్ష్మిపై కేసు నమోదు చేశారు.
- ▲ కోపూరి లక్ష్మి నకిలీ ఫోర్జరీ బీఫారాలను తయారు చేసి, అందులో తనకు తెలియకుండానే తన పేరిట సాక్షి సంతకాలు చేసేదని స్వర్ణభారతి నగర్‌కు చెందిన రమాదేవి అనే మహిళ 2013లో నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉంది.
- ▲ 2014లో సుశీల, అంజలి అనే మహిళల ఇళ్ళను కబ్జా చేసేందుకు కోపూరి లక్ష్మి ప్రయత్నించింది. వారిపై దాడి చేసి ఇరువురి ఇళ్ళకు ఫోర్జరీ సంతకాలతో నకిలీ బీఫారాలు తయారు చేసి స్థానికంగా ఉండే వ్యక్తికి విక్రయించాలని ప్రయత్నించింది. దీంతో లక్ష్మిపై సుశీల నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.
- ▲ 2015లో కోపూరి లక్ష్మి తన 15 సంవత్సరాల పెద్ద కుమార్తెకు వివాహం కాకున్నా, అప్పటికే వివాహం జరిగిందని రెవెన్యూ అధికారులను నమ్మించి ఆమె పేరుతో బీఫారం సృష్టించి ఆ స్థలాన్ని వేరే వ్యక్తికి విక్రయించాలని చూసింది. ఈ మోసాన్ని గమనించిన ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- ▲ 2017లో నకిలీ పత్రాలతో మోహనరావు అనే వ్యక్తికి ఇంటి స్థలం విక్రయించింది. అయితే, ఈ స్థలాల దస్తావేజులు నకిలీవని తేలడంతో ఆయన నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసుల్లో పోలీసులు లక్ష్మిని పలుమార్లు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆమె పోలీసులను సైతం ఏమార్చి స్టేషన్ నుంచి పారిపోయిన సంఘటనలు ఉన్నాయని పోలీసులే చెబుతున్నారు.

జాతీయ మీడియా దృష్టినాకర్షించడానికే ఢిల్లీకి

కోపూరి లక్ష్మికి నిజంగా అన్యాయం జరిగితే ఇదే పని గుంటూరులోనో, తాడేపల్లిలోనో చేయొచ్చు కదా! ఢిల్లీ వరకు ఎందుకు వెళ్లారు? ఇక్కడ మళ్లీ చంద్రబాబు పాత్రే కనపడుతుంది. 1994 నుంచి ఆయన ఆడుతున్న పాత చీప్‌ట్రిక్స్‌నే ఇక్కడా ప్రయోగించారు. అవే గుంటనక్క వేషాలు ప్రదర్శించారు. రాష్ట్రంలో అయితే, ఆమెను నమ్మే వారెవరూ ఉండరు. ఆమె అక్రమాల చరిత్ర అటువంటిది. అదే ఢిల్లీలో అయితే ఎల్లో మీడియాతోపాటు జాతీయ మీడియా దృష్టిని, కొందరు జాతీయ నేతల దృష్టిని ఆకర్షించొచ్చు. అందుకే చంద్రబాబు ఇలాంటి చవకబారు డ్రామాకు తెరతీశారు.

చంద్రబాబుపై చర్యలకు ఎన్నికల సంఘం సిఫార్సు

- బాబు వివరణలతో సంతృప్తి చెందని రాష్ట్ర ఎన్నికల సంఘం

సాక్షి, అమరావతి: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ఉల్లంఘించడంపై తదుపరి చర్యలకు సిఫార్సు చేస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా బాబు తన ప్రసంగాల్లో నిబంధనలు తుంగలో తొక్కుతూ సీఎం జగన్‌పై అభ్యంతరకర పదజాలంతో దూషిస్తూ, ఉద్వేగాలను రెచ్చగొట్టే విధంగా చేస్తున్న ప్రసంగాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ఎన్నికల సంఘానికి అనేక మార్లు ఫిర్యాదు చేసింది. వాటిలో 18 ఫిర్యాదులకు సంబంధించి చంద్రబాబుకు నోటీసులు జారీ చేశారు. ఫిర్యాదుల ఆధారంగా వివరణ ఇవ్వాలంటూ బాబుకు నోటీసులు జారీ చేయగా.. కొన్నింటికి సమాధానాలు ఇచ్చిన బాబు మరికొన్నింటికి అసలు స్పందించలేదు. బాబు సమాధానంపై సంతృప్తి చెందని రాష్ట్ర ఎన్నికల సంఘం ఫిర్యాదులను పరిశీలించిన తర్వాత బాబు ప్రసంగాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఉన్నట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. ఈ 18 ఫిర్యాదులకు సంబంధించిన వీడియో క్లిప్పులను జత చేస్తూ తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ ముఖేష్‌కుమార్ మీనా కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్యకార్యదర్శి అవినాష్‌కుమార్‌కు లేఖ రాశారు.

తాజాగా మరో ఫిర్యాదు

ఎన్నికల ప్రచార సభల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి



సీఈవో మీనాకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎ. నారాయణమూర్తి, శ్రీనివాసరెడ్డి

(సీఈవో) ముఖేష్ కుమార్ మీనాకు వైఎస్సార్‌సీపీ మంగళవారం ఫిర్యాదు చేసింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, పార్టీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నారాయణమూర్తి, న్యాయవాది కె.శ్రీనివాసరెడ్డి వెలగపూడి సచివాలయంలో సీఈవోకు ఫిర్యాదు అందించారు. ఈ నెల 22న జగ్గంపేట బహిరంగ సభలో బాబు ప్రసంగిస్తూ.. సీఎం జగన్, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, దూషణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు విరుద్ధం కాబట్టి బాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. జగ్గంపేట సభతోపాటు నర్సంపేట, ఎస్.కోట సభల్లో కూడా చంద్రబాబు పరుష పదజాలం వాడారని, సీఎం వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గమైన చర్యను చంద్రబాబు పదే పదే కొనసాగిస్తున్నారని, పచ్చమీడియాను అడ్డం పెట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని వివరించారు. మెగా డీఎస్సీపైనే తొలి సంతకం అంటూ నిరుద్యోగులకు మళ్లీ దగా చేయాలని చూస్తున్నారని, వీటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు.

కాపులకు సీట్లివ్వని మీకు ఓట్లెందుకు వెయ్యాలి బాబూ

- అన్ని రకాలుగా దారుణంగా దగా చేసినందుకా?
- ముద్రగడ కుటుంబాన్ని వేధించినందుకా?
- బాబుకు కాపు ఐక్యవేదిక సూటి ప్రశ్నలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలను అన్ని రకాలుగా దారుణంగా దగా చేసి, కాపులను తీవ్రంగా అవమానించి, అక్రమ కేసులు పెట్టిన చంద్రబాబుకు ఎందుకు ఓటెయ్యాలని కాపు ఐక్య వేదిక ఘాటుగా ప్రశ్నించింది. మాకు సీట్లివ్వని మీకు ఓటెందుకు వెయ్యాలి బాబూ అంటూ పలు ప్రశ్నలు సంధించింది. ఈ మేరకు కాపు ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిపల్లి అయ్యప్ప, కో చైర్మన్ మెర్ల నాగ సత్యనారాయణ, కో కన్వీనర్లు పెద్దిరెడ్డి మహేష్, పంచాది రంగారావు, వంగా ఆంజనేయులు మంగళవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. చంద్రబాబుకు కాపు ఐక్య వేదిక సంధించిన ప్రశ్నలు ఇలా ఉన్నాయి..

- ■ పొత్తులో భాగంగా జనసేనకు 64 సీట్లు ఇస్తున్నట్టు ఆంధ్రజ్యోతిలో రాయించి కాపులను భ్రమల్లో ముంచారు. చివరకు 24స్థానాలు కేటాయించారు. వాటిలో మూడు లాగేసుకుని 21 సీట్లకు పరిమితం చేశారు. జనసేనకు ఇచ్చిన 21 సీట్లలో 11 స్థానాల టికెట్లను తిరిగి టీడీపీ వారికే ఇప్పించుకున్నారు. జనసేనలో గెలిచిన వారు టీడీపీలో చేరిపోయేలా పథకం రచించారు. జనసేనని పథకం ప్రకారం నిర్వీర్యం చేసినందుకు కాపులు మీకు గంపగుత్తగా ఓటెయ్యాలా బాబూ..
- ■ కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభంను పవన్ కలవనీయకుండా చేసి వారిద్దరి మధ్య అగాధం పెంచి కాపులు చెల్లాచెదురు అయిపోయేలా చేశారు. ఇందుకు ఓటెయ్యాలా?
- ■ 2019 ఎన్నికల్లో పవన్‌ను చంద్రబాబే పథకం ప్రకారం రెండు చోట్లా ఓడించారు. ప్రస్తుత ఎన్నికల్లో పవన్‌కు కాసేపు ఎంపీ అని, కాసేపు ఎమ్మెల్యే అని అయోమయానికి గురిచేశారు. పిఠాపురంలో పవన్‌కు వర్మతో వెన్నుపోటు పొడిపించి ఓడించేందుకు ప్రయత్నాలు చేస్తున్నందుకు ఓటెయ్యాలా?
- ■ 2014లో అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలో కాపులకు రిజర్వేషన్లు ఇస్తానని నమ్మించి మోసం చేశారు. రిజర్వేషన్ ఉద్యమంలో కాపులను తీవ్రంగా అవమానించి అక్రమ కేసులను బనాయించినందుకు ఓటెయ్యాలా?
- ■ ముద్రగడ, ఆయన కుటుంబ సభ్యులను మహిళలతో సహా తీవ్రంగా అవమానించినందుకు కాపులంతా టీడీపీకి ఓటెయ్యాలా?
- ■ బీజేపీకి కేటాయించిన 6 లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాల్లో కనీసం ఒక్కటి కూడా కాపులకు ఇవ్వకుండా బాబు బలంగా కృషి చేశారు. టీడీపీలో ఒక్క లోక్‌సభ సీటు కూడా ఇవ్వనందుకు, కేవలం 11 ఎమ్మెల్యే సీట్లు మాత్రమే ఇచ్చారు. ఇలా దగా చేసినందుకు ఓటెయ్యాలా?
- ■ కాపుల ప్రయోజనాలను పట్టించుకోని చంద్రబాబును కాపులు ఎలా విశ్వసిస్తారు? పవన్ వద్ద పస లేదని, ఆయన కూడా చంద్రబాబుకు పూర్తిగా సరెండర్ అయిపోయారని కాపులు పసిగట్టేశారు. ఓట్ల కోసం జిమ్మిక్కులు చేస్తున్నారు అని కాపు ఐక్యవేదిక నేతలు స్పష్టం చేశారు.

వడ్డెర్ల మద్దతు వైఎస్సార్‌సీపీకే

వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు



సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్: వడ్డెర్ల రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి, ఎదుగుదలకు తోడ్పడిన వైఎస్సార్‌సీపీకే రానున్న ఎన్నికలలో సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు స్పష్టం చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. తనను శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా నియమించి సీఎం జగన్ గుర్తింపు ఇచ్చారని, గుంటూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వడ్డెరను నియమించారని గుర్తు చేశారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి వడ్డెర కుటుంబానికి చేరుస్తున్నారని చెప్పారు. వడ్డెర్ల అభివృద్ధి పట్ల సీఎం జగన్ చిత్తశుద్ధితో ఉన్నారనేందుకు ఇదే ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు.

వడ్డెర్లను పట్టించుకోని చంద్రబాబు

14 ఏళ్లుల సీఎం పనిచేసినా బాబు రాజకీయంగా, సామాజికంగా, వడ్డెర్లకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని ధర్మరాజు స్పష్టం చేశారు. 2014లో మాచర్ల అసెంబ్లీ స్థానం నుంచి వడ్డెర సామాజిక వర్గం నేతకు నామినేషన్ వేసుకోమని చెప్పినా.. సీటు ఇవ్వలేదన్నారు. 2024లో పుట్టపర్తి నియోజకవర్గం, హిందూపురం ఎంపీ సీట్లను వడ్డెర్లకు ఇస్తానని చెప్పి మోసం చేశారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో వడ్డెర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాలలో పర్యటించి వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికేలా ప్రచారం చేస్తామని, తిరిగి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకుంటామని చెప్పారు.

దళిత ద్రోహి చంద్రబాబు

- కూరలో కరివేపాకులా దళితుల్ని వాడుకుంటున్నారు
- టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి ఆనగల్లు మునిరత్నం మండిపాటు



పూతలపట్టు: రాష్ట్రంలోనే దళితులను మోసం చేసిన ఏకైక ద్రోహి చంద్రబాబు అని టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి ఆనగల్లు మునిరత్నం మండిపడ్డారు. మంగళవారం చిత్తూరు జిల్లా పూతలపట్టులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. టీడీపీకి అవసరం వచ్చినప్పుడల్లా దళితుల్ని వాడుకుంటూ.. చివరకు కూరలో కరివేపాకులా వదిలేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను 1994 నుంచి టీడీపీ కోసం కష్టపడుతున్నట్టు పేర్కొన్నారు. తనపై 14 కేసులు నమోదైనా టీడీపీ కోసం ఎంతో శ్రమిస్తున్నానని.. ఎన్నికలు వచ్చేసరికి 'దళిత' అనే భేదం చూపిస్తూ తనను పక్కన పెడుతున్నారని వాపోయారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే వరకు పూతలపట్టు టీడీపీ సీటును తనకే కేటాయించినట్టు పార్టీ అధిష్టానం చెప్పిందని.. చివరకు కొందరు బడా నాయకుల నిర్ణయంతో మురళీమోహన్‌కు సీటు కేటాయించారని తెలిపారు. 30 ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న వాళ్లను కాకుండా.. ఎన్నికలకు కేవలం 3 నెలల ముందు వచ్చిన వాళ్లను మాత్రం పార్టీ గుర్తిస్తుందన్నారు. చంద్రబాబు దళితులను అణగదొక్కడాన్ని ఒక ఆచరణగా, ధ్యేయంగా ముందునుంచీ పనిచేస్తున్నారన్నారు. 30 ఏళ్లుగా ఎస్సీలు వెనుకబడిపోవడానికి, పురోగతి చెందకుండా పోవడానికి చంద్రబాబే కారణమన్నారు. టీడీపీలో క్రియాశీలక సభ్యత్వం లేకుండా, కనీసం పార్టీలో ఏ రోజు జెండా మోయకుండా, తిరుపతికి చెందిన మురళీమోహన్‌కు టికెట్ ఇచ్చారన్నారు. ఎన్నికల్లో టీడీపీకి సపోర్టు చేయనని తెలిపారు. గుర్తించని పార్టీలో ఎంత శ్రమించిన వ్యర్థమని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ పునాదులు కూలిపోతాయి

చంద్రబాబు గాలిలో మేడలు కట్టేందుకు ప్రయత్నిస్తున్నారని.. దీనివల్ల టీడీపీ పునాదులు కూలిపోయే రోజులు వస్తాయని స్పష్టం చేశారు. పూతలపట్టులో పార్టీకి చెందని వాళ్లు రాజకీయాలు చేస్తుంటే.. టీడీపీలోని పెత్తందార్లు దళితులను అవమానిస్తున్నారని మండిపడ్డారు. దళిత కుటుంబాలను 30 సంవత్సరాల క్రితం ఎస్సీ వర్గీకరణ పేరుతో విద్య, ఉద్యోగ, ఉపాధిలో ఎలాంటి పురోగతి సాధించలేకపోవడానికి చంద్రబాబు కారణం అయ్యారని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ దళిత నాయకుల్ని తడిగుడ్డతో గొంతు కోశారని అన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

వైఎస్సార్‌సీపీ నేత రావెల కిషోర్‌బాబు

సాక్షి,అమరావతి: సీఎం జగన్ మాత్రమే బడుగు, బలహీనవర్గాలను వాళ్ల కాళ్లపై వారు నిలబడేలా తీర్చిదిద్దుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత రావెల కిషోర్‌బాబు అన్నారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'సీఎం జగన్ ఇచ్చిన నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ నినాదం ప్రజలలోకి చొచ్చుకుని వెళ్లింది. ఇప్పటివరకు ఈ వర్గాలను టీడీపీ కేవలం ఓటు బ్యాంకుగానే చూసింది. వైఎస్ జగన్ పేదల పక్షపాతి, అణగారిన వర్గాలకు, దళితులకు అండగా నిలద్దారు. అంబేద్కర్ కలలు నెరవేరడం జగన్ తోనే సాధ్యం.

25న ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్

- అదే రోజు గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఏపీఆర్ఎస్ క్యాట్
- ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు వెల్లడి



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 25న జరగనున్న ఏపీఆర్‌జేసీ, డీసీసెట్–2024, ఏపీఆర్ఎస్ క్యాట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు తెలిపారు. గుంటూరు కొరిటెపాడులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 50 గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ఏపీఆర్ఎస్ క్యాట్–2024కు 32,666 మంది విద్యార్థులకు 145 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదే విధంగా 10 జూనియర్ కళాశాలలతో పాటు ఒక డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గురువారం మధ్యాహ్నం 2.30 నుంచి 5.00 గంటల వరకు జరగనున్న ఏపీఆర్జేసీ డీసీ సెట్–2024కు 56,949 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. దీని కోసం 254 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సంబంధిత విద్యార్థుల్లో డిగ్రీలో ప్రవేశానికి 1,209 మంది డీసీ సెట్‌కు హాజరవుతున్నారని వివరించారు. విద్యార్థులు సంస్థ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని హాజరు కావాలని సూచించారు. కనీసం గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

అమర్‌నాథ్ యాత్రికులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ల జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రం నుంచి అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తులు తప్పనిసరిగా వైద్యుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు పొందాలని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జీజీహెచ్‌లలో వైద్య పరీక్షలు చేసి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు జారీ చేస్తున్నామన్నారు. జిల్లాల వారీగా స్పెషలిస్ట్ డాక్టర్ల వివరాల్ని https://www.jksasb.nic.in// వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అమర్‌నాథ్ 2024 యాత్ర వచ్చే జూన్ 29 నుంచి ప్రారంభమై ఆగస్టు 19వ తేదీతో ముగుస్తుంది. ఈ క్రమంలో యాత్రకు వెళ్లేందుకు నిర్దేశించిన మెడికల్ బోర్డు నుంచి తప్పనిసరిగా ఆరోగ్య ధ్రువీకరణ పత్రం పొందాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధన మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరించే ఇతర సర్టిఫికెట్‌లతో దగ్గరలోని ప్రభుత్వ బోధనా సుపత్రికి యాత్రికులు వెళ్లాలి. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యులతో కూడిన మెడికల్ బోర్డు దరఖాస్తు చేసుకున్న వారి వైద్య పరీక్షల ఫలితాల ఆధారంగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు.

వదలని వడగాడ్పులు

- మరింత ఉధృతం కానున్న ఎండలు
- 45 డిగ్రీలకు పైగా నమోదయ్యే అవకాశం
- రైల్వేలను అప్రమత్తం చేసిన ఐఎండీ

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రాన్ని వడగాడ్పులు వదలడం లేదు. మండుటెండలు ప్రజలకు ఏమాత్రం ఉపశమనం కలిగించడం లేదు. అధిక ఉష్ణోగ్రతలు రోజురోజుకూ అదుపు తప్పుతూనే ఉన్నాయి. సాధారణం కంటే 3నుంచి 6 డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. ఫలితంగా పలు జిల్లాల్లో వడగాడ్పులు, మరికొన్ని జిల్లాలో తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. మంగళవారం కూడా ఇవి కొనసాగాయి. రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 42–45 డిగ్రీలు రికార్డయ్యాయి. అత్యధికంగా నంద్యాల జిల్లా చాగలమర్రిలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇంకా డోన్, బనగానపల్లి (నంద్యాల), కొత్తవలస, జామి (విజయనగరం)లలో 44.9 డిగ్రీలు, కాజీపేట (వైఎస్సార్) 44.6, గోస్పాడు (కర్నూలు)లో 44.2, మహానంది, చీడికాడ, దేవరాపల్లి (అనకాపల్లి)లో 44.1, సారవకోట (శ్రీకాకుళం)లో 43.7 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. ఫలితంగా 66 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 84 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. బుధవారం 46 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 143 మండలాల్లో వడగాడ్పులు, గురువారం 47 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 109 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పలు మండలాల్లో 43–45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

ఉత్తర కోస్తాకు తేలికపాటి వర్షాలు

దక్షిణ అంతర్గత కర్ణాటక, దాని పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి 1.5 కి.మీ. ఎత్తువరకు విస్తరించి ఉంది. అలాగే రాష్ట్రంపైకి ఈశాన్య, ఆగ్నేయ దిశగా దిగువ స్థాయి నుంచి గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తాలో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం తెలిపింది. రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో వేడి, తేమతో కూడిన అసౌకర్య వాతావరణం ఉంటుందని పేర్కొంది.

రైల్వేలకు అలర్ట్

వడగాడ్పుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భారత రైల్వేలను ఐఎండీ అప్రమత్తం చేసింది. వడగాడ్పుల ప్రభావం రానున్న ఐదు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమపై ఉంటుందని తెలిపింది. వీటి పరిధిలో ఉన్న దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే స్టేషన్లలోని ప్లాట్‌ఫామ్‌లపైన, బోగీల్లోనూ ప్రయాణికులకు పూర్తిస్థాయిలో మంచినీటిని అందుబాటులో ఉంచాలని, ప్లాట్‌ఫామ్‌లపై చల్లదనం కోసం కూల్ రూఫ్‌లు, నీడనిచ్చే ఏర్పాట్లు చేయాలని సూచించింది.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.6	27.2
కర్నూలు	43.2	28.4
కడప	43.2	27.8
మార్కాపురం	42.0	28.0
గుంటూరు	42.0	27.0
రాజమహేంద్రవరం	42.0	25.0
విజయవాడ	41.0	27.0
ఏలూరు	41.0	25.0
విశాఖపట్నం	40.4	27.4
విజయనగరం	40.0	35.0
నెల్లూరు	38.3	26.2

నేడు పాలిసెట్ గ్రాండ్ టెస్ట్

సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 'పాలిసెట్–2024' సన్నాహక కార్యక్రమంలో భాగంగా బుధవారం పాలిసెట్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత గురువారం నిర్వహించాలని భావించినప్పటికీ ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఉండటంతో విద్యార్థుల నుంచి వచ్చిన వినతుల మేరకు ఒకరోజు ముందుగా చేపడుతున్నామన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రైవేటు పాలిటెక్నిక్‌లో 7,273, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 12,513 మంది విద్యార్థులు ఉచిత శిక్షణ పొందారన్నారు. ఉచితంగా నిర్వహించే పాలిసెట్ గ్రాండ్ టెస్టును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 27న పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు చేశామన్నారు. 36 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందని నాగరాణి తెలిపారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.




సాక్షి 2024 జైత్రయాత్ర

బుధవారం
ఏప్రిల్, 24



గుసగుస

వై నాట్ కుప్పం



సీఎం జగన్ ఏ ముహూర్తాన 'వై నాట్ కుప్పం'అన్నారోగానీ.. అప్పటి నుంచి చంద్రబాబుకు వెన్నులో వణుకు మొదలైంది. ఇన్నేళ్ల రాజకీయంలో ఎన్నడూ లేనంతగా కుప్పం చుట్టూనే తిరుగుతున్నారు. భార్యను కూడా అక్కడే ప్రచారానికి పెట్టారు. గత 4 ఎన్నికల్లో ఆయనకు వచ్చిన మెజార్టీ క్రమేపీ తగ్గుతూ సగానికి పడిపోయింది. 2019 ఎన్నికల్లో అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఎన్ని అక్రమాలు చేసినా మెజార్టీలో కోత తప్ప లేదు. స్థానిక ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్‌సీపీ స్వీప్ చేసింది. ఈ నేపథ్యంలో కుప్పం నుంచి ఇదే తన చివరి పోటీ అని, ఈసారి గెలిపిస్తే వచ్చే ఎన్నికల్లో కుప్పం సీటు మీదే నంటూ.. ఒకరిద్దరు స్థానిక నేతలకు హామీ ఇచ్చారట. ఈసారి ఓడిపోతే పార్టీ ఉండదు.. బొ.. ఉండదు.. ఈపాటి దానికి కుప్పంలో మేం పొడిచేది ఏముంటుందంటూ.. హామీ పొందిన నేతల గుసగుసలు.

జవ'హర్ట్'



చేసే మూడ్.. ఉత్సాహం సర్వనాశన మైపోతాయ్.. ఏమైనా అంటేనేమో.. హర్ట యిపోతారు.. తగలబెట్టండి సార్.. నిరంజన్‌గారూ.. అనే మీమ్ సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. ఇదే రీతిలో ప్రస్తుతం మాజీ మంత్రి, టీడీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ రెచ్చిపోతున్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ ఆయన్ని బుజ్జగించేందుకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టి, జిల్లా అధ్యక్ష పదవిలో కాస్త కోత పెట్టారు. కొత్త జిల్లా పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలుంటే ఆరింటికే ఆయన అధ్యక్షుడట. తన నివాస ప్రాంతమైన కొవ్వూరు వ్యవహారాల్లో ఏమాత్రం కలుగజేసుకోరాదట. దీంతో పార్టీ అధిష్టానం పెత్తందార్లను ప్రోత్సహించి, దళితుడైన జవహర్‌ను అవమానిస్తోందంటూ ఆయన అనుచరులు వాపోతున్నారు.

క(ల్లో)లమట!



పాతపట్నం టీడీపీలో **మాజీ ఎమ్మెల్యే** కలమట వెంకటరమణ **కల్లోలం రేపు**తున్నారు. తనను కాదని **పార్టీ ఫండ్‌గా** డబ్బు సంచులిచ్చిన వారికి **సీటు కేటాయిం**చడంపై బాహాటంగానే **ఆక్రోశం వెళ్లగ**క్కారు. అంతటితో ఆగకుం**డా రెబల్‌గా** బరిలో నిలిచేందుకు సన్న**ద్ధమయ్యారు.** శ్రీకాకుళం పర్యటనలో ఉన్న **పార్టీ అధినేత** చంద్రబాబు పార్టీ ఉత్తరాంధ్ర **నాయకులతో** పలాసలో భేటీ నిర్వహించారు**. ఈ సమావే**శానికి కలమటనూ **ఆహ్వానించారు.** అయితే తనకు పాతపట్నం టి**కెట్ ప్రకటిస్తేనే** వస్తానని, లేకుంటే లేదని.. తె**గేసి చెప్పేశార**ట. దీంతో ఇప్పటికే గెలుపు **ఆశలు వదులు**కున్న స్థానిక టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావుకు ముచ్చెమటలు పడుతున్నాయట. బుధవారం కలమట నామినేషన్ వేశాక ఈ కల్లోలం ఏ స్థాయికి వెళ్తుందో చూడాలి.

'కామ్'గ్రెస్!

ఏపీ కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మినహా మిగిలిన నాయకులు మౌన వ్రతాలు చేస్తున్నట్లున్నారు. షర్మిల తన మకాంను ఏపీకి మార్చడంతో అక్కడక్కడా మిగిలిన కాంగ్రెస్ అభిమానులు నమ్మకాలు పెంచుకున్నారట. వైఎస్సార్‌సీపీ ఎప్పుడో తన అభ్యర్థుల్ని ఖరారు చేసింది. పొత్తు పార్టీలూ అడపాదడపా మార్పులున్నా.. సీట్ల పంచాయితీని కొలిక్కి తెచ్చాయి. వామపక్షాలతో వస్తున్న కాంగ్రెస్‌లో మాత్రం ఎన్నికల జోష్ రాలేదు. రాయలసీమ ప్రాంతంలో కూడా ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కానరాని దుస్థితి. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక నుంచి ఆర్థిక సాయంతోపాటు, కీలక నేతలు ప్రచారానికి వస్తారని ఊదరగొట్టారు. అక్కడ లోక్‌సభ స్థానాలపైనే దృష్టి సారించాలని అధిష్టానం ఆదేశాలట. దీంతో వారెవరూ ఇటు కన్నెత్తి చూడట్లేదు.

ఆర్థికాభివృద్ధి అదుర్స్

చంద్రబాబు పాలనలో కంటే సీఎం జగన్ హయాంలోనే ఎక్కువ అభివృద్ధి

'సెల్ ఫోన్ నేనే కనిపెట్టా.. ఐటీని నేనే సృష్టించా.. శంషాబాద్ ఎయిర్‌పోర్టునూ నేనే కట్టా.. హైదరాబాద్‌లో రింగు రోడ్డునూ నేనే వేశా.. సింధూకు బ్యాడ్మింటన్ ఆడమని నేనే చెప్పా.. అంతెందుకు నా గైడెన్స్ మేరకే సత్య నాదెళ్ల ఇవాళ అంతటివాడయ్యాడు.. తుపాన్లనే ఆపగలిగాను.. సంపద సృష్టికి నేనే బ్రాండ్ అంబాసిడర్..' ఇలా కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పేదెవరంటే, చంద్రబాబు అని చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు.

అప్పుడు బాబు హయాంలో, ఇప్పుడు జగన్ హయాంలో దాదాపు ఒకే బడ్జెట్.. అప్పులు అప్పటి కంటే ఇప్పుడే తక్కువ.. అయినప్పటికీ సీఎం జగన్ ఈ ఐదేళ్లలో పేద ప్రజల ఖాతాల్లో వివిధ పథకాల రూపేణ ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. తద్వారా ఆర్థిక చక్రాన్ని పరుగులు పెట్టించారు. అభివృద్ధి విషయంలో కొత్త పుంతలు తొక్కించారు. ఈ ఐదేళ్లలో వార్షిక సగటు వృద్ధి 6.20 శాతానికి పెరగడమే ఇందుకు నిదర్శనం. అన్ని రంగాల్లోనూ స్పష్టమైన అభివృద్ధి కళ్లెదుటే కనిపిస్తోంది. ఇందుకు కేంద్ర గణాంకాలే సాక్ష్యం.

స్థిర ధరల ప్రకారం గత ఐదేళ్లలో జీఎస్‌డీపీ పెరుగుదల రూ.**1,94,063** కోట్లు

అదే బాబు పాలనలో రూ.**1,28,341** కోట్లే


కోవిడ్ సంక్షోభంలోనూ జగన్ హయాంలోనే భారీగా పెరిగిన సంపద

స్థిర ధరల ఆధారంగా 2023–24 రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి 7.35 శాతం

బాబు హయాంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.6.26 లక్షల కోట్లు

2023–24లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.8.20 లక్షల కోట్లు

కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ లెక్కలే ఇందుకు నిదర్శనం



బాబు ఐదేళ్లలో వార్షిక సగటు వృద్ధి **5.15%**

ఈ ఐదేళ్లలో వార్షిక సగటు వృద్ధి **6.20%**

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓ వైపు సంక్షేమాభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ.. మరో వైపు పేదరికాన్ని తగ్గించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కంటే ముందంజలో ఉంది. రాష్ట్ర అభివృద్ధికి, సంపద సృష్టించారనడానికి కొలమానం ఆ రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలే. ఆర్థిక మందగమనం, కోవిడ్ సంక్షోభాలను సైతం అధిగమించి సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో వరుసగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయమైన పెరుగుదలను నమోదు చేసింది. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కోవిడ్ సంక్షోభం లేనప్పటికీ గత చంద్రబాబు ఐదేళ్ల పాలనలో సగటు వార్షిక వృద్ధి రేటు 5.15 శాతం నమోదు కాగా, అదే సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో సగటు వార్షిక వృద్ధి 6.20 శాతం నమోదైంది. పదే పదే సంపద సృష్టిస్తానంటూ ఎన్నికల ముందు ప్రజల్లోకి వెళ్లి ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబు.. తన ఐదేళ్ల పాలనలో కోవిడ్ లాంటి సంక్షోభం లేనప్పటికీ సంపద సృష్టించడంలో ఎందుకు వెనుకబడ్డారో చెప్పాలి. ప్రజలు ఏది చెబితే అదే నమ్ముతారనుకోవడం ఎల్లవేళలా సాగదనే విషయం చంద్రబాబు మరిచిపోతున్నారు. తనకొక్కడికే సంపద సృష్టించడం వచ్చనే ధోరణిలో చంద్రబాబు ఇస్తున్న బిల్డప్ అంతా తుస్ అని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ద్వారా వెల్లడైంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో


-మిగతా IIIలో


బ్యాంకింగ్ కీలక సూచికలు

ఆర్‌బీఐ నిబంధనల మేరకు గత ఏడాది డిసెంబర్ నాటికి కీలక సూచికలు ఇలా

ఆర్‌బీఐ నిబంధన	శాతం	రుణాల మంజూరు శాతం
క్రెడిట్ రేషియో	60	157.94
ప్రాధాన్యత రంగం	40	64.91
వ్యవసాయ రంగం	18	43.21
చిన్న, సన్నకారు రైతులు	10	28.69
బలహీన వర్గాలకు	12	32.47
మహిళలు	5	25.32
సూక్ష్మ పరిశ్రమలు	7.50	8.68

తలసరి ఆదాయం పెరుగుదల ఇలా









ఏపీలో మహిళా ఓటర్లే అధికం

ప్రస్తుతం ఏపీలో పురుష, మహిళా ఓటర్ల రేషియో 1:1.02

భవిష్యత్‌లో 1:1.06కు పెరిగే అవకాశం

ఏపీలో 2014లో ఓటు వేయని మహిళలు 83 లక్షలు.. 2019లో 41 లక్షలు

2024 ఎన్నికల్లో మహిళలు ఎక్కువ శాతం ఓటు వేస్తే ఫలితాల్లో గణనీయ మార్పు

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ 68 కోట్లకు చేరవచ్చని అంచనా.. ఇందులో మహిళా ఓటర్లు 33 కోట్లు

ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

ఆమే కీలకం

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో మహిళలే నిర్ణయాత్మక శక్తిగా అవతరించనున్నారని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, గోవా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్‌లో కూడా మహిళలదే ప్రధాన భూమిక అని నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంగా మహిళా ఓటర్లు ఎలా నిర్ణయాత్మకంగా మారుతున్నారనే అంశంపై ఎస్‌బీఐ పరిశోధన నివేదికను విడుదల చేసింది. దేశంలో ప్రస్తుత సాధారణ ఎన్నికలతో పాటు రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటర్ల పాత్ర గణనీయంగా పెరుగుతుందని అంచనా వేసింది. ప్రస్తుత ఎన్నికల్లో కేరళ, గోవా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారని, భవిష్యత్ ఎన్నికల్లో ఈ రాష్ట్రాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఇంకా పెరుగుతుందని నివేదిక వెల్లడించింది. భవిష్యత్ ఎన్నికల్లో తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక, సిక్కిం రాష్ట్రాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య పెరిగి ఫలితాలను నిర్ణయిస్తారని నివేదిక పేర్కొంది.


ఆంధ్రప్రదేశ్‌లో 2014 ఎన్నికల్లో 83 లక్షల మంది మహిళలు పోలింగ్ కేంద్రాలకు రాలేదని, 2019 ఎన్నికల్లో మాత్రం పోలింగ్ కేంద్రాలకు రాని మహిళా ఓటర్ల సంఖ్య ఏకంగా 41 లక్షలకు తగ్గిపోయిందని, మహిళలు ఓటింగ్‌లో ఎక్కువ మంది పాల్గొంటున్నారనడానికి ఇదే సంకేతమని స్పష్టం చేసింది.

మహిళా ఓటర్లలో చైతన్యం

గతంలో కంటే ప్రస్తుత ఎన్నికల్లో మహిళా ఓటర్లు ఎక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొంటారని, తద్వారా ఫలితాలు గణనీయంగా మారిపోతాయని అంచనా వేసింది. దేశంలో వివిధ రాష్ట్రాల్లో జెండర్ రేషియో పెరుగుతోందని, లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్ల పాత్ర గణనీయంగా పెరుగుతోందని నివేదిక తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ఎన్నికల్లో పురుష, మహిళ ఓటర్ల రేషియో 1:1.02 ఉండగా భవిష్యత్‌లో 1:1.06కు పెరుగుతుందని వెల్లడించింది. గత ఓటింగ్ శాతాలు, మార్పులను విశ్లేషించడం ద్వారా 2024లో పోలింగ్ 68 కోట్లకు చేరుతుందని, ఇందులో 33 కోట్లు మహిళా ఓటర్లే ఉంటారని, ఇది 49 శాతంగా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుత పోలింగ్ రేటు ప్రకారం 2029 నాటికి పోలింగ్ 73 కోట్లకు చేరుతుందని, ఇందులో 37 కోట్లు మహిళా ఓటర్లు ఉంటారని అంచనా వేసింది. 2047 నాటికి దేశంలో 115 కోట్ల మంది ఓటర్లుగా నమోదు కావచ్చని, ఓటింగ్‌లో 92 కోట్ల మంది పాల్గొంటారని నివేదిక తెలిపింది. 2047లో అత్యధికంగా మహిళా ఓటర్లు 50.6 కోట్ల మంది పాల్గొననుండగా పురుష ఓటర్లు 41.1 కోట్ల మంది పాల్గొంటారని అంచనా వేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పురుష ఓటర్ల పోలింగ్ 67.01 శాతం ఉండగా మహిళా ఓటర్ల పోలింగ్ 67.18 శాతం ఉందని పేర్కొంది. గత లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే 2024 ఎన్నికల్లో అదనంగా 13 కోట్ల మంది మహిళలు ఓటు వేయవచ్చని, ఇది గేమ్ చేంజర్‌గా మారవచ్చని వ్యాఖ్యానించింది.

పురుష, మహిళ ఓటర్ల రేషియో ఇలా..

రాష్ట్రం	ప్రస్తుతం	భవిష్యత్
కేరళ	1.07	1.11
గోవా	1.04	1.09
తమిళనాడు	1.02	1.07
ఆంధ్రప్రదేశ్	1.02	1.06
ఛత్తీస్‌గఢ్	1.00	1.05
తెలంగాణ	0.99	1.05
హిమాచల్‌ప్రదేశ్	0.98	1.03
కర్నాటక	0.98	1.03
సిక్కిం	0.96	1.00



పారిశ్రామిక రంగం రయ్ రయ్

పెట్టుబడులు ఏకీకృతం కాకుండా అన్ని ప్రాంతాలకు విస్తరణ


- విశాఖ సదస్సులో రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ
- జగన్ ఐదేళ్ల పాలనలో వాస్తవ రూపంలోకి రూ.78,514 కోట్ల పెట్టుబడులు
- చంద్రబాబు హయాంలో ఏడాదికి సగటున రూ.11,994 కోట్లు
- జగన్ పాలనలో ఏడాదికి సగటున రూ.15,702.8 కోట్లు
- ఇవి కాకుండా వేగంగా పనులు జరుగుతున్న రూ.223 లక్షల కోట్ల పెట్టుబడులు
- ఇన్ఫోసిస్, రాండ్‌స్టాండ్, బీఈఎల్, విప్రో వంటి దిగ్గజ ఐటీ కంపెనీలు..
- ఐదేళ్లలో 1.01 లక్షల మందికి ఉపాధి.. నిర్మాణంలో ఉన్న వాటి ద్వారా మరో 1.62 లక్షల మందికి లభించనున్న ఉపాధి
- చంద్రబాబు దిగిపోయేనాటికి 27,643 మంది ఐటీ ఉద్యోగులు.. గత ఐదేళ్లలో 75,551కు పెరుగుదల.. 161 నుంచి 586కు పెరిగిన స్టార్టప్‌లు

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ వేసిన అడుగులు చక్కటి ఫలితాలిచ్చాయి. ప్రధానంగా పారిశ్రామికాభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించారు. ఎలాంటి హడావుడి లేకుండా అన్ని ప్రాంతాలకు భారీ పరిశ్రమలను తీసుకురావడమే కాకుండా, అవి ఉత్పత్తిని ప్రారంభించేలా అన్ని విధాలా ఊతమందించారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా టాటాలు, బిర్లాలు, అదానీ, అర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్ వంటి పారిశ్రామిక దిగ్గజాలతో పాటు విదేశీ సంస్థలు సైతం రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఉత్తరాంధ్రలోని అచ్యుతాపురం వద్ద జపాన్‌కు చెందిన యకహోమా టైర్స్ (అలయన్స్ టైర్స్ గ్రూపు), అదానీ డేటా సెంటర్, ఇన్ఫోసిస్, రాండ్‌స్టాండ్, లారస్ ల్యాబ్ వంటి దిగ్గజ సంస్థలు, విజయనగరంలో శారడా మెటల్స్ ఉత్పత్తిని ప్రారంభించాయి. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కోస్తాంధ్రలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బలభద్రపురంలో ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన గ్రాసిం ఇండస్ట్రీస్, కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద పెన్సులిన్ తయారీ సంస్థ లూఫిస్ ఫార్మా, ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఐటీసీ స్పైసెస్ పార్కు, పిడుగురాళ్ల వద్ద శ్రీ సిమెంట్స్, నెల్లూరు జిల్లాలో ఇండోసోల్ సోలార్ ప్యానల్స్ తయారీ, క్రిభ్‌కో ఇథనాల్, గ్రీన్‌లామ్ సొల్యూషన్స్, గోకుల్ ఆగ్రో ప్రారంభం అయ్యాయి. రాయలసీమలోని చిత్తూరులో బ్లూస్టార్, డైకిన్, హావెల్స్, యాంబర్, ఎన్‌జీసీ ట్రాన్స్‌మిషన్స్, టీసీఎల్, వైఎస్సార్ జిల్లాలో డిక్సన్, సెంచురీ ప్లేవుడ్స్, బిర్లా గార్మెంట్స్, కర్నూలు జిల్లాలో రాంకో సిమెంట్స్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్స్ వంటి భారీ పెట్టుబడులు వచ్చాయి.

పూర్తి వివరాలు IVలో

దోచుకో.. పంచుకో.. సూత్రం సారా వ్యాపారంలో ఆరితేరిపోయిన సీఎం రమేష్‌ను చంద్రబాబు నాయుడుకు దగ్గర చేసింది. సారా వ్యాపారంతో మొదలైన ఆర్జన ఇరిగేషన్ కాంట్రాక్టుల వరకు వెళ్లింది. టీడీపీ ప్రభుత్వం ఉన్నంతకాలం ఈ అక్రమార్జనపరుడికి ఎదురే లేకుండా పోయింది. రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో హంద్రీ –నీవా, వెలిగొండ, తెలుగుగంగ, గుంతకల్లు బ్రాంచి కెనాల్, వంశధార.. ఒకటేమిటి.. అధికారంలో బాబు అండతో సీఎం రమేష్ అక్రమాల్లో చెలరేగిపోయారు. బాబు– సీఎం రమేష్‌లది ఆర్థిక రాజకీయ బంధం. ఈ బంధం ఫెవికాల్ అంత దృఢంగా పెనవేసుకుపోయింది. బాబుతో ముడిపడిన ఆర్థిక బంధం రెండు టర్మ్‌ల్లో సీఎం రమేష్‌ను రాజ్యసభ సభ్యుడిని చేసింది. రాజకీయ చక్రం బాగా తిప్పుతారని సదరు బాబు సూచనతో బీజేపీ తీర్థం పుచ్చుకున్న ఇతనికి ఈసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగాలనిపించింది. స్థానికంగా అంత సీన్ లేనందున తన అక్రమాల నేపథ్యం తెలియని కోస్తాంధ్ర వైపు దృష్టి సారించారు.

సారా.. నారా అండ



దోపిడీకి C/O సీఎం రమేష్

-వివరాలు IIIలో

బ్రిజ్‌భూషణ్‌కు టికెట్‌పై... డోలాయమానం!

- కైసర్‌గంజ్ సిట్టింగ్ ఎంపీపై ఎటూ తేల్చని బీజేపీ
- వేధింపుల కేసులో తీర్పు కోసం ఎదురుచూపులు
- అభ్యర్థులను పెండింగ్‌లో పెట్టిన ఎస్పీ, బీఎస్పీ

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానం నుంచి వివాదాస్పద బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్ పోటీపై అయోమయం నెలకొంది. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనకు టికెటివ్వడంపై బీజేపీ పునరాలోచనలో పడ్డట్టు చెబుతున్నారు. ఈ కేసుపై ఢిల్లీ కోర్టు వెలువరించే తీర్పు ఆధారంగా తుది నిర్ణయానికి వచ్చే అవకాశం కన్పిస్తోంది. కేసును కొట్టేయాలన్న పోలీసుల పిటిషన్‌పై మే 20న తుది తీర్పు వెలువరించనున్నట్టు కోర్టు మంగళవారం పేర్కొంది.



అయితే ఐదో విడతలో కైసర్‌గంజ్‌లో పోలింగ్ కూడా అదే రోజున ఉండటం విశేషం! బీజేపీ ఎటూ తేల్చకపోవడంతో ప్రత్యర్థులైన సమాజ్‌వాదీ, బీఎస్పీ కూడా తమ అభ్యర్థులను ఇంకా ఖరారు చేయలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో బ్రిజ్‌భూషణ్ భార్య, మాజీ ఎంపీ కేతకీసింగ్‌కు బీజేపీ టికెటిచ్చే అవకాశముందని అంటున్నారు. వారి కుటుంబానికి బీజేపీ అవకాశమే ఇవ్వని పక్షంలో భార్యాభర్తల్లో ఎవరో ఒకరికి టికెటివ్వాలని సమాజ్‌వాదీ యోచిస్తున్నట్టు కూడా చెబుతున్నారు.

క్షత్రియ సామాజికవర్గానికి చెందిన బ్రిజ్‌భూషణ్ మూడు దశాబ్దాలుగా స్థానికంగా చక్రం తిప్పుతున్నారు. 1991లో గోండా నుంచి తొలిసారి ఎంపీగా గెలిచారు. 2009 నుంచి కైసర్‌గంజ్ ఎంపీగా గెలుస్తూ వస్తున్నారు. ఐదుసార్లు బీజేపీ టికెట్‌పై గెలిచారు. 2011 నుంచి 2023 దాకా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడిగా కొనసాగారు. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఎట్టకేలకు పదవి నుంచి తప్పుకున్నారు.

ఆ ఐదు చోట్ల అమీతుమీ

రెండో విడతలో అందరి దృష్టీ వీటిపైనే

- ఛత్తీస్‌గఢ్‌లో బఘెల్‌కు కఠిన పరీక్ష
- రాజ్‌నంద్‌గావ్‌లో చెమటోడుస్తున్న మాజీ సీఎం
- నాందేడ్‌లో బీజేపీ గెలుపు బాధ్యత చవాన్‌పై
- అమరావతిలో నటి నవనీత్ కౌర్ ఎదురీత
- పూర్ణియాలో ప్రధాన పార్టీలకు పప్పూ సవాల్
- బాలూర్‌ఘాట్‌లో సుకాంత వర్సెస్ మమత

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా రెండో విడతలో శుక్రవారం దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల పరిధిలోని 89 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. వాటిలో బీహార్, పశ్చిమబెంగాల్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ఐదు లోక్‌సభ స్థానాలు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. పలు సమీకరణాల నేపథ్యంలో అక్కడ హోరాహోరీ పోరు నెలకొనడమే ఇందుకు కారణం. ఆ స్థానాల్లో గెలుపును అధికార ఎన్డీఏ, విపక్ష ఇండియా కూటములు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో వాటిపై ఫోకస్...

– సాక్షి, నేషనల్ డెస్క్


పూర్ణియా (బిహార్)



• పప్పూయాదవ్

ఇక్కడ ఎన్డీఏ కూటమి నుంచి సిట్టింగ్ ఎంపీ, జేడీ(యూ) నేత సంతోష్ కుమార్ కుశ్వాహా ఈసారి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. విపక్ష ఇండియా కూటమి తరఫున ఆర్జేడీ నాయకురాలు బీమా భారతీ పోటీలో ఉన్నారు. ఆమె నెల క్రితమే జేడీ(యూ) నుంచి ఆర్జేడీలో చేరారు. కానీ బాహుబలి రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూయాదవ్ రంగప్రవేశంతో పోటీ ఒక్కసారిగా ఆసక్తికరంగా మారిపోయింది. ఆయనపై లెక్కలేనన్ని హత్య, హత్యాయత్నం తదితర కేసులున్నాయి. ఐదుసార్లు లోక్‌సభ ఎంపీగా నెగ్గారు. పదేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికల బరిలో దిగుతున్నారు. 2015లో ఆర్జేడీ నుంచి బహిష్కరణకు గురయ్యాక జన్ అధికార్ పార్టీ పేరుతో సొంత కుంపటి పెట్టుకున్నారు. కాంగ్రెస్ టికెట్‌పై ఆశతో దాన్ని ఇటీవలే ఆ పార్టీలో విలీనం చేశారు. కానీ కూటమి సర్దుబాటులో ఆ సీటు ఆర్జేడీకి వెళ్లడంతో ఆగ్రహించి స్వతంత్రునిగా రంగంలోకి దిగి ప్రధాన పార్టీల అభ్యర్థులకు పెనుసవాలు విసురుతున్నారు. గతంలో కూడా ఆయన స్వతంత్రునిగా నెగ్గడం విశేషం. సంతోష్‌కుమార్‌పై ఓటర్లలో అసంతృప్తి, వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. పైగా జేడీ(యూ) మాజీ నేత అయిన బీమా భారతీ కూడా ఆ పార్టీ ఓట్లను బాగానే చీల్చేలా కన్పిస్తున్నారు. ప్రణామ్ పూర్ణియా పేరిట పప్పూయాదవ్ చేస్తున్న ప్రచారానికి భారీ స్పందన లభిస్తుండటం విశేషం!

రాజ్‌నంద్‌గావ్ (ఛత్తీస్‌గఢ్)



• భూపేశ్ బఘెల్

ఈ స్థానం బీజేపీకి కంచుకోట. ఈసారి దాన్ని ఎలాగైనా బద్దలు కొట్టాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. అందులో భాగంగా తాజా మాజీ సీఎం భూపేశ్ బఘెల్‌ను బరిలో దింపింది. అయితే, కాకాగా ప్రసిద్ధుడైన ఆయన బహుముఖ సవాళ్లను ఎదుర్కొంటున్నారు. నిజానికి సీఎంగా ఈ ప్రాంతాన్ని బఘెల్ ఎంతగానో అభివృద్ధి చేశారు. పైగా ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 8 అసెంబ్లీ సీట్లలో ఏకంగా ఐదు కాంగ్రెస్ ఖాతాలోనే ఉన్నాయి. అయినా ఈసారి కూడా ఇక్కడ బీజేపీదే విజయమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఆ పార్టీ తరఫున బరిలో ఉన్న సిట్టింగ్ ఎంపీ సంతోష్ పాండే ఈసారి కూడా విజయంపై ధీమాగా ఉన్నారు. 2000లో రాష్ట్రం ఏర్పడ్డ నాటినుంచి ఒక్కసారి మినహా ఇక్కడ కాషాయ జెండాయే ఎగిరింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి నేపథ్యంలో ఇక్కడ గెలుపు బఘెల్‌కు తప్పనిసరిగా మారింది. దాంతో ఈ పోరును ఆయన అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సుడిగాలి పర్యటనలతో నియోజకవర్గమంతా చుట్టేస్తున్నారు. నిత్యం ఓటర్లను కలుస్తూ ఓట్లడుగుతున్నారు. కాకపోతే మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం ఆరోపణలు ఆయన అవకాశాలకు మరింతగా గండికొట్టేలా కన్పిస్తున్నాయి. ఇక్కడి ఓటర్లలో ఆదివాసీలు ఏకంగా 35 శాతం, ఓబీసీలు 30 శాతమున్నారు.

నాందేడ్ (మహారాష్ట్ర)



• అశోక్ చవాన్

ఈ లోక్‌సభ స్థానం కొన్నాళ్ల క్రితం దాకా కాంగ్రెస్‌కు పెట్టని కోట. కానీ ఆ పార్టీ అగ్ర నేత, మాజీ సీఎం అశోక్ చవాన్ ఇటీవల బీజేపీలో చేరడంతో ఇక్కడ సమీకరణాలు పూర్తిగా మారాయి. దానికి తోడు గత ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ పాగా వేసింది. అయితే సిట్టింగ్ బీజేపీ ఎంపీ ప్రతాప్‌రావ్ గోవిందరావ్ పాటిల్ చికలీకర్‌కు ఇండియా కూటమి తరఫున వసంత్ చవాన్ ఈసారి గట్టి పోటీ ఇస్తున్నారు. దీనికి తోడు ప్రకాశ్ అంబేడ్కర్ పార్టీ వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) కూడా బరిలో ఉండటంతో ముక్కోణపు పోరు నెలకొంది. ఈ సెగ్మెంట్లో సంఖ్యాధికులైన ఓబీసీలు బీజేపీకి గట్టి ఓటు బ్యాంకు. కానీ అదే సామాజిక వర్గానికి చెందిన వీబీఏ అభ్యర్థి అవినాశ్ భోసికర్ బీజేపీ ఓట్లను చీలుస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో చికలీకర్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యతను పార్టీ నాయకత్వం అశోక్ చవాన్‌పై ఉంచింది. దాంతో ఆయన సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. వీబీఏ అభ్యర్థి బీజేపీ వ్యతిరేక ఓట్లనే చీల్చి చికిలీకర్ విజయాన్ని సునాయాసం చేస్తారని చవాన్ చెబుతున్నారు.

అమరావతి (మహారాష్ట్ర)



• నవనీత్ కౌర్ రాణా

రాష్ట్రంలో అత్యంత హోరాహోరీ పోరు నెలకొన్న స్థానాల్లో ఇదొకటి. సిట్టింగ్ ఎంపీ, సినీ నటి నవనీత్ కౌర్ రాణా ఈసారి బీజేపీ టికెట్‌పై బరిలో ఉన్నారు. ఆమె 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్సీపీ దన్నుతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కేంద్ర మాజీ మంత్రి ఆనంద్‌రావ్ అడ్సుల్‌పై నెగ్గి తొలిసారి లోక్‌సభలో ప్రవేశించారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి మాత్రం ఎదురీదుతున్నారు. ఎందుకంటే ఆమెకు టికెటివ్వడంపై స్థానిక బీజేపీ నేతలు గుర్రుగా ఉన్నారు. ఇది చాలదన్నట్టు ఎన్డీఏ స్థానిక భాగస్వామి ప్రహార్ పార్టీ రాణా అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ పార్టీ తరఫున దినేశ్ బూబ్‌ను పోటీకి నిలిపింది! దీనికి తోడు మహావికాస్ అఘాడీ కూటమి తరఫున బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బల్వంత్ వాంఖడేకు నియోజకవర్గమంతటా మంచి పేరుంది. పైగా ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు అసెంబ్లీ సీట్లలో మూడు కాంగ్రెస్ చేతిలోనే ఉన్నాయి. అయితే వంచిత్ బహుజన్ పార్టీ నుంచి బరిలో ఉన్న అంబేడ్కర్ మనవడు ఆనంద్‌రాజ్ అంబేడ్కర్ కాంగ్రెస్ ఓట్లను భారీగా చీలుస్తారని భావిస్తున్నారు. ఇది రాణాకు బాగా కలిసొచ్చే అంశం.

బాలూర్‌ఘాట్ (పశ్చిమబెంగాల్)



• సుకాంత మజుందార్

పశ్చిమబెంగాల్లో బీజేపీ, అధికార తృణమూల్ కాంగ్రెస్ నడుమ హోరాహోరీ పోటీ నెలకొన్న లోక్‌సభ స్థానాల్లో బాలూర్‌ఘాట్ ముఖ్యమైనది. ఇక్కడి నుంచి బీజేపీ తరఫున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, సిట్టింగ్ ఎంపీ సుకాంత మజుందార్ పోటీ చేస్తున్నారు. 2019లో బీజేపీ తొలిసారిగా రాష్ట్రంలో భారీగా సీట్లను గెలుచుకోవడం తెలిసిందే. ఆ ఎన్నికల్లో తృణమూల్ అభ్యర్థి అర్పితా ఘోష్‌పై సుకాంత భారీ మెజారిటీతో నెగ్గారు. దాంతో ఈసారి బాలూర్‌ఘాట్‌ను తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సుకాంతను ఎలాగైనా ఓడించి తీరాలని పట్టుదలగా ఉన్నారు. రాష్ట్ర మంత్రి విప్లవ్ మిత్రాను మమత బరిలో దించడంతో పోరు మరింత ఆసక్తికరంగా మారింది. అయినా సుకాంత మాత్రం బాలూర్‌ఘాట్‌తో పాటు బెంగాల్ మొత్తాన్నీ మోదీ వేవ్‌లో బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందంటున్నారు. ఈసారి కూడా తనకు భారీ మెజారిటీ ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తృణమూల్ నేతల అంతులేని అవినీతి, సందేశ్‌ఖాలీలో మహిళలపై వారి అకృత్యాలతో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా విసిగిపోయారని చెబుతున్నారు.

మీరట్ (ఉత్తరప్రదేశ్)



• అరుణ్ గోవిల్

'టీవీ రాముడు' అరుణ్ గోవిల్ పోటీతో ఈ లోక్‌సభ స్థానం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. దూరదర్శన్‌లో సీరియల్‌గా వచ్చిన రామాయణంలో రాముని పాత్ర పోషించిన ఆయన దేశవ్యాప్త క్రేజ్ సంపాదించారు. బీజేపీ ఆయనను అనూహ్యంగా పార్టీలో చేర్చుకోవడమే గాక మీరట్ టికెట్ కూడా ఇచ్చింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో 80 స్థానాలకు గాను బీజేపీ 62 చోట్ల నెగ్గడం తెలిసిందే. ఈసారి దేశవ్యాప్తంగా సొంతంగా 370 లోక్‌సభ స్థానాల లక్ష్యాన్ని సాధించాలంటే యూపీలో క్లీన్‌స్వీప్ చేయడం తప్పనిసరని పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో మీరట్ పరిసరాల్లోని పలు లోక్‌సభ స్థానాల్లో గోవిల్ ప్రభావం చూపుతారన్న అంచనాతో ఆయన్ను బరిలోకి దింపింది. సమాజ్‌వాదీ నుంచి సునీతా వర్మ, బీఎస్పీ నుంచి దేవవ్రత్ కుమార్ త్యాగి ఆయనకు ప్రత్యర్థులుగా బరిలో ఉన్నారు.

13 ముచ్చట రిపీట్!

తొలిసారి 13 రోజుల ముచ్చటగా ముగిసిన వాజ్‌పేయి పాలన రెండో విడతలో 13 నెలలకే పరిమితమైంది! గతానుభవంతో 1998 లోక్‌సభ ఎన్నికల్లో వీలైనన్ని ప్రాంతీయ పార్టీల మద్దతు సాధించి ఎన్డీఏ సర్కారును ఏర్పాటు చేసినా జయలలిత రూపంలో ముప్పు ముంచేసింది. కాంగ్రెసైనా, బీజేపీ అయినా కేంద్రంలో పాగా వేయాలంటే ప్రాంతీయ పార్టీలతో కలసి సాగాల్సిన పరిస్థితులు మరింతగా బలపడ్డాయి. అలా 12వ లోక్‌సభా కాలం దేశ రాజకీయాల్లో ఎప్పటికీ గుర్తుండిపోతుంది...

– సాక్షి, నేషనల్ డెస్క్



వాజ్‌పేయికి అచ్చిరాని 13

- కొంప ముంచిన జయలలిత, గమాంగ్
- 13 నెలలకే పడిపోయిన ఎన్డీఏ సర్కారు
- రెండేళ్లయినా కొనసాగని 12వ లోక్‌సభ

''మీకు అధికారం కావాలి. మేం మాత్రం దేశం కోసం పని చేయాలనుకుంటున్నాం. ఆ ప్రయత్నం నెరవేరేదాకా విశ్రమించేదే లేదు'' అని 1996 మేలో బల నిరూపణకు ముందే ప్రధాని పదవికి రాజీనామా చేస్తూ విపక్షాలనుద్దేశించి వాజ్‌పేయి చేసిన వ్యాఖ్యలు! అన్నట్టుగానే 1998లో కేంద్రంలో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారాయన. 1998 ఫిబ్రవరి 16, 22, 28 తేదీల్లో లోక్‌సభకు ఎన్నికలు జరగ్గా మరోసారి హంగే ఏర్పడింది. బీజేపీ బలం ఇంకాస్త పెరిగి 182 స్థానాలకు చేరింది. కాంగ్రెస్‌కు 141 సీట్లు దక్కాయి. సీపీఎం 32, సమాజ్‌వాదీ 20, అన్నాడీఎంకే 18, ఆర్జేడీ 17, టీడీపీ, సమతా పార్టీ చెరో 12 స్థానాలు నెగ్గాయి.

ఏడాదితో సరి

1998లో బీజేపీ ముందుగానే ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుంది. వాటితో కలిపి సీట్ల సంఖ్య 252కు చేరింది. టీడీపీ బయటి నుంచి మద్దతుతో వాజ్‌పేయి రెండోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. కానీ కొద్ది రోజులకే అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత బెదిరింపులకు దిగారు. తమిళనాట డీఎంకే సర్కారును రద్దు చేయాలని, అది తనపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఒత్తిళ్లు తేవడం మొదలుపెట్టారు. లేదంటే మద్దతు ఉపసంహరిస్తానని బెదిరించినా వాజ్‌పేయి తలొగ్గలేదు. జయ అన్నంత పనీ చేయడంతో లోక్‌సభలో బలపరీక్ష తప్పలేదు. 270 ఓట్లొస్తే సర్కారు గట్టెక్కేది. కానీ 269 దగ్గరే ఆగిపోయింది. ఒకే ఒక్క ఓటు తేడాతో 13 నెలలకే ప్రభుత్వం పడిపోయింది.

బీఎస్పీ యూటర్న్

ఐదుగురు ఎంపీలున్న బీఎస్పీ వాజ్‌పేయి సర్కారుకు మద్దతిస్తానని హామీ ఇచ్చింది. తీరా ఓటింగ్ సమయానికి పార్టీ అగ్రనేత మాయావతి అడ్డం తిరిగారు. తాము సర్కారుకు వ్యతిరేకమని ప్రకటించి వాజ్‌పేయి ఆశలపై నీళ్లుచల్లారు. అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్‌ను రాష్ట్రపతి ఆహ్వానించారు. కానీ మద్దతు కూడగట్టలేక పార్టీ ముందుకు రాకపోవడంతో మళ్లీ ఎన్నికలు అనివార్యమయ్యాయి.

గతం

సోనియా ప్రభావం అంతంతే

రాజీవ్‌గాంధీ మరణించిన నాటి నుంచీ కాంగ్రెస్ నేతలు ఎంతగా ఒత్తిడి చేస్తున్నా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న సోనియాగాంధీ 1998 ఎన్నికల ముంగిట అరంగేట్రం చేశారు. అయితే ఎన్నికల్లో ఆమె దేశవ్యాప్త ప్రచారం అంతంతగానే లాభించింది.

ఆ ఒక్క ఓటు...!



ఒకే ఒక్క ఓటుతో వాజ్‌పేయి సర్కారు కూలిపోవడానికి ప్రధాన కారకుడిగా ఒడిశాకు చెందిన కాంగ్రెస్ ఎంపీ గిరిధర్ గమాంగ్ శాశ్వత అప్రతిష్ట మూటగట్టుకున్నారు. కోరాపుట్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన వాజ్‌పేయి ప్రభుత్వ బలపరీక్షకు కాస్త ముందే ఒడిశా సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. దాంతో విశ్వాస పరీక్షలో ఓటేయడానికి గమాంగ్ అనర్హుడని ఎన్డీఏ వాదించింది. కానీ ఆయన ఇంకా లోక్‌సభకు రాజీనామా చేయకపోవడంతో ఓటేసేందుకు అర్హుడేనని స్పీకర్ తేల్చిచెప్పారు. చివరికి ఆయన వేసిన ఆ ఒక్క ఓటు తేడాతోనే సర్కారు పడిపోయింది! అన్నట్టూ, కాంగ్రెస్ తరఫున ఏకంగా తొమ్మిదిసార్లు ఎంపీగా నెగ్గిన గమాంగ్ 2015లో బీజేపీలో చేరడం విశేషం!

అణుపరీక్ష కార్గిల్ యుద్ధం

- దేశ భద్రతకు వాజ్‌పేయి సర్కారు ప్రథమ ప్రాధాన్యమిచ్చింది. ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నా, పాశ్చాత్య దేశాల ఆంక్షలున్నా వెరవకుండా అణ్వస్త్ర పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. 1998 మే 11–13 మధ్య పోఖ్రాన్‌లో వరుసగా ఐదు అణుబాంబులను పరీక్షించింది.
- వాజ్‌పేయి ఆపద్ధర్మ ప్రధానిగా ఉన్న వేళ కశ్మీర్ దురాక్రమణకు తెగబడింది పాకిస్తాన్. ఉగ్రవాదుల ముసుగులో పాక్ దళాలు నియంత్రణ రేఖ దాటుకుని కార్గిల్ ప్రాంతాన్ని ఆక్రమించాయి. 1999 మే 3 నుంచి జూలై 26 దాకా రెండు నెలలకు పైగా సాగిన యుద్ధంలో పాక్ సైన్యాన్ని భారత దళాలు తరిమికొట్టాయి.

12వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 543)

పార్టీ	స్థానాలు
బీజేపీ	182
కాంగ్రెస్	141
సీపీఎం	32
సమాజ్‌వాదీ	20
అన్నాడీఎంకే	18
ఆర్జేడీ	17
టీడీపీ	12
సమతా పార్టీ	12
ఇతరులు	103
స్వతంత్రులు	6

ఇప్పుడు మధుర గోపిక

హేమమాలిని. డ్రీమ్‌గాళ్‌గా హృదయాలను కొల్లగొట్టిన తమిళ పొన్ను. 75 ఏళ్ల వయసులోనూ క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. యూపీలోని మధుర నుంచి ముచ్చటగా మూడోసారి నెగ్గి హ్యాట్రిక్ కొట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. 'ఇదే నా చివరి పోటీ. గత హామీలన్నీ నెరవేర్చి రాజకీయాల నుంచి తప్పుకుంటా' అని ప్రకటించారు...

– సాక్షి, నేషనల్ డెస్క్



పరిచయం

రాజకీయ ప్రస్థానం..

బాలీవుడ్‌లో సూపర్‌స్టార్‌గా వెలుగొందిన హేమమాలిని 2003లో రాజ్యసభకు నామినేటయ్యారు. 2010లో బీజేపీ ప్రధాన కార్యదర్శి అయ్యాక 2011లో మరోసారి రాజ్యసభకు నామినేటయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మధుర నుంచి బీజేపీ తరఫున ఆరెల్డీ చీఫ్ జయంత్ చౌదరిపై పోటీ చేశారు. మధురలో జాట్ల ప్రాబల్యం ఎక్కువ. హేమ భర్త, బాలీవుడ్ హీమాన్ ధర్మేంద్రది అదే సామాజికవర్గం. 'జాట్ల కోడలు' అంటూ భార్య కోసం ఆయన ప్రచారం వారిని ఆకట్టుకుంది. అలా 2014లో నెగ్గిన ఆమె 2019 లోక్‌సభ ఎన్నికల్లో మరింత మెజారిటీతో విజయం సాధించారు.

బృందావనవాసిని...

మధురను మరింత అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యమంటారు హేమ. తాను నాన్‌లోకల్ అన్న ఆరోపణలను దీటుగా తిప్పికొడుతూ వచ్చారు. ''నాకు ముంబైలో ఇల్లుంటే సమస్యేమిటి? మధురలోనూ నాకు సొంతిల్లుంది. నేను బృందావనవాసిని. మధురతో నాది దైవిక బంధం'' అంటారు. తొలిసారి లోక్‌సభకు నెగ్గాక రెండేళ్లపాటు ప్రజలతో కలవడానికి ఇబ్బంది పడ్డానని అంగీకరిస్తారు. అలాంటి హేమ 2019 ఎన్నికల నాటికి ఆరితేరిన నేతగా ఎదిగారు.

ఆత్మకథ రాస్తా...

హేమమాలినిది తమిళనాడు. వీఎస్ఆర్ చక్రవర్తి అయ్యంగార్, జయలక్ష్మి దంపతులకు 1948 అక్టోబర్ 16 జన్మించారు. 11వ తరగతి మధ్యలోనే ఆపేశారు. 16 ఏళ్లకే సినిమాల్లో అడుగుపెట్టారు. తెలుగు, తమిళ సినిమాల్లో నటించాక 1968లో రాజ్‌కపూర్ సరసన సప్నోం కా సౌదాగర్ చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలతో తిరుగులేని తారగా వెలుగొందారు. ధర్మేంద్రతో 35 చిత్రాల్లో కలిసి నటించారు. అప్పటికే పెళ్లై పిల్లలున్న ధర్మేంద్రను ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తొలి చిత్రం 'దిల్ ఆష్నా హై'కి హేమ దర్శకత్వం వహించడం విశేషం! సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉంటారు. భరతనాట్యమంటే ఆమెకు ప్రాణం. ''ఎప్పటికైనా ఆత్మకథ రాస్తా. ప్రత్యేకించి నా డ్యాన్స్ అనుభవాలను పొందుపరుస్తా. అలాగే కుటుంబానికి సమయం కేటాయించుకోవాలి. నాకెంతో ఇష్టమైన డ్యాన్స్‌పై మరింత ఫోకస్ చేయాలి. అందుకే ఈసారి హామీలన్నీ నెరవేర్చి రాజకీయాలకు గుడ్‌బై చెప్తా'' అని ఇప్పటికే ప్రకటించారు.

ఇదీ నవరత్నాల వెలుగులు



ఓబిరెడ్డి కుటుంబానికి కలిగిన లబ్ధి ఇలా...

పథకం	టీడీపీలో	వైఎస్సార్‌సీపీలో
డ్వాక్రా రుణమాఫీ	00	రూ.44 వేలు
పింఛన్	రూ.62,000	రూ.1.89 లక్షలు
ఆరోగ్యశ్రీ	00	రూ.60 వేలు
వైఎస్సార్‌బీమా	00	రూ.1 లక్ష
సున్నా వడ్డీ	00	రూ.8 వేలు
విద్యా దీవెన	00	రూ.25 వేలు
వసతి దీవెన	00	రూ.15 వేలు
అమ్మ ఒడి	00	రూ.55 వేలు
నిరుద్యోగ భృతి	రూ.4 వేలు	00
యానిమేటర్	00	రూ.2.40 లక్షలు

ఆ ఇంటి యజమాని ఓ ప్రైవేట్ డ్రైవర్. తన సంపాదనతోనే సంసారాన్ని నెట్టుకొచ్చేవాడు. ఆ కుటుంబంలో తల్లి, భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. అరకొర సంపాదన తిండికే సరిపోయేది కాదు. తల్లికి రూ.200 మాత్రమే వితంతు పింఛన్ వచ్చేది. భార్య ఎంఏ, బీఈడీ చదివింది. నాలుగురాళ్లు వెనకేసుకుని పిల్లలను బాగా చదివించుకోవాలనే ఆశ ఉన్నా... సర్కారు సహకారం కొరవడింది. ఇదీ గతంలో అనంతపురం జిల్లాలోని అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన వెన్నపూస ఓబిరెడ్డి కుటుంబ పరిస్థితి. ఎన్నో ఒడుదుడుకులను తట్టుకుంటూ నెట్టుకు వచ్చిన ఈ కుటుంబం నేడు వైఎస్సాసీపీ ప్రభుత్వ సహకారంతో సుఖసంతోషాలతో జీవిస్తోంది. – అనంతపురం

దిక్కుతోచని కుటుంబం దిశ మారింది..!

2014 ఎన్నికల సమయంలో టీడీపీకి ఓట్లు వేస్తే డ్వాక్రా రుణాలు, బంగారు రుణాలు మాఫీ చేస్తామని, ఇంటికో ఉద్యోగం లేదా ప్రతినెలా రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మాటలతో ఓబిరెడ్డి కుటుంబం గంపెడు ఆశలు పెట్టుకుంది. తీరా ఆయన డ్వాక్రా రుణాలు మాఫీ చేయలేదు. వారి హామీతో మూడు నెలలు అప్పు కట్టలేదు. నెలనెలా వడ్డీ పెరుగుతోందని బ్యాంకు సిబ్బంది హెచ్చరిస్తూ వచ్చేవారు. ఒక వేళ మాఫీ చేసినా..మీరు చెల్లించిన సొమ్ము వెనక్కు ఇస్తామని, మాఫీ చేయకపోతే వడ్డీ మీ నెత్తిన పడుతుందని చెప్పారు. దీంతో సభ్యులంతా మాట్లాడుకుని అప్పు కడుతూ వచ్చారు. అలాగే ఇంట్లో ఉన్న బంగారమంతా బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.70 వేలు రుణం తీసుకున్నారు. అదికూడా మాఫీ కాలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన ఈ నాలున్నరేళ్లలో



యానిమేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రమీల

మొత్తం రూ.7,36,000 మేరకు ఆర్థిక సహాయాన్ని పొందారు. వైఎస్సార్ ఆసరా కింద భార్యకు రూ.44 వేలు వచ్చింది. వడ్డీ లేని రుణాలు కూడా ఇచ్చారు. ఇంటి పెద్ద కన్నుమూయగా వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష వచ్చింది. యానిమేటర్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఇంట్లో ఇద్దరికి పింఛన్ వస్తోంది. ఇప్పుడు తమ కుటుంబం ఆనందంగా గడుపుతోందని ఓబిరెడ్డి ప్రమీల చెప్పారు.

‘సంక్షేమం’ లేకుండా సుస్థిరాభివృద్ధి అసాధ్యం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయి. దేశంలో ఎక్కడైనా ఈ సంక్షేమ పథకాలు అమలు చేయకుండా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడం అసాధ్యం. ఏపీ ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేని విధంగా అమలు చేస్తున్న నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు చేరువలో ఉన్నాయి. వీటిద్వారా సగటు మానవుని జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి.


– గుర్రం జయపాల్‌రెడ్డి, జెడ్పీ రిటైర్డ్ సీఈఓ

• సారా.. నారా అండతో

దోపిడీకి c/o సీఎం రమేష్

సాక్షి ప్రతినిధి, కడప : స్వయం కృషితో కష్టపడి ఉన్నత స్థాయికి చేరేవారు కొందరైతే, రాజకీయ అండ దొరకబుచ్చుకుని చెలరేగిపోయే వారు ఇంకొందరు. ఇందులో రెండో కోవకు చెందిన నేత చింతకుంట మునెయ్యగారి (సీఎం) రమేష్ నాయుడు. ఉరఫ్ సీఎం రమేష్. చిత్తూరు జిల్లా సారా వ్యాపారంలో చంద్రబాబుతో ఏర్పడ్డ సాన్నిహిత్యం ఉన్నత స్థాయికి ఎదిగేలా చేసింది. అదీ ఏ స్థాయిలో అంటే సొంత తమ్ముడు నారా రామ్మూర్తినాయుడినే బాబు పక్కన పెట్టే స్థాయిలో సంబంధాలు పెనువేసుకున్నాయని పరిశీలకుల అభిప్రాయం. విభజిత ఏపీలో సీఎం రమేష్‌నాయుడు కాంట్రాక్టు సంస్థ దినదినాభివృద్ధి చెందింది. చంద్రబాబు ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అనేక అక్రమ కార్యకలాపాలను శరవేగంగా నడిపారు. ఎంతలా అంటే 2019 ఎన్నికల నోటిఫికేషన్‌కు కేవలం ఒక్క రోజు ముందే ఈయన కాంట్రాక్టు సంస్థకే ఇరిగేషన్ పనులు దక్కేలా చక్రం తిప్పారు. ఒక్కమాటలో చెప్పాలంటే టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్నాళ్లు సీఎం రమేష్ ఆర్థిక సామ్రాజ్యం విస్తరించింది.

- సారా వ్యాపారంతో ప్రస్థానం ప్రారంభం
- ప్రేమ వివాహంతో చిత్తూరు జిల్లాకు విస్తరణ
- చంద్రబాబుతో పెరిగిన వ్యాపార, రాజకీయ చెలిమి
- రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ పేరిట అడ్డగోలు కాంట్రాక్టులు
- రెండు టర్మ్‌లు రాజ్యసభకు ఎంపిక
- బాబు సూచన మేరకు చక్రం తిప్పేందుకు కమలం తీర్థం
- టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ పనుల్లో చేతివాటం
- నీరు–చెట్టు పనులతో సొంత భూముల ప్రొటెక్షన్
- ఆర్టీపీపీ కేంద్రంగా యథేచ్ఛగా కొనసాగిన దోపిడీ
- రాయలసీమలో ప్రజాబలం లేక కోస్తాంధ్రపై కన్ను
- బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి..



ఎవరీ సీఎం రమేష్ నాయుడు?

వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చెందిన చింతకుంట మునెయ్యగారి (సీఎం) సుబ్బానాయుడు మాజీ మంత్రి ఎంవీ మైసూరారెడ్డి అనుచరుడు. సారా వ్యాపారంలో రాణించారు. కడప జిల్లాలో పలుప్రాంత్రాల్లో ఈ వ్యాపారాన్ని విస్తరించారు. ఆయనకు నలుగురు కుమారులు. మునిస్వామినాయుడు, గోవర్ధన్‌నాయుడు, సత్యనారాయణనాయుడు, గోపాల్‌నాయుడు. తండ్రి సుబ్బానాయుడు వారసత్వంగా కుమారులు పలువ్యాపారాలను విస్తరించారు. ఈ క్రమంలో మునిస్వామినాయుడు సారా వ్యాపారాన్ని కొనసాగించారు. అప్పట్లో కడప జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న సారా కాంట్రాక్టును చిత్తూరు జిల్లాకు విస్తరించారు. ఈ జిల్లాలో సారా కాంట్రాక్టు కార్యకలాపాలను మునిస్వామినాయుడు కుమారుడు సీఎం రమేష్‌నాయుడు కొనసాగించారని ఈ వ్యవహారం మొత్తం తెలిసిన పలువురు వివరిస్తున్నారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లాలో అప్పటికే క్రియాశీలకంగా ఉన్న చంద్రబాబుతో సాన్నిహిత్యం కోసం తొలుత తమ్ముడు నారా రామ్మూర్తినాయుడితో సీఎం రమేష్ దోస్తీ చేశారు. క్రమంగా వీరి సాన్నిహిత్యం పెరిగి, తుదకు నారా రామ్మూర్తినాయుడినే చంద్రబాబు నుంచి దూరం పెట్టేలా చేసింది. చిత్తూరు జిల్లాలో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన యువతిని సీఎం రమేష్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. దాంతో వెలమ సామాజిక వర్గానికి చెందిన సీఎం రమేష్ బాబుకు మరింత దగ్గరైనట్లు సమాచారం. అనంతరం 1994 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఆయనకు చంద్రగిరి, కుప్పం నియోజకవర్గాల సమన్వయ బాధ్యతలు అప్పగించినట్లు పలువురు చెబుతున్నారు. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో సీఎం రమేష్ సారా వ్యాపార సామ్రాజ్యం వేగంగా విస్తరించినట్లు సమాచారం. అప్పటి సాన్నిహిత్యమే అంచెలంచెలుగా ఎదిగి టీడీపీ నుంచి రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యే స్థాయికి చేరుకుందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

టీడీపీ హయాంలో రూ.3,658 కోట్ల పనులు

రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ అధికార పగ్గాలు చేపట్టింది. రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇదో వరంగా పరిణమించింది. అప్పటి వరకూ వివిధ రాష్ట్రాల్లో కాంట్రాక్టు పనులు చేస్తూ ఆర్థిక లోటుపాట్లతో ఇబ్బందులు పడుతున్న ఆ సంస్థకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదరించి అండగా నిలిచింది. ఈ క్రమంలో ఈ సంస్థకు కాంట్రాక్టు పనుల వరద పారిందని పలువురు వివరిస్తున్నారు. అందులో ప్రధానంగా కుప్పం బ్రాంచ్ కెనాల్ రూ.522 కోట్లు, హంద్రీ–నీవా సుజల స్రవంతి ఫేజ్–2 రూ.1000 కోట్లు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ విస్తరణ పనులు రూ.195 కోట్లు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ 34వ ప్యాకేజీ రూ.234 కోట్లు, జీఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టులో రూ.350 కోట్లు, వెలిగొండ టన్నెల్ రూ.270 కోట్లు, తెలుగుగంగ లైనింగ్ పనులు రూ.289 కోట్లు, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ రూ.172 కోట్లు, వంశధార ప్రాజెక్టు పనులు రూ.120 కోట్లు, ఆర్టీపీపీ 6వ ప్లాంటు నిర్మాణ పనులు రూ.400 కోట్లు, గండికోట ప్రాజెక్టు పునరావాస నిర్మాణం పనులు రూ.106 కోట్ల పనులు దక్కినట్లు పలు కాంట్రాక్టు సంస్థలు వెల్లడిస్తున్నాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో దాదాపు రూ.3,658 కోట్ల పైబడిన కాంట్రాక్టులను ఆ సంస్థ కొనసాగిస్తున్నట్లు పలువురు కాంట్రాక్టర్ల విశ్వసనీయ సమాచారం. అదే విషయాన్ని ప్రొద్దుటూరు నియోజకవర్గ అప్పటి టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి (ప్రస్తుత టీడీపీ అభ్యర్థి) సైతం పలుమార్లు స్పష్టం చేశారు. ఎంపీ రమేష్‌నాయుడుకు చెందిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు.

ఆర్టీపీపీలో అడ్డగోలు

టీడీపీ ఎంపీ హోదాలో రాష్ట్ర వ్యాప్తంగా సీఎం రమేష్ దందా నిర్వహిస్తే, సోదరుడు సీఎం సురేష్‌నాయుడు స్థానికంగా ఆర్టీపీపీ (రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్) కేంద్రంగా దోపిడీ చేశారు. ఇనుము (స్క్రాప్), సిమెంటు, కంకర యథేచ్ఛగా తరలించారు. తన దారికి అడ్డు లేకుండా మరో రహదారి (అనధికారిక గేట్) ఏర్పాటు చేసి మరీ తరలించారు. మూడేళ్ల పాటు జెన్‌కో డైరెక్టర్లు చోద్యం చూడటం మినహా కట్టడి చేయలేని దుస్థితి. ఆర్టీపీపీలో అధికారికంగా రెండుగేట్లు ఉన్నాయి. వాటి పరిధిలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) బందోబస్తు ఉంటుంది. ప్రతిదీ అక్కడ రికార్డు అవుతుంది. ఈ క్రమంలో అనధికారికంగా మూడో గేటు వెలసింది. అందుకు అప్పటి సీఈ, ఓ డైరెక్టర్ స్థాయిలో సహకరించారు. 6వ యూనిట్ నిర్మాణ పనుల నేపథ్యంలో వాహనాల రాకపోకలకు మూడో గేట్ ఏర్పాటు చేసినట్లు యంత్రాంగం సమర్థించుకుంది. ఆ గేటులో ఎలాంటి సిబ్బంది లేకపోవటంతో అవినీతి అక్రమాలకు నిలయంగా మారింది. యథేచ్ఛగా ఈదారి గుండా వాహనాలు ఆర్టీపీపీలోకి వెళ్లడం, బయటికి రావడంతో అందులో ఉన్న కోట్లాది రూపాయల స్క్రాప్, కంకర, సిమెంటు బయటకు వెళ్లింది. విజిలెన్సు విభాగం యాజమాన్యానికి అప్పట్లో ఈ విషయమై నివేదించినా ఫలితం లేకపోయింది.

చంద్రబాబు అండ

చిత్తూరు జిల్లాలో సారా వ్యాపారంతో అరంగేట్రం చేసిన సీఎం రమేష్ కుటుంబానికి అప్పటి నుంచే చంద్రబాబునాయుడు అండగా నిలిచి ఆదరించారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో గుడిమల్లం దేవాలయ భూములు 303 ఎకరాలు వేలానికి వచ్చాయి. అప్పటి రాజకీయ సంబంధాల కారణంగా సీఎం రమేష్ కుటుంబం తక్కువ ధరలకు ఆ భూములను వేలంలో దక్కించుకున్నట్లు సమాచారం. ఆ భూముల ఆధారంగా 90వ దశకం చివర్లో అప్పటి రాజకీయ పలుకుబడితో బ్యాంకులో దాదాపు రూ.400 కోట్ల రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. తర్వాత రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కార్యకలాపాలు చురుగ్గా సాగినట్లు వాటి కార్యకలాపాలే చెబుతున్నాయి.

అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీఎం రమేష్‌నాయుడుపై 2019 ఏప్రిల్ 11న వైఎస్సార్ కడప జిల్లా యర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 2019 ఎన్నికల సమయంలో యర్రగుంట్లలోని ఓ ఎన్నికల బూత్‌లోకి

వ్యక్తిపై దాడి కేసు

నిబంధనలకు విరుద్ధంగా ఒకరికంటే ఎక్కువ మంది వెళ్లడంతోపాటు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడు పడిగపాటి వెంకటసుధాకర్ తండ్రి బాల సుబ్బిరెడ్డి ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు సీఎం రమేష్‌పై 100/2019 ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఐపీసీ సెక్షన్ 323, 324/ఆర్/డబ్లు 34 కింద కేసు నమోదు చేశారు.




ప్రభుత్వ నిధులతో భూములకు ప్రొటెక్షన్ వాల్

పోట్లదుర్తి గ్రామంలో నీరు–చెట్టు పథకం కింద ఫ్లడ్ ప్రొటెక్షన్ బ్యాంక్స్ ఏర్పాటు చేసేందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ జీఓ జారీ చేసింది. జీఓ ఆర్‌టీ నంబర్ 74 ను 2019 జనవరి, 29న జారీ చేశారు. ఆ మేరకు నీరు–చెట్టు పథకం కింద ఫ్లడ్ ప్రొటెక్షన్ బ్యాంక్స్ నిర్మించేందుకు ఫిబ్రవరి 1న ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను ఆ శాఖ ఎస్‌ఈ ఆహ్వానించారు. అంటే విషయం గ్రహించేలోపు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేలా వ్యవహరించారు. ఎన్నికల కోడ్‌కు ముందే టెండర్లకు పిలిచిన నేపథ్యంలో ఫిబ్రవరి 19న టెండర్లు ఫైనల్ చేశారు. పలు కాంట్రాక్టు సంస్థలు పోటీపడ్డా ఆయా సంస్థలను డిస్‌క్వాలిఫై చేసి రిత్విక్ సంస్థకు మాత్రమే టెండర్‌ను 4 శాతం ఎక్సెస్ రేట్లకు ఖరారు చేశారు. అవే పనులను రూ.3.08 కోట్లతో రమేష్‌నాయుడు కుటుంబ సభ్యుల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ నిర్మించడం విశేషం.

కోస్తాంధ్రలోనే ఎందుకంటే..

సీఎం రమేష్‌నాయుడు ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నా, రాయలసీమలో అందునా కడప జిల్లాలో రాజకీయంగా గ్రామానికి ఎక్కువ, మండలానికి తక్కువ స్థాయి. అదే విషయాన్ని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అనేక పర్యాయాలు చెప్పుకొచ్చారు. అలాంటి స్థాయిలేని నాయకుడికి అనధికారికంగా జిల్లా బాధ్యతలు అప్పగించి ప్రజాధనం దోపిడీకి పాల్పడుతున్నారని అప్పట్లో తీవ్రంగా ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ప్రజాబలం లేని కడప నుంచి పోటీ చేయలేక, కోస్తాంధ్రలోని అనకాపల్లి బీజేపీ అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. ఎన్నికల్లో ఖర్చు చేయగల సామర్థ్యం, పైగా టీడీపీ అధినేత చంద్రబాబుతో ఉన్న సాన్నిహిత్యం వల్లే అక్కడ పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని పరిశీలకులు భావిస్తున్నారు.

ఆర్థికాభివృద్ధి అదుర్స్



గత ఐదేళ్లలో బ్యాంకుల్లో డిపాజిట్లు పెరుగుదల, రుణాలు మంజూరుపెరుగుదల ఇలా ఉంది


సంవత్సరం	డిపాజిట్లు పెరుగుదల	రుణాల మంజూరు పెరుగుదల (కోట్లలో)
31-03-2019 నాటికి	3,12,642	3,97,350
31-03-2020	3,40,208	4,34,261
31-03-2021	3,85,929	5,03,075
31-03-2022	4,14,594	5,81,968
31-03-2023	4,56,961	6,84,466
31-12-2023	4,94,690	7,81,313


▶ మొదటి పేజీ తరువాయి


రాష్ట్ర స్థూల ఉత్పత్తి నమోదులో టాప్ పది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఆరవ స్థానంలో ఉందని స్పష్టమైంది. ఈ గణాంకాలన్నీ 2011–12 సంవత్సరం స్థిర ధరల ఆధారంగా కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమ లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ గణాంకాలన్నీ పారదర్శకంగా అందరికీ అందుబాటులో ఉన్నాయి.


కోవిడ్‌లోనూ రయ్.. రయ్..

చంద్రబాబు ఐదేళ్ల పాలనలో స్థిర ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.1,28,341 కోట్లు పెరిగింది. అంటే మొత్తం ఐదేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 25.74 శాతం పెరిగింది. అంటే సగటు వార్షిక వృద్ధి 5.15 శాతంగా నమోదైంది. అదే సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.1,94,063 కోట్ల మేర పెరిగింది. అంటే ఐదేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల 30.95 శాతం. వార్షిక సగటు వృద్ధి 6.20 శాతంగా ఉంది. దీన్ని బట్టి చూస్తే సంపద సృష్టించడంలో, రాష్ట్ర అభివృద్ధి విషయంలో గత చంద్రబాబు పాలన కన్నా సీఎం వైఎస్ జగన్ పాలన ఎంతో మెరుగ్గా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆర్థిక మందగమనం, కోవిడ్ సంక్షోభంతో రాష్ట్ర సొంత ఆదాయంతో పాటు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా రూపంలో రాబడి తగ్గిపోయినప్పటికీ రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు ఆగిపోకుండా కొనసాగించే చర్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్నారు. మరో పక్క కోవిడ్‌లోనూ పేద, మధ్య తరగతి ప్రజలకు నేరుగా నగదు బదిలీ పథకాలను అమలు చేశారు. ఈ చర్యలతో రాష్ట్ర ఆర్థిక చక్రం ఆగిపోకుండా నిలదొక్కుకుంది. అందువల్లే జగన్ పాలనలో స్థిర ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల ఎక్కువగా నమోదైంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో స్థిర ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి 7.35 శాతం వృద్ధి నమోదైందని కేంద్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.









రక్తహీనత నివారణ చర్యల్లో భాగంగా చిన్నారులు, బాలింతలు, మహిళలకు 2023-24లో ఐఎఫ్ఏ మాత్రల పంపిణీలో ఏపీ పనితీరు

రాష్ట్రం	6–59 నెలల చిన్నారులు	5–9 ఏళ్ల పిల్లలు	10–19 పిల్లలు యువత	గర్భిణీ స్త్రీలు	బాలింతలు	ర్యాంక్
ఆంధ్రప్రదేశ్	76.9	95	93.7	95	84.6	1
తమిళనాడు	92.2	95	95	95	62.8	2
ఛత్తీస్‌గఢ్	75	91.6	95	95	76.3	3
తెలంగాణ	61.6	95	94.3	95	78.3	4
కేరళ	10.1	35.1	8.1	95	60.6	5
దేశవ్యాప్తంగా	37.1	46.5	50.1	95	65.2	–

మీకు తెలుసా?



2019 ఎన్నికలకు ఈసీఐ ముందస్తు కసరత్తు

2019 సార్వత్రిక ముందస్తు ఎన్నికల ప్రణాళిక 2014 ఎన్నికలు ముగిసిన వెంటనే మొదలైంది. 2014 ఎన్నికల నాటికి దేశంలో నమోదైన ఓటర్ల సంఖ్య 83.4 కోట్లు. మొత్తం 543 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 9.28 లక్షలు. ఆ ఎన్నికల్లో 66.44 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల నిర్వహణకు సుమారు కోటి మంది ఎన్నికల సిబ్బందిని, 20 లక్షల ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు)లను కేంద్ర ఎన్నికల సంఘం వినియోగించింది.

తొలి రాష్ట్రపతి ఎన్నికల్లో 4,056 మంది ఓటర్లు

రాజ్యాంగంలోని 324వ నిబంధన, నవరించిన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతుల ఎన్నికల చట్టం నిర్వహణ, నియంత్రణల బాధ్యతను భారత ఎన్నికల సంఘానికి(ఈసీఐ) కట్టబెట్టింది. తొలి రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ 1952 మే 2న జరిగింది. ఆ ఎన్నికల్లో మొత్తం 4,056 మంది ఓటర్లు ఉన్నారు. అయిదుగురు అభ్యర్థులు పోటీ చేశారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ అవసరమైన ఓట్ల కోటా కన్నా ఎక్కువ ఓట్లు సాధించారు. అలా ఆయన స్వతంత్ర భారతదేశానికి తొలి రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు.

అభ్యర్థుల అఫిడవిట్ సమాచారానికి ఎన్ కోర్

ఎన్నికల ప్రణాళిక నుంచి పోలింగ్, అభ్యర్థుల నుంచి ఓట్ల లెక్కింపు వరకు అవసరమైన సమాచారాన్నంతటినీ అందించే ప్రక్రియకు ‘ఎన్ కోర్ ’ అనే డిజిటల్ రూపాన్ని భారత ఎన్నికల సంఘం తెచ్చింది. ఎన్ కోర్ అనేది ఎనేబ్లింగ్ కమ్యూనికేషన్స్ రియల్ టైమ్ ఎన్విరాన్‌మెంట్‌కు సంక్షిప్త రూపం. ఈ వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఎన్ కోర్ 43,996 మంది అభ్యర్థుల నామినేషన్ వివరాలను వెలువరించింది. ఇందులో అభ్యర్థుల అఫిడవిట్లను అప్‌లోడ్ చేస్తారు. రిటర్నింగ్ అధికారులు అప్‌లోడ్ చేసిన, డిజిటలైజ్ చేసిన సమాచారాన్ని https://affidavit.eci. gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. తమ ప్రతినిధిగా పోటీ చేయబోయే అభ్యర్థుల వివరాలను ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.



రెండు దశాబ్దాల్లో ఈవీఎంలలో 315 కోట్ల ఓట్ల నమోదు

2001 –2019 మధ్య కాలంలో జరిగిన అన్ని లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఈవీఎంలలో 315 కోట్ల ఓట్లు నమోదయ్యాయి. వీటిలో ఒక్కటీ తప్పుగా నమోదు కాలేదు. వీటి టాంపరింగ్ ద్వారా ఎన్నికల ఫలితాలను తయారు చేయవచ్చన్నది ఊహాజనితమే తప్ప వాస్తవం కాదని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) అనేకసార్లు స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రమేయం లేకుండా చివరికి భారత ఎన్నికల సంఘం సైతం ఈవీఎంలను భద్రపరిచే వేర్‌హౌస్‌లను తెరవడానికి వీల్లేదు. ఈ వేర్‌హౌస్‌లను పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షంలోనే తెరుస్తారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభంలో తొలిదశ చెక్‌చేసే సమయం నుంచి ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసే కాలపరిమితి వరకు ఈవీఎంలకు సీసీ టీవీ నిఘా ఉంటుంది.

జగన్ ప్రభుత్వంలోనే పేదలకు మేలు



పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే మేలు జరిగింది. కరోనా దుర్భర పరిస్థితుల్లో దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయలేనంత గొప్పగా, సమర్థవంతంగా వైద్య సేవలు అందించారు. చావు వరకు వెళ్లి వేల సంఖ్యలో ప్రజలు బయటపడ్డారంటే అందుకు కారణం సీఎం జగన్. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో చాలా రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందంటే అది జగన్ పాలన వల్లే. గతాన్ని మర్చిపోని ప్రతి వ్యక్తి మళ్లీ జగన్ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారు. 2019 కంటే గొప్పగా జగన్ ప్రభుత్వం ఈసారి అధికారంలోకి వస్తుంది.

– గంగుల చైతన్యకుమార్, ఫొటోగ్రాఫర్, దర్శి, ప్రకాశం జిల్లా

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

ప్రజలందరి నమ్మకం జగన్



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రంలోని ప్రజల ఆర్థికాభివృద్ధి, జీవనస్థితిగతుల్లో చాలా మార్పు వచ్చింది. ఐదేళ్లలో అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదల బతుకుల్లో వెలుగులు నింపారు. తరతమ భేదం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చారు. ఉత్తమ విద్య, మెరుగైన వైద్యాన్ని పేదలకు చేరువ చేసిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమే. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపిస్తే భవిష్యత్తులో మరెన్నో సంక్షేమ పథకాలు పేద ప్రజలకు చేర్చి వారిని ఆర్థికంగా ఆదుకుంటారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలందరి నమ్మకం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

– వట్టిగుంట మధుబాబు చౌదరి, కావలి, నెల్లూరు జిల్లా

అభివృద్ధి బటన్ నొక్కిన సీఎం జగన్



బద్వేల్‌లో సెంచురీ ప్యానల్స్ యూనిట్‌ను బటన్ నొక్కి ప్రారంభిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి

ఈ 5 ఏళ్లలో ఉత్పత్తి ప్రారంభించిన పరిశ్రమల్లో రూ.78,514 కోట్ల పెట్టుబడులు

- **బాబు హయాంలో రూ.59,970 కోట్లు మాత్రమే**
- **కరోనా నష్టాల్ని అధిగమించి మరీ రాష్ట్రంలో పరిశ్రమలకు సీఎం జగన్ పట్టం**
- **386 ఒప్పందాలతో రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులకు జగన్ ప్రభుత్వం ఒప్పందాలు**
- ఏడాదిలోపే 19 శాతం పెట్టుబడులు వాస్తవ రూపం
- గత ప్రభుత్వంలో రూ.19 లక్షల కోట్ల పెట్టుబడులంటూ ఊదరగొట్టిన చంద్రబాబు
- 3 శాతం కూడా తీసుకురాలేక అభాసుపాలు
- మూడు పారిశ్రామిక కారిడార్లతో మారనున్న రాష్ట్ర రూపురేఖలు
- అంబానీ, అదానీ, బిర్లా, మిట్టల్, సంఘ్వీ వంటి పారిశ్రామిక దిగ్గజాలతో భారీ ఒప్పందాలు



అచ్యుతాపురం సెజ్‌లో యొకహమా టైర్స్ ఉత్పత్తి చేసిన తొలి టైర్‌పై సంతకం చేస్తున్న సీఎం

చంద్రబాబు ఐదేళ్ల కాలంలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు రూ.59,970 కోట్లు

ఈ 5 ఏళ్లలో ఉత్పత్తి ప్రారంభించిన పరిశ్రమల్లో రూ.78,514 కోట్ల పెట్టుబడులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు రాలేదంటూ ఎల్లో మీడియాతో కుట్ర చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు.

తప్పుడు సమాచారంతో యువతను రెచ్చగొట్టి లబ్ధిపొందాలనే చంద్రబాబు అండ్ కోకు ఈ వాస్తవాలు కనిపించవా...

సంక్షేమంతో పాటు సమానంగా పరిశ్రమలకు అగ్రతాంబూలం ఇస్తే నీచమైన రాతలా..

– చంద్రశేఖర్ మైలవరపు, సాక్షి, అమరావతి

చంద్రబాబు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలవా?

- **పెట్టుబడుల సదస్సు** అంటూ గత ప్రభుత్వం **రూ.18.87 లక్షల** కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి **వచ్చేశాయని ఎల్లో** మీడియాలో ఊదరగొట్టేశారు. **కనీసం అందులో** 10 శాతం పెట్టుబడులు వచ్చినా **మన రాష్ట్రం పారిశ్రామిక** ప్రగతిలో దూసుకుపోయేది. **బాబు హయాంలో** కనీసం 5 శాతం పెట్టుబడులు **కూడా రాలేదు**. దీనిపై మీ ఎల్లో మీడియాలో **రాయించగలవా..**
- **బాబు హయాంలో** కేంద్ర సహకారం అందినా.. **40 ఇయర్స్ ఇండస్ట్రీ** అనుభవం ఉన్నా.. పెట్టు**బడుల ప్రవాహానికి** అనుకూల వాతావరణం ఉన్నా.. **తన సొంత అజెండాతో** పారిశ్రామిక ప్రగతిని **బాబు నిర్లక్ష్యం చేశారు**. జగన్ అధికారంలోకి **రాగానే పరిశ్రమల**కు పట్టం కడుతున్న వేళ.. కోవిడ్ **లాక్‌డౌన్‌తో రెండేళ్లు** ప్రపంచమంతా పడకేసింది. **అయినా జగన్ గత** ప్రభుత్వం కంటే ఎక్కువ **పెట్టుబడులను** వాస్తవ రూపంలోకి తీసుకొచ్చారు.
- జగన్ పాలనలో రాష్ట్రంలో 163 భారీ ప్రాజెక్టుల ద్వారా రూ.78,514 పెట్టుబడులు వాస్తవరూపం దాల్చాయి. ఉత్పత్తి ప్రారంభించాయి. బాబు హయాంలో ఏటా సగటున రూ.11,994 కోట్ల పెట్టుబడులు పెడితే.. జగన్ హయాంలో ఏటా రూ.15,702.8 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

ఇదీ జగన్ అంటే..

- గత ప్రభుత్వంలా ఏటా పెట్టుబడుల సదస్సు అంటూ హడావుడి చేయలేదు. ఒక్కసారి మాత్రమే 2023లో విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహించగా.. 386 ఒప్పందాల ద్వారా రూ.13.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించారు. వీటి ద్వారా 6 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. ఏ రాష్ట్ర పెట్టుబడుల సదస్సుకు రాని రిలయన్స్ గ్రూపు అధినేత ముఖేష్ అంబానీ స్వయంగా విశాఖ రావడమే కాకుండా రూ.50,000 కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఐదేళ్లలో బిర్లాలు, అదానీ, మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రానికి విచ్చేసి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు.
- సాధారణంగా దేశంలో పెట్టుబడుల సదస్సులో జరిగే ఒప్పందాల్లో 16 నుంచి 17 శాతం మాత్రమే వాస్తవ రూపంలోకి వస్తాయి. మన రాష్ట్రంలో మాత్రం సదస్సు జరిగి ఏడాది తిరక్కుండానే 19 శాతం పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి.



విశాఖ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్న ముకేశ్ అంబానీ

ఎంఎస్‌ఎంఈలకు పునరుజ్జీవం

కోవిడ్ సమయంలో రీస్టార్ ప్యాకేజీ, వైఎస్సార్ నవోదయం వంటి పథకాలతో ఎంఎస్‌ఎంఈలు మళ్లీ ఊపిరిపోసుకున్నాయి. గత ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలను పూర్తిగా నిర్లక్ష్యం చేయగా ఈ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రోత్సాహకాలతో ఆదుకుంటోంది. గత ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలు, స్పిన్నింగ్ మిల్లులకు బకాయి పెట్టిన రూ.1,588 కోట్లను విడుదల చేయడమే కాకుండా రూ.2,087 కోట్ల ప్రోత్సాహకాలు విడుదల చేశారు. నిర్వహణ వ్యయం తగ్గించి పెద్ద పరిశ్రమలతో పోటీ పడేలా క్లస్టర్ విధానాన్ని, ఎంఎస్‌ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రూ.118 కోట్లతో జగన్ ప్రభుత్వం ర్యాంప్ కార్యక్రమం చేపట్టింది. చంద్రబాబు సర్కారు దిగిపోయే నాటికి రాష్ట్రంలో 1,93,530 ఎంఎస్‌ఎంఈలు ఉంటే.. ఇప్పుడు ఏడు లక్షలు దాటాయని ఉద్యమ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



బలభద్రపురంలో గ్రాసిమ్ యూనిట్



పులివెందుల: ఆదిత్యబిర్లా గార్మెంట్స్‌లో ఉద్యోగులతో మాట్లాడుతున్న జగన్

పారిశ్రామిక కారిడార్లతో రాష్ట్రం రికార్డులు

పరిశ్రమలకు అన్ని రకాల మౌలికవసతులు ఒకే చోట లభించేలా మూడు పారిశ్రామిక కారిడార్లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. మూడు పారిశ్రామిక కారిడార్లు కలిగిన ఏకైక రాష్ట్రంగా రికార్డులకు ఎక్కింది.

- **విశాఖ-చెన్నై కారిడార్(వీసీఐసీ)**
- **చెన్నై-బెంగళూరు కారిడార్**
- **హైదరాబాద్-బెంగళూరు కారిడార్..**

ఈ మూడూ అభివృద్ధి దశలో ఉన్నాయి.

చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్

ఇందులో భాగంగా కృష్ణపట్నం పారిశ్రామిక నోడ్‌గా రూపుదిద్దుకుంటోంది. తిరుపతి జిల్లాలోని 2,500 ఎకరాల్లో క్రిస్ సిటీ ఏర్పాటు కోసం ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తోంది. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దీని ద్వారా రూ.5 వేల కోట్ల పెట్టుబడులు, 14 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని అంచనా.

విశాఖ-చెన్నై కారిడార్(వీసీఐసీ)

విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధిలో భాగంగా రెండు గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ నోడ్‌లు తీర్చిదిద్దారు. విశాఖపట్నంలోని నక్కపల్లి-రాంబిల్లి క్లస్టర్లు, చిత్తూరు నోడ్‌లో ఏర్పేడు, శ్రీకాళహస్తి పారిశ్రామిక క్లస్టర్లలో అంతర్గత మౌలిక సదుపాయాలు కల్పించారు. వీసీఐసీ ప్రాజెక్టుకు సంబంధించిన ఎక్స్‌టర్నల్ సదుపాయాల కల్పనలో భాగంగా తిరుపతి స్పెషల్ జోన్‌లోని నాయుడుపేట, అనకాపల్లి స్పెషల్ జోన్‌లోని అచ్యుతాపురం ప్రాంతాలను పారిశ్రామిక ప్రాంతాలుగా అభివృద్ధి చేశారు. నాయుడుపేటలో 276 పరిశ్రమల ఏర్పాటుతో రూ.3,051 కోట్ల పెట్టుబడులతో 9,030 ఉద్యోగాలు కల్పించారు. అచ్యుతాపురంలో మొత్తం 2,272 పరిశ్రమల ఏర్పాటుతో రూ.12,381 కోట్ల పెట్టుబడులు రాగా 60 వేల మందికి ఉద్యోగాలు లభించాయి.

- వీసీఐసీలో భాగంగా వైఎస్సార్ జిల్లాలోని కొప్పర్తిలో 6,740 ఎకరాలలో పరిశ్రమల హబ్ తీర్చిదిద్దేందుకు వేగంగా అడుగులు వేస్తున్నారు. కొప్పర్తి కేంద్రంగా మోడల్ ఇండస్ట్రియల్ పార్కు, ఎంఎస్ఈ సీడీపీ, వైఎస్సార్ ఈఎంసీ, వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఇప్పటికే రూ.2595.74 కోట్ల నిక్‌డిక్ట్ నిధులతో అభివృద్ధికి కార్యాచరణ రూపొందించారు. అక్కడ 66 పరిశ్రమలు కొలువుదీరాయి. ప్లగ్ అండ్ ప్లే పరిశ్రమల కోసం ఇప్పటికే 4 షెడ్ల నిర్మాణం పూర్తయింది. మొత్తం రూ.1,875.16 కోట్ల పెట్టుబడులు, 13,776 మందికి ఉద్యోగాలిచ్చేందుకు కొప్పర్తి సిద్ధమైంది.

హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్

ఈ కారిడార్‌లో ఓర్వకల్లు వద్ద భారీ పారిశ్రామిక నగరాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

వివిధ దశల్లో రూ.2.46 లక్షల కోట్ల పెట్టుబడులు

ఒప్పందం జరిగిన పెట్టుబడుల్లో ఇప్పటికే రూ.2.46 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన పనులు వేర్వేరు దశల్లో ఉన్నాయి. అదనంగా దావోస్ పర్యటనలో మరో రూ.1,26,000 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వీటి ద్వారా యువతకు 38 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఒక ఫోన్ కాల్ దూరంలో మీకు నేను ఉన్నానంటూ పారిశ్రామికవేత్తలకు సీఎం ఇచ్చిన అభయం వారి నమ్మకాన్ని రెట్టింపు చేసింది. గత మూడేళ్ల నుంచి పూర్తిగా 100 శాతం పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు ఆధారంగా నిర్వహిస్తున్న సులభతర వాణిజ్యం సర్వేలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది.

6 లక్షల మందికిపైగా ఉపాధి

ఎంఎస్‌ఎంఈ యూనిట్ల ద్వారా రాష్ట్రంలో 6 లక్షల మందికిపైగా ఉపాధి లభిస్తోంది. ఎంఎస్‌ఎంఈలు ఒక సంఘంగా ఏర్పడి తక్కువ వ్యయంతో ఉత్పత్తి చేసుకునే విధంగా క్లస్టర్ రూపంలో ఉమ్మడి మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశారు. ఇందుకు ప్రతి జిల్లాలో కనీసం రెండు చొప్పున మొత్తం 54 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం అవసరమైన నూతన సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల్ని అందించేలా మరో ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో మరో టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే విశాఖలో టెక్నాలజీ సెంటర్ కొనసాగుతోంది. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్ల వ్యయంతో ఈ టెక్నాలజీ సెంటర్ అభివృద్ధి చేస్తున్నారు.

సీఎం చేతుల మీదుగా ఉత్పత్తి ప్రారంభమైన యూనిట్లు

కంపెనీ పేరు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి	రంగం
గ్రాసిం ఇండస్ట్రీస్	861	1,300	కాస్టిక్ సోడా
ఏటీసీ టైర్స్	1,250	840	హాఫ్ హైవే టైర్స్
రాంకో సిమెంట్స్	1,790	1000	సిమెంట్
సెంచురీ ప్యానల్స్	1,600	2,000	ప్లైవుడ్ ప్యానల్స్
ఆదిత్య బిర్లా గార్మెంట్స్	110.38	2,112	గార్మెంట్స్
ప్యానల్ ఆప్టో డిస్‌ప్లే టెక్నాలజీస్	1,230	2,200	టీవీ డిస్‌ప్లే ప్యానల్స్
ఫాక్స్‌లింక్ ఇండియా ఎలక్ట్రిక్	1,050	2,000	సర్క్యూట్ బోర్డ్స్
సన్నీ ఒప్పొ టెక్	280	1,200	కెమెరా మాడ్యూల్స్



మేడిన్ పులివెందుల గార్మెంట్స్ పరిశీలిస్తున్న సీఎం



అసాగో ఇండస్ట్రీస్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవం

ఉత్పత్తి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న మరికొన్ని భారీ పరిశ్రమలు



కంపెనీ పేరు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి	రంగం
కింబెర్లీక్లార్క్ ఇండియా	368	117	టెక్స్‌టైల్
మునోత్ ఇండస్ట్రీస్	124	350	లిథియం బ్యాటరీలు
హెచ్‌పీసీఎల్ రిఫైనరీ విస్తరణ	28,000	3,500	పెట్రో కెమికల్స్
పయనీర్ అల్యూమినియం	6,700	2,300	అల్యూమినియం
భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్	300	300	రక్షణ రంగ ఉత్పత్తులు
వీఆర్‌వీ ఏషియా పసిఫిక్	95.28	264	హీట్ ఎక్స్ఛేంజర్ యూనిట్
దాల్వకోట్ బయోఫ్యూయల్స్	85	184	ఇథనాల్ తయారీ
లైఫస్ ఫార్మా	1,962.64	2,000	ఫార్మాస్యూటికల్స్
ఇండోసోల్ సోలార్	43,143	11,500	సోలార్ పీవీ మాడ్యుల్స్ తయారీ

రాష్ట్రం వైపు ఐటీ దిగ్గజ సంస్థల చూపు

దేశంలోని దిగ్గజ ఐటీ సంస్థలు రాష్ట్రంలో తమ కార్యాలయాల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయి. ఈ ప్రభుత్వ హయాంలో ఇన్ఫోసిస్, విప్రో, రాండ్‌స్టాండ్, బీఈఎల్, అమెజాన్ డీసీ వంటి అనేక దిగ్గజ సంస్థలు ఇప్పటికే తమ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయి. బీపీఓ కార్యకలాపాలకు ప్రధాన వేదికగా నిలిచిన విశాఖ నగరం.. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్స్(డీసీ)ను ఆకర్షిస్తోంది. ఇన్ఫోసిస్ రాష్ట్రంలో తొలి డెవలప్‌మెంట్ సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేయడంతో.. విప్రో కూడా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. విశాఖ అనగానే పల్సస్ గ్రూపు, డబ్ల్యూఎన్ఎస్, టెక్ మహీంద్రా, విప్రో వంటి బీపీవో కార్యకలాపాలే కనిపించేవి. ఇప్పుడు బీచ్ ఐటీ డెస్టినీ పేరుతో విశాఖకు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఆకర్షణ చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

ఐటీ హబ్‌గా విశాఖ

గత నాలుగేళ్లుగా రాష్ట్రంలోని ఐటీ రంగంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు పెరిగాయి. చంద్రబాబు దిగిపోయే నాటికి రాష్ట్రంలో ఐటీ ఉద్యోగుల సంఖ్య 27,643గా ఉంది. అందులో సగం మందికి ఉద్యోగాలు దివంగత నేత వైఎస్సార్ హయాంలో వచ్చినవే. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో కొత్తగా 47,908 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో ప్రస్తుతం రాష్ట్రంలో ఐటీ ఉద్యోగుల సంఖ్య 75,551కు చేరుకుంది. స్టార్టప్స్ కూడా 161 నుంచి 586కు చేరాయి. స్టార్టప్స్‌లో 2019 నాటికి 1,552 మంది పనిచేస్తుంటే ఇప్పుడు ఆ సంఖ్య 55,669కు చేరింది. ఈ గణాంకాలన్నీ కేంద్ర ప్రభుత్వ రంగ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్(డీపీఐఐటీ) చెబుతున్నవే. తొలి నాలుగో తరం పారిశ్రామిక రంగం ఇండస్ట్రీ 4కు చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ 'కల్పతరువు'తో పాటు నాస్కామ్ సహాయంతో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల స్టార్టప్‌ల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు విశాఖలో ఏర్పాటు చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఏ హబ్, ఓడల నిర్మాణంపైన, మెడ్‌టెక్ జోన్‌లోనూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు ఏర్పాటు చేశారు.



విశాఖలోని ఇన్ఫోసిస్ కార్యాలయం

బంధం కొనసాగిస్తాం



ఏపీలో భారీ పెట్టుబడులు పెట్టిన తాము భవిష్యత్తులో కూడా అదే బంధాన్ని కొనసాగిస్తాం. ఇందులో భాగంగా 10 గిగావాట్ల రెన్యువబుల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తున్నాం. రిలయన్స్ రిటైల్ ద్వారా రాష్ట్రంలో 1.20 లక్షల మంది కిరాణా వ్యాపారులతో ఒప్పందం చేసుకున్నాం. 6,000 గ్రామాల్లో సేవలు అందిస్తున్న రిలయన్స్ రిటైల్ ద్వారా రాష్ట్రంలో 20,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి, లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నాం. – ముఖేశ్ అంబానీ

రెండు నెలల్లో రెండు యూనిట్లు



ఆదిత్య బిర్లా గ్రూపు ద్వారా రెండు నెలల్లో రెండు యూనిట్లు ఏర్పాటు చేశాం. వైఎస్సార్ జిల్లాలో గార్మెంట్స్ తయారీ యూనిట్‌కు భూమి పూజ చేశాం. తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురంలో కాస్టిక్ సోడా యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఆరు వ్యాపారాల్లో 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాం. 10,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. – కుమార్ మంగళం బిర్లా

సీఎం జగన్ భూమిపూజ చేసిన ముఖ్యమైన పరిశ్రమలు

కంపెనీ పేరు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఎంత మందికి ఉపాధి	రంగం
ఇంటెలిజెంట్ సెజ్	70	2,000	పాదరక్షల ఉపకరణాలు
హిల్‌టాప్ సెజ్ ఫుట్‌వేర్	700	10,000	పాదరక్షలు
డిక్సన్ టెక్నాలజీస్	108	830	టెలివిజన్స్
ఫాక్స్‌లింక్ ఇండియా విస్తరణ	300	1,200	స్మార్ట్ వాచీలు, ఇయర్ పాడ్స్
ఏటీసీ టైర్స్ ఫేజ్-2	1,000	1,160	టైర్ల తయారీ
పిడిలైట్ ఇండస్ట్రీస్	202	280	వాటర్ ప్రూఫింగ్ ఉత్పత్తులు
మెగా ఫ్రూట్ ప్రాసెసింగ్	186	677	ఆహార ఉత్పత్తులు
ఐనాక్స్ ఎయిర్ ప్రొడక్ట్స్	145	70	పారిశ్రామిక వాయువులు
ఆప్టిమస్ డ్రగ్స్	125	185	ఫార్మాస్యూటికల్స్
విన్‌విన్ స్పెషాలిటీ ఇన్సులేటర్స్	108	382	ఇన్సులేటర్స్
స్టీరాక్స్ లైఫ్ సైన్సెస్	88	450	బల్క్ డ్రగ్స్
సినాప్టిక్స్ ల్యాబ్స్	82	300	బల్క్ డ్రగ్స్
ఇషా రిసోర్సెస్	68	220	కోక్ అండ్ కోల్ స్క్రీనింగ్
అస్సాగో ఇండస్ట్రీస్	270	500	బయో ఇథనాల్
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	8800	2,500	ఉక్కు తయారీ

అర నిమిషంలోనే ఒప్పించారు



మే నెలలో సీఎం జగన్‌ను కలిసి 30 సెకన్లు మాత్రమే మాట్లాడా. ఈ సందర్భంగా మా అబ్బాయి బయో ఇథనాల్ ప్లాంట్ స్థాపనకు వివిధ రాష్ట్రాలు పరిశీలిస్తున్న విషయం చెప్పా. ఎక్కడో ఎందుకు? మా రాష్ట్రంలో పెట్టండి అని సీఎం ఆహ్వానించారు. బయో ఇథనాల్ పాలసీని యూనిట్ ప్రారంభమయ్యే సరికి రూపొందిస్తామని భరోసా ఇచ్చారు. ఆరు నెలల్లోనే రాజమహేంద్రవరంలో యూనిట్‌కు శంకుస్థాపన చేశాం. –సీపీ గుర్నానీ, సీఈవో, టెక్ మహీంద్రా

పెట్టుబడుల ఆకర్షణలో ముందు వరుస



పెట్టుబడుల ఆకర్షణలో దేశంలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉండటమే కాకుండా అధిక పెట్టుబడులు ఆకర్షిస్తున్న రాష్ట్రంగా రికార్డు సృష్టిస్తోంది. సీఎం జగన్ తీసుకుంటున్న చర్యలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇటీవల గుంటూరులో వెల్‌కమ్ ఫైవ్‌స్టార్ హోటల్‌ను ప్రారంభించాం. ప్రపంచంలోనే అతిపెద్ద సుగంధ ద్రవ్యాల పార్క్ ప్రారంభిస్తున్నాం. – సంజయ్ పూరి, ఐటీసీ సీఈవో

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	90	73,738
నిఫ్టీ ▲	32	22,368

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,690	▲ 239
డోజోన్స్	38,498	▲ 258
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,045	▲ 21
డాక్స్	18,138	▲ 277
షాంఘై	3,022	▼ 23
నికాయ్	37,552	▲ 114

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,598 ▼ 1,277
బంగారం (99.5 స్వచ్ఛత)	71,311 ▼ 1,272
వెండి (కేజీ)	80,007 ▼ 1,547

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఫారెక్స్	83.43	85.33
£	బ్రిటన్ పౌండ్	ఫారెక్స్	100.71	105.92
€	యూరో	ఫారెక్స్	86.64	91.36
¥	జపాన్ ఎన్ (100)	ఫారెక్స్	41.00	67.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఫారెక్స్	51.36	56.34
S$	సింగపూర్ డాలర్	ఫారెక్స్	58.79	63.65
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	21.31	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	21.78	23.62
¥	చైనా యువాన్	ఫారెక్స్	10.37	12.47

రేటు బదిలీలో ప్రభుత్వ బ్యాంకులే ముందు: ఆర్‌బీఐ



ముంబై: ప్రైవేట్ బ్యాంకుల కంటే ప్రభుత్వ రంగ బ్యాంకులలో (పీఎస్‌బీ) కీలక రేటు (రెపో) బదిలీ ఎక్కువగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రచురించిన 2024 ఏప్రిల్ బులెటిన్ ఒకటి స్పష్టం చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల విషయంలో డిపాజిట్ రేట్ల పెంపు అధికంగా ఉంటే, రుణ రేట్లు ప్రైవేటు బ్యాంకుల కంటే తక్కువగా కొనసాగుతున్నట్లు తెలిపింది. ''ఏప్రిల్ 2023 నుండి ఫిబ్రవరి 2024 వరకు పరిశీలిస్తే.. ఆర్‌బీఐ రెపో రేటు బదలాయింపు ప్రక్రియ కొనసాగుతోంది. డిపాజిట్ల సమీకరణ అధిక రేట్ల వద్ద జరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది'' అని ఏప్రిల్ 5న ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ పాత్ర పేర్కొనడాన్ని బులెటిన్ ప్రస్తావించింది. కాగా దేశీయ ఎకానమీ పురోగతి బాటన పయనిస్తోందని అయితే వాతావరణ పరిణామాలు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఎకానమీకి సంబంధించిన మరో బులెటిన్‌లో ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు.

బీఎఫ్‌ఐతో ఐకేపీ నాలెడ్జ్ పార్క్ జట్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సైన్స్ పార్క్స్, ఇంక్యుబేటర్స్ సంస్థ ఐకేపీ నాలెడ్జ్ పార్క్ తాజాగా బ్లాక్‌చెయిన్ ఫర్ ఇంపాక్ట్ (బీఎఫ్‌ఐ)తో జట్టు కట్టింది. బయోమెడికల్ విభాగంలో పరిశోధనలు, ఆవిష్కరణలకు తోడ్పడేలా యువ ఆవిష్కర్తలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం అందించేందుకు ఈ వ్యూహాత్మక ఒప్పందం ఉపయోగపడనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-4-2024 ఫామ్ ధర...

విశాఖ	400-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	380-00
విజయవాడ	380-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	350-00
వరంగల్	352-00
రిటైల్ ధర	4.10


ఇక 'నిఫ్టీ నెక్స్ట్ 50' ఫ్యూచర్స్

నేటి నుంచి డెరివేటివ్ కాంట్రాక్టులు



ముంబై: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ నేటి(బుధవారం) నుంచి 'నిఫ్టీ నెక్స్ట్ 50' సూచీ డెరివేటివ్ కాంట్రాక్టులు ప్రవేశపెడుతోంది. మూడు నెలల ఫ్యూచర్స్, ఆప్షన్స్ కాంట్రాక్టులను ట్రేడింగ్‌కు అందుబాటులో ఉంచుతుంది. ప్రతినెలా చివరి శుక్రవారం ఈ కాంట్రాక్టుల గడువు ముగుస్తుంది. నిఫ్టీ 100లోని నిఫ్టీ 50 కంపెనీలు మినహా మిగితా కంపెనీలన్నీ ఈ సూచీలో ఉంటాయి. ఈ ఏడాది మార్చి 29 నాటికి ఈ సూచీలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.70 లక్షల కోట్లుగా ఉంది. ఎన్ఎస్ఈలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువలో ఇది సుమారు 18%గా ఉంది. ఈ కాంట్రాక్టులపై అక్టోబర్ 31 వరకు ఎలాంటి ట్రాన్సాక్షన్ చార్జీలు ఉండవని ఎన్ఎస్ఈ పేర్కొంది.

మూడో రోజూ సూచీలు ముందుకే...



స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. సెన్సెక్స్ 90 పాయింట్లు పెరిగి 73,738 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32 పాయింట్లు బలపడి 22,368 వద్ద నిలిచింది. సూచీలకిది ఇది మూడో రోజూ లాభాల ముగింపు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 411 పాయింట్లు ఎగసి 74,060 వద్ద, నిఫ్టీ 111 పాయింట్లు దూసుకెళ్లి 22,448 వద్ద ఇంట్రాడే గరిష్టాలు నమోదు చేశాయి. అయితే అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరులో లాభాల స్వీకరణ, క్రూడాయిల్ ధరల రికవరీ, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలతో సూచీల లాభాలు పరిమితమయ్యాయి. టెలికం, రియల్టీ, యుటిలిటీ, కన్జూమర్, కమోడిటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించాయి. మెటల్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

- ఫాలోఆన్‌ఆఫర్(ఎఫ్‌పీఓ) ద్వారా రూ.18వేల కోట్లు సమీకరించడంతో వొడాఫోన్ ఐడియా షేరు 12% పెరిగి రూ.14.39 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ఎగసి రూ.14.42 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

భారీగా తగ్గిన పసిడి ధర



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, భారీగా పెరిగిన ధర వద్ద లాభాల స్వీకరణ పసిడి ధరపై తాజాగా ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా దేశంలో బంగారం ధరలు మంగళవారం భారీగా తగ్గాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత ధర రూ.1,450 తగ్గి రూ.72,200కు దిగివచ్చింది. కేజీ వెండి ధర రూ.2,300 తగ్గి, రూ.83,500కు చేరింది. కాగా ఆర్థిక రాజధాని ముంబైలో 99.9, 99.5 స్వచ్ఛత ధరలు వరుసగా రూ.1,277, రూ.1,272 తగ్గి రూ.71,598, 71,311కు దిగివచ్చాయి. వెండి కేజీ రూ.1,547 మైనస్‌తో రూ.80,007కు తగ్గింది.కాగా పసిడి ఫ్యూచర్ మార్కెట్లలో సైతం క్రితం ముగింపుతో పోలిస్తే నష్టాల్లో ట్రేడవుతోంది.

ఫోక్స్‌వ్యాగన్ టైగున్ కొత్త వేరియంట్లు



చెన్నై: వాహన తయారీలో ఉన్న జర్మనీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ తాజాగా స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ టైగున్ కొత్త వేరియంట్లను భారత్‌లో ప్రవేశపెట్టింది. 1.0 లీటర్ టీఎస్ఐ ఇంజిన్‌తో టైగున్ జీటీ లైన్‌ను అందుబాటులోకి తెచ్చింది. 6 స్పీడ్ ఆటోమేటిక్, 6 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో ఇది లభ్యం. ఎక్స్‌షోరూం ధర రూ.14.08 లక్షలు. అలాగే టైగున్ జీటీ ప్లస్ స్పోర్ట్ వేరియంట్‌ను 1.5 లీటర్ టీఎస్ఐ ఇంజన్‌తో పరిచయం చేసింది. 6 స్పీడ్ మాన్యువల్, 7 స్పీడ్ డైరెక్ట్ షిఫ్ట్ గేర్‌బాక్స్ (డీఎస్‌జీ) ట్రాన్స్‌మిషన్‌తో రూపొందింది. ఎక్స్‌షోరూం ధర రూ.18.53 లక్షలు.

ఎయిర్‌టెల్ రోమింగ్ రూ.133

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారతీ ఎయిర్‌టెల్ సరికొత్త ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్స్‌ను అందుబాటు ధరలో ప్రవేశపెట్టింది. టారిఫ్ రోజు కు రూ.133 నుంచి ప్రారంభం. అధిక డేటా ప్రయోజనాలు, ఇన్-ఫ్లయిట్ కనెక్టివిటీ, 24 గంటలు కస్టమర్ కేర్ సేవలు అందుబాటులో ఉంటాయి.

టాటా కన్జూమర్ లాభం డౌన్

క్యూ4లో రూ. 212 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ కన్సాలిడేటెడ్ నికర లాభం మార్చి త్రైమాసికంలో 27% క్షీణతతో రూ. 212 కోట్లకు పరిమితమైంది. ఇందుకు ఇతర సంస్థల కొనుగోళ్లు, విలీన వ్యయాలు, ఆస్తుల విలువ తగ్గింపు, ఫైనాన్షియల్ ఇన్‌స్ట్రుమెంట్స్ నష్టాలు తదితర అంశాలు ప్రభావం చూపాయి.

పూర్తి ఏడాదికి

గత ఆర్థిక సంవత్సరంలో టాటా కన్జూమర్ నికర లాభం రూ. 1,215 కోట్లకు పరిమితమైంది. 2022–23లో రూ. 1,320 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 13,783 కోట్ల నుంచి రూ. 15,206 కోట్లకు జంప్‌చేసింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. కాగా, క్యూ4లో టాటా స్టార్‌బక్స్ కొత్తగా 29 స్టోర్లను ఏర్పాటు చేసింది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు ఎన్ఎస్ఈలో నామమాత్ర లాభంతో రూ. 1,172 వద్ద ముగిసింది.

హైదరాబాద్‌లో జీసీసీపై 'హిటాచీ' కసరత్తు



ఎండీ ఎన్ వేణు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రైల్వేలు, యుటిలిటీస్ తదితర రంగాల సంస్థల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, హై వోల్టేజీ ఉత్పత్తులు మొదలైనవి తయారు చేసే హిటాచీ ఎనర్జీ హైదరాబాద్‌లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటుపై కసరత్తు చేస్తోంది. ఆరు నెలల నుంచి ఏడాది వ్యవధిలో దీనిపై ఒక నిర్ణయానికి రావచ్చని, పుణే కూడా పరిశీలనలో ఉందని సంస్థ ఇండియా ఎండీ ఎన్ వేణు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో తమకు గణనీయంగా కార్యకలాపాలు ఉన్నాయని, పరిశ్రమ సంబంధ సాంకేతికతల్లో విద్యార్థులకు శిక్షణ కల్పించేందుకు వరంగల్ ఎన్ఐటీతో కూడా జట్టు కట్టామని ఆయన పేర్కొన్నారు.

సైయంట్ డీఎల్ఎం లాభం రూ. 61 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరంలో సైయంట్ డీఎల్ఎం నికర లాభం (కన్సాలిడేటెడ్) సుమారు 93 శాతం పెరిగి రూ. 32 కోట్ల నుంచి రూ. 61 కోట్లకు చేరింది. ఆదాయం రూ. 838 కోట్ల నుంచి రూ. 1,220 కోట్లకు పెరిగింది. క్యూ4లో ఆదాయం రూ. 276 కోట్ల నుంచి రూ. 370 కోట్లకు, లాభం రూ. 12.5 కోట్ల నుంచి రూ. 23 కోట్లకు పెరిగింది.

మహీంద్రా ఫైనాన్స్‌లో రూ. 150 కోట్ల మోసం

ఆర్థిక ఫలితాలు మే 30కి వాయిదా



న్యూఢిల్లీ: ఆర్థిక సేవల సంస్థ మహీంద్రా ఫైనాన్స్ రుణాల పోర్ట్‌ఫోలియోలో దాదాపు రూ. 150 కోట్ల మోసం బైటపడింది. ఈశాన్య రాష్ట్రాల్లోని ఒక శాఖలో ఇది చోటుచేసుకున్నట్లుగా గుర్తించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ నేపథ్యంలో నాలుగో త్రైమాసికం, పూర్తి సంవత్సర ఆర్థిక ఫలితాల వెల్లడిని మే 30కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. బోర్డు సమావేశాన్ని కూడా అదే రోజునకు రీ-షెడ్యూల్ చేసినట్లు వివరించింది. రిటైల్ వాహన రుణాల మంజూరులో కేవైసీ డాక్యుమెంట్లను ఫోర్జరీ చేయడం ద్వారా నిధులను పక్కదారి పట్టించారని గుర్తించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలిపింది. దీనిపై ప్రస్తుతం విచారణ తుది దశలో ఉన్నట్లు వివరించింది. అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నామని, కొందరు వ్యక్తులను అరెస్టు చేయడం సహా చర్యల అమలు వివిధ దశల్లో ఉందని మహీంద్రా ఫైనాన్స్ పేర్కొంది.

తాజా పరిణామాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో మంగళవారం 5 శాతం పైగా క్షీణించి రూ. 263.60 వద్ద క్లోజయ్యింది.

భవిత

జాబ్ పాయింట్

నవోదయ విద్యాలయ సమితి, భోపాల్‌లో 500 టీజీటీ, పీజీటీ పోస్టులు

భోపాల్‌లోని నవోదయ విద్యాలయ సమితి.. ఒప్పంద ప్రాతిపదికన 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి టీజీటీ, పీజీటీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఖాళీలు భర్తీ చేస్తారు.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 500
- » **పోస్టుల వివరాలు:** టీజీటీ-283, పీజీటీ-217.
- » **ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ):** **సబ్జెక్టులు:** హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఒరియా, కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యూజిక్, ఆర్ట్, ఒకేషనల్, లైబ్రేరియన్. **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీ, సీటెట్ ఉత్తీర్ణతతో పాటు బోధన అనుభవం ఉండాలి.
- » **పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ):** **సబ్జెక్టులు:** హిందీ, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హిస్టరీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, కామర్స్. **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ ఉత్తీర్ణతతో పాటు బోధన అనుభవం ఉండాలి.
- » **వేతనం:** నెలకు పీజీటీలకు రూ.42,250, టీజీటీలకు రూ.40,625.
- » **వయసు:** 01.07.2024 నాటికి 50 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతలు, అవార్డులు, పని అనుభవం, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.04.2024.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.04.2024
- » **ఇంటర్వ్యూ తేదీలు:** 16.05.2024 నుంచి
- » **వెబ్‌సైట్:** https://navodaya.gov.in

నావల్ డాక్‌యార్డ్‌లో 301 అప్రెంటిస్‌లు

ముంబైలోని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(నేవీ).. నావల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ స్కూల్.. వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 301
- » **ఖాళీల వివరాలు:** ఏడాది అప్రెంటిస్‌షిప్ ట్రెనింగ్-288; రెండేళ్ల అప్రెంటిస్‌షిప్ ట్రెనింగ్-13.
- » **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రోప్లేటర్, ఫిట్టర్, ఫౌండ్రీ మ్యాన్, మెకానిక్(డీజిల్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, ఎంఎంటీఎం, పెయింటర్(జి), ప్యాటర్న్ మేకర్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ రిఫ్రిజరేషన్ అండ్ ఏసీ, షీట్ మెటల్ వర్కర్, షిప్ రైట్(ఉడ్), టైలర్(జి), వెల్డర్(జి అండ్ ఇ), మేసన్(బీసీ), ఐ అండ్ సీటీఎస్ఎం, షిప్ రైట్(స్టీల్), రిగ్గర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.
- » **అర్హత:** ఎనిమిది, పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** కనిష్ట వయసు 14 ఏళ్లు, గరిష్ట వయోపరిమితి లేదు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 23.04.2024.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.05.2024
- » **వెబ్‌సైట్:** https://indiannavy.nic.in

సీఎంఎస్ఎస్, న్యూఢిల్లీలో 15 పోస్టులు

న్యూఢిల్లీలోని సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ(సీఎంఎస్ఎస్)..ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ జనరల్ మేనేజర్-05, మేనేజర్-08, ఆఫీస్ అసిస్టెంట్-01, వేర్‌హౌస్ మేనేజర్-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఏ, ఎంఎస్సీ, బీకాం, బీఫార్మా, ఎంఫార్మా, బీఈ, బీటెక్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు, మేనేజర్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుకు రూ.1,00,000, మేనేజర్, వేర్‌హౌస్ పోస్టులకు రూ.50,000, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు రూ.30,000.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులో తమ డేటాను ది జనరల్ మేనేజర్(అడ్మినిస్ట్రేషన్, సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ, రెండో ఫ్లోర్, విశ్వయువక్ కేంద్ర, టీస్ మూర్తి మార్గ్, చాణక్యపురి, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 20.05.2024.
- » **వెబ్‌సైట్:** https://cmss.gov.in

ఇర్కాన్ న్యూఢిల్లీలో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(ఇర్కాన్).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
- » **అర్హత:** డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 1,40,000
- » **దరఖాస్తులకు చివరితేది:** 10.05.2024.
- » **వెబ్‌సైట్:** https://www.ircon.org

బీటెక్.. మారుతోంది!

- » టెక్నాలజీ రంగంలో వేగంగా మార్పులు
- » విస్తృతమవుతున్న ఇండస్ట్రీ 4.0 కార్యకలాపాలు
- » కోర్‌తోపాటు లేటెస్ట్ టెక్నాలజీస్‌పై పట్టు తప్పనిసరి
- » జాబ్ మార్కెట్‌కు తగ్గ స్కిల్స్ ఉంటేనే కొలువులు

బీటెక్.. లక్షల మంది విద్యార్థుల స్వప్నం! బీటెక్ పూర్తి చేసుకుంటే.. జాబ్ మార్కెట్‌లో అవకాశాలు స్వాగతం పలుకుతాయనే అభిప్రాయం. బీటెక్‌తో కెరీర్‌లో త్వరగా స్థిరపడొచ్చు..సుస్థిర భవిష్యత్తుకు మార్గం వేసుకోవచ్చనే భావన!! అందుకే ఏటా లక్షల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు కృషి చేస్తున్న పరిస్థితి! ఎంట్రన్స్‌లలో ర్యాంకుతో బీటెక్‌లో చేరగానే లక్ష్యం నెరవేరినట్లు కాదు. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలు పెంచుకుంటేనే అవకాశాలు అంటున్నారు నిపుణులు!! ఈ నేపథ్యంలో.. ఇంజనీరింగ్ విద్యలో తాజా ట్రెండ్స్, పెంచుకోవాల్సిన స్కిల్స్‌పై ప్రత్యేక కథనం..

టెక్నాలజీ రంగంలో చాలా వేగంగా మార్పులు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీలైన ఐవోటీ, ఏఐ, బిగ్ డేటా, రోబోటిక్స్, ఆటోమేషన్‌ల ప్రాధాన్యం పెరుగుతోంది. దీంతో.. ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ లేటెస్ట్ స్కిల్స్ సొంతం చేసుకుంటేనే అవకాశాలు దక్కే పరిస్థితి కనిపిస్తోంది.

డిజిటలైజేషన్

ప్రభుత్వ విభాగాలు నుంచి కార్పొరేట్ సంస్థల వరకూ.. నేడు అన్ని చోట్లా డిజిటలైజేషన్‌కు పెద్ద పీట వేస్తున్నారు. డిజటలైజేషన్ ఆధారిత కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్నాయి. నాస్కామ్ అంచనా ప్రకారం-వచ్చే కొన్నేళ్లలో భారత ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) మార్కెట్ తారాస్థాయికి చేరుకోనుంది. అంతే స్థాయిలో ఈ విభాగంలో నైపుణ్యాలు కలిగిన యువతకు డిమాండ్ పెరుగుతోంది. కాబట్టి బీటెక్ విద్యార్థులు ఐఓటీ నైపుణ్యాలపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

పునరుత్పాదక ఇంధనం

జాతీయ స్థాయిలో పునరుత్పాదక శక్తి రంగానికి ప్రోత్సాహమిచ్చేలా ప్రభుత్వ విధానాలు అమలవుతున్నాయి. కాబట్టి రెన్యువబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్, సోలార్ పవర్, ఎనర్జీ ఎఫిషియన్సీ విభాగాలు బీటెక్ విద్యార్థులకు కెరీర్ అవకాశాలు కల్పించనున్నాయి. ఈ విభాగాలపై ఆసక్తి పెంచుకొని నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. రెన్యువబుల్ ఎనర్జీ విభాగంలో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

డేటాసైన్స్ అండ్ అనాలిసిస్

తాజాగా మాన్యుఫ్యాక్చరింగ్, సేవలు, బ్యాంకింగ్.. ఇలా అన్ని రంగాల్లోనూ కార్యకలాపాల నిర్వహణలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న మరో విభాగం.. డేటా సైన్స్ అండ్ అనాలిసిస్. సంస్థలు బిగ్ డేటా ఆధారిత సమాచారవిశ్లేషణ ద్వారా వినియోగదారులను పెంచుకోవాలని కోరుకుంటున్నాయి. కాబట్టి డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, అనలిటిక్స్ విభాగాల్లో నైపుణ్యాలను సొంతం చేసుకున్న వారికి జాబ్ మార్కెట్‌లో డిమాండ్ నెలకొంది.

సైబర్ సెక్యూరిటీ

సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో.. బీటెక్ అభ్యర్థులకు అవకాశాలు కల్పించడంలో సైబర్ సెక్యూరిటీ ముందుంటోంది. ముఖ్యంగా ఈ-కామర్స్, డిజిటల్ బ్యాంకింగ్, ఫిన్‌టెక్.. ఇలా అన్ని రంగాల్లోనూ ఇంటర్నెట్ ఆధారిత ఆన్‌లైన్ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. అవి సాఫీగా సాగేందుకు వీలుగా పటిష్ట భద్రత కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీంతో.. థ్రెట్ డిటెక్షన్, ఎథికల్ హ్యాకింగ్, డేటా ప్రొటెక్షన్ వంటి సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలున్న వారికి చక్కటి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.



స్టార్ట్-అప్ ఎకో సిస్టమ్

దేశంలో స్టార్ట్-అప్ ఎకో సిస్టమ్ విస్తరిస్తోంది. అంతర్జాతీయ పరిస్థితులతో పోల్చుకుంటే.. భారత్ స్టార్ట్-అప్స్‌కు అనుకూలంగా మారుతోంది. ఫలితంగా బీటెక్ విద్యార్థులు తమ ఆవిష్కరణలకు రూపమిచ్చేందుకు ఎన్నో మార్గాలు, ప్రోత్సాహకాలు అందుబాటులోకి వస్తున్నాయి. స్టార్ట్-అప్ ఇండియా, అటల్ ఇన్నోవేషన్ మిషన్ వంటి స్కీమ్‌ల ద్వారా ఔత్సాహిక ఎంట్రప్రెన్యూర్స్‌కు ఫండింగ్ లభిస్తోంది. దీంతో.. స్టార్ట్-అప్ ఆలోచన ఉన్న బీటెక్ విద్యార్థులు వీటిని అందిపుచ్చుకునేలా కృషి చేస్తే తమ ఐడియాలను విజయవంతమైన వెంచెర్స్‌గా మార్చుకోవచ్చు.

ఆర్ అండ్ డీ

రీసెర్చ్, డెవలప్‌మెంట్(ఆర్ అండ్ డీ)పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు అవకాశాలు, ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయి. ఐఐటీలు, నిట్‌లు తదితర ప్రభుత్వ రంగ ఇన్‌స్టిట్యూట్స్, అదే విధంగా పరిశోధన లేబొరేటరీలు, కార్పొరేట్ రీసెర్చ్ ల్యాబ్స్ వంటివి పరిశోధనలకు వేదికలుగా నిలుస్తున్నాయి. బయో టెక్నాలజీ, నానో టెక్నాలజీ, ఏరోస్పేస్.. ఇలా విభిన్న విభాగాల్లో రీసెర్చ్‌కు అవకాశాలు లభిస్తున్నాయి.

ఎలక్ట్రిక్ వెహికిల్ రంగం

ఇంజనీరింగ్, సాంకేతిక విభాగాల్లో వేగంగా ముందుకొస్తున్న మరో విభాగం.. విద్యుత్ వాహన రంగం(ఎలక్ట్రిక్ వెహికిల్ సెగ్మెంట్). దేశంలో 2030 నాటికి ఎలక్ట్రిక్ వాహన వినియోగాన్ని పెంచేలా కేంద్ర ప్రభుత్వం.. నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్ ప్లాన్ పేరుతో ప్రత్యేక పథకాన్ని రూపొందించింది. ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు పలు రాయితీలు అందిస్తోంది. ఫేమ్ స్కీమ్‌తో పలు రాయితీలను ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ విభాగానికి సంబంధించిన నైపుణ్యాలు సొంతం చేసుకుంటే అవకాశాలు అందుకోవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈవీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్, హార్డ్‌వేర్ ఇంజనీర్స్, ఏఐ అండ్ డేటా ఇంజనీర్స్, బ్యాటరీ ఇంజనీర్స్, టెక్నాలజీ కన్సల్టెంట్స్ వంటి కొలువులు దక్కించుకోవచ్చు.

స్పేస్ టెక్నాలజీ

స్పేస్ టెక్నాలజీ.. ఇటీవల కాలంలో విస్తృతంగా వినిపిస్తున్న మాట. అంతరిక్ష పరిశోధనల దిశగా దేశం ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ఇస్రో పలు ప్రయోగాలు, పరిశోధనలు చేస్తున్న సంగతి తెలిసిందే. అదే విధంగా ఈ సెగ్మెంట్‌లో ప్రైవేట్ ఆపరేటర్స్‌కు సైతం ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోంది. దీంతో.. బీటెక్ ఉత్తీర్ణులు స్పేస్ టెక్నాలజీ రంగంలో శాటిలైట్ కమ్యూనికేషన్, ఎర్త్ అబ్జర్వేషన్, డేటా అనాలిసిస్, రిమోట్ సెన్సింగ్ వంటి విభాగాల్లో కొలువులను సొంతం చేసుకోవచ్చు.

నైపుణ్య మార్గాలు!

దేశంలో ఇంజనీరింగ్, సాంకేతిక విభాగాల్లో ఏఐ, ఎంఎల్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ వంటివి కీలకంగా మారుతున్న నేపథ్యంలో.. ఈ స్కిల్స్‌ను పెంచుకునే మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. పలు ఇన్‌స్టిట్యూట్స్ బీటెక్ స్థాయిలోనే ఏఐ-ఎంఎల్ బ్రాంచ్‌తో ప్రత్యేక ప్రోగ్రామ్‌ను అందిస్తున్నాయి. మరికొన్ని ఇన్‌స్టిట్యూట్స్ ఎంటెక్ స్థాయిలో వీటిని ప్రవేశపెట్టాయి. ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌కు సంబంధించి ఐబీఎం, సిస్కో, మైక్రోసాఫ్ట్, వీఎం వేర్, ఇంటెల్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు.. ఆటోమేషన్, ఐఓటీ పరిధిలోని పలు విభాగాల్లో ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి.

మూక్స్‌తో లేటెస్ట్ టెక్నాలజీ

ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకునేందుకు మరో మార్గం.. మూక్స్(మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్). అంతర్జాతీయంగా పలు ప్రముఖ యూనివర్సిటీలు ఆయా అంశాలకు సంబంధించి ప్రత్యేకంగా ఆన్‌లైన్ విధానంలో కోర్సులను అందిస్తున్నాయి. ఈ మూక్స్ ద్వారా తమ సబ్జెక్టులతోపాటు లేటెస్ట్ టెక్నాలజీపైనా అవగాహన పెంచుకోవచ్చు. మన దేశంలోనూ ఎన్‌పీటీఈఎల్ ద్వారా ప్రముఖ ప్రొఫెసర్స్ బోధించే పాఠాలను ఆన్‌లైన్‌లో వినే అవకాశముంది. వీటిల్లో విద్యార్థులకు ఉపయోగపడే వర్చువల్ ల్యాబ్స్ సౌకర్యం సైతం లభిస్తుంది. ఫలితంగా విద్యార్థులు తాజా పరిశోధనలు, టెక్నాలజీ, పరిణామాలు, ప్రాక్టికల్ అంశాలపై అవగాహన పెంచుకోవచ్చు.

నిరంతర అధ్యయనం, పరిశీలన

విద్యార్థులు నిరంతరం అధ్యయనం, పరిశీలన దృక్పథాన్ని అలవరచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సబ్జెక్ట్‌ను చదవడానికే పరిమితం కాకుండా.. అప్లికేషన్ అప్రోచ్‌ను పెంచుకోవాలంటున్నారు. బీటెక్ విద్యార్థులు లేటెస్ట్ టెక్నాలజీపై ప్రాజెక్ట్ వర్క్, మినీ ప్రాజెక్ట్ వర్క్‌లు చేయాలని సూచిస్తున్నారు. దీనివల్ల తాజా సాంకేతికతపై అకడమిక్ దశలోనే ప్రాక్టికల్ నైపుణ్యాలు సొంతమవుతాయి. అదే విధంగా.. కొత్త టెక్నాలజీకి సంబంధించి ఇండస్ట్రీ వర్గాలు తీసుకుంటున్న చర్యలు, వాటిని అమలు చేస్తున్న తీరును పరిశీలించి.. దానికి అనుగుణంగా తమ స్కిల్స్‌కు పదును పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

న్యూస్‌మేకర్


ప్రియంవద రంగరాజన్

'టైమ్' మేగజీన్ 2024 సంవత్సరానికి గాను '100 మంది ప్రభావపూరిత వ్యక్తుల' జాబితా ప్రకటించింది. ప్రపంచవ్యాప్త ఉద్దండులతో పాటు భారతీయులు కూడా ఈ ఎంపికైన వారిలో ఉన్నారు. వారిలో ఒకరు ఆస్ట్రోఫిజిసిస్ట్ ప్రియంవద రంగరాజన్. కృష్ణబిలాలను లోతుగా అధ్యయనం చేయడం ద్వారా సృష్టి పుట్టుకను విశదం చేయగల మర్మాన్ని ఈమె విప్పుతున్న తీరు అసామాన్యమని 'టైమ్' భావించింది. కోయంబత్తూరులో జన్మించి అమెరికాలో స్థిరపడ్డ ప్రియంవద పరిచయం.

కృష్ణబిలాల అన్వేషణలో

కోయంబత్తూరులో జన్మించి...

ప్రియంవద రంజరాజన్ కోయంబత్తూరులో జన్మించారు. తండ్రి ఉద్యోగం రీత్యా ఇంటర్ వరకూ ఢిల్లీలో చదువుకున్నారు. ఆమె అండర్ గ్రాడ్యుయేషన్ 'మసాచుసెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో జరిగింది. ఆ తర్వాత యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ నుంచి పిహెచ్‌డి చేశారు. ప్రస్తుతం అమెరికాలోని యేల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. 'మ్యాపింగ్ ది హెవెన్స్: ది రాడికల్ సైంటిఫిక్ ఐడియాస్ దట్ రివీల్ ది కాస్మోస్' అనే ముఖ్యమైన గ్రంథాన్ని రచించారు.

మన పాలపుంతలో ఎన్ని కృష్ణ బిలాలు (బ్లాక్ హోల్స్) ఉంటాయో తెలుసా? కనీసం కోటి నుంచి నూరు కోట్ల వరకు. అంతరిక్షంలో కృష్ణ బిలాలు ఒక నిగూఢ రహస్యం. ఐన్‌స్టీన్ వీటిని ఊహించాడుగాని ఆయన జీవించి ఉన్నంత కాలం వాటి ఉనికిపై వాస్తవిక ఆధారాలు వెల్లడి కాలేదు. 1967లో జాన్ వీలర్ అనే ఫిజిసిస్ట్ 'బ్లాక్ హోల్' పదం వాడినప్పటి నుంచి వీటిపై చర్చలు కొనసాగాయి. ఆ తర్వాతి కాలంలో ఉనికి గురించిన ఆధారాలు దొరికాయి. కృష్ణ బిలాలు కాంతిని కూడా మింగేసేంత శక్తిమంతమైనవి. చిన్న చిన్న బ్లాక్‌హోల్స్ నుంచి అతి భారీ (సూపర్ మాస్) బ్లాక్ హోల్స్ వరకూ మన పాలపుంతలో ఉన్నాయి. ఒక తార తన గురుత్వాకర్షణలో తానే పతనం అయినప్పుడు బ్లాక్ హోల్స్ ఏర్పడతాయనేది ఒక సిద్ధాంతమైతే ఇవి విశ్వం ఏర్పడే సమయంలోనే అంతరిక్ష ధూళిమేఘాలు తమపై తాము పతనవడం వల్ల ఏర్పడ్డాయని మరో సిద్ధాంతం. ఈ మరో సిద్ధాంతానికి ఊతం ఇస్తూ ప్రియంవద రంగరాజన్ సాగిస్తున్న పరిశోధనల వల్లే ఆమె తాజాగా 'టైమ్' మేగజీన్‌లో 'హండ్రెడ్ మోస్ట్ ఇన్‌ఫ్లుయెన్షల్ పీపుల్'లో ఒకరుగా నిలిచారు.

■ ఆమె పరిశోధన

ప్రియంవద కృష్ణబిలాల పరిశోధనలో ప్రత్యేక కృషి చేశారు. గురుత్వాకర్షణ లెన్సింగ్ పద్ధతి ద్వారా నక్షత్ర మండలాల ఆవిర్భావాన్ని, వాటి పరిణామాలను, అనేక నక్షత్ర మండలాల మధ్య అంతర్గత సంబంధాలపై అధ్యయనం చేశారు. నక్షత్ర మండల సమూహాల గతిశీలతను అధ్యయనం చేయడానికి లెన్సింగ్, ఎక్స్-రే, సున్యావ్-జెల్డోవిక్ డేటాను ఉపయోగించారు. అంతే కాదు ఒక నక్షత్రం, కృష్ణబిలం కలయిక ద్వారా ఏర్పడే విద్యుదయస్కాంత, గురుత్వాకర్షణ తరంగాలపై కూడా అధ్యయనం చేశారు. ఆమెను ఎన్నో అవార్డులు వరించాయి. ప్రతిష్ఠాత్మక లిబర్టీ సైన్స్ సెంటర్ వారి 'జీనియస్ అవార్డు' కూడా దక్కింది.

ఈ విశ్వం ఎలా పరిణామం చెందిందో తెలుసుకోవడానికి ప్రియంవద సాగిస్తున్న కృష్ణబిలాల అన్వేషణ చాలా కీలకంగా ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

పోరాటం

మన దేశంలో మహారాష్ట్రలో గాడిదలను అధిక స్థాయిలో రవాణాకు ఉపయోగిస్తున్నారు. ఇటుక బట్టీలలో ఇసుక రవాణాలో వీటి వీపు మీద 200 కేజీల వరకూ వేయడానికి వెనుకాడరు. దీని వల్ల గాడిదలు హింసకు గురవుతున్నాయి. రోగాల బారిన పడుతున్నాయి. అందుకే నాందేడ్‌కు చెందిన సిర్జనా నిజ్జర్ గాడిదల సంరక్షణ గురించి పోరాడుతోంది. గాడిద మోత నుంచి గాడిదలను తప్పించాలంటోంది. ఆమె పోరాటం గురించి...


సిర్జనా నిజ్జర్

గాడిద మోత వద్దు.. వద్దు..

'జనం దేనికైనా విరాళాలు ఇస్తారు గాని గాడిదలంటే ఇవ్వరు. కాని గాడిదలు పడుతున్న బాధ అంతా ఇంతా కాదు' అంటుంది సిర్జనా గుజ్జర్.

ఢిల్లీ యూనివర్సిటీలో లా చదివిన సిర్జనా జనం కోసం న్యాయస్థానాల్లో వాదించడం కంటే హింసకు గురవుతున్న మూగజీవాల కోసం సమాజంలో వాదించడం మేలు అనుకుంది. అందుకే ఆమె ఎఫ్.ఐ.ఎ.పి.ఓ. (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యానిమల్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్)లో కీలకబాధ్యతలు నిర్వహిస్తోంది. వీధి శునకాలతో మొదలైన ఆమె సేవ నేడు గాడిదలకు చేరింది.

నాందేడ్‌లో చూసి...

మహారాష్ట్రలోని నాందేడ్ సిర్జనా తాతగారి ఊరు. కాలేజీ రోజుల్లో వేసవి సెలవుల్లో అక్కడకు వెళితే గాడిదలు విపరీతంగా కనిపించేవి. వాటిని చూసి సరదా పడదామనుకుంటుడగానే ఒళ్లంతా గాయాలతో, బరువులు మోయలేక అవస్థపడుతూ, తిండి లేక ఎముకలు తేలి ఉన్న వాటి రూపాలు సిర్జనాకు ఎంతో బాధ కలిగించేవి. విద్యార్థిగా ఉండగానే వాటి కోసం చేతనైనంతలో హెల్త్ క్యాంప్స్ నిర్వహించేది. లా పూర్తయ్యాక ఇప్పుడు పూర్తి స్థాయిలో వాటి సంరక్షణ కోసం పని చేస్తోంది.



మూడు జిల్లాల్లో...

'మహారాష్ట్రలోని మూడు జిల్లాలు నాందేడ్, బీడ్, లాతూర్‌లలో గాడిదల సంఖ్య ఎంత లేదన్నా 6000 ఉంటుంది. ఇవి మహారాష్ట్రలో వాన కొరత ప్రాంతాలు. జనం పేదరికంలో మగ్గుతుంటారు. ఈ మూడు జిల్లాల్లోనూ ఇటుక బట్టీలు విస్తారం. వాటిలో కూలీ చేస్తే రోజుకు వంద రూపాయలు వస్తాయి. ఇటుకలు మోయడానికి వీరంతా గాడిదలను ఉపయోగిస్తారు. ఇటుకలను చేరవేయడానికి వాటి వీపు మీద 60 కేజీల నుంచి 100 కేజీల వరకూ బరువు మోయిస్తారు. ఈ ప్రాంతంలో పారే ఉపనది చంద్రభాగ ఒడ్డు నుంచి ఇసుక మోయిస్తారు. శక్తికి మించి బరువు మోయడం వల్ల గాడిదలు గాయాల బారిన పడతాయి. ఒక్కోసారి వాటి కాళ్లు విరుగుతాయి. కంటి సమస్యలు వస్తాయి. వాటికి వైద్యం చేయించే శక్తి పేదలకు ఉండదు. వాటిని అలాగే వదిలేస్తారు' అంటుంది సిర్జనా.

వానలు వస్తే పస్తే

'నాందేడ్, బీడ్, లాతూర్ జిల్లాల్లో అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకూ నిర్విరామంగా ఇటుక బట్టీల పని జరుగుతుంది. అన్నాళ్లు గాడిదలకు పని ఉంటుంది. కొద్దోగొప్పో తిండి దొరుకుతుంది. కాని ఎప్పుడైతే తొలకరి మొదలవుతుందో ఇటుక బట్టీలు మూతపడతాయి. కూలీలు గాడిదలకు తిండి భారం అని రోడ్ల మీద వదిలేస్తారు. వాటికి తిండి దొరకదు. మంచినీరు దొరకదు. రోగాలతో బాధ పడతాయి. ముసలివైతే కబేళాకు అమ్మేస్తారు. వాటి కోసం ఈ మూడు జిల్లాలో సంరక్షణాశాలలను ఏర్పాటు చేస్తున్నాం. ఎస్.పి.సి.ఎ. (సొసైటీస్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాలిటీ టు యానిమల్స్) బలోపేతం చేస్తున్నాం. గత పదేళ్లలో గాడిదల సంఖ్య కూడా బాగా తగ్గింది. వీటి సంఖ్య కాపాడుకుంటూ వీటితో మానవీయంగా వ్యవహరించే చైతన్యాన్ని కలిగించడమే నా లక్ష్యం' అని తెలిపింది సిర్జనా.

యూత్ పల్స్

కంటెంట్‌లో సత్తా ఉండాలేగానీ కాలు కదపకుండా, కడుపులో చల్ల కదలకుండా సొంత ఊళ్లోనే ఉంటూ తగినంత డబ్బు సంపాదించవచ్చు అని నిరూపిస్తున్నారు గ్రామీణ యువ కంటెంట్ క్రియేటర్‌లు. హాస్యం నుంచి వ్యవసాయం వరకు రకరకాల సబ్జెక్ట్‌లను వైరల్ చేయడంలో నేర్పు సాధించారు.

పల్లె టు పాపులర్ జోన్

● జోరుగా హుషారుగా



ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆరియారి గ్రామానికి చెందిన శివానీ కుమారికి సోషల్ మీడియాలో వేలాది మంది ఫాలోవర్‌లు ఉన్నారు. గ్రామీణ జీవితాన్ని పాటలు, కామెడీతో కూడిన స్కెచ్‌ల ద్వారా ఆవిష్కరిస్తూ సోషల్ మీడియాలో పేరు తెచ్చుకుంది.

తనతో సమానంగా ఫాలోవర్‌లు ఉన్న ఇంగ్లీష్ క్రియేటర్‌లు కుమారి కంటే ఎక్కువ సంపాదిస్తున్నటికీ డబ్బుల గురించి చింత ఆమెకు లేదు. డబ్బుల కంటే కంటెంట్ క్రియేషన్ గురించే ఎక్కువ దృష్టి పెడుతుంది కుమారి.

ఒడిశాలోని చిత్రకూట్‌కు చెందిన ధీరజ్ టక్రీకి గతంలో ఇంగ్లీష్‌లో ఫ్లూయెంట్‌గా మాట్లాడడం వచ్చేది కాదు. తడబడుతూ మాట్లాడేవాడు. దీంతో యూట్యూబ్ వీడియోలు చూసి ధీరజ్ అమెరికన్స్‌లా ఫ్లూయెంట్‌గా మాట్లాడడం నేర్చుకున్నాడు. అమెరికన్ యాక్సెంట్‌తో మాట్లాడే నైపుణ్యం ధీరజ్‌ను 'ఇన్‌స్టా ఫేమ్' చేసింది.

2023లో ధీరజ్ ఫాలోవర్‌ల సంఖ్య 160 మాత్రమే.

హ్యాండ్‌సమ్ అనే మాటను ఫారిన్ యాక్సెంట్‌లో ఎలా పలకాలి అనే రీల్ వైరల్ కావడంతో ధీరజ్ టక్రీ ఫాలోవర్‌ల సంఖ్య వేలకు చేరింది.

మధ్యప్రదేశ్‌లోని బిరాఖేడీ గ్రామానికి చెందిన 23 సంవత్సరాల రామ్ పారమార్ 17 సంవత్సరాల వయసులో యూట్యూబ్ చానల్ మొదలు పెట్టాడు. తన చానల్ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన విషయాల గురించి మాట్లాడేవాడు. ఏడు, ఎనిమిది వేలతో యూట్యూబ్‌లో అతడి సంపాదన మొదలైంది. ఇప్పుడు బ్రాండ్ కొలాబరేషన్ ద్వారా లక్ష రూపాయల వరకు సంపాదిస్తున్నాడు.

పది లక్షలు వెచ్చించి తన గ్రామంలో ఆఫీస్ నిర్మించుకున్నాడు. కారు కొన్నాడు. ఇద్దరు సభ్యులతో ఉన్న టీమ్‌ను విస్తరించే పనిలో ఉన్నాడు. గుజరాతీ, తమిళ భాషల్లో కూడా కంటెంట్‌ను విస్తరించే ఆలోచనలో ఉన్నాడు.

'మన దేశంలో చాలా ప్రాంతాల్లో రైతులు హిందీ భాషను అర్థం చేసుకోలేరు. వారిని దృష్టిలో పెట్టుకొని ఇతరుల సహకారంతో ప్రాంతీయ భాషల్లో కంటెంట్‌ను క్రియేట్ చేయాలనుకుంటున్నాను. దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు కంటెంట్‌ను చేరువ చేయాలనుకుంటున్నాను' అంటున్నాడు ధీరజ్.

ఇరవై ఏడు సంవత్సరాల మయూరి పాటిల్‌కు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా డబ్బు సంపాదించాలనేది లక్ష్యం కాదు. 'పశ్చిమ కనుమలను కాపాడుకుందాం' అనే నినాదంతో రీల్స్ చేస్తోంది. పశ్చిమ కనుమల అందాలను కళ్లకు కట్టేలా ఉండే ఆ రీల్స్ ఎంతోమందిని ఆకట్టుకుంటున్నాయి. ఆలోచించేలా చేస్తున్నాయి.

కొండపై ఉన్న ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న ఒక వృద్ధురాలి జీవనశైలిపై పాటిల్ చేసిన రీల్ వైరల్ అయింది. ఎలాంటి కమర్షియల్ ఎలిమెంట్స్ లేని ఈ రీల్ సూపర్ సక్సెస్ కావడమే కాదు అది పాటిల్‌కు ఎంతో ఉత్సాహాన్నీ ఇచ్చింది.

మహారాష్ట్రలోని పులగామ్ గ్రామానికి చెందిన నేహా తాంబ్రేది సూపర్ పవర్ గ్రామీణ యాస. కామెడీ దట్టించి వివిధ సామాజిక సమస్యలపై తమ ప్రాంత మాండలికంలో నేహా చేసే వీడియోలు సోషల్ మీడియాలో పాపులర్ అయ్యాయి. తన గ్రామం నుంచి వెళ్లి పుణెలో ఇంజనీరింగ్ చేయడం నేహాకు కల్చరల్ షాక్.

'నా గ్రామీణ మరాఠీ యాసను వెక్కిరించేవారు' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంది నేహా.

ఎంతోమంది వెక్కిరించిన ఆ యాస కంటెంట్ క్రియేషన్‌లో ఆమె బలం అయింది. నేహా సృష్టించిన 'తోంబ్రే బాయి' క్యారెక్టర్ బాగా పాపులర్ అయింది.

స్థూలంగా చెప్పాలంటే గ్రామీణ ప్రాంత క్రియేటర్‌లు సోషల్ మీడియాలో కొత్త దృశ్యం ఆవిష్కరిస్తున్నారు. కర్నాటకాలోని చిన్న పల్లెల నుంచి ఈశాన్య ప్రాంతాలలోని మారుమూల గ్రామాల వరకు కంటెంట్ క్రియేషన్ ద్వారా వైవిధ్యాన్ని ఆవిష్కరిస్తున్నారు. ప్రతి క్రియేటర్ తనదైన ప్రత్యేకతను కంటెంట్‌కు జోడిస్తున్నారు.

'ఇన్‌స్టాగ్రామ్ ఉద్దేశాన్ని చాలా బ్రాండ్స్ మరిచిపోయాయి. ఇన్‌స్టాగ్రామ్ అనేది ఫన్, స్టోరీ టెల్లింగ్‌కు వేదిక' అంటుంది ముంబైకి చెందిన కంటెంట్ సొల్యూషన్స్ ఫర్మ్ 'అప్పర్‌కేస్' డైరెక్టర్ నిటషా భర్వానీ.

ఇన్‌స్టాగ్రామ్‌కు కీలకమైన ఫన్, వైవిధ్యాన్ని జోడిస్తూ తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు గ్రామీణ ప్రాంత యువ కంటెంట్ క్రియేటర్‌లు.

ఎక్కడా తగ్గేదే లేదండీ

గ్రామీణప్రాంత జీవనశైలికి అద్దం పట్టే వీడియోలతో పాపులర్ అయింది ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శివానీ కుమారి. ఆడంబరాల కంటే సహజత్వమే కంటెంట్‌కు అందాన్ని తీసుకువస్తుంది అనేది కుమారి నమ్మే థియరీ. అందుకే ఆమె చేసే వీడియోల్లో ఎక్కడా కృత్రిమత్వం కనిపించదు. యూట్యూబ్ ద్వారా వచ్చిన ఆదాయంతో ఊళ్లో సొంత ఇళ్లు కట్టుకుంది. సోషల్ మీడియాలో కుమారి పాపులారిటీని దృష్టిలో పెట్టుకొని వ్యక్తుల నుంచి మొదలు ఆర్గనైజేషన్స్ వరకు ప్రశంసపూర్వకమైన ఈ-మెయిల్స్ వస్తుంటాయి. అవి ఆమెకు బలమైన టానిక్‌లా పనిచేస్తాయి. 'ఇంగ్లిష్‌లో గడగడా మాట్లాడితేనే కంటెంట్ హిట్ అవుతుంది' అనే భావనను కుమారిలాంటి వాళ్లు తప్పని తేల్చేస్తున్నారు. ఇంగ్లీష్-స్పీకింగ్ అర్బన్ క్రియటర్స్ కంటే తాము తక్కువ కాదని నిరూపిస్తున్నారు.


శివాని కుమారి

'ఎంత పెద్ద చదువులు చదివినా.. ఆర్థికంగా ఎంత ఎదిగినా మనసుకు తృప్తిగా లేకపోతే అందులో సహజత్వం లోపిస్తుంది. చేసే పనుల్లో నైపుణ్యం రాదు..' అంటున్నారు హేమ. పర్యావరణహితంగా మహిళలకు ఉపయుక్తంగా ఉండే రీ యూజబుల్ క్లాత్‌తో ప్యాడ్స్, పిల్లలకు డైపర్లు తయారుచేస్తూ, గ్రామంలోని మహిళలకు ఉపాధి కల్పిస్తూ వాటిని మార్కెటింగ్ చేస్తున్నారు.


హేమ

పర్యావరణ ప్రేమిక



తమిళనాడు, చిత్తూరు బార్డర్‌లో ఉన్న అతిమంజరీ పేట్‌లో ఉన్న హేమ తన ఉత్పత్తులతో హైదరాబాద్‌లోని క్రాఫ్ట్ కౌన్సిల్‌లోని ప్రదర్శనశాలలో తన స్టాల్ ద్వారా పరిచయం అయ్యారు. అత్యంత నిరాడంబరంగా కనిపిస్తున్న ఆమె... అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేసి, స్వదేశానికి వచ్చి తనను తాను పర్యావరణ ప్రేమికగా ఎలా మలచుకున్నారో, మరికొందరి మహిళలను ఎలా భాగస్వాములను చేస్తున్నారో వివరించారు.

"మా ఊరిలో పన్నెండేళ్లుగా ఉంటున్నాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వాడకంలో ఉన్న వస్తువులకు ప్రత్యామ్నాయ, పర్యావరణ అనుకూల ఉత్పత్తులను తయారుచేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నాను. చాలా ఆలోచనలు చేశాక మహిళల రుతుక్రమ సమయంలో వాడే ప్యాడ్స్‌కు సంబంధించిన పరిష్కారం కనుక్కోవాలనుకున్నాను. అందులో భాగంగా 2020లో 'కొన్నై' పేరుతో మా ఉత్పత్తులన్నీ గ్రామంలోని మహిళలు, యువతతో కలిసి చిన్న చిన్న సమూహాలుగా ఏర్పాటు చేసి, వారితో తయారుచేస్తున్నాను. మహిళలు, చంటిపిల్లలకు ఉపయోగపడే రీ యూజబుల్ ఉత్పత్తుల తయారీకి కొంతమందిని గ్రూప్‌గా చేసి వారి ఇళ్ల నుంచే, సౌకర్యవంతమైన సమయంలో తయారుచేసిచ్చేలా ప్రణాళిక చేశాను. చదువుకునే అమ్మాయిలకు, అబ్బాయిలకు ఇది ఒక పార్ట్‌టైమ్ ఉపాధి లాగా కూడా ఉపయోగపడుతుంది.

■ వాడకం సులువు..

మృదువుగా, మన్నికగా ఉండటమే కాకుండా వాడిన తర్వాత రెండు గంటల పాటు నీళ్లలో నానబెట్టి, ఎండలో ఆరవేయవచ్చు. తిరిగి వీటిని వాడుకోవచ్చు. వెదురు కాటన్‌ను వాటర్‌ప్రూఫ్ ఫ్యాబ్రిక్‌తో జత చేసి వీటిని తయారుచేస్తుంటాం. ఇవి సురక్షితంగానూ, అనుకూలంగానూ ఉంటాయి. తిరిగి ఉపయోగించడం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్నీ నివారించవచ్చు. డిస్పోజబుల్ ప్యాడ్‌లలో రసాయనాల కారణంగా చర్మానికి హాని కూడా కలిగిస్తాయి. మహిళలకు రీ యూజబుల్ క్లాత్ ప్యాడ్స్ మాత్రమే కాదు పిల్లలకు డైపర్లు, మ్యాట్లు, వైప్స్.. అన్నీ ఎకో ఫ్రెండ్లీవే తయారుచేస్తున్నాం. ఇవి మృదువుగా ఉంటాయి. కాబట్టి చర్మానికి ఎలాంటి హానీ కలిగించవు. స్మాల్, మీడియమ్.. సైజులను బట్టి డిజైన్ల బట్టి ధరలు ఉన్నాయి. ఆర్డర్లను బట్టి ఒక్కొరికి రూ.5,000 వరకు ఆదాయం లభిస్తుంది. ఇందులో ఇప్పుడు పెద్దగా ఆదాయం రాకపోవచ్చు. నేను ఆదాయం, రాబడి గురించి ఆలోచించడం లేదు. మునుముందు అందరూ పర్యావరణహితంగా మారాల్సిందే. అందుకు నా వంతు ప్రయత్నం చేస్తున్నాను.

■ సొంత ఊరికి...

మేం పన్నెండేళ్ల అమెరికాలో ఉన్నాం. నేనూ, మా వారు దేవ్ అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగాలు చేశాం. మాకు ఇద్దరు పిల్లలు. ఒక దశలో మాకు అక్కడ ఉండాలనిపించలేదు. మొత్తం కుటుంబంతో సొంత ఊరికి వచ్చేశాం. ఇక్కడే ఊళ్లో ఏడెకరాల భూమి కొనుగోలు చేశాం. అందులో ఎక్కువ శాతం రాగులు పండిస్తాం. ఆ పని అంతా మా వారు చూసుకుంటారు.

■ ఎవరికి నచ్చిన పని వాళ్లు...

అమెరికన్ సంస్కృతిలో పిల్లల మీద చదువుల ఒత్తిడి ఉండదు. పిల్లలకు ఏది ఇష్టమో, ఏ కళలో నైపుణ్యం సాధించాలనుకుంటారో దానిని వారే కనిపెట్టేలా, నైపుణ్యాలు సాధించేలా చూస్తారు. మేం కూడా పిల్లలను స్కూళ్లను, కాలేజీకి పంపించలేదు. హోమ్ స్కూలింగ్ అని మాకు గ్రూప్ ఉంటుంది. ఆ కమ్యూనిటీలో పిల్లలకు నచ్చినవి చదువుకుంటారు. తప్పనిసరిగా చదవాలనే నిబంధన పెడితే, మనసుకు ఇష్టంలేనిదానిమీద వారెప్పటికీ ప్రావీణ్యులు కాలేరు. ఇవన్నీ ఆలోచించాం. పిల్లలకు ఏది ఇష్టమో అదే చేయమన్నాం. ఇద్దరూ సంగీతం నేర్చుకున్నారు. ఇరవై ఏళ్ల మా అబ్బాయికి శాస్త్రీయ సంగీతం అంటే ఎక్కువ ఇష్టం. పద్దెనిమిదేళ్ల మా అమ్మాయి ఉడెన్ ఫర్నీచర్‌లో తన నైపుణ్యాలను చూపుతుంటుంది. నేను పర్యావరణ హితంగా ఉండే పనులు చేయాలనే ఆలోచనతో రీ యూజబుల్ న్యాపికిన్స్ పై దృష్టి పెట్టాను. మా విధానాలు మా ఇతర కుటుంబాల వారికి నచ్చుతుందని నేను అనుకోను. ఎందుకంటే, ఈ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ పరుగులు పెట్టేవారే. తమకేది నచ్చుతుందో, ఏం చేయగలమో, ఎందులో సంతృప్తి లభిస్తుందో దానిని కనుక్కోలేరు. ప్రకృతి నీడన, నచ్చిన పనుల్లో భాగస్వాములం అవుతూ పర్యావరణహితగా జీవిస్తున్నాం. నా ఈ ఆలోచనను విరివిగా మార్కెట్లోకి తీసుకెళ్లడానికి ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్ ద్వారా రకరకాల క్రాఫ్ట్స్ మేళాలో పెడుతూ సాధ్యమైనంత వరకు ప్రజల్లోకి తీసుకెళుతున్నాను' అని వివరించారు హేమ.

– నిర్మలారెడ్డి